T.T.D. Religious Publications Series No. 1222 Price : ₹

Published by Dr. D. SAMBASIVA RAO, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

పుష్కరకృష్ణ

కృష్ణాపుష్కర విశేష సంచిక - 2016

కృష్ణాపుష్కరాల చిహ్నాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్రమంత్రి గౌ॥ నారా చంద్రబాబునాయుడు, ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్లు) గౌ॥ పరకాల ప్రభాకర్, దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి గౌ॥ పైడికొండల మాణిక్యాలరావు తదితరులు.

కృష్ణా
పుష్కరం 2016

ఈ చిహ్నంలోని రెండు నీలిరంగు గీతలు కృష్ణ ప్రవాహగతిని, వేగాన్ని సూచిస్తున్నాయి. ఎగువనున్న గీతల మధ్యలో జ్యోతి... దానిచుట్టూ సూర్యునికి అర్ఘ్యం ఇచ్చాక రెండు చేతులూ జోడించి నమస్కారం చేస్తున్నట్లుగాను, అగ్నిహోత్రంలాగాను కనిపిస్తున్నాయి.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

శ్రీ వేంకటేశ్వర వారసత్వ సంస్కృతీ పరిరక్షణ నిధి

'దేవాలయం దేవుని ప్రతిరూపం'

భారతీయ సనాతన ధర్మానికి, సంస్కృతికి దేవాలయాలు ప్రతిరూపాలు. శిల్పం, చిత్రలేఖనం, సంగీతం, సాహిత్యం, నాట్యంవంటి శాస్త్ర కళాసమ్మిళితమైన దేవాలయాలను సర్వజన సంక్షేమంకోసం, లోక కల్యాణార్థం నిర్మించారు.

ఆలయ వాస్తుప్రకారం శాస్త్రీయంగా నిర్మించబడిన ఆలయాలలో విగ్రహమూర్తిని ప్రతిష్ఠించిన మహనీయుల తపశ్శక్తితో జరుపబడుతున్న పూజా విశేషాదుల చేత శిల్ప ఆగమ లక్షణ సమన్వితమైన విగ్రహసౌందర్యంవల్ల భగవంతుడు ఆ ఆలయంలోని బింబాన్ని ఆవహించి భక్తుల కోరికలు తీరుస్తూ ఉంటాడని శాస్త్ర ప్రవచనం.

వైదిక సంస్కృతీ పరిరక్షణ కేంద్రాలయిన ఆలయాలనుకాలాంతరంలో రక్షించుకోవడం, ఆలయంలోని శిథిలమైన ఏ భాగాన్నయినా జీర్ణోద్ధరణ చేసుకోవడం లేదా పునర్నిర్మించుకోవడం ప్రతి భారతీయుని విధి, ధర్మం కూడా

శిఖరం లేదా ప్రాకారం, బలిపీఠం, ధ్వజస్తంభం చివరకు మూల విగ్రహమూర్తి కూడా కావచ్చు - ఇలా శిథిలమై, కలావిహీనమైన ఆలయాల వలన ఆ గ్రామానికేకాక దేశానికి కూడా అతివృష్టి రోగభయాదుల వంటి ఉపద్రవాలు కలుగుతాయని పెద్దలమాట.

పలువురు ఆచార్యులు, 'సక్రమమైన నిర్వహణ వ్యవస్థ' లేకుండా నూతన ఆలయాలను నిర్మించడం మంచిది కాదని, ఎప్పుడో, ఏనాడో మహనీయుల చేత ప్రతిష్ఠించబడిన ఆలయాలను పరిరక్షించి, నిర్వహించడం లోకకల్యాణ కారకమని సందేశమిస్తున్నారు. వైదిక ధర్మాన్ని, సంస్కృతిని ప్రతిబింబింపజేసే ప్రాచీన ఆలయాల వంటి కట్టడాలు కావచ్చు, పురావస్తు ప్రదేశాలు కావచ్చు, వాటిని పరిరక్షించడం, పునర్నిర్మించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం కేవలం ఒక్కరి వలన సాధ్యం కాదు. అందువలన ఈ బృహత్ లక్ష్యాలతో తిరుమల తిరుపతి దేవస్థానములు 'శ్రీవేంకటేశ్వర వారసత్వ సంస్కృతీ పరిరక్షణ నిధి' ని ఏర్పాటు చేసింది.

'కర్తా, కారయితా చైవ ప్రేరకశ్చానుమోదకః' అన్నట్లుగా ఈ కార్యాన్ని నిర్వహించేవారికి, నిర్వహింపజేసేవారికి, ప్రోత్సహించేవారికి, ఆమోదించి ఆనందించేవారికి... ఇలా నలుగురికి ఈ కార్యంవలన వచ్చే ఫలితం లభిస్తుందని అర్థం.

తిరుమల, తిరుపతి దేవస్థానములు ఏర్పాటు చేసిన 'శ్రీవేంకటేశ్వర వారసత్వ సంస్కృతీ పరిరక్షణ నిధి'కి విరివిగా విరాళాలివ్వండి, ఇప్పించండి. ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు కండి. ఊరూరా, వాడవాడలా శిథిలాలయాలు పునర్నవీకృతం కావాలి. అంతటా ఆధ్యాత్మిక దివ్యచైతన్యం వెల్లివిరియాలి. తద్వారా జగత్కల్యాణం సిద్ధించాలి.

ఈ నిధికి దాతలు ఎంత మొత్తాన్నయినా విరాళంగా ఇవ్వవచ్చు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80(జి) ప్రకారం పన్ను మినహాయింపు ఉంటుంది

దాతలకు సౌకర్యాలు

ఈ ట్రస్టుకు 5 లక్షలు లేదా అంతకన్న ఎక్కువ విరాళంగా ఇచ్చిన దాతలకు ఈ క్రింది సౌకర్యాలు లభిస్తాయి. సం॥లో 3 రోజులు దాత, అతని కుటుంబ సభ్యులకు (5 గురికి మించకుండా) వైకుంఠం సెల్లారు ద్వారా వి.ఐ.పి. దర్శనం. మొదటిసారి దర్శనానికి వచ్చినపుడు శ్రీవారి, శ్రీపద్మావతి అమ్మవారి బంగారు పూత పూసిన వెండిడాలరు బహూకరణ. సంవత్సరానికి ఒకసారి దాతకు ఉత్తరీయం బహూకరణ. 3 రోజులపాటు తిరుమలలో ఉచిత వసతి లేదా వి.ఐ.పి. అతిథి గృహాల్లో చెల్లింపుతో వసతి. ఈ సౌకర్యాలు దాతకు జీవిత పర్యంతం, కంపెనీలు, ఇద్దరు దాతలు అయితే 20 సంవత్సరాలు వుంటాయి.

మీ విరాళాలను ఏ జాతీయ బ్యాంకు నుంచైనా 'కార్యనిర్వహణాధికారి' తిరుమల తిరుపతి దేవస్థానములు, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 501, వారికి డ్రాఫ్టుద్వారా పంపాలి. దాతలు తమ విరాళాలను తిరుమలలోని ఏ జాతీయ బ్యాంకులోనైనా జమచేయవచ్చు.

పుష్కరకృష్ణ

కృష్ణా
పుష్కరం 2016

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2016

PUSHKARA KRISHNA

Krishnapushkara Visesha Sanchika – 2016

TTD Religious Publications Series No. 1222
© All Rights Reserved

Honorary Editor & Publisher
Dr. D. SAMBASIVA RAO, I.A.S.,
Executive Officer
T.T.Devasthanams.

Edited by
Prayaga Ramakrishna
Special Officer
Publications Division

Sub-Editor
Dr. Nossam Narasimhacharya,
M.A., T.P.T., P.G.D.M.C.J., Ph.D.,

Year : 2016

Copies : 500

Price :

DTP – Page Layout – Designing
Smt. M. Subbarathnamma

Printed by
Smt. M. Gowthami, M.B.A.,
Dy. E.O. (Publications & Press),
Press Manager,
TTD, Tirupati.





प्रधान मंत्री

Prime Minister

MESSAGE

The religious and distinct celestial event Krishna Pushkarams occurs once in every twelve years. This solemn occasion is celebrated as Kumbhamela in North India and as Pushkaram in south India. The devotees are eagerly waiting to take a holy dip in the river krishna. On this occasion I take the previlege to greet all my fellowmen to celebrate the mela and be blessed always.

I am delighted to learn that the Tirumala Tirupati Devasthanams is bringing out a special Publication titled 'Pushkara Krishna' to document the history and distinct features of the river god Krishna.

I am very happy to extend my greetings and felicitations to all the participating devotees. I wish the Pushkarams all success.

(Narendra Modi)

E.S.L. Narasimhan

RAJ BHAVAN
HYDERABAD-500 041

सत्यमेव जयते

GOVERNOR
ANDHRA PRADESH AND TELANGANA

శుభాకాంక్షలు

కృష్ణాపుష్కరాలు మన విశిష్ట సంస్కృతిలో ఒక పవిత్ర ఘట్టం. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు 'పుష్కరకృష్ణ' పేరుతో ఒక ప్రత్యేక సంచికను ప్రచురించడం హర్షణీయం.

శ్లో॥ సహ్యపాద సముద్భూత పవిత్రజలపూరితా ।
కృష్ణవేణీతివిఖ్యాత మమపాపం వ్యపోహతు ॥

అని ధ్యానించి కృష్ణానది జలాల్లో స్నానంచేస్తే సర్వపాపాలు పోతాయని పురాణోక్తి.

మన వాఙ్మయంలో పుష్కరస్నానం చాలా పవిత్రమైంది. పుష్కరాలు 12 సంవత్సరాల కొకసారి వస్తాయి. ప్రస్తుతం గురువు కన్యారాశిలో ప్రవేశించడంతో కృష్ణాపుష్కరాలు జరుగుతున్నాయి. ఇది తెలుగు ప్రజలందరికీ ఒక అరుదైన అవకాశం. తెలుగుదనపు సంప్రదాయాన్ని పుష్కరాలు గుర్తుకుతెస్తాయి.

పరమపవిత్రమైన కృష్ణాపుష్కరాలకు దేశం నలుమూలల నుండి భారీసంఖ్యలో తరలివచ్చే భక్తజనావళికి కనులవిందుగా కృష్ణాతీరంలో తిరుమల తిరుపతి దేవస్థానాలు ఎన్నో ధార్మిక సనాతన సంప్రదాయ విశేష కార్యక్రమాలు నిర్వహించడం ముదావహం. ఇందులో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానాలు ప్రచురణల విభాగంవారు పలువురు పండితులచే ఎంతో విలువైన వ్యాసాలు వ్రాయించి విశేషసంచికను ప్రచురించి ధార్మికవరులకు అందజేస్తోందని తెలిసి ఆనందపడ్డాను.

ఈ 'పుష్కరకృష్ణ' విశేషసంచిక అశేష పాఠకులను అలరించగలదని ఆశిస్తున్నాను.

సర్వేజనా స్సుఖినోభవంతు!!

ఇ.ఎస్.ఎల్. నరసింహన్

(ఇ.ఎస్.ఎల్. నరసింహన్)

CHIEF MINISTER'S OFFICE

Government of Andhra Pradesh, Hyderabad



కృష్ణా
పుష్కరం 2016

సందేశం

మానవజీవన మనుగడకు అవసరమైన పంచభూతాల్లో నీటికి ప్రత్యేకస్థానం ఉంది. ప్రాణాధారమైన జలాలను అందించి మన జీవనానికి ఆధారభూతమౌతున్నవి నదులు. అలాంటి నదుల్లో కృష్ణవేణి ఒకటి. ఆ తల్లి మనరాజధాని అమరావతిని ఆనుకొని ప్రవహించడం మనకు గర్వకారణం. నవ్యాంధ్రప్రదేశ్‌ని పునర్వికసనం చేసుకొంటున్న తరుణంలో గత సంవత్సరం గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించుకొన్నాం. ఈ ఏడాది కృష్ణాపుష్కరాలను వైభవంగా జరుపుకొంటున్నాం.

కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో వేలసంవత్సరాల చరిత్ర దాగి ఉంది. సాహిత్యం, సంగీతం, కళలతోపాటు అనేక ఆలయాలు విరాజిల్లి ప్రజల జీవన విధానాన్ని, సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ వస్తున్నాయి. ఇవన్నీ దేశీయుల్ని, విదేశీయుల్ని ఆకర్షిస్తున్నాయి. యాత్రావిహార కేంద్రాలను అభివృద్ధిచేస్తూ నేడు మన ప్రభుత్వం ముందుకు పోతూ ఉంది.

2016 ఆగష్టు 12వ తేదీనుండి పవిత్ర కృష్ణానదికి పుష్కరాలు ప్రారంభమవుతున్నాయి. పుష్కరాలు మనజాతి సంస్కృతిలో ఒక ముఖ్య ఘట్టం. నదీమతల్లి ప్రశస్తిని, వైశిష్ట్యాన్ని, నదీప్రాంతంలో నివసించే ప్రజల సంస్కృతీ వికాసాన్ని, అక్కడ పురాప్రాభవాన్ని 12 ఏళ్లకొకసారి స్మరణకు తెచ్చే పుష్కరాలను వైభవంగా జరుపుకోవడం అనాదిగా వస్తున్న భారతీయ సంప్రదాయం.

పుష్కరాల సందర్భంగా తరలివచ్చే యాత్రికులకోసం తిరుమల తిరుపతి దేవస్థానములు అనేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూండటంతోపాటు అనేక సేవాకార్యక్రమాలతో అన్ని వర్గాలవారి ఆదరాభిమానాలను చూరగొంటున్నది. ఈ ఏడాది కృష్ణానది పుష్కరాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు "పుష్కరకృష్ణ" అనే విశేష సంచికను చక్కటి వ్యాసాలతో ప్రకటించడం ముదావహం. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానముల ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ చదలవాడ కృష్ణమూర్తి గారిని, కార్యనిర్వహణాధికారి డా॥ డి. సాంబశివరావు I.A.S., గారిని మరియు వారి సిబ్బందిని అభినందిస్తున్నాను.

మీ

(నారా చంద్రబాబు నాయుడు)



Sri P.MANIKYALA RAO

Hon'ble Minister for Endowments
Govt. of A.P.

Sri CHADALAWADA KRISHNAMURTHY

Chairman, TTD Trust Board

తి.తి.దే. ధర్మకర్తల మండలి

అధ్యక్షులు
శ్రీ చదలవాడ కృష్ణమూర్తి
తిరుపతి

సభ్యులు
శ్రీమతి కె.లలితకుమారి
విజయనగరం

సభ్యులు
శ్రీమతి పి.అనంతలక్ష్మి
కాకినాడ

సభ్యులు
డా॥ డి.ఎస్.బాలవీరాంజనేయస్వామి
ప్రకాశం జిల్లా

సభ్యులు
శ్రీ పి.సుధాకర్ యాదవ్
కడపజిల్లా

సభ్యులు
శ్రీ సండ్ర వెంకటవీరయ్య
ఖమ్మం జిల్లా

సభ్యులు
శ్రీ ఎ.నరసారెడ్డి
కరీంనగర్

సభ్యులు
శ్రీ ఎ.వి.రమణ
హైదరాబాదు

సభ్యులు
శ్రీ వి.కృష్ణమూర్తి
హైదరాబాదు

సభ్యులు
శ్రీ జె.శేఖర్
తమిళనాడు

సభ్యులు
శ్రీ డి.పి.అనంత
కర్ణాటక

సభ్యులు
శ్రీమతి ఇ.సుచిత్ర
హైదరాబాదు

సభ్యులు
శ్రీ కె.రాఘువేంద్రరావు
హైదరాబాదు

సభ్యులు
శ్రీ సంపత్ రవి నారాయణన్
కర్ణాటక

సభ్యులు
డా॥ పి.హరిప్రసాద్
తిరుపతి

సభ్యులు
శ్రీ జి.భానుప్రకాష్‌రెడ్డి
తిరుపతి

ఎక్స్ అఫిషియో సభ్యులు
శ్రీ జె.ఎస్.వి. ప్రసాద్, ఐ.ఏ.ఎస్.,
ప్రిన్సిపల్ సెక్రటరీ (ఆ.ప్ర)

ఎక్స్ అఫిషియో సభ్యులు
శ్రీమతి వై.వి.అనురాధ, ఐ.ఏ.ఎస్.,
కమీషనర్, దేవాదాయశాఖ(ఆ.ప్ర)

ఎక్స్ అఫిషియో సభ్యులు
డా॥ డి.సాంబశివరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దే.

Dr. D. SAMBASIVA RAO, I.A.S.,

Executive Officer, TTD

Sri K.S. SRINIVASA RAJU, I.A.S.,

Joint Executive Officer, TTD
Tirumala

Sri POLA BHASKAR, I.A.S.,

Joint Executive Officer, TTD
Tirupati

చదలవాడ కృష్ణమూర్తి
అధ్యక్షులు, పాలకమండలి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

ఒక్కమాట

మన హైందవ సంప్రదాయంలో నదీ పుష్కరాలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. జీవనదీ ప్రస్థానంతో మానవజీవిత ప్రస్థానమూ ముడివడి ఉంది గనుక పుష్కరనదీస్నానం తక్కిన అన్ని విధాల స్నానాలకంటే పరమపవిత్రమూ, మహాపుణ్య ఫలప్రదము.

ప్రస్తుతం దుర్ముఖినామ సంవత్సరం ఆగస్టునెల 12వ తేదీనుండి పన్నెండు రోజులపాటు జరిగే కృష్ణాపుష్కరాలు సుముఖమైన సత్సందేశాలను అందిస్తోంది. ఎట్లంటే - కృష్ణానది మహారాష్ట్రలోని సహ్యాద్రి పర్వతశ్రేణుల్లో మహాబలేశ్వరంలోపుట్టి కర్ణాటకరాష్ట్రం గుండా తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రవహించి హంసలదీవి దగ్గర సాగరసంగమం చేస్తున్నది. ఇలా నాలుగు రాష్ట్రాల ప్రజలకు ఏకైక సమన్వయాన్ని ఘటింపజేస్తున్న కృష్ణానది, ప్రజలకు సామరస్య పూర్వకమైన జీవన సందేశాన్ని అందిస్తోంది. ఇది బాహ్య సమన్వయం.

అలాగే కృష్ణానది శైవ - వైష్ణవ - దత్తాత్రేయ సంప్రదాయాలను గౌరవిస్తూ తన పరీవాహక ప్రాంతాలలో, మత సమన్వయాన్ని చేస్తూ "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అన్న సనాతన ధర్మాన్ని నెలకొల్పుతున్నది. ఇది మతసామరస్యపూర్వకమైన అంతరంగ సమన్వయం.

మరో గొప్ప విషయమేమంటే, కావేరికి ఉపనదులు లేవు. గోదావరికి ఉపనదులున్న కృష్ణకు ఉన్నంతలేవు. మహారాష్ట్రలో 14 ఉపనదులు, కర్ణాటకలో మూడునదులు, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో 15 ఉపనదులు వెరసి 32 ఉపనదులుగల మహాజీవనది కృష్ణావేణీ నది.

విశేషించి, పన్నెండేళ్ళకోసారి గురువు కన్యారాశిలో ప్రవేశించినప్పుడు వచ్చే కృష్ణాపుష్కర స్నానం అత్యంత పవిత్రం. సకల పాపనాశనియైన గంగానదికంటే కృష్ణానది గొప్పనది అని పురాణాలు ఘోషిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే - కృష్ణానది హరిహరాత్మకం - త్రిమూర్త్యాత్మకం - సర్వదేవతాత్మకం!

ఈ పవిత్ర పుష్కరాల సందర్భంలో తిరుమల తిరుపతి దేవస్థానములు విజయవాడలో శ్రీవారి నమూనా ఆలయాన్ని నిర్మించడంతోపాటు అనేక సేవాకార్యక్రమాలను, ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తి.తి.దే. ప్రచురణల విభాగం కృష్ణాపుష్కరాల సందర్భంగా "పుష్కరకృష్ణ" పేరుతో ఒకచక్కటి గ్రంథాన్ని అందిస్తోంది. ప్రచురణల విభాగ అధికారికి మరియు సిబ్బందికి నా శుభాకాంక్షలు. అశేష ఆంధ్ర ప్రజానీకానికి నేను అభ్యుదయం కలగాలని కోరుతున్నాను.

(చదలవాడ కృష్ణమూర్తి)

డా॥ డి. సాంబశివరావు
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

శుభాశయం

భారతీయ సంస్కృతికీ చరిత్రకూ ఆనవాళ్ళు జీవనదులు. ఎంతో ప్రాచీనతనూ, ప్రశస్తినీ, పవిత్రతనూ కలిగిన జీవనదులు మన ఆంధ్రప్రదేశ్‌గుండా ప్రవహిస్తూ ఉండటం మనకు గర్వకారణం. అలాంటి నదులలో కృష్ణానది ప్రత్యేకతను సంతరించుకుంది. కృష్ణానదీ తీరప్రాంతాలలో సంస్కృతీ వికాసం కలిగి తెలుగుజాతి బ్రహ్మాండంగా అభివృద్ధి సాధించింది, సాధిస్తూ ఉంది. మన సంస్కృతిక, సాహిత్య, సంగీతాది రంగాలు సుసంపన్నం కావటానికి అవసరమైన మౌలికవనరులు అందించిన వాటిలో కృష్ణానదికి సముచితస్థానం ఉంది. నవ్యాంధ్ర రాజధానినగరం అమరావతికూడా కృష్ణానదీతీరవిలసితమై చారిత్రక సాంస్కృతికాది నేపథ్యం కలిగి ఉండడం అపురూపం.

కృష్ణానదికి తుంగభద్ర ఉపనది. తుంగభద్రకు కూడా పుష్కరాలు వస్తాయి. అంటే కృష్ణానదికీ దాని ఉపనది తుంగభద్రకూ పుష్కరాలు (వేరు వేరు సమయాలలో) రావటం విశేషం. ఇది కేవలం కృష్ణానదికి మాత్రమే వర్తిస్తుంది. అంటే కృష్ణకు తప్ప మరేనది ఉపనదికీ పుష్కరాలు లేవు. ఇది కృష్ణానది గొప్పదనం.

తిరుమల తిరుపతి దేవస్థానం కృష్ణాపుష్కరాల సందర్భంగా పలుధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా తి.తి.దే. ప్రచురణల విభాగం కృష్ణాపుష్కరాలపై "పుష్కరకృష్ణ" ప్రత్యేక సంచికను అందిస్తోంది. పుష్కరాలను గురించి కృష్ణాతీరప్రాంత సంస్కృతి, చరిత్రలను గురించిన అనేక వ్యాసాలను ప్రసిద్ధ పండితులచే వ్రాయించి, అందమైన చిత్రాలతో సమకూర్చి ఈ సంచిక ద్వారా అందిస్తోంది.

ఈ ప్రత్యేక సంచిక వెలువడటంలో విశేష కృషిచేసిన ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి, ఆయన సహచర ఉద్యోగులు, తి.తి.దే. ముద్రణాలయ సిబ్బంది అభినందనీయులు. ఈ సంచికను పాఠకులు అభినందిస్తే వారి శ్రమ సఫలీకృతమవుతుంది.

(డా॥ డి. సాంబశివరావు)

ప్రయాగ రామకృష్ణ
ప్రత్యేకాధికారి, ప్రచురణల విభాగం
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

సంపాదకీయం

నది మనకు అమ్మ. అమ్మ బిడ్డల్ని తీర్చిదిద్దినట్టే నదులూ మనల్ని తీర్చిదిద్దుతున్నాయి. ఒక్కొక్క నది తనను ఆశ్రయించి బతుకుతున్న జనులను ఒక్కోరకంగా తీర్చిదిద్దుతోంది. అందుచేతనే రకరకాల నదీనాగరికతలు, సంస్కృతులు, జీవన విధానాలు ఏర్పడ్డాయి.

ఆసేతుహిమాచలం ఒకటై వినిపిస్తున్న ఐక్యరాగానికీ, భిన్నత్వంలో ఏకత్వానికీ నదులే కారణం. అంతెందుకు జీవకోటి నిలవడానికి నీరే ఆధారం. నీళ్ళు లేకపోతే బతుకే లేదు. అన్నం లేకపోయినా బతకవచ్చేమో గానీ నీళ్ళు లేకపోతే బతకలేం.

అన్ని నదులూ పవిత్రమైనవే అయినా కృష్ణ మరీ పవిత్రం. మహారాష్ట్రలో పుట్టి కర్నాటక ఆంధ్రాలలో ప్రవహిస్తూ మధ్య మధ్యలో అనేక నదుల్ని తనలో కలుపుకుంటూ సముద్రాన్ని చేరుకునే కృష్ణను నారాయణ స్వరూపంగా భావిస్తారు. కలియుగంలో మానవుల పాపాలను కడిగేయడానికి నారాయణుడే కృష్ణగా పుట్టాడని పురాణకథ. కృష్ణ అంటే పాపాలను పోగొట్టేది అని అర్థం.

కృష్ణ జీవనది. అన్ని ఋతువుల్లోనూ గలగలా ప్రవహిస్తూ ఉంటుంది. ప్రజల దాహార్తిని తీరిస్తూ వుంటుంది. జనకస్థానం నుంచి సాగరంలో సంగమించేదాకా దోవ పొడవునా అనేక నదులు వచ్చి కృష్ణను చేరుతాయి. అన్నింటినీ తనలో కలుపుకుని బిరా బిరా సాగే కృష్ణ తెలిసో తెలియకో మనం చేస్తున్న దైహిక మానసిక మలినాలను తొలగిస్తోంది. ఆ తల్లికి విసుగు లేదు. తల్లికి బిడ్డలు భారమా! బిడ్డల్ని కడిగిన ముత్యాల్లా ఉంచడమే ఆవిడ పని. జలరూపిణి అయిన కృష్ణవేణి హరిహరాత్మకంగా ప్రసిద్ధి చెందింది.

గురుడు కన్యారాశిలో ప్రవేశించినప్పుడు కృష్ణకు పుష్కరాలు వస్తాయి. పుష్కర సమయంలో కృష్ణాసాగర సంగమంలో స్నానం చేసిన వారికి ఉత్తమగతి కలుగుతుంది.

ఆగష్టు 12వ తేదీనుంచి కృష్ణా పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగం "పుష్కరకృష్ణ" పేరిట ప్రత్యేక సంచికను ప్రచురిస్తోంది. లబ్ధప్రతిష్టులైన కవి పండితుల రచనలు ఇందులో ఉన్నాయి. పదికాలాలపాటు మీ పిల్లాపాపలు చదువుకునేందుకు, ధార్మిక చింతన అలవర్చుకునేందుకు, ధర్మమార్గాన నడిచేందుకు ఈ అక్షరకృష్ణ అక్షయమై నిలవాలని ఆశిస్తున్నాను.

(ప్రయాగ రామకృష్ణ)

విషయసూచిక

ఒక్కమాట

శుభాశయం

సంపాదకీయం

పుష్కరం

1. పుష్కరం అంటే ఏమిటి? కృష్ణాపుష్కరం? (తూములూరి లక్ష్మీనారాయణ) 01
2. పుష్కరాలు మన కర్తవ్యం (సన్నిధానం లక్ష్మీనారాయణమూర్తి) 06
3. పర్వకాలం అంటే ఏమిటి? (శ్రీమద్భాగవతం లక్ష్మీనరసింహాచార్యులు) 10
4. పుష్కరాలు - పూజాపురస్కారాలు (వైద్యం వేంకటేశ్వరాచార్యులు) 14
5. పుష్టినిచ్చేది పుష్కరం (గడియారం రామకృష్ణశర్మ) 20

పితృకర్మలు

6. పుష్కరాల్లో ఎందుకు పితృకర్మలు చేయాలి? (ఎమ్. బాలవిశ్వనాథశర్మ) 23
7. పితృకర్మలు వైజ్ఞానిక సమన్వయం (డా॥ ఎక్కిరాల కృష్ణమాచార్య) 25

కృష్ణవేణి పేరు - వైభవం

8. నా పేరు కృష్ణవేణి (జంధ్యాల జయశంకర్ బాపూజీ) 29
9. కృష్ణానది వైభవం (డా॥ జయంతి చక్రవర్తి) 33

తీర్థక్షేత్రాలు - ఆలయాలు

10. తీర్థయాత్రలు వాటి స్వరూపం? (డా॥ శలాక రఘునాథశర్మ) 43
11. మన నదులు - మన సంస్కృతి (చెఱుకుపల్లి జమదగ్నిశర్మ) 47
12. నదులు - ధార్మిక భావన (డి.ఆర్. ఆచార్య) 51
13. ఇతిహాస పురాణాలు పేర్కొన్న నదులు (మురళి, దుర్గ) 54
14. మన దేశంలో జీవనదులు (డా॥ ప్రసాదరాయ కులపతి) 58
15. పురాణములలోని నదీమాహాత్మ్యము (ఆచార్య దివాకర్ల వేంకటావధాని) 63
16. శ్రీశైల మహాక్షేత్రం (డా॥ నొస్సం నరసింహాచార్యులు) 68

17. అలంపురం సంగమేశ్వరం సోమశిలక్షేత్రాలు (మైత్రేయ) 74

18. ప్రథమ పంచారామక్షేత్రం - శ్రీ అమరారామము (దిట్టకవి కన్నబాబు) 79

19. కృష్ణాతీర నరసింహక్షేత్రాలు (కె.ఆర్. నరసింహన్) 83

20. కృష్ణాతీరపు ప్రసిద్ధ ఆలయాలు (డా॥ కోరాడ రామకృష్ణ) 87

21. నదీతీరాల్లో పుణ్యక్షేత్రాలు (డా॥ ఎస్.బి. రఘునాథాచార్య) 93

22. కృష్ణానదీతీరాల్లో తీర్థక్షేత్ర మాహాత్మ్యం (డా॥ సింగరాజు దక్షిణామూర్తి) 99

ప్రసిద్ధ స్థలాలు

23. కొండపల్లి విశిష్టత (ఎం.పి. శాస్త్రి) 107

24. నూజివీడు (పమ్మి సత్యనారాయణశాస్త్రి) 108

శాసనాలు - సంగ్రహాలయాలు

25. శాసనాల్లో సాహిత్యంలో కృష్ణానది (డా॥ గల్లా చలపతి) 113

26. అమరావతి పురావస్తు సంగ్రహాలయం (దిట్టకవి కన్నబాబు) 119

కృష్ణాతీరంలో...

27. కృష్ణాతీరం ఆయుర్వేదం (పమ్మి సత్యనారాయణశాస్త్రి) 125

28. కృష్ణాతీరం వనమూలికా సంపద (డా॥ కొప్పల హేమాద్రి) 131

29. దేశీనృత్యం జాయపసేనాని (ఆచార్య ఎస్. గంగప్ప) 139

30. పదముల క్షేత్రయ్య - పాటకాడు (ఆచార్య కె. సర్వోత్తమరావు) 145

31. కృష్ణాతీరం నాటకరంగం (పొన్నపల్లి విశ్వనారాయణ కృష్ణ) 152

32. సామాజిక ప్రయోజనం సాధించిన కూచిపూడి భాగవతులు (కట్టా నరసింహులు) 157

స్తుతి

33. కృష్ణమ్మ నీ నడకలే సిరులమ్మ (కవిత) (ఎలమర్తి రమణయ్య) 161

34. కృష్ణాస్తోత్రం (డా॥ ముదివేడు ప్రభాకరరావు) 162

35. విశ్వనాథ 'కిన్నెరసాని పాటలు' (ఆచార్య కోసూరి దామోదర నాయుడు) 164

పుష్కరం అంటే ఏమిటి?

కృష్ణాపుష్కరం

తూములూరి లక్ష్మీనారాయణ

శక్తిస్వరూపం

ఈ ప్రపంచం అనేక శక్తులతో కూడిన మహాశక్తి స్వరూపం. ఒక్కొక్క శక్తి ఒక్కొక్క సమయంలో, ఒక్కొక్క స్థలంలో మహోజ్వలంగా ప్రసరిస్తూ ఉంటుంది. భారతీయ మహర్షులు ఈ విశేషాన్ని గుర్తించారు. ఈ శక్తుల వెనుక ఆధిదైవికశక్తులున్న విషయాన్ని కూడా వారు గుర్తించారు. ఆ వివరాలను సామాన్యుల ఊహలకు అందేటట్లుగా రమ్యమైన కథల రూపంలో అందించి, ఆ శక్తుల విశేషాలను తెలుసుకొని అవలంబించవలసిన యోగ్యజీవన విధానాన్ని, సంస్కృతిని, ధర్మాన్ని, విధులను ప్రబోధించారు.

పుష్కరం అంటే ఏమిటి?

అట్టి శక్తులలో జలం ఒకటి. పుష్కర విజ్ఞానం దానికి సంబంధించింది. జలానికి పుష్కరమని పేరున్నది. "పోషయతీతి పుష్కరం" - పోషించేది అని అర్థం. ఈ విజ్ఞానాన్నొక రమ్యమైన కథ రూపంలో పూర్వులు మనకు అందించారు.

పూర్వం తుందిలుడనే ధర్మనిష్ఠుడున్నాడు. అతడు పరమేశ్వరుని గురించి తపస్సుచేసి శాశ్వతంగా పరమేశ్వరునిలో ఉండేటట్లు వరం పొందాడు. పరమేశ్వరుని అష్టమూర్తులలో ఒకటైన జలరూపంలో అతడికి శాశ్వత స్థానమిచ్చారు. మూడున్నరకోట్ల పుణ్యతీర్థాలకు ఆదికారణుడు గను, జలసామ్రాజ్యానికి సార్వభౌముడుగాను కూడా ఆ పుష్కరుడు వరాలు పొందాడు. అనంతర కాలంలో బ్రహ్మకు జగత్సృష్టి చేయడానికి జలం అవసరమైంది. అతడు పరమేశ్వరుని గురించి తపస్సుచేసి, పుష్కరుడు తన కమండలంలో నివాసముండేటట్లు వరం పొందాడు.

పుష్కరోదంతం

ఆ తరువాత బృహస్పతి బ్రహ్మను గురించి తపస్సు చేయవలసి వచ్చింది. ప్రాణులను

"బృహస్పతి పుష్కరునితో కలిసి మేషరాశిని ప్రవేశించినప్పుడు గంగకు పుష్కరం. వృషభరాశిలో నర్మదకు, మిథునంలో సరస్వతికి, కర్కాటకంలో యమునకు, సింహంలో గోదావరికి, కన్యలో కృష్ణకు, తులలో కావేరికి, వృశ్చికంలో భీమరథికి, ధనుస్సులో వాహినికి, (బ్రహ్మపుత్ర) మకరంలో తుంగభద్రకు, కుంభంలో సింధుకు, మీనంలో ప్రణీతానదికి పుష్కరాలు".

బ్రతికించే ధర్మం బృహస్పతిది. అందువలన జీవనాధారుడైన పుష్కరుని తన అధీనంలో ఉంచవలసిందిగా బ్రహ్మను ప్రార్థించాడు. అయితే పుష్కరునికి బ్రహ్మను విడిచి వెళ్లటానికి ఇష్టంలేక, బ్రహ్మను కూడా తనతో బృహస్పతివద్ద ఉండవలసిందిగా ప్రార్థించాడు. అది సాధ్యం కానిపని. అందువల్ల బ్రహ్మ ఒక ఏర్పాటు చేశాడు. గ్రహస్వరూపుడైన బృహస్పతి మేషాది ద్వాదశ రాశులందు ప్రవేశించేటప్పుడు 12 రోజులు, ఆ రాశులనుండి నిష్క్రమించేటప్పుడు 12 రోజులు సంవత్సరంలో మిగిలిన అన్ని దినాలలో మధ్యాహ్న సమయంలో రెండు ముహూర్తాల కాలం పుష్కరుడు బృహస్పతిలో ఉండాలని, ఆ సమయాలలో తాను సమస్త దేవతలతోను బృహస్పతి ఉన్న రాశికి అధిష్ఠానమైన పుణ్యనదికి వస్తూ ఉంటానని – ఈ విధంగా పుష్కరుడు నిరంతరం బ్రహ్మతోను, బృహస్పతితోను ఉండే ఏర్పాటు జరిగింది. సృష్టి, స్థితులకు ఆధారభూతమైన జల ప్రశస్తిని గురించిన ఆధిదైవికవిజ్ఞానానికి ఈ కథ నొక సంకేతంగా స్వీకరించవచ్చు. నదులకు పుష్కరాలు ఈ విధంగా ఏర్పడ్డాయి.

నదులు పుష్కరాలు

శ్లో॥ మేషే గంగా వృషే రేవా మిథునే చ సరస్వతీ।
కర్కటే యమునా ప్రోక్తా సింహే గోదావరీ స్మృతా॥

కన్యాయాం కృష్ణవేణీ చ కావేరీ తులాయం స్మృతా।
వృశ్చికే తామ్రపర్ణీ చ చాపే పుష్కరవాహినీ ॥

మకరే తుంగభద్రా చ కుంభే సింధునదీ స్మృతా।
మీనే ప్రణీతా చ నదీ గురోస్సంక్రమణే స్మృతా ॥

పుష్కరాఖ్యో మునీనాం హి ప్రదేశోఽత్ర బుధైః స్మృతః।

అనే శ్లోకప్రమాణం ప్రకారం బృహస్పతి పుష్కరునితో కలిసి మేషరాశిని ప్రవేశించినప్పుడు గంగకు పుష్కరం. వృషభరాశిలో నర్మదకు, మిథునంలో సరస్వతికి, కర్కాటకంలో యమునకు, సింహంలో గోదావరికి, కన్యలో కృష్ణకు, తులలో కావేరికి, వృశ్చికంలో భీమరథికి, ధనుస్సులో వాహినికి, (బ్రహ్మపుత్ర) మకరంలో తుంగభద్రకు, కుంభంలో సింధుకు, మీనంలో ప్రణీతానదికి పుష్కరాలు సంభవిస్తాయి.

కృష్ణాపుష్కర ప్రశస్తి

కృష్ణానదికి సంబంధించినంతవరకు బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించినప్పుడు పుష్కరం సంభవిస్తుందనే విషయంలో అభిప్రాయభేదం లేదు. కృష్ణానది విష్ణురూపిణి అని ప్రసిద్ధి. లోకాలను తరింపచేయటానికి కృష్ణపరమాత్మ సహ్యాద్రిపైన అశ్వత్థ వృక్షరూపంలో నిలచాడని, ఆ చెట్టు వ్రేళ్లనుండి కృష్ణానది అవతరించిందని ఐతిహ్యం. సహ్యాద్రిపైన బ్రహ్మ తపస్సు చేసినచోట బ్రహ్మగిరి, వేదాలు మూర్తిరూపం పొంది ఈశ్వరుని స్తుతించిన స్థలంలో వేదగిరి ఏర్పడ్డాయని, వేదగిరి వద్ద కృష్ణపరమాత్మ అశ్వత్థ రూపాన్ని ధరించాడని పురాణాలలో చెప్పబడింది కలియుగంలో పాపప్రక్షాళనావసరాలను తీర్చే వ్యవస్థకోసం మునులు పరమేశ్వరుణ్ణి ప్రార్థించగా అతడు లింగాకారంలో ఆ ప్రదేశంలో వెలశాడు. ఆ ప్రదేశంలో గల ఆమలక (ఉసిరిక) వృక్షంనుండి వేణీనది అవతరించి కృష్ణానదిలో ఏకమై

ఇనుమడించిన ప్రాశస్త్యంలో కృష్ణవేణీనది ఏర్ప డిందని చెబుతారు. శివకేశవుల అభేదత్వమిది. ఈ అన్ని కారణాలవల్ల కృష్ణవేణి పరమపవిత్రంగా భావించింది. ఈ నదిలో స్నానం, పానం, నదీతీరంలో జీవనం అత్యంత ఫలదాయకాలని విశ్వసించబడింది. క్రమంగా నదీతీరంలో అంతటా అనేక పుణ్యక్షేత్రాలు నెలకొన్నాయి.

కృష్ణానది - ఉపనదులు

సహ్యాద్రి నుంచి సాగరసంగమం వరకు సాగిన 800 మైళ్ల సుదీర్ఘయాత్రలో, కృష్ణానది అనేక ఉపనదీనదాలను తనలో కలుపుకుంది. వేణి, కకుద్మతి (కొయ్‌నా) సావిత్రి, గాయత్రి, వర్ణ, పంచగంగ, భీమ, తుంగ, భద్ర, మూసి, ఇట్లెన్నెన్నో నదీనదాలు కలిసి మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రరాష్ట్రాల చారిత్రక, సాంస్కృతిక జీవనంలో ఈ నది ప్రముఖస్థాన మాక్రమించింది. పురాణా లలో కృష్ణవేణిగాను జాతక కథలలో కన్హపెన్నగాను, ఖారవేల శాసనంలో కన్హ పెమ్నగాను ప్రస్తావన పొందింది.

పుష్కర ప్రశస్తి

పుష్కర సమయాలలో నదీజలాలు ఆధిదైవిక తేజస్సును పొంది ఉంటాయి. కాబట్టి ఆ సమయాలలో మానవులు స్నాన, దాన, జప, అర్చన, ధ్యాన, హోమ, తర్పణాది అనుష్ఠానాలను పితృపిండప్రదానాలను చేయాలని మహర్షులు ప్రబోధించారు. ఈ కర్మల వలన శారీరక, మానసిక, బౌద్ధిక కల్మషాలు తొలగి, మానవులు పవిత్రులు. తేజోవంతులై ఉత్తేజితులవుతారు. ఆధ్యాత్మికోత్తేజం కలిగి - ఐహిక సత్ఫలాలేగాక ఆము ష్మిక ప్రయోజనాలు సిద్ధి స్తాయి. ఇంకో మాటలో చెప్పాలంటే ఈ కర్మలు ఆధ్యాత్మిక సంస్కార హేతువులు అందువల్లనే ఆధ్యా త్మిక సాధనలకు, మోక్ష లక్ష్యానికి విశేష ప్రాముఖ్యమిచ్చే భారతీయ సంస్కృతిలో ఈ ధార్మిక కర్మలకు విశేష ప్రాధాన్యమీయబడింది. ఈ ఆధ్యాత్మిక చింతన మన జాతి ఏకత్వానికి పునాదివంటిది కూడా.

> **వేణి, కకుద్మతి (కొయ్‌నా) సావిత్రి, గాయత్రి, వర్ణ, పంచగంగ, భీమ, తుంగ, భద్ర, మూసి కృష్ణకు ఉపనదులు.**

పుష్కర వ్రతం

కృష్ణాపుష్కర దినాలలో అపమృత్యు పరిహా రార్థం పుష్కర వ్రతం సూచించబడింది. అందు కృష్ణ, పుష్కర, బృహస్పతి, నారాయణ, భాస్కర, మహాలక్ష్మి, గణేశ, శ్రీకృష్ణ, సరస్వతి, పార్వతి, మహేశ్వర, అనంత, నృసింహ, వామన, శ్రీరామచంద్ర మహామంత్ర జపాలు - కనీసం ప్రార్థనాదులు కర్తవ్యాలు.

పుష్కరసమయంలో 12 దినాలు జరిపే వ్రతం, 12 ముఖ్యకల్పాల్లో జరిపే వ్రతానికి సమానమని పుష్కరవ్రతకథలో చెప్ప బడింది. మూడు యామాల ఆయు ర్దాయమే మిగిలిన చిత్రరథుడనే రాకుమారుడు కృత్నునుడనే ముని

ప్రబోధించే, కృష్ణాపుష్కర సమయంలో ఈ వ్రతమాచరించి దీర్ఘాయుర్దాయం పొందేదని వ్రతమాహాత్మ్యంలో చెప్పబడింది.

దానధర్మాలు

కృష్ణాపుష్కర దినాలలో దినాని కొక రీతిని దానవిధి ప్రతిపాదింపబడింది. వెండి, బంగారు, భూమి, ధాన్యం, హిరణ్యం, గోవులు, లవణాలు, మణులు, వస్త్రాలు – అశ్వం, బెల్లం, పండ్లు, కూరలు – తైలం, నేయి, పాలు, తేనె, పానకం – బండి, నాగలి, ఎద్దు, మహిషం, కస్తూరి, చందనం, ఔషధం – గృహం, శయ్య, పీట, ఊయెల – కంద మూలాలు, పూలు, దాసదాసీజనం, కన్య, కంబళి, అన్నం – ముత్యాలహారాలు – పుస్తకం, తాంబూలం, జందెము, షోడశమహా దానాలు – ఇత్యాది దానకర్మలను క్రమంగా ఆ 12 దినాలలోను చేయాలని ధర్మశాస్త్రం చెబుతుంది. ఈ పట్టికను గమనించి ఐహికజీవితంలో మనం సంపాదించే సమస్త వస్తువులలో, స్థిరచరాస్తుల భోగభాగ్యాలలో వ్యామోహాలను వదలి పరులకు సమర్పించడం ద్వారా పరార్థచింతనం, పరమార్థ సాధనం అవలంబించాలని ప్రబోధంగాను, అందుకు సాధనగాను కనిపిస్తుంది. మోక్షగామికి ఈ దానాలు అత్యంత ఫలప్రదమనటం ఆ విషయాన్నే వక్కాణిస్తుంది. ఇది సామాజికం, ఆధ్యాత్మికమైన సాధన.

వెండి, బంగారు, భూమి, ధాన్యం, హిరణ్యం, గోవులు, లవణాలు, మణులు, వస్త్రాలు - అశ్వం, బెల్లం, పండ్లు, కూరలు - తైలం, నేయి, పాలు, తేనె, పానకం - బండి, నాగలి, ఎద్దు, మహిషం - కస్తూరి, చందనం, ఔషధం - గృహం, శయ్య, పీట, ఊయెల - కందమూలాలు, పూలు, దాసదాసీజనం, కన్య, కంబళి, అన్నం - ముత్యాలహారాలు - పుస్తకం, తాంబూలం, జందెము, షోడశమహా దానాలు - ఇత్యాది దానకర్మలను పుష్కర సమయంలో చేయాలని ధర్మశాస్త్రం చెబుతోంది.

పుష్కరాలలో శ్రాద్ధాలు

పుష్కరసమయంలో విశేష ప్రాముఖ్య మివ్వబడే మరొక అంశం పితృదేవతలకు తర్పణాలు, పిండ ప్రదానాలు. తొలిదినాన హిరణ్మయశ్రాద్ధం. 9వ దినాన అన్నశ్రాద్ధం 12వ దినాన ఆమశ్రాద్ధం చెప్పబడింది. ఆ విధివిధానాలు స్పష్టీకరించబడి ఉన్నాయి. అందు తల్లివైపున, తండ్రివైపు గల బంధుజనులకు, రక్తబంధువులకే గాక, గురువులు, మిత్రజనులకు సైతం శ్రాద్ధాలను పెట్టాలని చెప్పబడింది. మనమీ పితృజనులందరి వలన భౌతికకాయాన్నే గాక, ఆంతరిక సంస్కారాలను కూడా పొంది వున్నందు వలన వారికి మనం ఋణపడి వుంటాం. వారిలో కొందరు సద్గతి పొందియుండ వచ్చు. కొందరు పొందియుండకపోవచ్చు. అట్టివారందరికి శ్రద్ధతో ఈ మహాపుణ్య కాలంలో శ్రాద్ధవిధులు నిర్వర్తించడం వలన వారికి ఉత్తమగతులు కల్గటం ద్వారా మనం ఋణ విముక్తులమౌతామని ఇందులోని సందేశం. ఇది మనకు వారికి కూడా

సత్ఫలితం కల్గించే విషయం కాబట్టి తప్పక ఆచరించదగినదవుతున్నది. పుష్కరసమయంలో పుణ్యనదుల జలాలు – ఎన్నడో మరణించిన వారికి కూడ ఉత్తమగతులీయగల సామర్థ్యం గలవి అనేమాట కూడా ఇందులో ఉంది. పుష్కర సమయంలో శ్రద్ధావిరహితుడై శ్రాద్ధకర్మను నిర్వహించినా ఫలప్రదమే అని ప్రబోధించడానికి ఒక చక్కని కథ చెప్పబడింది. గోవిందశర్మ అనే భ్రష్ట బ్రాహ్మణుడు కర్మభ్రష్టుడు నాస్తికుడై పులివాతబడి దుర్మరణం పాలవుతాడు. అతడి కుమారుడు శివశర్మ అంతకుమించిన భ్రష్టుడు, నాస్తికుడు. అతడి తల్లి సుగుణవతి. ఆమె సంతృప్తి కొరకు శివశర్మ కృష్ణాపుష్కర సమయంలో తండ్రికి అశ్రద్ధగానైనా శ్రాద్ధం పెట్టిన కారణంచేత గోవింద శర్మకు సద్గతి కలిగిందని ఆ కథలో చెప్పబడింది. పితరులను స్మరిస్తూ జరిపే ఈ విధివిధానం, మన జాతిలో వంశపారంపర్యాని కీయబడే ప్రాముఖ్యం, పితరుల ఋణవిముక్తి ప్రాధాన్యాలను వక్కాణిస్తున్నది.

పుష్కరాల్లో మన బాధ్యత

పుష్కరకాలంలో జరుపవలసిన విస్తృత విధి విధానమొక గొప్పతపస్సు వంటిది. అంతటి దీక్షాయుత కృషి సాధ్యం కానివారు కూడా జప, దాన, అర్చన, శ్రాద్ధాదుల విషయంలో యథా శక్తిగానైనా ప్రవర్తించడం, ఆ పవిత్ర సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే అవుతుందని గ్రహించవలసి వుంది.

కృష్ణానదిలో స్నానం, పానం, నదీతీరంలో జీవనం అత్యంత ఫలదాయకం.

పుష్కరాలు - మన కర్తవ్యం

సన్నిధానం లక్ష్మీనారాయణమూర్తి

పరిచయం

భారతీయులమైన మనం తరతరాల నుంచి ఏదో ఒక ధర్మమార్గాన్ని అనుసరించి జీవనం సాగిస్తున్నాం. ఇలా ధార్మికజీవనం చేసే మనకు ఈ కృష్ణా పుష్కరం ఒక సువర్ణావకాశం ఇది 12 సంవత్సరాలకొకసారి సంభవించే పవిత్ర సన్నివేశం అన్ని శ్రేయస్సులకు ధర్మమే సాధనమని, కనుక దాన్ని సాధించాలని అన్నివేదాలు, శాస్త్రాలు ఉపదేశిస్తున్నాయి.

కర్తవ్యంగా ఉపదేశింపబడిన ధర్మంకూడా దేశ-కాల-ప్రాంతాలను బట్టి అనేక విధాలుగా ఉంటుంది. అంతెందుకు లోకవ్యవహారంలో మన అందరి కర్తవ్యాలు ఒకేరకంగా ఉండవు. వారి వారి వయస్సును అవస్థలను అనుసరించి అనేక పనులను చేస్తూ ఉండటం మనకు తెలిసిన విషయమే. ధర్మాన్ని ఆచరించేటప్పుడు కూడా అలాగే వాళ్ళ వాళ్ళ అన్ని అర్హతలను, అవకాశాలను దృష్టిలో పెట్టుకోవాలి.

ధర్మాచరణంవల్ల మిగతా సమయాల్లో సిద్ధించే ప్రయోజనం కన్నా విశిష్టసమయాల్లో ఎక్కువ ప్రయోజనాలు కలుగుతుంటాయి. నిత్యం మనం చేసే స్నానం, దానం, దేవతార్చన మొదలగునవి పుష్కరాలవంటి పర్వ కాలాలలో వందలరెట్లు ఫలితాన్ని ఇవ్వ గలుగుతాయి. ఔషధం ఒకటే అయినా ఋతుభేదంవల్ల అనుపానభేదంవల్ల విశిష్ట ప్రయోజనాన్ని కల్గించడం మనకు తెలియని విషయం కాదు.

పుష్కర వృత్తాంతం

బృహస్పతి ఒక్కొక్క రాశిలో ప్రవేశించినప్పుడు ఒక్కొక్కనదికి పుష్కరం వస్తుందని మనకు తెలుసు. అయితే పుష్కరుడు అంటే ఎవరు? అన్న సందేహం కలుగుతుంది కదూ! ఈ కథ వినండి : పూర్వం తుందిలుడనే మహర్షి ఉండేవాడు. ఆయన చాలకాలం పరమేశ్వరుణ్ణి ఆరాధించాడు. ఆయన దయవల్ల 3½ కోట్ల పుణ్యతీర్థాలకు రాజై, పుష్కరుడు అనే ప్రసిద్ధి సంపాదించాడు. ఈశ్వరుని అష్టమూర్తులలో ఒకటైన జలమయమూర్తిలో ప్రవేశించి ఈశ్వరుడే అయినాడు. ఇలా ఉండగా ఒకప్పుడు బ్రహ్మ తన తపస్సుతో పరమేశ్వరుణ్ణి సంతోషింపచేసి అన్ని కోర్కెలను తీర్చే పుష్కరుణ్ణి సృష్టికార్యం కోసం తనకిమ్మని అడిగాడు. అలాగే అన్నాడు ఈశ్వరుడు. జలరూపంలో వున్న పుష్కరుణ్ణి తన కమండలంలో పెట్టుకొని బ్రహ్మ సృష్టి చేస్తున్నాడు.

ఇంకొంత కాలానికి బృహస్పతి బ్రహ్మను మెప్పించి పుష్కరుడు తనకు కావాలని కోరుకొన్నాడు. సరేనన్నాడు బ్రహ్మ. కాని పుష్కరుడు బ్రహ్మను వదలి

వెళ్ళడాని కిష్టపడలేదు. ఎట్లాగో ఒక ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం బృహస్పతి కొత్తగా ఒక రాశిలో ప్రవేశించినపుడు మొదటి 12 రోజులు, చివరి 12 రోజులు మిగతా రోజుల్లో మధ్యాహ్నం 4 ఘడియలు మాత్రం పుష్కరుడు బృహస్పతి అధీనంలో ఉండాలి. ఆ సమయంలో దేవగణా లందరితో బ్రహ్మ పుష్కరుణ్ణి అనుసరించాలి. ఈ ఒప్పందంప్రకారం పై చెప్పిన పుష్కర కాలాల్లో 3 కోట్ల 50 లక్షల పుణ్యతీర్థాలకు అధిపతియైన పుష్కరుడు బ్రహ్మ మొదలగు దేవతలందరితో ఆ యా నదుల్లో బృహస్పతితో కలసి నివసిస్తాడు. కాబట్టే ఆ నదుల్లో దేవతలందరి సాన్నిధ్యంవల్ల చెప్పలేనంత ప్రభావముంటుంది. అప్పుడు ఆచరించిన స్నాన, తర్పణాది కర్మలన్నింటికి మనకెంతో పుణ్యం కలుగుతుంది.

పుష్కరస్నానం

ఈ పుష్కర సమయంలో అందరూ స్నానాన్ని దానాన్ని ఆచరించవచ్చు. ఎన్నో పుణ్యకార్యాలు ఈ సమయంలో చేయాలని శాస్త్రాలు చెపుతున్నాయి. కాని వాటన్నింటిలోకి ముఖ్య మైంది. ఎంతో ఫలితాన్నివ్వగలిగింది పుష్కరస్నానం నదులు దైవ, ఆర్ష, మానవ, ఆసుర భేదంతో నాలుగురకాలు అని బ్రహ్మపురాణం చెబుతున్నది.

త్రిమూర్తుల చేత ప్రవర్తింపచేయబడేవి మొదటి తరగతికి చెందుతాయి. అలా మొదటి తరగతికి చెందిన గంగ, గోదావరి మొదలగువాటితో కృష్ణవేణికూడా పరిగణింపబడింది. సహజంగా ఇలాంటి గొప్ప ప్రభావం కలిగి పుష్కరకాలంలో 3½కోట్ల పుణ్యతీర్థాలలో ప్రకాశించే కృష్ణవేణిలో స్నానం చేయడం ఎంతటి అదృష్టవంతులకు సాధ్యమవుతుందో మీరే ఊహించండి.

నీళ్ళకింత విలువా? అని కొందరంటారు. నీళ్ళల్లో రెండురకాల శక్తులున్నాయని వేదం చెప్తుంది. మురికిని పోగొట్టడం, దాహాన్నితీర్చడం అనే లౌకికశక్తి అందరికి తెలిసిందే. ఇంకా అతీంద్రియమైన దైవికశక్తికూడా ఒకటి ఉంది. అది 'మేధ్యం' 'యజ్ఞ్యం' అని రెండురకాలు. అందులో 'మేధ్యం' అనే శక్తి స్నాన ఆచమనాదుల ద్వారా మనపాపాన్ని పోగొడు తుంది. 'యజ్ఞ్యం' అనే శక్తి ప్రోక్షణాదుల ద్వారా ద్రవ్యశుద్ధిని కలిగిస్తుంది.

ఈ రెండూ కంటికి కనబడేవి కావు. ఆ ఫలితం కలగడానికి అలాంటి భావన ముఖ్యం. పుష్కర సమయంలో కృష్ణానదిలో స్నానం చేస్తే గంగ, గోదావరి మొదలైన నదుల్లో 12 సంవత్సరాలు ప్రతిరోజూ స్నానం చేసిన ఫలితం కలుగుతుందని, పూర్వజన్మల్లో మనస్సు, వాక్కు, శరీరమనే త్రికరణాలతో చేసిన అన్ని పాపాలు నశించి మోక్షప్రాప్తి కలుగు తుందని బ్రహ్మాండ పురాణం చెప్తున్నది. అంతేకాదు చాలా శ్రమపడి చేయ వలసిన అశ్వమేధ యాగం కంటే ఎక్కువ ఫలితాన్ని

కృష్ణాపుష్కర స్నానం మనకిస్తుందని మనవిశ్వాసం ఇంకా నర్మదా తీరంలో తపస్సు, కురుక్షేత్రంలో దానం, కాశిలో మరణం ఈ మూడు మోక్షాన్నిస్తాయని పుష్కరకాలంలో కృష్ణలో స్నానం చేయడం పై మూడింటివల్ల కలిగే ఫలితం కలుగుతుందని పద్మపురాణం పేర్కొన్నది.

పుష్కర సమయంలో ప్రాతఃకాల స్నానం ఉత్తమమైందని, మధ్యాహ్న స్నానం మధ్యమమని, అపరాహ్ణస్నానం అధమ మైందని శాస్త్రాలు చెప్తున్నాయి. అవకాశ మున్నవారు పుష్కరవిధిని ఆచరించడానికి ముందురోజే రెండు పూటలో, ఒకపూటో ఉపవాసం చేసి మరుసటిరోజు ఉదయం ముండనం చేయించుకొని స్నాన, దాన, శ్రాద్ధ, తర్పణాదులను ఆచరించడం ఉత్తమం. స్నానం చేసిన తర్వాత స్నానఫలం సిద్ధించడానికి కృష్ణవేణి - తీర్థరాజ, బృహస్పతి - బ్రహ్మ, విష్ణు - మహేశ్వర - ఇంద్రాది దేవతలకు అర్ఘ్య ప్రదానంచేసి అటు తర్వాత ధర్మార్ఘ్యాలు ఇవ్వమని బ్రాహ్మణులకు తగిన దక్షిణల నివ్వమని ముత్తైదువులకు వాయనాలను ఇవ్వమని పుష్కరస్నానకల్పం చెప్తుంది.

దానధర్మాలు

గృహస్థులు ఈ పుష్కరకాలాన్ని చక్కగా వినియోగించు కోవాలి. శాస్త్రాలు పుష్కర సమయంలో దానవిధిని ఇలా ఉపదేశిస్తున్నాయి.

మొదటిరోజు సువర్ణ రజిత ధాన్య భూదానాలు, రెండవరోజు వస్త్ర లవణ ధేను రత్నదానాలు, మూడవరోజు

గుడ అశ్వ శాక ఫలదానాలు, నాల్గవరోజు ఘృత తైల క్షీర మధు దానాలు, ఐదవరోజు ధాన్య శకట మహిషి వృషభ హల దానాలు, ఆరవరోజు ఔషధ కర్పూర కస్తూరి చందన దానాలు, ఏడవరోజు గృహ పీఠ శయ్య ఆందోళికా దానాలు, ఎనిమిదవరోజు చందన పుష్పమాల మూలఆర్ద్రక దానాలు, తొమ్మిదవరోజు పిండ దాసీ కన్యా కంబళ దానాలు, పదవరోజు శాక సాలగ్రామ పుస్తక దానాలు, పదకొండవరోజు గజాది దానాలు, పన్నెండవరోజు తిల అజాది దానాలు మిక్కిలి ప్రశస్తమైనవి.

సువర్ణ, రజత దానాలవల్ల ఈ లోకంలో సుఖ భోగాలతోబాటు సూర్య, చంద్రలోకప్రాప్తి, భూదానంవల్ల భూపతిత్వం, వస్త్రదానంవల్ల వసులోకప్రాప్తి, గోదానంవల్ల రుద్రలోకప్రాప్తి, ఆజ్యదానంవల్ల ఆయుష్యాభివృద్ధి, ఔషధదానంవల్ల ఆరోగ్యం, సాలగ్రామ దానంవల్ల విష్ణులోకం, గృహదానంవల్ల చిరసౌఖ్యం, దాసీ శయ్యాదానం వల్ల స్వర్గసుఖం, తిలదానంవల్ల ఆపదలు తొలగిపోవడం మొదలైన ఫలితాలు నిర్దేశింపబడ్డాయి.

పూజాపురస్కారాలు

ఈ పర్వకాలాల్లో ఎన్నో రకాల పూజలుకూడా చెప్పబడ్డాయి అందులో 3½ కోట్ల తీర్థాలతో పుష్కరునితో కూడి ఉన్న కృష్ణవేణిని పూజించడం చాల ముఖ్యమైంది అంటే కృష్ణానదీజలాలను పూజించడం ద్వారా అభిమాని దేవత అయిన కృష్ణవేణిని పూజిస్తున్నామన్నమాట. తరువాత పుష్కరప్రవర్తకుడైన బృహస్పతిని, త్రిమూర్తులను. ఇష్టదేవతను పూజించాలి. ఇంకా కృష్ణాప్రవాహం ప్రాంతంలో వున్న ఇతర పుణ్యతీర్థాలను వాటిలో వెలసిన దేవతలను తప్పక పూజించాలి. పుష్కర సంవత్సరంలో ప్రత్యేకంగా చెప్పబడిన ఆ యా విశిష్టసమయాల్లో పై చెప్పిన దేవతలను పూజింపుమని కూడా పుష్కరకల్పం చెప్తున్నది.

తీర్థశ్రాద్ధవిధి

పుష్కరసమయంలో తప్పనిసరిగా ఆచరించ వలసిన పుణ్యకార్యం తీర్థశ్రాద్ధం. దీన్ని పుష్కరాలలో తొమ్మిదవరోజు జరుపుకోవడం మంచిది. అలాకాకపోతే ఆ యా పితృదేవతల (మృత) తిథినాడుకాని లేక 12 రోజులలో ఏదో ఒకరోజు కాని ఆచరించవచ్చు తల్లిదండ్రులు లేనివారే ఈ తీర్థశ్రాద్ధాన్ని ఆచరించడానికి అర్హులు.

ఈ శ్రాద్ధకర్మ పితరుల ప్రేతత్వవిముక్తికి పుణ్యలోకప్రాప్తికి మాత్రమే కాకుండా బ్రతికివున్న సంతతికి వ్రత్యవాయం లేకుండాచేయడానికి వంశం పెరగడానికీ, మంచి కలగడానికి సాధనం అవుతుంది. పుష్కరకాలంలో చేయబడే ఈ తీర్థశ్రాద్ధంలో మాతృవర్గ, పితృవర్గాలకే కాకుండా. మాతామహి మాతామహ వర్గత్రయానికి భాతృ - పితృవ్య భగినీ - భావుక శ్వశుర - స్యాలక - గురు - రిక్థి మొ॥ వారికి మరణించిన, తన సంబంధులందరికీ పిండప్రదానం చేయాలి.

అంతేకాక తనకు ఉపకారం చేసినవారు, మిత్రులు, ఆశ్రితులు, సేవకులు విష, శస్త్ర, అగ్ని, జల, అశనిపాతాదులవల్ల దుర్మరణాన్ని పొందినవారు, మరణానంతరం అంత్యకర్మ లోపించినవారు. క్షయ, అవస్మారక, కుష్ఠాది రోగాలతో మరణించినవారు, దారపుత్రాదులు లేనివారు, వికలాంగులు, కర్మభ్రష్టులు, జాతిభ్రష్టులు, బ్రహ్మహత్యాది మహాపాపాలు చేసినవారు ఎవరైనావుంటే వారందరికి సద్గతి కలగడానికి ధర్మపిండ ప్రదానం చేయబడుతుంది. ఇలా తీర్థ శ్రాద్ధాన్ని ఆచరించటం ద్వారా పితృదేవతల అనుగ్రహంకలిగి, వారి ఆశీస్సులు లభించి, తను, తన కుటుంబం సుఖశాంతులతో జీవించే అవకాశం లభిస్తుంది.

తన శక్తికి తగినట్లు సామాన్య మానవుడైనా పారణవిధానంగా అన్నశ్రాద్ధాన్ని ఆచరించడం మంచిది. అలా సాధ్యం కాకపోతే ఆమశ్రాద్ధాన్ని లేకపోతే, హిరణ్య శ్రాద్ధాన్ని చేయవచ్చు.

ఈ కృష్ణాపుష్కరం భారతీయులమైన మన అందరకు గొప్ప భాగ్యవశమున వచ్చిన మహావ కాశం. ఈ సమయంలో వారి వారి శక్తికి, అర్హతకు తగినట్లు పైన చెప్పిన స్నాన, దాన, శ్రాద్ధాది కర్మలను అనుష్ఠించి మంచి పుణ్య విశేషాన్ని మనమందరం సంపాదించు కోవడానికి ప్రయత్నం చేద్దాం.

*

పర్వకాలం అంటే ఏమిటి?

- శ్రీమద్భాగవతం లక్ష్మీనరసింహాచార్యులు

పరిచయం

ఈ భూమండలంలో భారతభూమికి రెండు రకాల ప్రసిద్ధులున్నాయి. ఒకటి ఇది ధర్మభూమి అని, రెండు కర్మభూమి అనీ. భోగభూములైన ఇతర దేశాల్లో జన్మించడానికంటే కర్మభూమి అయిన ఈ దేశంలో జన్మ ఎత్తడానికి ఆ జీవికి ఎంతో అదృష్టం ఉండాలి. ఎన్నో జన్మల అదృష్టంవల్లనే కొన్ని వేలజన్మలకొకసారి ఈభూమిపైన జీవి మానవుడై పుడతాడు. ఇది ఎవరో కాలక్షేపానికి చెప్పినమాట కాదు. విష్ణుపురాణం ఎలుగెత్తి చాటుతున్న సత్యం. కానీ ఇక్కడ విచారకరమైన విషయమేమిటంటే, మనకు కల్గిన అదృష్టాన్ని గుర్తించే స్థితిలో మనం లేకపోవడం. ఈ నగ్నసత్యాన్ని బాగా గుర్తించిన మనపూర్వులు మన జీవితాన్ని చక్కగా విభజించి, ఆయా దశల్లో మనం నిర్వహించాల్సిన కర్మల్ని మనకుపదేశించారు. కర్మసిద్ధాంతాన్ని తీసివేస్తే మన వేదాంతాలు, సంస్కృతులు సంప్రదాయాలు నిలవడానికి కూడా చోటుండదు. ఒక జీవిత కాలంలో మానవుడు ఆచరించవలసిన ఈ కర్మలను క్రమంగా ఎంతో చక్కని పద్ధతిలో వారు మనకు బోధించారు. కొన్ని కర్మలను కొన్ని యోగ్యమైన కాలాలలోనే ఆచరించాలి. కొందరే కొన్ని కర్మలను అనుష్ఠించ డానికి అర్హులు. కాబట్టి అన్నికర్మలూ అన్నికాలా ల్లోను ఆచరించాలను కోకుండా, యోగ్యాయోగ్య తలను నిశ్చయించుకొని నిర్వహించాలి. కొన్ని కర్మలు పర్వకాలంలోనే ఆచరించదగినవి. వాటిని మిగతాకాలంలో చేస్తే ప్రాయశ్చిత్తం చేయవలసి ఉంటుంది. అయితే పర్వకాలమనే మాటకు ఏమిటి అర్థం? అని సంశయం కలుగుతుంది. చూడండి:

పర్వనిర్వచనం

పర్వశబ్దం మనకు ఋగ్వేదంలోను, శతపథ బ్రాహ్మణంలోను, మహాభారతంలోను కనబడు తుంది. పర్వపదానికి ముడి, సంధి, కణుపు, గ్రంథ భాగం, ఉత్సవం అనేవి సామాన్యార్థాలు. ఒక మహా ప్రాసాదానికి కట్టిన సోపానపంక్తిలో ఉండే సోపానా నికి కూడా పర్వమనే వ్యవహారం ఉంది. తరువాతి కాలంలో చాతుర్మాస్యవ్రతం కూడా పర్వమనే పిలవబడింది. రాను రాను ఒక విశిష్టమైన సమయ పరంగా కూడా పర్వపదం ప్రయోగంలో చోటు చేసుకుంది. వీటినన్నింటిని పరిశీలించిన తరువాత పర్వపదంయొక్క ప్రయోగాన్నిబట్టి, రెండు ప్రత్యేక

కాలాలకు మధ్యలో సంధిలాంటి పవిత్రకాలం పర్వమని, ఆత్మ సంస్కారాన్ని పెంపొందించుకొనే వైదికకర్మలు కొన్ని ఆ కాలంలో చేయబడతాయని మనం భావించవచ్చు.

ఏవి పర్వకాలాలు?

వెనుక చెప్పినట్లు కర్మభూమియైన భారతభూమిలో ఎన్నో సత్కర్మలను చేసి వాటిద్వారా పుణ్యాన్ని సంపాదించుకొనే అర్హతగల మానవులకు ఎన్నో సత్కర్మలు, వాటిని ఆచరించడానికి తగిన కాలాలు మహర్షులచేత నిర్దేశింపబడ్డాయి. మొట్ట మొదట ఈ పర్వకాలాలెన్ని? అనే విచారం ఏర్పడినప్పుడు ఇవి నాలుగు అన్నారు. వాటినెలా గుర్తించడం? అంటే, చంద్రుడు కళలను పెంచుకోవడంద్వారా గాని, పోగొట్టుకోవడంద్వారా గాని కొన్ని మార్పులకు గురయ్యే రోజులు కొన్ని ఉన్నాయి. అవే పర్వాలు అన్నారు. పూర్ణిమనాడు చంద్రుడు సకలకళాపరిపూర్ణుడై ఉంటాడు. కాబట్టి అదొక పర్వం. తర్వాత అష్టమికి కళలలో ఎన్నో మార్పులు వస్తాయి. కాబట్టి అదొక పర్వం. అలాగే చతుర్దశినాటికి ఇంకొన్ని మార్పులకు అతడు గురౌతారు కాబట్టి అదీ ఒక పర్వం. ఇక మిగిలింది అమావాస్య. ఆనాడు దేవకార్యం కోసం పూర్తిగా క్షీణిస్తాడు కాబట్టి అదొకపర్వం. ఇలా మొదట ఈ పర్వకాలాలు నాలుగుగా పేర్కొనబడ్డాయి. ఇలాగే సూర్యుడు ఒక రాశినుంచి ఇంకో రాశికి సంక్రమించే రోజుకూడా పర్వకాలంగా గుర్తించ బడింది. అంటే ప్రతి సూర్యసంక్రమణం మనకు పర్వకాలమన్నమాట. కాలక్రమేణ మొత్తం సూర్యచంద్రుల్నిబట్టి సంభవించిన 5 పర్వకాలాలను కలిపి పంచపర్వాలనే పేరుతో వ్యవహరించారు. దీన్నే విష్ణుపురాణం ఇలా చెబుతుంది.

చతుర్దశ్యష్టమీ చైవ అమావాస్యాథ పూర్ణిమా ।
పర్వాణ్యేతాని రాజేన్ద్ర! రవిసంక్రాంతిరేవ చ ॥

మొత్తంమీద 1. అష్టమి 2. చతుర్దశి 3. పూర్ణిమ 4. అమావాస్య 5. సూర్యసంక్రమణదినం ఈ అయిదు పంచపర్వాలనే పేరుతో ప్రసిద్ధిని పొందాయి.

ఇవికాక సూర్య – చంద్రగ్రహణసమయం, పుష్కరసమయం కూడా పర్వకాలమే అవుతుంది. పుష్కరం అంటే ముఖ్యంగా బృహస్పతి ఒకరాశిని వదలి ఇంకొకరాశిలో ప్రవేశించిన మొదటి, చివరి పన్నెండురోజులు కాబట్టి అదికూడా సంక్రమణమే కనుక పర్వకాలమే. అంతేగాక పర్వమంటే ప్రత్యేకమైన పవిత్రకాలమని కూడా అర్థం కాబట్టి దాన్ని పర్వకాలం అనడంలో తప్పులేదు.

పర్వకాలంలో ఏం చేయాలి?

పర్వకాలంలో సాధారణంగా స్నాన – దాన – జప – తపస్సులను ఆచరించాలి. అది పుష్కరమైతే అప్పుడు చేయవలసిందంతా చాలా విస్తృతంగా ఉంటుంది. సామాన్యపర్వకాలాలలో పైచెప్పిన కర్మలను శాస్త్రోక్తంగా చేయాలి. పర్వకాలాల్లో తల్లిదండ్రులు లేనివారు కొన్ని శ్రాద్ధ – తర్పణాదులను చేయాలి. వాటిని 'పార్వణం' అని

'పార్వణశ్రాద్ధం' అని కూడా అంటారు. అమావాస్య నాడు ముగ్గురిని ఉద్దేశించి చేసే శ్రాద్ధకర్మకు పార్వణ శ్రాద్ధమనే వ్యవహారం ఉంది.

"తత్ర త్రిపురుషోద్దేశేన యత్క్రియతే తత్ పార్వణమ్"

మితా. 1-217

అమావాస్యాం యత్క్రియతే తత్పార్వణముదాహృతమ్।
క్రియతే వా పర్వణి యత్తత్పార్వణమితి స్మృతిః ॥

భవిష్యపురాణం అమావాస్య పర్వకాలంలో చేసే ఈ కర్మ పార్వణమని పేర్కొంటున్నది.

ఒక్కొక్క పర్వానికి ఒక్కొక్క వైశిష్ట్యం ఉంటుంది. ఆ పర్వంలో విధింపబడిన వాటిని ఆచరించడం ద్వారా, నిషిద్ధమైన వాటిని ఆచరింపక పోవడం చేతను మన ఆత్మ - మనోగతదోషాలు పోయి, పుణ్యంవల్ల ఆత్మప్రకాశం లభిస్తుంది.

పర్వకాలంలో ఏం చేయకూడదు?

పర్వకాలాల్లో విధిహితమైన కర్మలు చేస్తే ఎలా పుణ్యం సంభవిస్తుందో, నిషిద్ధమైన కర్మలు చేస్తే అలా పాపంకూడా సంభవిస్తుంది. స్త్రీసంపర్కం, ఒంటికిగాని తలకుగాని నూనెరాచుకోవడం, లేక అభ్యంగన స్నానం చేయడం, మాంసాన్ని తినడం మొదలైనవి నిషేధించాలి. అలా నిషేధించకపోతే చనిపోయిన తరువాత విణ్మూత్ర భోజనమనే నరకాన్ని అతడు పొందుతాడు. ఈ విషయాన్నే విష్ణుపురాణం ఇలా ప్రతిపాదిస్తుంది :

స్త్రీతైలమాంససంభోగీ సర్వేష్వేతేషు వై పుమాన్ ।
విణ్మూత్రభోజనం నామ ప్రయాతి నరకం మృతః ॥

విష్ణు - III, II – 119.

కనుక పర్వకాలంలో భోగాలు, విలాసాలు మానేసి, సాత్త్వికాహారం తీసుకొని శాస్త్రోక్తంగా వైదిక కర్మలను ఆచరించాలి.

అలా చేస్తే ఏం లాభం?

ఇలా పర్వకాలాలలో విధ్యుక్తమైన కర్మలను ఆచరించటం వల్ల మానవునకు ఏం లాభం కలుగుతుంది? అనేది ప్రశ్న. దీనికి సంగ్రహంగా ఇది సమాధానం.

మానవుడు పుడుతూనే మూడు ఋణాలతో పుడతాడు. అవి దేవ – ఋషి – పితౄణములు. పుట్టినప్పటినుంచి అనేక కర్మలద్వారా ఈ ఋణాలను మూడింటిని తీర్చుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటాడు. జీవితంలో ఒక్కొక్క పర్వకాలంలో తానాచరిస్తున్న కొన్ని కొన్ని కర్మలద్వారా ఒక్కొక్క ఋణం తీరిపోయి ఋణ విముక్తుడవుతాడు. అతడు ఋణవిముక్తిని పొందే కొద్దీ అతడి ఆత్మ మోక్షం పొందడానికి అర్హతను సంపాదిస్తుంది. పర్వం అనే శబ్దానికి మెట్టు అనే అర్థం ఉన్నట్లు ఇంతకుపూర్వం అనుకొన్నాం. ఒక్కొక్క పర్వంలో ఒక్కొక్క రకమైన కర్మను చేస్తూ ఒక్కొక్క మెట్టు ఎక్కి ఆత్మప్రకాశాన్ని సంపాదించు కొని ముక్తిప్రాసాదాగ్రానికి చేరగలుగుతాడు మానవుడు.

అలాగే పర్వం అనే పదానికి ముడి అని సంధి అని కూడా అర్థాలున్నాయి కదా! మానవుడు అంతకు పూర్వం సంపాదించిన సంస్కారానికి

ముందు ముందు సంపాదించబోయే సంస్కారానికి ఈ పర్వకాలం ఒక సంధిలాంటిది అనికూడ చెప్పవచ్చు. అలాగే ఈ పర్వకాలంలో ఆచరించే కర్మలు ఇతడి ఆత్మ సంస్కారాన్ని ప్రతి పర్వంలోను దృఢపరుస్తూ ముడిపెడుతుంటాయి అని కూడ మనం ఊహించుకోవచ్చు.

మొత్తంమీద కర్మభూమి అయిన భారతావనిలో పుట్టిన ప్రతి మానవుడు తన జీవితకాలంలో సంభవించే పవిత్రమైన ప్రతిపర్వకాలంలోను పరంపరగా వస్తున్న శాస్త్రీయమైన అనేక కర్మలను ఆచరించటం ద్వారా సంస్కారాన్ని దృఢతరం చేసుకొని ఒక్కొక్కమెట్టు ఎక్కి మాధవాభిముఖంగా ప్రయాణంచేస్తూ మోక్షాన్ని సాధించటానికి అర్హతను సంపాదిస్తాడు. అందుకే ఈ పర్వకలాలను ప్రతివాడు చక్కగా ఉపయోగించుకోవాలని శాస్త్రాలు ఉపదేశిస్తున్నాయి.

త్రివేణీస్తుతి

త్రివేణీయమఘశ్రేణీకృపాణీ ముక్తికారిణీ ।

మమానీహితమాదహ్యేద్ధిమానీమంశుమానివ ॥

పాపాలను ఖండించే ఖడ్గంలాగా ఉండి మోక్షాన్ని ప్రసాదించే ఈ త్రివేణి సూర్యుడు మంచు సమూహాన్ని కరిగించినట్లు నా పాపాలను దహించివేయుగాక!

* * *

కృష్ణవేణీ ప్రభావం

నమామి సుకృతశ్రేణీం కృష్ణవేణీం తరంగిణీమ్ ।

యద్వీక్షణం కోటిజన్మకృత దుష్కర్మశిక్షణమ్ ॥

పుణ్యపరంపరలు కల ఏ నదిని చూసినంత మాత్రాననే కోటిజన్మలలో చేసిన పాపాలు శమిస్తాయో అటువంటి నది కృష్ణవేణికి నమస్కరిస్తున్నాను.

పుష్కరస్నానమహిమ

జన్మప్రభృతి యత్పాపం స్త్రియా వా పురుషేణ వా ।

పుష్కరే స్నాతమాత్రస్య సర్వమేవ ప్రణశ్యతి ॥

పుట్టినప్పటినుండి స్త్రీచేగాని, పురుషునిచే గాని చేయబడిన పాపమంతా పుష్కర సమయంలో స్నానంచేస్తే తొలగిపోతుంది.

కావేరీమహిమ

కావేరీ! కమనీయాంగం రంగనాథం సదా హృది ।

ధత్సే! త్వత్సేవయా దేవి! కోను కుర్యాన్న తం హృది ॥

కావేరీ! మనోహరమైన శరీరం కల రంగనాథుని నీవు హృదయంలో ధరించావు. నిన్ను సేవించినవారు ఎవరు హృదయమందు రంగనాథుని ధరించరు? అంటే నీ సేవాఫలం వల్లనే రంగనాథుని స్మరించడమవుతుంది.

పుష్కరాలు - పూజాపురస్కారాలు

- వైద్యం వేంకటేశ్వరాచార్యులు

పుష్కర స్నానాలు

కృష్ణానదీ పుష్కరస్నానాలను గురించి స్కాందాది పురాణలలో గొప్పగా చెప్పబడింది. స్నానంవల్ల కలిగే ప్రయోజనాలు తెలుపబడ్డాయి. అలాంటి శ్లోకాలలో మచ్చుకు –

శ్లో॥ యస్మిన్ దినే సురగురుః కన్యారాశిగతో భవేత్ ।
తద్దినే కృష్ణవేణ్యా వై స్నాతో ముక్తి పదంభవేత్ ॥

శ్లో॥ కన్యారాశిస్థితే జీవే కృష్ణవేణ్యభిగామినాం ।
వదాని క్రతు తుల్యాని స్వర్గలోక ఫలానిచ ॥

శ్లో॥ సర్వతీర్థాభిషేకేన యత్పుణ్యం లభతే నరః ।
తత్పుణ్యం కృష్ణవేణ్యాం తు స్నానమాత్రేణ లభ్యతే ॥

కన్యారాశిలో బృహస్పతి ఉన్నప్పుడు కృష్ణానదికి పుష్కరాలు. అప్పుడు కృష్ణవేణిలో స్నానం చేస్తే ముక్తిపదం లభిస్తుంది. యజ్ఞఫలితం కలుగుతుంది. సమస్త పుణ్యతీర్థాలలో స్నానం చేస్తే లభించినంత పుణ్యం లభిస్తుంది.

నదులు నాలుగు విధాలని పెద్దలు చెప్తారు. దైవీయాలు, ఆర్షేయాలు, మానవీయాలు, ఆసురములు. వీటిలో దైవసంబంధమగు నదులను దైవీయాలని అంటారు. కృష్ణవేణీనది దైవీయాలకు చెందినది. నదీస్నానం ఉత్తమమైంది. అందులో దైవీయమైన నదుల లోని స్నానం అత్యుత్తమమైంది. దానికి తోడు సకలతీర్థాధిపతి అయిన పుష్కరునితోను బృహస్పతితోను సకల దేవతలతోను ఋషులతోను గ్రహాలతోను కూడివున్న పుష్కర కృష్ణానదీ ప్రభావ వర్ణనాతీతం. కనుకనే కృష్ణాపుష్కరస్నానానికి ఫలితం అనంతంగా ఉంటుం దని పురాణాలు చెప్తున్నాయి.

స్కాందపురాణాన్ని అనుసరించి గంగానది మహానదులలో ప్రతినిత్యం

స్నానం చేసిన ఫలితం పుష్కర కృష్ణవేణీ నదిలో ఒకమారు స్నానం చేసినంత మాత్రాననే కలుగుతుందని చెప్పబడింది.

జల శక్తులు యజ్ఞ్యం, మేధ్యం అని రెండు విధాలు. వీటిలో యజ్ఞ్యం అనే శక్తివల్ల, ప్రోక్షించడం ద్వారా ఆ జలం శుచిత్వాన్ని కలుగ చేస్తుంది. మేధ్యం అనే శక్తివల్ల జనులుచేసే ఆచమన స్నానాదుల ద్వారా జలం మానవుల పాపాలను నశింపజేస్తుంది. కృష్ణవేణీ నదిలో అందునా పుష్కర కృష్ణవేణిలో ఈ రెండు శక్తులు సమృద్ధిగా ఉంటాయి. అందుకే కృష్ణాపుష్కర స్నానం అనంత పుణ్యఫలదాయకం.

పుష్కరం పన్నెండు సంవత్సరాలకు ఒక పర్యాయం కలిగే పరమ పవిత్రమైన ఘట్టం. ధర్మసాధనకీ – ఆచరణకీ పారలౌకిక పరమార్థ సాధనకీ ఇదొక మహత్తర అవకాశంగా ఆస్తిక హైందవులు భావిస్తారు. బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించగానే కృష్ణానదీజలాలలో పుష్కరుడు ప్రవేశిస్తాడు. పావన పుష్కరకాలంలో కృష్ణానదీ తీర్థాలలోఆచరించే పుణ్యస్నానాలు సత్ఫలితాలను కలుగచేస్తాయి. పుష్కర సమయాన నదీజలాలు ఆధిదైవిక తేజస్సును కలిగి ఉంటాయి. అందువల్ల కృష్ణాపుష్కర స్నానాలు శారీరక, మానసిక రుగ్మతలను తొలగిస్తాయని పరంపరవిశ్వాసం. పుష్కరనదీ స్నానంవల్ల మానవుడు పవిత్రుడై తేజోవంతుడౌతాడు. ఆధ్యాత్మిక ప్రేరణ కలుగుతుంది. ఐహిక ఆముష్మిక ప్రయోజనాలు కలుగుతాయి. పుష్కర స్నానదానాది విధులు నిర్వర్తించటం వలన ఆధ్యాత్మికసంస్కారం కలుగుతుందని అనుభవజ్ఞుల ఉవాచ.

పుష్కరాల సందర్భాన కృష్ణవేణీనది ఒడిలో స్నానంచేస్తే ఏడుతరాల పాపాలు నశిస్తాయని చెప్తారు.

జలాలకు ఎంతో శక్తి ఉంది. నీరు కల్మషాన్ని కడిగి వేస్తుంది. దప్పిక తీరుస్తుంది. ఇది అందరెరిగిన సత్యం కాగా అతీంద్రియమైన దైవిక శక్తికూడా జలాలకు ఉంది.

అయితే పుష్కరాలలో చేయవలసిన దానాలు ఎన్నో ఉన్నాయి. అన్ని దానాలు ఖచ్చితంగా చేయాలనే నియమం లేదు. ఆర్థిక స్తోమతను బట్టి దానాలు చేసుకోవాలి. అందుకే 'యథాశక్తి' అంటారు.

ఔషధదానంవల్ల ఆరోగ్యం, సాలగ్రామాల దానంవల్ల వైకుంఠప్రాప్తి, గోదానంవల్ల కైలాస ప్రాప్తి, నువ్వుల దానంవల్ల దుఃఖాలు తొలగిపోవటం, నేతిని దానం చేయటంవల్ల ఆయుర్దాయం, గృహ దానంవల్ల శాశ్వత సుఖం, భూదానంవల్ల

పుష్కరదానాలు

పుష్కరాలు పన్నెండురోజులలో ఏ రోజున ఏవేవి దానం చేయాలో శాస్త్రాలు తెలియ చేస్తున్నాయి.

మొదటిరోజు : భూదానం, ధాన్యదానం, సువర్ణదానం, రజతదానం, అన్నదానం.

రెండవరోజు : రత్నదానం, గోదానం, వస్త్రదానం, లవణదానం.

మూడవరోజు : అశ్వదానం, ఫలదానం (నాలుగు రకాల పండ్లు), గుడ (బెల్లం) దానం, శాక (గుమ్మడి, ఆనప మొదలయినవి) దానం.

నాలుగవరోజు : తేనె, నెయ్యి, పాలు, నూనె, మధుర పదార్థాలు.

ఐదవరోజు : ధాన్యం, బండి, ఎద్దులు, నాగలి, దున్నపోతులు మొదలయినవి దానం చేయాలి.

ఆరవరోజు : ఔషధాలు (వట్టివేరు, జాజికాయ, జాపత్రి, కరక్కాయ), కస్తూరి, కర్పూరం, చందనం, సుగంధద్రవ్యాలు.

ఏడవరోజు : పల్లకి, మంచం, పీట మొదలయినవి.

ఎనిమిదవరోజు : అల్లం, దుంపలు, పూలదండలు, చందనం మొదలయినవి దానం చేయాలి.

తొమ్మిదవరోజు : దుప్పటి, కంబడి, సేవకులను దానం చేయాలి.

కన్యాదానం కూడా చేయవచ్చునని అంటారు. పిండప్రదానాలు చేయాలి.

పదవరోజు : పుస్తకదానం, సాలగ్రామదానం, శాకదానం, రజిత (వెండి), ముత్యాలు దానం చేయాలి.

పదకొండవరోజు : ఏనుగు, జందెములు, తాంబులాలు.

పన్నెండవరోజు : మేక, నువ్వులు, ఇంకా తోచినవి.

అధికారం, బంగారు, వెండి దానాల వల్ల ఇహపర సౌఖ్యాలు పుణ్యలోక ప్రాప్తి, మంచం, సేవకులను దానం చేయటంవల్ల స్వర్గప్రాప్తి, వస్త్రదానం వల్ల వసులోక ప్రాప్తి. పై వస్తువుల్ని ఇవ్వలేనివారు ప్రత్యామ్నాయంగా యథాశక్తిగా కొంత ధనాన్ని కూడా దానం చేయవచ్చు. దానం భక్తితో చేయాలి. సాలగ్రామ దానం అన్నిటి కన్నా మంచిది.

పుష్కరాలలో శ్రాద్ధకర్మలు - తర్పణాలు - పిండప్రదానాలు

పుష్కరకాలంలో తీర్థ పితృ శ్రాద్ధాన్ని తప్పక ఆచరించాలి. పితృదేవతలు మరణించినప్పటి తిథి లేదా పుష్కరదినాలలో తొమ్మిదవ రోజున కానీ లేదా పుష్కరాలలో ఏరోజున కానీ పితృదేవతా శ్రాద్ధాన్ని ఆచరించాలని చెప్తారు.

పుష్కర శ్రాద్ధవిధి విషయ ప్రమాణ శ్లోకాలు

శ్లో॥ ఆదౌ పితా తథా మాతా సాపత్నీ
జననీ తథా
మాతామహాస్సపత్నీకా
ఆత్మపత్నీస్త్వనంతరం
సుతభ్రాతృ పితృవ్యాశ్చ
మాతులాస్సహ భార్యకాః
దుహితా భగినీ చైవ
దౌహిత్రోభాగినేయకః

పితృష్వసా మాతృష్వసా సాజామాతాభావుకస్స్నుషా
శ్వశురౌ స్యాలకశ్చైవస్వామినో గురురిక్థిభిః ॥

పితృ, మాతృ వర్గాలకీ, మాతామహి మాతా మహావర్గాలకీ, అన్నదమ్ములకూ, పినతండ్రి, పెదతండ్రులకు, అక్కచెల్లెళ్ళకూ, బావమరదులకు, బావగార్లకూ, మామగారికి, అత్తగారికి, గురువులకు, శిష్యులకు, పినతల్లి, పెదతల్లులకు, మేనత్తలకు, తన సంతానానికీ, వారి సంతానానికీ, అల్లుళ్ళకూ, కోడళ్ళకూ, తనకు సంబంధించిన పైన చెప్పిన మృతులందరికీ శ్రాద్ధకర్మ, పిండప్రదానం, తర్పణం వదలటం పుష్కరసమయంలో తప్పక చేయాలి.

స్నేహితులకూ, ఆశ్రితులకు, మేలు చేసిన వారికి, సేవకులకు, యజమానికి కూడా పిండ ప్రదానం చేయాలి. మరణానంతరం అగ్ని సంస్కారాలు సరిగా జరుగని వారికీ, బ్రహ్మహత్యాది పాపాలు చేసిన వారికీ, కర్మభ్రష్టులకు, రోగపీడితులై మరణించిన వారికీ, విషశస్త్ర అగ్ని జల క్రూర మృగచోరాదుల వలన చనిపోయినవారికీ పిడుగు పాటువల్ల మరణించిన వారికీ, వికలాంగులకు, భార్యాపుత్రాది వారసులు లేనివారికీ కూడా పుష్కర సమయంలో ధర్మ పిండప్రదానం చేయటంవల్ల ఆ పితృదేవతలకు సద్గతులు, చేసిన వారికి పుణ్యం లభిస్తుంది.

పితృదేవతలకు పిండప్రదానం చేయవలసిన దిక్కులు

శ్లో॥ పితౄణాం పశ్చిమ భాగే మాతృపిండం విధీయతే
మాతామహాశ్చతత్పూర్వే ఆత్మపత్నీ తదుత్తరే
సూతభ్రాతృ పితృవ్యాశ్చ మాతా పిత్రోశ్చ మధ్యమే
మాతామహా మహీ మధ్యే మాతులా స్సహ భార్యకాః
శ్వశ్రూ శ్వశూరయోర్మధ్యే శ్యాలకస్య విధీయతే
దుహిత్రాది తతోన్యేషాం శేషం దక్షిణతో విధిః
పుం పిండం వామతః స్త్రీణాం తత్పుత్రం సముపస్థితం
అంగుష్ఠపరిమాణంతు గోత్రమన్యం నగుం స్పృశేత్
నిరాశాః పితరోయాంతి విపరీతే భవేద్యది ॥

పుష్కరాలలో తీర్థశ్రాద్ధాన్ని ఆచరిస్తే పితృ దేవతల అనుగ్రహం కలుగుతుంది. వారి ఆశీస్సులు లభిస్తాయి. తద్వారా జీవితం సుఖప్రదంగా వుంటుంది. కుటుంబం సుఖసంతోషాలతో ఉంటుంది. పుష్కరాలలో శ్రాద్ధాలు పిండప్రదానాలు తర్పణాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తే పితృదేవతలకు పుణ్యలోకప్రాప్తి ప్రేతత్వ విముక్తి కలుగుతాయి. పుష్కర పిండప్రదానం ఆచరించినవారికి సంతానం కలగడం, సంతానం అకాల మృత్యువుకు గురికాక పోవటం జరుగుతుంది. వికలాంగులు రోగగ్రస్తులు జన్మించరు. దారిద్ర్యాది బాధలు నివారించబడతాయి.

పుష్కరాలలో వీలుంటే అన్నశ్రాద్ధం, లేకపోతే ఆమశ్రాద్ధం, అదీవీలుకాకపోతే హిరణ్యశ్రాద్ధం ఆచరించవచ్చు. తీరవాసులు అన్నశ్రాద్ధం ఇతరులు ఆమ/హిరణ్య శ్రాద్ధం ఆచరించవచ్చు.

పుష్కరదినాలలో మధుమాంసాదులు తీసుకోవటం కూడదు. నిత్యస్నానం, శుచి, శ్రాద్ధ కర్మలు, భూతదయ, భక్తి ప్రపత్తులు కలిగినవారు జీవితంలో పురోభివృద్ధిని సాధిస్తారని శాస్త్రాలు చెప్తున్నాయి. మన పూర్వులు పుష్కర శ్రాద్ధంపేరిట పితృకర్మలు ఆచరించినట్లు పురాణాలలో ఉంది.

చనిపోయిన వారికి దైవత్వం ఆపాదించడం వారికి పితృలోకం పేరుతో ప్రత్యేకస్థానం ఉందని చెప్పటం మన సంప్రదాయ విశేషం. వారిని ఉద్దేశించి చేసే కర్మను శ్రాద్ధం అంటారు. అలా అనడంలోనే ఎంతో అర్థంవుంది. పవిత్రంగా శ్రద్ధతో చేసేది కనుక దానికి శ్రాద్ధం అనే పేరు కలిగింది. నిజానికి ఏపని చేసినా శ్రద్ధతోనే చేయాలి. అయితే పితృదేవతలకోసం చేసే పనిని మాత్రమే 'శ్రాద్ధం' అన్నారంటే దానికి విశేష ఫలితాలు ఉంటాయని అవగతమౌతోంది.

హైందవ సంస్కృతి సంప్రదాయాలలో జన్మలకి సంబంధించిన కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. వీటిలో పితృదేవతలకు శ్రాద్ధకర్మలాచరించటం కూడా ఒకటి. పుష్కర సమయంలో అవి మరింత ఫలప్రదాలు.

మనస్సు, వాక్కు, శరీరం వీటిని త్రికరణా లంటారు. ఈ మూడింటి ప్రవర్తన వలన కలిగిన పాపాలన్నీ పుష్కరస్నానాలవల్ల హరించబడతాయని పురాణ కథనం.

ఎంత ప్రయత్నించియైనా సరే కృష్ణా పుష్కారాలలో స్నానం చేసి తీరాలని పెద్దలంటారు. కృష్ణా పుష్కరస్నాన మాహాత్మ్యాన్ని తెలిపే మరికొన్ని శ్లోకాలు

శ్లో॥ కన్యాగతే గురౌ యద్య త్సప్తకోట్యఘునాశనం
స్నానమాత్రేణ సర్వేషా తావత్పుణ్య వివర్ధనం ॥

శ్లో॥ భూతతేయాని తీర్థాని తాని కన్యాగతే గురౌ
ఆయాంతి కృష్ణవేణీం తు మహాపుణ్యఫలాయచ ॥

శ్లో॥ బ్రహ్మావిష్ణుశ్చ రుద్రశ్చ ఇంద్రాద్యాస్సర్వదేవతా
పితరో ఋషయ శ్చైవ తత్రైవ నివసంతి హి ॥

శ్లో॥ కృష్ణాయాః పుష్కరే కృత్వా స్నానం దానం చ పైతృకం
గంగాయాః కోటిగణితం ఫలమాప్నోతి మానవః ॥

శ్లో॥ యస్యాం తిథౌ గురురానితి కన్యాయాంచసమాగమం
కృష్ణాయాంతు తదా స్నానం ప్రయత్నేనసమాచరేత్ ॥

పుష్కరసమయంలో ఉదయమే కృష్ణానదిలో స్నానం చేయటం ఉత్తమమైంది, మధ్యాహ్నస్నానం మధ్యమమని, అపరాహ్ణస్నానం అధమమైందని అంటారు.

పుష్కరవిధులకు ఒకరోజు ముందు ఉపవాసం చేస్తే మంచిది. ఆ మరుసటిరోజు పురుషులు శిరోముండనం చేసుకొని స్నాన, దాన, శ్రాద్ధ, తర్పణాలు వదిలితే ఉత్తమ ఫలితాలు కలుగుతాయి.

నదీ స్నానానికి ముందు

శ్లో॥ పిప్పలాదాత్సముత్పన్నే కృష్ణేలోక భయంకరీ
మృత్తికాంతే మయాదత్తాం ఆహారార్థం ప్రకల్పయ ॥

అనే మంత్రాన్ని చదువుతూ రేగిపండంత మట్టిని నదిలో మూడుపర్యాయలు వేయాలి.

స్నానానికి ఆదేశం

శ్లో॥ పావని త్వం జగత్పూజ్యే సర్వతీర్థమయే శుభే
త్వయి స్నాతు మనుజ్ఞాం మే దేహి కృష్ణేమహానదీ ॥

- పుష్కరదినాలలో మధు మాంసాదులు తీసుకోవటం కూడదు.
- నిత్యస్నానం, శుచి, శ్రాద్ధకర్మలు, భూతదయ, భక్తి ప్రపత్తులు కలిగినవారు జీవితంలో పురోభివృద్ధిని సాధిస్తారని శాస్త్రాలు చెప్తున్నాయి.

ధ్యానం

శ్లో॥ కన్యాగతౌ దేవగురౌ పితౄణాం తారణాయచ
సర్వపాప విముక్త్యర్థం తీర్థస్నానం కరోమ్యహం ॥

నమస్కారం

శ్లో॥ తీర్థరాజ నమస్తుభ్యం సర్వలోకైకపావన
త్వయి స్నానం కరోమ్యద్య భవబంధవిముక్తయే ॥

స్నానాచరణ విషయంలో భక్తిప్రపత్తులు, పుష్కర ప్రాశస్త్య అవగాహన ప్రముఖమైన ప్రభావాన్ని కలిగిస్తాయి. రాత్రిపూట నదీస్నానం కూడదంటారు.

మొదట కృష్ణానదికి ఆ పిమ్మట తీర్థరాజుకు, బృహస్పతికి, విష్ణుమూర్తికి, మహేశ్వరునికి, బ్రహ్మాది దేవతలకు, ఆ తర్వాత వశిష్ఠాది మహామునులకు, గంగాది పుణ్యనదులకు సూర్యనారాయణమూర్తికి అర్ఘ్యప్రదానం చేయాలి.

అర్ఘ్యప్రదానం

కృష్ణానది మహాదేవి సర్వపాపహరే మలే
స్నానసాద్గుణ్యసిద్ధ్యర్థమిదమర్ఘ్యం దదామ్యహమ్ ॥
శ్రీకృష్ణవేణ్యై మహానద్యైనమః ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

తీర్థరాజమహాభాగసర్వతీర్థ సమావృత
ఇదమర్ఘ్యం మయాదత్తం గృహాణవరదోభవ ॥
తీర్థరాజాయనమః ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

బృహస్పతే సురాధ్యక్ష సర్వదేవ నమస్కృత
ఇదమర్ఘ్యం ప్రదాస్యామి సంగృహాణ మహామతే ॥
బృహస్పతయేనమః ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

శ్రీరమానాథ శ్రీవిష్ణో గంగోద్భవ పదాంబుజ
సంగృహాణ జగన్నాథ ఇదమర్ఘ్యం దదామ్యహమ్ ॥
శ్రీమహావిష్ణవేనమః ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

ఉమానాథమహాదేవ గంగాధర మహేశ్వర
ఇదమర్ఘ్యం మయాదత్తం సంగృహాణ త్రియంబక ॥
శివాయనమః ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

వశిష్ఠోగౌతమోత్రిశ్చ భారద్వాజో మృకండుజః
విశ్వామిత్రో దేవలశ్చ తుభ్యమర్ఘ్యం దదామ్యహమ్ ॥
వశిష్ఠాది మునిభ్యోనమః ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

గంగాద్యాశ్చ మహానద్యో యాశ్చపుణ్యాస్సమాగతాః
ఇదమర్ఘ్యం ప్రదాస్యామిమాయం గృహ్ణీత సన్నిధౌ
గంగాదిభ్యోనమః ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

ఉదయే బ్రహ్మరూపీచ మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం కాలే సదా విష్ణుః త్రిమూర్తిశ్చదివాకరః ॥
ఛాయాఉషాసమేత శ్రీసూర్యనారాయణ పరబ్రహ్మణేనమః
ఇదమర్ఘ్యం సమర్పయామి ॥

నదీతీరాన పవిత్ర జలాలను మూడు మారులు సేవించి నీళ్ళలోనే నిలిచి, వస్త్రాన్ని తీసి ఒడ్డుమీద మూడుసార్లు పిండాలి. ఆ సందర్భంగా చదివే మంత్రం

యస్మయా దూషితం తోయం శారీరమలినయుతం
తస్యపాపవిశుద్ధ్యర్థం యక్ష్మాణం తర్పయామ్యహమ్ ॥

సూర్యధ్యానం

ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ
నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః
కేయూరవాన్ మకరకుండల వాన్ కిరీటీ
హారీ హిరణ్మయవపుః ధృతశంఖచక్రః ॥

పుష్కరాలు జరిగే పన్నెండు రోజులూ దీక్షాయుతులై భక్తిశ్రద్ధలతో కృష్ణవేణిని అర్చించి వ్రతమాచరిస్తే సంపూర్ణఫలం లభిస్తుంది. ●

పుష్టినిచ్చేది పుష్కరం

గడియారం రామకృష్ణశర్మ

పుష్కరం - పుష్కర మాహాత్మ్యం

ప్రపంచ శక్తులలో జలం ఒక్కటి. జలాన్ని పుష్కరం అంటారు. "పోషయతీతి పుష్కరం". పోషించేది పుష్కరం. "పోషయతీతి, పుష్ణాతీతి పుష్కరం". పోషించేది, పుష్టినిచ్చేది అని పుష్కరానికి ఇంకో అర్థం కూడా ఉంది. పుష్కరం ఎలా వచ్చిందంటే...

పూర్వం ముద్గలుడు అనే ముని శివుని గూర్చి తపస్సు చేశాడు. శివుడు ఏమి కావాలని అడిగితే ఆయనలో ఐక్యం కావాలని ముద్గలుడు కోరాడు. శివుడు అతనిని తనలో ఉన్న ఎనిమిది శక్తులలో ఒకటైన జలంలో కలుపుకున్నాడు. ఆ తరువాత శివుని గూర్చి తపస్సు చేసిన బ్రహ్మ జలతత్వాన్ని (ముద్గలుడు ఉన్న) వరంగా ఇమ్మన్నాడు. భూమండలాన్ని కమండలంగా మార్చి అందులో జలతత్వాన్ని నింపి బ్రహ్మకు ఇచ్చాడు శివుడు. అది చాలా శక్తివంతమైన జలము కాన ఉత్తరదేశంలో ఒక మడుగును సృష్టించి లోకాని కంతటికి మేలు కలిగించే దృష్టితో ఈ జలాన్ని అందులో పోశాడు బ్రహ్మ. అదే పుష్కరం అయ్యింది. హిమాలయంలో పుట్టిన సరస్వతీ నది రాజస్థాన్ గుండా ప్రవహించి ఆరేబియా సముద్రంలో కలిసిపోతుంది. అయితే అది ఎడారిలో ఇంకిపోయింది. ఎడారిలో ఇంకిపోయిన స్థానమే పుష్కరం అయింది. ఆ పుష్కర ప్రదేశమే తరువాత పోఖ్రాన్ అయ్యింది.



ఇంకొక కథ ఏమిటంటే బృహస్పతి మహర్షి బ్రహ్మదేవుని గూర్చి తపస్సుచేసి ఆయనను మెప్పించాడు. దైవగురుత్వంతోపాటు పుష్కరుని తన వశం చేయమన్నాడు. అయితే పుష్కరుడు అంగీకరించలేదు. బ్రహ్మ ఒక రాజీ ఏర్పాటు చేశాడు. ఆ ప్రకారం బృహస్పతి ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క రాశిలో ఉంటాడు. అప్పుడు బృహస్పతి ప్రభావం ఉండే ఆ నదిలో పుష్కరుడు ఆ సంవత్సరం ఉండాలి. సంవత్సరం మొదట్లో పన్నెండు దినాలు అంతంలో

పన్నెండుదినాలు మిగతా రోజులలో మధ్యాహ్నం కేవలం ఒకటిన్నర గంట కాలం ఆ నదిలో పుష్కరుడు ఉంటాడు. ఈ సంవత్సరం కన్యారాశిలో బృహస్పతి ప్రవేశంతో కృష్ణానదికి పుష్కరం వచ్చింది. పుష్కర సమయంలో స్త్రీలైనా, పురుషులైనా నదీస్నానం చేస్తేచాలు సర్వ పాపాలు నశిస్తాయని పురాణాలు చెపుతున్నాయి. పుష్కరస్నానం చేసేటప్పుడు ముందుగా సంకల్ప మంత్రంగా

శ్లో॥ జన్మ ప్రభృతి యత్‌పాపం స్త్రియా వా పురుషేణ వా
పుష్కరే స్నాన మాత్రస్య సర్వమేవ ప్రణశ్యతి

– అని పుష్కరుని

శ్లో॥ సహ్యపాద సముద్భూతా పవిత్ర జలపూరితా
కృష్ణవేణీతి విఖ్యాతా మమపాపం వ్యపోహతు

– అని కృష్ణానదిని

ధ్యానించి మునిగితే సర్వపాపాలు పోతాయన్నది పురాణోక్తి.

దక్షిణకాశి – అలంపురం

కృష్ణానది మహబూబ్‌నగర్ జిల్లాలోని అలంపురం సమీపంలో కూడలి సంగమేశ్వరం వద్ద తుంగభద్రతో కలుస్తున్నది. ప్రసిద్ధ శైవక్షేత్రమై, శ్రీశైలానికి పశ్చిమ ద్వారమై విలసిల్లే అలంపురాన్ని దక్షిణకాశి అనడంలో ఔచిత్యం ఏమిటో పరికిద్దాం.

సాధారణంగా దక్షిణదేశంలోని ప్రసిద్ధ శైవక్షేత్రాలన్నింటినీ దక్షిణకాశి అంటుంటాం. అయితే అలంపుర క్షేత్రానికి కొన్ని ప్రత్యేకతలు న్నాయి. ఏవంటే –

వరణ – అసి నదులమధ్య ఉండడం వల్ల కాశిని వారణాసి అంటారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో కాశీవిశ్వేశ్వరుడు ఒకరు కాగా, అష్టాదశ శక్తి పీఠాలలో కాశీ విశాలాక్షి కూడా ఉంది. ఆ విధంగానే అలంపురంలోని బాలబ్రహ్మేశ్వర స్వామి లింగం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటని స్కాంద పురాణంలో చెప్పబడింది. ఇక్కడున్న జోగులాంబ గుడి పద్దెనిమిది శక్తిపీఠాలలో ఒకటి. కాశీ సమీపంలో ప్రయాగవద్ద త్రివేణీ సంగమం ఉండగా అలంపురానికి అతిదగ్గరలో కూడలి సంగమేశ్వరం వద్ద కృష్ణా తుంగభద్రలు సంగమిస్తున్నాయి. కాశివద్ద గయ అనుచోట గదాధరుడు వెలసి యుండగా అలంపురానికి సమీపంలో పాపనాశనం వద్ద గదాధరుడు ఉన్నాడు. గంగానది కాశి వద్ద ఉత్తరవాహిని కాగా అలంపురం వద్ద తుంగభద్ర ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్నది. కాశివద్ద గంగానదీ తీరంలో 64 స్నానఘట్టాలు ఉండగా అలంపురం వద్ద పుల్లూరు నుండి కూడలి దాకా 64 స్నాన ఘట్టాలు ఉన్నాయని స్థలపురాణం చెపుతున్నది. అంతేకాదు అలంపురాన్ని పరశురామ క్షేత్రమని, భాస్కర క్షేత్రమని స్థలపురాణం అంటున్నది. ఇచ్చట పూర్వం జమదగ్ని మహర్షి ఆశ్రమం ఉండేది. ఒకసారి ఆయన భార్య రేణుక మనసు చలించగా మహర్షి కోపించి ఆమె తలను నరుకవలసినదిగా పుత్రుడైన పరశురాముని అజ్ఞాపించాడు. పరశురాముడు తల్లి తల తెగనరికి తండ్రి ఆజ్ఞ పాలించాడు. నాటినుంచి రేణుకాదేవి తల యల్లమ్మ దేవతగా, మొండెం భూదేవతగా పూజింపబడుతున్నది.

శివ, విష్ణు, శక్తి, సూర్య, గణపతులకు (ఐదుగురకు) ఒకేచోట ప్రత్యేక దేవాలయాలు ఉన్నాయి కాబట్టి, అలంపురాన్ని భాస్కర క్షేత్రమని అంటారు. ఈ విధంగా బహుళ ప్రాశస్త్యాన్ని పొంది దక్షిణ కాశిగా సార్థక నామధేయాన్ని సంతరించు కుంది అలంపురం.

పుష్కరాల్లో ఎందుకు పితృకర్మలు చేయాలి?

ఎమ్. బాలవిశ్వనాథశర్మ

నదీజలాల్లో చేప త్రిషవణ స్నానంచేస్తూ ఉంటుంది. సర్పం గాలినాహారంగా తీసుకొని జీవిస్తుంది. మేక ఆకులు నమిలి బ్రతుకుతుంది. చాతకపక్షి నెలల తరబడి ఆహారమే ముట్టుకోదు. ఎలుకలు కొండగుహల్లో నివసిస్తాయి. గాడిద బూడిద పూసుకొంటుంది. కొంగ సంతత ధ్యానం చేస్తుంది. ఈ ప్రాణులు చేసే పనులే ఋషులూ చేస్తారు. కాని జంతువులకు లేని భావశుద్ధి ఋషులకు ఉంటుంది. అందుచేతనే ఋషులు తరిస్తారు. ఇతరప్రాణులకు తరణోపాయం లేదు. భావంలోను. విశ్వాసంలోను దైవమున్నదేగాని ఇతరంలో లేదు.

వైదికమార్గాన్ని, ఋషి వాక్యాన్ని విశ్వసించే మతం మనది. ఆ మంత్రద్రష్టలైన ఋషులుకూడ గుడ్డిగా నమ్మమని మనకు చెప్పలేదు. నిరాధారమైన పలుకు వారి నోటివెంటరాదు. తప్పుపనులు మనచేత చేయించవలసిన అవసరంకూడా వారికి లేదు. అయినా ఎప్పుడో భావితరంలో పుట్టనున్న మనల్ని మోసగించినంత మాత్రాన వారికి ఒరిగే లాభమూ లేదు. ఋషిమతం మీద, ఋషివాక్యం మీద, ఆర్షధర్మం మీద విశ్వాసముంచుకొన్నవాడు ఎన్నటికీ చెడడు.

నదీ పుష్కరాల్లో శ్రాద్ధమెందుకు చేయాలి? అసలు పుష్కరానికి శ్రాద్ధానికి ఏమిటి సంబంధం? అన్నది ప్రశ్న. ఈ ప్రశ్నకిది సూటిగ సమాధానం.

శ్లో॥ గంగాయాం పుష్కరే శ్రాద్ధే అర్ఘ్యమావాహనాదికమ్।
తృప్తి ప్రశ్నాదికం పిండం యథావిధి సమాచరేత్॥

శ్లో॥ భూతలే యాని తీర్థాని తాని కన్యాగతే గురౌ।
ఆయాంతి కృష్ణవేణీం తు మహాపుణ్యఫలాయ చ॥

శ్లో॥ బ్రహ్మ విష్ణుశ్చ రుద్రశ్చ ఇంద్రాద్యా స్సర్వ దేవతాః।
పితరో ఋషయశ్చైవ తత్రైవ నివసంతి హి॥

శ్లో॥ కృష్ణాయాః పుష్కరే కృత్వా స్నానం దానం చ పైతృకమ్।
గంగాయాం కోటిగుణితం ఫలమాప్నోతి మానవః॥

బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించుటచేత కృష్ణానదికి పుష్కరాలు వచ్చాయి. ఈ పుష్కరం మహాపర్వం. అనగా గొప్ప పుణ్యసమయం.

ఈ సమయంలో భూమండలంలోని సమస్తతీర్థాలేగాక ఇతరలోకాల్లోని పవిత్ర తీర్థాలన్నీ కృష్ణానదిలో చోటు చేసుకుంటాయి. ఈ పవిత్ర సమయంలో పుణ్యఫలంమీద, నివాపాంజలులు మీద అపేక్షకొద్దీ, త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు, సమస్త ఋషులు, పితృదేవతలు, పర్వకాలం దాటేంతవరకు, పుష్కరస్థానంలో నివాసాలు ఏర్పరచుకొంటారు. అందుకే స్నానం, దానం, పూజ, పితృతర్పణాలు, శ్రాద్ధకర్మలు ఈ పుష్కరాల్లో చేయడం. దీనిచేత మానవులు పుణ్యాన్ని కోటిరెట్లు పెంచుకుంటారు.

పుష్కర సమయాల్లో దేవతలు, ఋషులు, వారితోపాటు పితరులు కూడా వస్తారన్న ప్రమాణవాక్యమున్నది. గనుక స్నానదా

నాలతోపాటు పైతృకకర్మలు కూడ చేయాలన్నదే సంగ్రహమైన సమాధానం. ఇది చేయడంచేత విధిని అనుష్ఠించిన తృప్తి మనకు తమ భాగాల నందుకొన్న తృప్తి వారికి తద్ద్వారా పరస్పర సహకారభావాలు కల్గడమే ప్రయోజనం.

కాగా మరొక విషయ మిక్కడ మనం తెలుసుకోవలసినదున్నది. ఇక్కడ చేసే శ్రాద్ధం వారికి అక్కడ తిండిపెడుతుందా?

ఢిల్లీ రేడియోస్టేషనులో మాట్లాడే మాటలు, పాడేపాటలు మనయింట్లో మనం ఇక్కడ వింటున్నాం, అంటే వాయుతరంగాలలో మనకంటికి కనబడని శబ్దగ్రాహకములైన కొన్ని అణువులు అక్కడి శబ్దాలను మోసుకొని మనకిక్కడికి తెచ్చి వినిపిస్తున్నాయన్నమాట. ఇదేవిధంగా మనకంటికి కనబడని కొన్ని పదార్థగ్రాహకములైన అణువులు ఇక్కడ సమంత్రకంగా పెట్టే శ్రాద్ధద్రవ్యంలోని ఆహార సారాన్ని మనపితరులకు అందివ్వవచ్చును గదా! ఇంతలేనిది జ్ఞానధనులైన మనపెద్దలు మనకీ సంప్రదాయాన్ని ఎందుకు అందిస్తారు? దానిపై విశ్వాసంకొద్దీ అది పనిచేస్తుంది.

"ఆపస్స్వభావతో మేధ్యాః" అని జలం స్వతః పవిత్రమైనను, కొన్ని సమయాల్లో కొన్నిచోట్ల పారేనీళ్ళు పవిత్రనదీసారాలను తమగర్భం నందుంచుకొని పారుతుంటాయి. దేశకాల ప్రభావితమైన ఆ స్థలంలో తత్ప్రయుక్తములైన కార్యాలు చేయాలి. అది అనంతమైన పుణ్యాన్ని ఇచ్చేదేకాక ఇహపరాలనుకూడ సాధించి పెడుతుందని ఋషుల సూక్తి. గుండెలో ఫిరంగిగుండు పెట్టుకొనియైనా బ్రతుకు వచ్చును గాని, ఆప్తులైన ఋషుల వాక్యంమీద అప్రమాణ బుద్ధి పెట్టుకొని బ్రతకడం కష్టం. ❋

పితృకర్మలు - వైజ్ఞానిక సమన్వయం

డా॥ ఎక్కిరాల కృష్ణమాచార్య

విభాగం

పితృకర్మలు అంటే భారతీయ సంప్రదాయాన్ని అనుసరించేవారు తమ తల్లిదండ్రులు చనిపోయినపుడు ఆచరించే వేదోక్త కర్మలు. వీటిని శ్రద్ధతో ఆచరిస్తారు గనుక, శ్రాద్ధ కర్మలు అనికూడా అంటారు. ఈ శ్రాద్ధ కర్మలలో చాలా తరగతులు ఉన్నాయి దేహాన్ని విడిచినపుడు దహనం చేసే వరకూ కొన్ని కర్మలు, అటుపైన ప్రేతత్వాన్ని లేకుండా చేయడానికి పదిరోజుల వరకూ కుమారుడు ఆచరించే కర్మలూ, ఒక తరగతికి చెందినవి. అలాగే దేహం విడిచిన సంవత్సరంలో ప్రతిమాసం అదే తిథినాడు ఆచరించే కర్మలు మాసికాలు. అటుపైన ప్రతిసంవత్సరమూ ఆ మాసంలో ఆ తిథినాడు ఆచరించే వేదోక్తకర్మను ఆబ్దికం లేక తద్దినం అంటారు నిష్ఠాపరుడైన గృహస్థుడు ప్రతి అమావాస్యనాడు ఆచరించే పితృకర్మని పిండపితృయజ్ఞం అంటారు. ఇదికాక పుష్కరాల్లో పుణ్యనదీ తీరాన ఆచరించే పితృకర్మను పుష్కరశ్రాద్ధం అంటారు.

సర్వమతవ్యాప్తి

ఈ కర్మలన్నీ వేదోక్తాలే అయినా వీటిని ఆచరించే విధానం వేద మంత్రాల్లో కనబడదు. ధర్మ శాస్త్రగ్రంథాల్లో కనిపిస్తుంది. కనుక కొంతమంది వీటిని కల్పితాలు అనుకొంటారు. అలా అనుకోవడం న్యాయంకాదు. అలా భావించే పక్షంలో మానవుడు కనిపెట్టిన శాస్త్రాలు, కళలు, విద్యలు, చట్టం, రాజ్యాంగం అన్నీ మానవకల్పితాలే గదా! వాటిని అసత్యాలు అనగలమా? వాటిని కనిపెట్టిన మానవుడు జీవితాన్ని సంస్కారవంతం చేసుకొంటున్నాడు. గనుక ఇవన్నీ శాస్త్ర సంస్కారాలే. అలాగే పితృకర్మలు కూడాను. జాగ్రత్తగా పరిశీలిస్తే భారతీయ సంప్రదాయంలోనే కాదు వివిధ దేశాల సంప్రదాయాల్లో కూడా దేహం విడిచిన వాళ్లకి బ్రతికివున్నవాళ్ళు చేసే శ్రాద్ధ కర్మలు ఏదో ఒక రూపంలో జరుగుతూనే ఉన్నాయని తెలుస్తుంది. కర్మసిద్ధాంతాన్ని నమ్మని క్రైస్తవమతం వారు కూడా నవంబరు 7వ తేదీనాడు ప్రతి సంవత్సరం 'ఆల్ సోల్స్ డే' పేరుతో తద్దినాలు పెడతారు. చనిపోయిన వారి గోరీల దగ్గర - శ్రద్ధాభక్తులతో బొమ్మలుకూడా ఉంచి వస్తారు. అలాగే మహమ్మదీయ, యూదు మతాలలో కూడా పితరుల ఆరాధన ఉన్నది.

పితరులద్వారా పునర్జన్మ

దేహం విడిచిన తర్వాత జీవుడు ఉండాడన్న శాస్త్ర సత్యంమీద ఆధారపడి ఉంది ఈ పితృకర్మల విధానం అంతా. దేహంతో జీవుడు అంతమవు తాడు అనేది కంటికి కనిపించే విషయమేకానీ

శాస్త్రీయసత్యం కాదు. బల్బు మాడిపోతే విద్యుచ్ఛక్తి లేకుండా పోదు. కాని ఇది కంటికి తెలిసే సత్యంకాదు. బుద్ధి గమ్యమైన శాస్త్రసత్యం. కుండలు తయారుచేసే కుమ్మరివాడు ఉంటాడని తెలియని కుర్రవాడికి కుండబ్రద్దలైతే ఏడుపువస్తుంది. దేహం తల్లిగర్భంలో కుండలాగా తయారు చేయబడుతుంది. దాన్ని తయారు చేసుకొనేవాడు జీవుడు. కర్మాగారంవంటిది తల్లిగర్భం. అందులో టెక్నీషియన్ల వంటివాళ్లు మనస్సు, బుద్ధి, ఇంద్రియశక్తులు, జీవశక్తులు. వీరందరినీ ఎరిగి ఉన్న ప్రాచీనశాస్త్రం వీళ్లకి దేవతలు అని పేరు పెట్టింది. అందులో తల్లిగర్భంలో జీవుణ్ణి ఆధారంచేసి పెంచే దేవతలు పితృదేవతలు అనబడే వర్గంలో ఒక అంతర్భాగం. వాళ్లు చంద్రకిరణాలు, చంద్రకళలు ఆధారంగా చేసుకొని గర్భంలో పిండాన్ని నిర్మాణం చేస్తారు. కనుకనే చంద్రుడు భూమిచుట్టూ ఒకసారి తిరిగే కాలవ్యవధి స్త్రీ ఋతుకాలానికి కేలండరులాగా పనిచేస్తుంది. (28 రోజులు) జీవుడు దేహం విడిచినప్పటినుండి మళ్ళీ తల్లి గర్భంలో పడేలోపున జరగవలసిన పరిశుద్ధి కొంత ఉంటుంది. ఆ పరిశుద్ధికి సంబంధించినవే చనిపోగానే చేసే శ్రాద్ధకర్మలు. ఆ జీవి మళ్లా తల్లిగర్భంలో ఉత్తమజన్మ పొందటానికి చేసే శాస్త్రీయమైన కర్మకాండయే తద్దినం. పిండ పితృయజ్ఞం పుష్కర శ్రాద్ధం.

పితృకర్మలు శారీరక దోషాలను పోగొడతాయి

మనకి భౌతిక శరీరం ఉన్నట్లే ఇంకాకొన్ని సూక్ష్మ శరీరాలు ఉన్నాయి. అవి ఆవేశ శరీరం (Astrol body), భావనామయ శరీరం, బుద్ధిమయ శరీరం మొదలైనవి. వీటిలో కొన్నివేల పొరలు సూక్ష్మశరీరాలు ఉన్నమాట సత్యం. ముఖ్యంగా మూడు విభాగాలు చేసి, స్థూలశరీరం, సూక్ష్మశరీరం కారణశరీరం అని సామాన్యులకోసం చెప్పారు పెద్దలు. ఈ శరీరాలన్నీ జీవుడికి అలవాటు చొప్పున ఏర్పడేవి. ఈ అలవాటునే పూర్వకర్మ అంటారు. మనం అలవాటు చొప్పున నిద్రలేవడం, స్నానాదులు చేయడం, ఆఫీసుకు వెళ్ళడం, ఇంటికి రావడం, భార్య మొదలైన వాళ్లను గుర్తించడం చేస్తున్నాం. అలవాటు అయినకొద్దీ ఆలోచన అక్కరలేకుండా జరుగుతాయి. అలాగే పూర్వకర్మ బలీయమైనకొద్దీ దేహాలు అప్రయత్నంగా ఏర్పడుతాయి; పెరుగుతాయి; అపవిత్రము అయిన పదార్థాన్ని చేకూర్చుకొంటాయి. దురభ్యాసాలు ఋణాది భయాలు, ఈర్ష్యలు, అసూయలు మొదలైన అలవాట్లతో కూడిన సూక్ష్మద్రవ్యం భౌతికదేహం విడిచిన తర్వాత కూడా ఆ గుణాలతో వెంటాడుతుంది. దాన్ని పోగొట్టవలెనంటే ఒక శాస్త్రీయమైన విధానం ఉండాలి. ఇది వైద్యంలాంటిది. నాలికమీద మందుపడితే మోకాటిలో ఉన్న నొప్పి ఎలా తగ్గుతుందో అలాగే ఒక బ్రతికి ఉన్నవాడిని భోక్తగా పూజించి శ్రాద్ధకర్మ చేస్తే చనిపోయిన వాడికి ఉన్న పూర్వకర్మదోషాలు తొలగుతాయి. ఇందులో స్నానాదికాలతో శుచిత్వాన్నీ, వేదమంత్రంతో శబ్దాన్నీ, నువ్వులు మొదలైన వస్తువులతో శాస్త్రీయమైన ద్రవ్యాన్నీ, సందర్భ పరచడం ఉంటుంది. ఈ సందర్భ పరచడాన్నే కల్పము లేక క్రతువు (Practical) అంటారు. దీనివలన మనచుట్టూ ఉన్న శబ్దస్పర్శ

రూప రసగంధాలను శాస్త్రీయంగా వినియోగించడం జరుగుతుంది. దీనితో ఆ దేహం వదలినవారికి, సూక్ష్మ శరీరంలోని దుష్కర్మబంధాలు తొలగి, పవిత్రమైన శరీరంతో, మనస్సుతో మరల జన్మ లభిస్తుంది.

లౌకికసమన్వయం

జీవించి ఉన్న ఒకరు భోంచేస్తే చనిపోయిన మరి ఒకరికి ఆ శ్రాద్ధం ఎలా చెందుతుంది? అని సందేహం కలగవచ్చు. దృశ్యమైన ఈ లోకంలో తిరుగుతూ ఉన్న మన వెనుక అదృశ్యాలైన అనేకలోకాలు ఉన్నాయి. ఆ లోకాలమధ్య తంతి తపాలావంటి ఏర్పాట్లు ఉన్నాయని శాస్త్రపరిశీలన వలన తెలుస్తుంది. మనం పోస్టాఫీసులో మనియార్డరు చేసి పోష్టువారికి డబ్బు అప్పచెబితే మనం ఉద్దేశించినవాళ్లకి అది చేరే ఏర్పాటు ఉన్నది గదా! దీనినే తపాలశాఖ అంటాం. అలాంటిదే పితృదేవతలశాఖ.

వంశ గౌరవాభివృద్ధి

ఈ పితృకర్మల విషయంలో మరొక విశేషం కూడా ఉన్నది. పవిత్రమైన జీవితం నడిపిన మహానుభావులు దేహంవదలిన వెనుక ఆ ఇంట్లో అదే విధమైన పవిత్రజీవితం తరువాతి తరాల్లో నడుస్తూ ఉంటే తాము మరల అదే ఇంట్లో బిడ్డలుగా జన్మిస్తారు. దానికి ఈ పితృకర్మలు ఎంతగానో సహాయపడతాయి. ఇలా జన్మించడం వల్ల కుటుంబ సంస్కారం పతనం కాకుండా నిలబడటానికి, విశ్వశ్రేయస్సు అనే యజ్ఞార్థ జీవితాన్ని అలవరచుకోవడానికి వీలవుతుంది. అలాంటి కుటుంబాలతో నిండిన పౌరులు జాతి అభ్యుదయానికి ఔన్నత్యానికీ, ఏకముఖత్వానికీ చాలా సహాయపడుతారు. ఇంతకన్నా నరజన్మకు పరమావధి వేరే లేదనే చెప్పాలి. ఏ కుటుంబాలలో నిత్యస్నానమూ, శుచిత్వమూ, శ్రాద్ధకర్మలూ, భూతదయా, ఆస్తిక్యమూ ఉంటాయో ఆ కుటుంబాలు అన్ని విధాలా అభివృద్ధిలో ఉంటాయి. ఏ పరిస్థితులలో ఉన్నా వాళ్లు సుఖశాంతులను, స్వేచ్ఛను అనుభవిస్తూ ఉంటారు. స్వచ్ఛమైన అద్దంలో ప్రతిబింబంలాగా జ్ఞానంకూడా సహజత్వంతో వెలుగొందుతుంది.

వైజ్ఞానిక సమన్వయం

ఇంతకీ శ్రాద్ధకర్మలు చేయనివాళ్ళంతా పతనం చెందుతున్నారా? శ్రాద్ధకర్మలు చేయనివాళ్లకి గతులు లేవా? అని ప్రశ్నించవచ్చు. ఉన్నాయి. కాని సంస్కారమయమైన జీవితంలో ఉన్న సుఖం, మిగిలినవి ఎన్ని ఉన్నా ఉండదు. మానవుడు కంచంలోనో గిన్నెలోనో ఎందుకు అన్నం తింటాడు? కుక్కలాగా నేలమీద పోసుకొని తింటే ఆకలి తీరదా? చేతులతో తినడం దేనికి? తినేముందు, తిన్న తర్వాత చేయి కడుక్కోవడం దేనికి? అన్నప్రశ్న ఎలాంటిదో ఇదీ అలాంటిదే. పెళ్ళి చేసుకోకపోతే బిడ్డలు పుట్టరా? జంతువులకు పుట్టడంలేదా? అన్న ప్రశ్న ఎలాంటిదో ఇదీ అలాంటిదే. పరిశుభ్రమైన పాత్రలో అన్నం తినడం, మంత్రపూతంగా స్త్రీ పురుషులు వివాహమాడటం, కామసంబంధమైన అంటువ్యాధులు లేకుండా పాతివ్రత్యమూ, ఏకపత్నీవ్రతం నిర్వహించడం

ఎలాంటిదో పితృకర్మలవల్ల కలిగే పవిత్రమైన లోకాల అనుభవాలు కూడా అలాంటివే. అది లేనివారు జీవించరని అర్థంకాదు. తెలిసినవారు సద్వినియోగం చేసుకోవాలనే అర్థం. ఎలక్ట్రిక్‌లైట్లు, పంకాలు, టెలిఫోన్లు, రేడియోలు లేకపోతే మానవుడు బ్రతకడా? బ్రతుకుతాడు. అయినా ఈ శాస్త్రీయ విజ్ఞానాన్ని ఎలా వినియోగం చేసుకొంటున్నాడో అలాగే మానవుడు పితృకర్మల శాస్త్రాన్నికూడా వినియోగం చేసుకోవచ్చు. మానవుడు అనుభవించే పవిత్రలోకాలు పైన ఆకాశంలో ఎక్కడా ఉండవు. వాడి అనుభవంలోనే ఉంటాయి. ఒకడు నిద్రపోతూ ఉండగా మరొకడు మేలుకొని ఉంటే వారిద్దరి నడుమా గల భేదం ఎట్టిదో లోకాల భేదం కూడా అట్టిదే. లోకాలు ప్రజ్ఞలకు సంబంధించినవిగాని చోటుకి సంబంధించినవి కావు.

పుష్కరాల్లో పితృకర్మలు

శ్రాద్ధకర్మల్లో పుష్కరంలో చేసేవి ఒక భాగం. భారతదేశంలో పుణ్యనదులు చాలా ఉన్నాయి. అందు ముఖ్యంగా పన్నెండు నదులని పెద్దవాళ్ళు లెక్కలోకి తీసుకొన్నారు. బృహస్పతి అదే గ్రహం పన్నెండు సంవత్సరాలకి ఒకసారి రాశిచక్రంలో తిరిగి వస్తుంది. ఒక్కొక్క నదిలోఉన్న జలాలు బృహస్పతి సంచారం చేసే రాశిని అనుసరించి ప్రభావితం అవుతూ ఉంటాయి. ఆ ప్రభావితం అయిన కాలాన్ని ఆ నదికి పుష్కరం అంటారు. ఈ శాస్త్రం మన పురాణాలలో విశేషంగా వివరించబడి ఉంది. ఈ సంవత్సరం కృష్ణానదిమీద ఈ ప్రభావం ఉంటుంది గనుక ఇది కృష్ణాపుష్కరం. కొన్నివేల సంవత్సరాల నుండి మహా పురుషులు పుష్కరశ్రాద్ధంపేర పితృకర్మలు ఆచరించినట్లు పురాణాల్లో వర్ణింపబడి ఉంది. మనంకూడా వారిమార్గాన్ని అనుసరించి వారిచ్చిన విజ్ఞానాన్ని వినియోగించుకోనడం మంచిది. ప్రాచీన నవీన శాస్త్రాల్లో దేనినీ కాదనడం శాస్త్రీయ దృక్పథం కాదు. తెలిసిన విజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంలోనే పరిశీలనాబుద్ధి ఇమిడి ఉంటుంది. మానవుడు బుద్ధిజీవి గనుక ఈ వినియోగం అందరికీ శ్రేయస్సు చేకూరుస్తుంది. పన్నెండు సంవత్సరాలకు ఒక మారువచ్చే ఈ కృష్ణాపుష్కర సదవకాశాన్ని అందరూ వినియోగించుకొని పితృకర్మలు ఆచరించి, తమ పెద్దలైన పితరులకు సుఖశాంతులు కల్పించడం శ్రేయోదాయకం. పుష్కర శ్రాద్ధం మొదలైన పితృకర్మల్ని సూక్ష్మంగా శాస్త్రీయ దృక్పథంతో పరిశీలించినకొద్దీ వాటిలో ఉన్న విశేషం బోధపడుతుంది. వినియోగించుకొన్నకొద్దీ జీవితం వికాసవంతం అవుతుంది.

నా పేరు కృష్ణవేణి

డా॥ జంధ్యాల జయకృష్ణ బాపూజీ

నేను కృష్ణవేణిని, నా పుట్టినిల్లు మహారాష్ట్ర, మెట్టినిల్లు ఆంధ్రప్రదేశం.

నీలవర్ణాన్ని కృష్ణవర్ణం అని కూడా అంటారు. "కృష్ణ" అంటే ఆకర్షించేది అని మరొక అర్థం. ఆ పేరుతో ఒక అవతార పురుషుడు, ఒక సాధ్వీమణి, ఒక జీవనది ఉన్నాయి. ఆ అవతార పురుషుడే శ్రీకృష్ణుడు, ఆ సాధ్వీమణీ ద్రౌపది, ఆ జీవనదే నేను. నీలవర్ణపు నీటితో నిండి ఉంటాను కనుక, అందరినీ ఆకర్షిస్తూ ఉంటాను కనుక నాకు "కృష్ణవేణి" అన్న పేరు వచ్చింది. "వేణి" అంటే "నది" అన్నమాట.

పడమటి కనుమలలో సహ్యాపర్వత పంక్తులలో మహా బలేశ్వరం వద్ద జన్మించిన నేను మొత్తం మూడు రాష్ట్రాలలో ముచ్చటగా ప్రవహించాను. మహారాష్ట్రలో 306 కిలో మీటర్లు ప్రయాణించి కర్ణాటకలో కాలుపెట్టాను. ఆ రాష్ట్రంలో 482 కిలోమీటర్లు పరుగులెత్తి ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించాను. అక్కడ–

కృష్ణా తరంగ పంక్తిన్ ద్రొక్కి త్రుళ్లింత
నాంధ్ర నౌకలు నాట్యమాడు నాడు

అని నవ్యకవితా యుగకర్త రాయప్రోలు సుబ్బారావు,

కృష్ణాతరంగ నిర్ణిద్రగానము తోడ
శిల్పమ్ము తొలిపూజ సేయునాడు
అక్షరజ్ఞాన మెరుగదో ఆంధ్రజాతి!
విమల కృష్ణానదీ సైకతములయందు

కోకిలపుపాట పిచ్చుక గూండ్లు కట్టి
నేర్చుకొన్నది పూర్ణిమా నిశలయందు

- అని కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణా,

కదలిరావే కృష్ణవేణీ!
కదలిరావే నిత్యకల్యాణీ!
కదలిరా కదలిరా కడుపుచల్లని తల్లి!
జలజలా పొంగుతూ కిలకిలా నవ్వుతూ

- అని కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి - కవితాపూర్ణ కుంభాలతో ఆదరంగా అభిమానంగా నన్ను ఆహ్వానించారు. వెంటనే-

గలగలా గోదారి కదలి పోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ పరుగులిడు తుంటేను.
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి.

అని శంకరంబాడి సుందరాచార్య,

కృష్ణా తరంగాల సారంగనాదాలు
కృష్ణలీలాతరంగిణీ దివ్య గీతాలు.

అని వేటూరి సుందరరామమూర్తి నాకు స్వాగత గీతాలు ఆలపించారు.

తెలంగాణాలో నేను నల్గొండ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో కర్నూలు జిల్లా, గుంటూరు జిల్లా, కృష్ణా జిల్లాలు సందర్శించాను. ఇంతకుముందు నేను ప్రవహించిన మహారాష్ట్ర, కర్ణాటక రెండు రాష్ట్రాల కంటే తెలుగురాష్ట్రాల రెండింటిపైనా ఎందుకో నాకు మమకారం ఎక్కువ. అందువల్లనే ఆ రాష్ట్రాలలో కన్న ఎక్కువగా 612 కిలోమీటర్ల దూరం ఈ రాష్ట్రాల్లో ప్రయాణించాను. చివరకు నా పేరుతో వర్ధిల్లుతున్న కృష్ణాజిల్లాలో హంసలదీవి వద్ద మహాసాగరంలో కలసిపోయాను. ఇంతకీ నా గమనమార్గం అంతా 1400 కిలోమీటర్లు అన్నమాట.

నాకు పన్నెండుమంది చెల్లెళ్లు ఉన్నారు. దిండి, మూసి, పాలేరు, మునేరు, తుంగభద్ర, కోయినా, వరుణ, పంచగంగ, దూద్‌గంగ, ఘటప్రభ, మలప్రభ, భీమ - అనేవి వాళ్ల పేర్లు. మా అక్కయ్య పేరు గోదావరి.

నా తీరప్రాంతాలలో శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, కాకతీయులు వంటి పెద్దపెద్ద రాజవంశాల వారు రాజ్యాలు ఏలారు. ఎన్నెన్నో గ్రామాలూ, పట్టణాలూ, నగరాలూ, దేవాలయాలూ, వనాలు, ఉద్యానవనాలూ నాకు అటూ ఇటూ వెలిశాయి. నామీద ఆనకట్టలు, డ్యాములు, ప్రాజెక్టులు, రైలు వంతెనలు, రోడ్డు వంతెనలు నిర్మించారు. లక్షల కొలది ఎకరాలకు సాగునీరూ, కోట్ల ప్రజలకు తాగునీరూ అందించాను.

స్వతంత్ర భారతానికి ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆధునిక దేవాలయాలుగా అభివర్ణించిన బహుళార్థ సాధక ప్రాజెక్టులు కోట్నీ, ఆలమట్టి, శ్రీశైలం, నాగార్జున కొండ, విజయవాడ ప్రాంతాలలో నామీద నిర్మితమైనాయి. అవి “శ్రమ ఏవ జయతే” అన్న

సూక్తికి సుందరమైన ఉదాహరణలుగా నిలిచి మీకు నిరంతరం కన్నుల పండుగ చేస్తున్నాయి.

ఇదిగో! ఇది వీరశైవ మతప్రవక్త అయిన బసవేశ్వరుడి ఆలయం. ఆయనను "కూడల సంగమదేవా!" అని కన్నడ శివకవులు కీర్తించారు.

అదిగో! అది అలంపురం. ఇది నవబ్రహ్మాలయాలు. తొమ్మిది శివలింగాలతో విలసిల్లే ఈ దేవాలయ సముదాయం నవవిధ భక్తులను స్ఫురింపజేస్తున్నది. ఆ ప్రక్కన ఎడంగా కనిపించేవి పాపనాశి ఆలయాలు.

ఇది కూడవల్లి, ఆ సమున్నతమైన గాలిగోపురం సంగమేశ్వర స్వామిది.

ఆ కనపడేదే "శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అని ప్రసిద్ధి పొందిన శ్రీశైల క్షేత్రం.

శిఖరదర్శనమ్ము చేత
ముక్తినిచ్చు శ్రీగిరిపై
మల్లికార్జునుండ వైన
భ్రమరాంబా మనోనాథ!

అని కొనియాడబడిన పరమేశ్వరుడి నివాసం ఇది. ఇక్కడ నేను లోయలో ప్రవహించటం చేత నాకు "పాతాళ గంగ" అనే పేరు వచ్చింది.

ఇది తెలుగుగంగ ప్రాజెక్టు, చెన్నపట్టణ ప్రజలకు దప్పిక తీర్చటంకోసం ఈ కనపడే సుదీర్ఘమైన కాలువను తవ్వారు. దీనివల్ల రాయలసీమ జిల్లాలు, నెల్లూరు జిల్లా కూడా లాభాన్ని పొందాయి.

అవిగో వీనులవిందుగా వినిపిస్తున్న బుద్ధభగవానుడి త్రిశరణాలు! "బుద్ధం శరణం గచ్ఛామి - ధర్మం శరణం గచ్ఛామి - సంఘం శరణం గచ్ఛామి" అని ఆచార్య నాగార్జునుడి అడుగు జాడలలో శిష్యులు నడుస్తున్నారు. ఇక్కడి బౌద్ధ విశ్వవిద్యాలయంలో దేశ దేశాల విద్యార్థులకు విద్యాబోధ, విజ్ఞానబోధ చేయబడినాయి. ప్రపంచంలోనే పెద్దదైన ఈ ఆనకట్టను చూడండి - అది జవహర్ కాలువ. ఇది లాల్ బహదూర్ కాలువ. సాటిలేని మేటి ప్రధానుల పేర్లతో పిలువబడే ఈ కాలువలు నా జీవజలాన్ని ప్రజల ప్రాణాలు నిలపటంకోసం, ఆంధ్రభూమిని అన్నపూర్ణగా చేయటంకోసం వోనుకొని పోతున్నాయి.

అదిగో! ఆలకించండి. అవి అమరావతిలోని అమరేశ్వరుడి ఆలయ ఘంటారావం. బాలచాముండికా సహితుడైన స్వామిని సందర్శించండి. ఆ ప్రక్కనే ఉన్న బౌద్ధస్తూపాన్ని అవలోకించండి.

ఇది ఇంద్రకీలాద్రి. శంకరుని రాణి కనకదుర్గాభవాని కొలువు దీరిన పుణ్యాద్రి. ఈ పర్వతం మీదనే పాండవమధ్యముడైన అర్జునుడు పరమేశ్వరుణ్ణి మెప్పించి పాశుపతాస్త్రాన్ని అందుకొని విజయశ్రీ విరాజితుడైనాడు.

''ఆంధ్రకేసరి'' టంగుటూరి ప్రకాశం పంతులు పేరుమీద నిర్మింపబడిన ''ప్రకాశం బారేజి'' పరికించండి. అవిగో! అవి రెండూ కొత్తగా నెలకొల్పిన రైలు వంతెనలు. వాటికి అవతల

కనపడే విశాలమైన "కనక దుర్గమ్మ వారధి"ని కనుగొన్నారా! అది కూడా ఇటీవలనే నిర్మింపబడిన రోడ్డువంతెన. ఈ విజయవాడ నగరం నుండి ఏలూరు కాలువ, బందరు కాలువ తవ్వారు.

ఆ కనపడేదే దివిసీమ. అదే వేణుగోపాల స్వామి ఆలయం. హృదయాలను సమ్మోహపరచే వేణుగానం ఆలకించి పులకించండి. మహారాష్ట్ర మంచిగంధాన్నీ, కన్నడ కస్తూరినీ, తెలుగు తేనెనీ నాలో కలుపుకొని తెచ్చాను.

వేదాద్రి నరసింహుడి చరణాలు కడిగి, అమరేశ్వరుణ్ణి అభిషేకించి, కనకదుర్గాదేవిని అలంకరించి, శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువును ఆరాధించి, హంసలదీవి వేణుగోపాల దేవుడి దివ్య మురళీ స్వరాలలో తేలియాడి సానురాగంతో, సాదరంతో సాగరుణ్ణి చేరుకున్నాను.

ఇప్పుడు పరమపావనమైన పుష్కర సమయం వచ్చింది. దేవగురుడు బృహస్పతి కన్యారాశిలో ప్రవేశించాడు. పన్నెండు సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే ఈ పవిత్ర సన్నివేశంలో ఆబాలగోపాలం పాలుపంచు కొంటున్నారు. రండి! నాలోని కెరటాలలో జలకాలాడి తాపాలనూ, పాపాలనూ పోగొట్టు కోండి. పునీతులు కండి. ఆనందాన్నీ, ఆత్మతృప్తినీ అందుకోండి.

కృష్ణానది వైభవం

డా॥ జయంతి చక్రవర్తి

కృష్ణానది ప్రాశస్త్యం

"జీవనం జలమ్" ఈ సృష్టిలో ఒక్క నీటికి మాత్రమే 'జీవనమ్' అని పేరు. జీవింపచేసేది కాబట్టే జలం అయింది. అటువంటి జీవన జలాలతో ప్రవహించే ఎన్నో పుణ్యనదులు పవిత్ర తీర్థాలుగా, వీటి తీరాల్లో వెలసిన క్షేత్రాలు పుణ్యస్థలాలుగా ప్రసిద్ధి పొందాయి. మనదేశంలో ప్రవహించే నదుల్లో సుప్రసిద్ధమైనవి ఎనిమిది వున్నాయి అవి...

గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి ।
నర్మదే సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు ॥

గంగా, యమునా, కృష్ణా, గోదావరి, సరస్వతి, నర్మదా, సింధు, కావేరి అనే మహానదులు. వీటిలో గంగా, యమునా, సరస్వతి, నర్మదా, సింధు, ఉత్తర భారత ప్రాంతంలో ప్రవహించే పుణ్యనదులు కాగా, కృష్ణా, గోదావరి, కావేరి, దక్షిణ ప్రాంతంలో ప్రవహించే నదీమతల్లులు. ఈ ఎనిమిది నదుల్లో, ఉత్తర భారతంలోని గంగానది, దక్షిణ భారతంలో వున్న కృష్ణానది పరమ పవిత్రమైనవిగా పురాణాల్లో వర్ణించబడ్డాయి. "విష్ణుపాదోద్భవీగంగా" శ్రీ మహావిష్ణువు పాదాలనుంచి పుట్టింది గంగా అని, అలాగే "కృష్ణా కృష్ణాంగ సంభూతా" కృష్ణుడి (విష్ణువు) శరీర భాగంనుంచి ఉద్భవించింది కృష్ణా అని పురాణాల్లో ఈ రెండు నదుల ప్రాశస్త్యం గురించి చెప్పటం జరిగింది.

పూర్వం కృతయుగం ప్రారంభంలో, షోడశ (16) లోకాల్లో ఉన్నతమైన గోలోకంలో రాధాకృష్ణులు ఉల్లాసంగా, ఏకాంతంగా ప్రణయ విహారం చేస్తుండగా, అదే సమయంలో వారి ఏకాంతాన్ని కొందరు గోపికలు భంగపరిచారట. అంత వారి చేష్టలకి కోపం వచ్చిన ఆ రాధాకృష్ణులు, ఆ గోపికలందర్నీ భూలోకంలో పుట్టమని శాపం ఇచ్చారు. అప్పుడా గోపికలంతా దీనంగా తమని క్షమించమని పరిపరివిధాలుగా వేడుకోగా, కరుణించిన ఆ రాధాకృష్ణులు వాళ్ళతో, "మీరంతా భరతఖండంలో మీమీ పేర్లతో పుష్కర మహానదులుగా ప్రవహించి, జనులందర్నీ తరింప చేయండి. మిమ్మల్ని మేము ఎప్పుడూ అనుగ్రహిస్తూ వుంటామని" చెప్పారు.

ఆ విధంగా శాపగ్రస్తులైన గోపికలంతా గంగా, యమునా, నర్మద, సింధు, కావేరి, సరస్వతి, గోదావరి, కృష్ణ, భీమరథి, తుంగభద్ర, పుష్కర వాహిని, ప్రణీత అని పన్నెండు పుష్కర నదులుగా భూలోకంలో అవతరించారు. ఈ పవిత్ర పుణ్యనదీతీరాల్లో ఎన్నో దివ్యక్షేత్రాలు వెలిశాయి. ఇలా వెలసిన నదుల్లో విశిష్టమైనది కృష్ణానది ఈ నది వేణీనదిలో కలసి కృష్ణవేణిగా

రూపొందిన విధం గురించి పురాణాలు ఇలా వివరించాయి.

కృష్ణా - వేణీ

అతి పవిత్రమైన ఈ కృష్ణ - వేణీ నదుల పుట్టుకను గురించి పద్మపురాణంలోని ఉత్తర ఖండంలో, పృథుచక్రవర్తి నారద మహాముని సంవాద సందర్భంలో నారద మహర్షి పృథు చక్రవర్తితో ఇలా అంటాడు.

కృష్ణా విష్ణుతను స్సాక్షాద్వేణీ దేవోమహేశ్వరః
తత్సంగమమ్ ప్రభావంతు నాలం వక్తుం చతుర్ముఖః
తథాపి తత్సముత్పత్తిం కీర్తయిష్యామి త్వాం శృణు ।

ఓ పృథు మహారాజా విష్ణువు తనువు నుంచి కృష్ణానది పుడితే, వేణీనది సాక్షాత్తు మహేశ్వరుడి నుండి పుట్టింది. ఈ రెండు నదుల సంగమంతో వెలసిన కృష్ణవేణీనది మాహాత్మ్యం గురించి చెప్పాలంటే ఆ బ్రహ్మదేవుడికైనా సాధ్యం కాదు. అయినా దాని మహిమను గురించి చెప్తాను విను అని చెప్పటం ప్రారంభించాడు...

పూర్వం చాక్షుష మన్వంతర కాలంలో, రమణీయమైన ప్రకృతి శోభతో అలరారుతున్న సహ్యాద్రి అనే పర్వత శిఖరం మీద బ్రహ్మదేవుడు ఒక మహాయజ్ఞం చేయాలని నిశ్చయించుకున్నాడు. వెంటనే దానికి కావలసిన సమస్త సంభారాలన్నీ సమకూర్చుకొని హరిహరులిద్దర్నీ, ఇతర ఋషుల్ని వెంటబెట్టుకొని ఆ పర్వతశిఖరం మీదికి విచ్చేశాడు. అక్కడ భృగుమహర్షి ఇత్యాదులంతా యజ్ఞాన్ని ఆరంభించటానికి ఒక దివ్యముహూర్తాన్ని నిర్ణయించి బ్రహ్మదేవుడికి యాగదీక్షని ఇవ్వటం కోసం వేచిచూస్తున్నారు.

అంతలో ముహూర్తకాలం సమీపించింది. వెంటనే విష్ణుమూర్తి బ్రహ్మదేవుడి భార్య అయిన సరస్వతీదేవిని త్వరగా రమ్మని కబురు చేశాడు. అయినప్పటికీ ఆమె రావటానికి ఆలస్యం జరిగింది. ఇది చూసిన భృగుమహర్షి విష్ణువుతో "ఆర్యా! ముహూర్తకాలం సమీపిస్తోంది. సరస్వతీదేవి ఇంకా రాలేదు. ఇప్పుడు ఎలా" అని అడిగాడు. అప్పుడు ఆలోచించిన విష్ణుమూర్తి సరస్వతికి బదులుగా బ్రహ్మదేవుడి రెండవ భార్య అయిన గాయత్రీ దేవిని, పిలిపించి బ్రహ్మదేవుని వద్ద కూర్చోపెట్టండి అని చెప్పగా, పరమేశ్వరుడు కూడా అవును అలాగే చేయండని అన్నాడు. ఇలా వారిద్దరి ఆదేశాలు విన్న భృగుమహర్షి గాయత్రీ దేవిని పిలిపించి బ్రహ్మదేవుడికి దక్షిణ భాగాన కూర్చోబెట్టి ఆయనకి యాగదీక్షని ఇచ్చాడు.

సరిగ్గా అదే సమయానికి సరస్వతీదేవి అక్కడికి వచ్చింది, బ్రహ్మదేవుడి ప్రక్కన తన స్థానంలో కూర్చున్న గాయత్రీదేవిని సవతి మాత్సర్యంతో కోపంగా చూస్తూ "ఎక్కడ పూజించటానికి అర్హతలేనివారు పూజించబడతారో, పూజింపతగిన వారు పూజింపబడరో అక్కడ దుర్భిక్షం, మరణం, భయం అనే మూడు గుణాలు ఏర్పడతాయి. నాకన్నా వయసులో చిన్నదానివైన నీవు నా స్థానంలో కూర్చున్నావు కాబట్టి, నువ్వు భూలోకంలో

ఎవ్వరికీ కనపడని అదృశ్య శరీరంతో నదీరూపాన్ని పొందుదువు గాక” అని శపించింది.

ఆ తర్వాత హరిహర హిరణ్యగర్భుల వైపు చూసి “ఓ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులారా సర్వజ్ఞులైన మీరు నా స్థానంలో, నాకన్నా చిన్నదైన గాయత్రిని కూర్చోపెట్టారు. కాబట్టి మీరు కూడా భూలోకంలో నదీరూపాల్ని పొందండి.” అని వారికి కూడా శాపం ఇచ్చింది.

ఇంతలో గాయత్రీదేవి కోపంగా లేచి సరస్వతీదేవితో “ఓ సరస్వతీ! నేను కూడా నీలాగానే బ్రహ్మదేవుడి భార్యను. నీవు అకారణంగా నన్ను శపించావు. కాబట్టి నువ్వు కూడా భూలోకంలో నదీరూపాన్ని పొందుదువుగాక” అని ప్రతిశాపం ఇచ్చింది. ఇది విన్న హరిహరులిద్దరూ ఆందోళనతో సరస్వతీదేవికి నమస్కరించి “అమ్మా! నీ చేత శపించబడిన త్రిమూర్తులమైన మేము నదీరూపాల్ని పొందితే ముల్లోకాలు నాశనమైపోతాయి. కాబట్టి నీ శాపాన్ని దయచేసి ఉపసంహరించుకో అని ప్రార్థించారు.

వారి ప్రార్థన విన్న సరస్వతీ దేవి “ఓ హరిహర బ్రహ్మలారా! మీరు యజ్ఞదీక్షా ప్రారంభకాలంలో ప్రథమ పూజార్హుడైన గణపతిని పూజించలేదు. అందువల్లే నాకు కోపం రావటం, మిమ్మల్ని శపించటం, జరిగింది. అలాగే యజ్ఞానికి విఘ్నం ఏర్పడింది. నేనిచ్చిన శాపానికి ఉపసంహారం లేదు. కానీ ప్రత్యామ్నాయం ఏమిటంటే? మీరు మీరుగానే వుండి, మీమీ అంశలతో భూలోకంలో నదీరూపాల్ని పొంది, జనుల్ని తరింప చేయండి” అని సమాధానమిచ్చింది.

ఈ విధంగా హరిహరబ్రహ్మాది దేవతలు సరస్వతీదేవి చేత శపించబడి అవ్యక్తంగా నదీ రూపాల్ని పొంది అవసరమైనప్పుడు భూలోకంలో వ్యక్తంగా నదీరూపాల్ని ధరించటానికి సిద్ధంగా వున్నారు. ఇదిలావుండగా–

ఒకనాడు వైకుంఠంలో శేషశయనుడై శ్రీ మహావిష్ణువు విశ్రాంతి తీసుకొంటున్న సమయంలో జగత్పితయైన బ్రహ్మదేవుడు అక్కడికి వచ్చి విష్ణుమూర్తికి సభక్తికంగా నమస్కరించి ఈ విధంగా విన్నవించాడు... “ఓ మహాదేవా, స్థితికారకా, నేను కేవలం సృష్టికర్తను. ఈ సృష్టిమొత్తాన్ని భరించేవాడివి నీవే. నీవల్లే లోకంలోని జనులంతా ఇప్పటి దాకా సుఖంగా వున్నారు. నీ ప్రత్యక్ష అవతార వైభవం వల్ల భూలోకంలో కృత, త్రేతా, ద్వాపరయుగాల్లో ధర్మం నిలిచివుంటుంది. కానీ రాబోయే కలియుగంలో ధర్మంపూర్తిగా నశిస్తుంది. దానివల్ల మానవులంతా పాపకార్యాలు చేసి నరకాన్ని పొందాల్సి ఉంటుంది కదా! మరి దీనికి తగిన నివారణోపాయాన్ని చూపించు తండ్రీ! నాచే సృష్టించబడిన ఈ మానవకోటి నరకం పాలు కాకుండా ఏదైనా మార్గాన్ని చూపించు అని ప్రార్థించాడు.” అలా బ్రహ్మచేసిన ప్రార్థనవిన్న విష్ణుమూర్తి మహదానందంతో పూర్వం తనకి సరస్వతీదేవి ఇచ్చిన శాపాన్ని గుర్తుచేసుకొని ఇదే సరైన సమయం అని భావించి తన శరీరంలోని అంశచేత ఒక దివ్య తేజాన్ని సృష్టించాడు.

అత్యద్భుతమైన, అత్యంత ప్రకాశవంతమైన ఆ తేజస్సు, నీలమేఘంవంటి శరీరకాంతితో, దివ్యమైన మణికుండలాదిహారాలతో ఒక సుందరమైన స్త్రీరూపాన్ని ధరించి నిలబడింది. అప్పుడు శ్రీహరి బ్రహ్మదేవుడితో, "ఓ చతుర్ముఖా, నా అంశచేత సృష్టించబడిన ఈమె నీ ఆజ్ఞ ప్రకారం నదీరూపంలో భూలోకంలో ప్రవహించి, దర్శన (చూడటం) స్పర్శన (తాకటం) కీర్తన (కీర్తించటం) చేయటం చేతనే, జనుల సర్వపాపాల్ని హరించి, వారికి పుణ్యలోకాలు కలిగించి, ఆయురారోగ్యాలు కూడా కలిగిస్తుంది. ఇక నా అంశతో నా శరీర వర్ణంతో ఈమె జన్మించటం వల్ల 'కృష్ణ' అని ఈమె లోకంలో ప్రసిద్ధిపొందుతుంది. ఈ కృష్ణానదీ తీరంలో ఎవరైతే నివసిస్తారో వారంతా చివరికి నాలోకాన్ని చేరతారు. కాబట్టి భూలోకంలో ఎప్పుడైతే పాపం పెరిగి అధర్మం పెచ్చుమీరుతుందో, అప్పుడు ఈ నదిని భూమ్మీద అవతరింపచేయి. అంతవరకు ఈమెని నీవద్దనే ఉండనీ" అని చెప్పాడు.

అలా విష్ణువు ఆదేశాన్ని విని బ్రహ్మదేవుడు సంతోషంతో ఆయనకి కృతజ్ఞతలు తెలిపి ఆ కృష్ణని వెంటబెట్టుకొని కైలాసానికి వెళ్ళాడు. అక్కడ పరమేశ్వరుడితో ఈ వృత్తాంతాన్నంతా చెప్పగా, సంతోషించిన శంకరుడు బ్రహ్మదేవుడితో, "పితామహా! నీ భూతదయ చాలా గొప్పది. విష్ణుతనూభవ అయిన ఈ కృష్ణానదీ తీరాన నేను లింగరూపాన్ని ధరించి కొలువుంటాను. ఈ పవిత్ర కృష్ణాజలాలతో నన్నెవరు అభిషేకిస్తారో వాళ్ళకి నా సాయుజ్యాన్ని కల్పిస్తాను" అని పలికాడు. ఆ తర్వాత బ్రహ్మదేవుడు సంతోషంతో శివుడికి కూడా తన కృతజ్ఞతలు తెలియచేసి కృష్ణను తీసుకొని తన సత్యలోకానికి వెళ్ళిపోయాడు.

ఇలా కొంతకాలం జరిగింది. అప్పుడు భూలోకంలో సహ్యాద్రి అనే పర్వతం మునిరూపాన్ని ధరించి శ్రీ మహావిష్ణువు కోసం ఘోరమైన తపస్సు చేసింది. తీవ్రమైన ఆ సహ్యాద్రి తపస్సుకి మెచ్చిన విష్ణువు ప్రత్యక్షమై వరం కోరుకోమనగా, ఆ సహ్యముని మహాసంతోషంతో "ప్రభూ నామీద దయవుంచి నీ అంశరూపమైన పరమ పవిత్రమైన కృష్ణానదిని, నా పర్వతం మీద నుంచి ప్రవహింప చేయి, అలాగే నీవు కూడా నా పర్వతం మీద కొలువుండు" అని ప్రార్థించగా సరే అని వరమిచ్చి విష్ణువు అంతర్ధానమయ్యాడు.

ఆ తర్వాత కొంతకాలానికి అదే సహ్యాద్రి పర్వతం ఉత్తరదిక్కున వున్న శిఖరం మీద బ్రహ్మదేవుడు నారాయణుడి గురించి తపస్సు చేయగా, బ్రహ్మతపస్సుకి మెచ్చిన నారాయణుడు తెల్లటి అశ్వత్థ వృక్షం (రావిచెట్టు) రూపంలో ఆ పర్వతం మీద ప్రత్యక్షమయ్యాడు. అలాగే అదే సమయంలో సహ్యాద్రి దక్షిణ ప్రాంతపు శిఖరం మీద వేదాలు ఒకమూర్తిని (ఆకారాన్ని) పొంది పరమేశ్వరుడిని గూర్చి తపస్సు చేశారు, వారి తపస్సుకి – సంతోషించిన ఈశ్వరుడు అదే పర్వతం మీద ఆమలకవృక్ష (ఉసిరిచెట్టు) రూపంలో నిలిచాడు. అలా కొంతకాలం గడిచాక ఆ 'శ్వేత అశ్వత్థ వృక్షం' నుంచి ఒక జలపుట్టి ప్రవహించ

సాగింది అదే కృష్ణా, అలాగే అపర్వతం మీదే ఉన్న ఆమలక వృక్షం నుంచి కూడా మరోజల ఉద్భవించింది. దానికి వేణీ అని పేరు. ఇలా ఈ రెండు నదులూ కొంతదూరం విడిగా ప్రవహించి ఆ తరువాత ఒకటిగా కలిసి కృష్ణవేణిగా రూపొందాయి.

ఇలా ఈ రెండునదులూ కలసి కృష్ణవేణిగా ప్రవహిస్తూండగా వీటిలో బ్రహ్మాంశ సంభూత అయిన కకుద్మతీ అనే నది కూడా కలిసింది. ఇక ఆనాటినుంచి త్రిమూర్త్యాత్మకంగా పరమ పవిత్రంగా ఈ కృష్ణవేణీ నది భూలోకంలో ప్రసిద్ధి గాంచింది.

కృష్ణా - వేణీ నదుల ప్రాశస్త్యం

కృష్ణా కృష్ణాంగ సంభూతా, కృష్ణా విష్ణుతనూద్భవా।
సాక్షాద్వేణో దేవో మహేశ్వరః ॥

అని ప్రసిద్ధి పొందిన ఈ కృష్ణవేణీలో వివిధ దైవాంశ సంభూతాలైన విశాలా, విజయా, వైష్ణవి, మలాపహారిణీ, కుముద, కౌశికి, నారాయణి, భీమా, తుంగభద్రా, అరుణ, భాస్కరి, మూసి, వైఘా, తామ్రపర్ణి అనే నదులు కలసి సర్వదేవతాత్మక మైనదిగా కీర్తించబడింది. ఇంకా ఈ కృష్ణవేణీ నదీ ఎంత గొప్పదంటే :

గోదావరీ మహాపుణ్యా బ్రహ్మ గోవధనాశనీ।
ఏకవింశముఖాప్రోక్తా రుద్రలోక ప్రదాయినీ ॥
కృష్ణవేణీ పుణ్యనదీ సర్వపాపక్షయాపహా।
సాష్టాదశముఖాప్రోక్తా విష్ణులోక ప్రదాయినీ ॥

మహాపుణ్యప్రదమైన గోదావరీ నది, ఇరవై ఒక్క ముఖాలతో ప్రవహిస్తూ బ్రహ్మహత్య, గోహత్య అనే పాపాల్నుంచి మనల్ని రక్షించి రుద్రలోకానికి తీసుకువెళ్తే, సర్వపాపాల్ని పోగొట్టే కృష్ణవేణీ నది పద్దెనిమిది ముఖాలతో ప్రవహిస్తూ మనల్ని విష్ణులోకానికి చేరుస్తుంది అని శివమహాపురాణంలో చెప్పటం జరిగింది. అలాగే విష్ణుమహాపురాణంలో సహ్యాద్రి పర్వతంలో పుట్టిన నదుల ప్రాశస్త్యం గురించి వివరిస్తూ వ్యాసభగవానుడు.

గోదావరీ భీమరథీ కృష్ణవేణ్యాదిక స్తథా
సహ్యపాదోద్భవా నద్యాః స్మృతాః పాపభయావహా ॥

స్మరించిన మాత్రంచేతనే పాపభయాన్ని పోగొట్టేవి, సహ్యాద్రిపాదం నుంచి పుట్టిన కృష్ణవేణ్యాది నదులు అని చెప్పాడు. ఇక బ్రహ్మాండ మహాపురాణం లోని పూర్వభాగంలో కూడా

గోదావరీ భీమరథీ కృష్ణవేణీ చ మంజులా
తుంగభద్రా సుప్రయోగ్యా కావేర్యపి తథాపి చ
దక్షిణేన ప్రవాహస్త్వః సహ్యపాదాద్వినిస్సృతాః ॥

అని భారతదేశంలో దక్షిణ ప్రాంతంలో ప్రవహించే పుణ్య మహానదుల గురించి చెప్పే సందర్భంలో ఈ కృష్ణవేణీనది ప్రస్తావించబడింది.

కృష్ణాతీరంలోని తీర్థాలు

ఇటువంటి పరమ పవిత్రమైన కృష్ణవేణీ నదీ పరీవాహక ప్రాంతంలో ఎన్నో తీర్థాలు వెలిశాయి. వాటిలో అనంత, అష్టతీర్థ, అమరజ, అఘహరి, ఆమలక, ఆదిత్య, ఇంద్ర, కకుద్మతి, కంక, కర్కోటక, కుబ్జేశ్వర, కులతారక, కౌశిక, క్రౌంచి, కూర్మ, చక్ర,

జంబు, ముని, తీర్థ, ముక్తితీర్థ, మలాపహారిణి, మూర్తిదర్శన, దుర్గా, యజ్ఞవాట, ఋణాపహరణ, నృసింహ, లింగతటి, విష్ణు, రుద్ర, విశాల, విష్ణుచ్ఛాయ, వేద, వేణీసంగమ, విహంగమ, వాసుకి, జాతిస్మర, పౌలస్త్య, ఫల్గుణ, పాతాళగంగ, బ్రహ్మ, భారత, భైరవ, త్రిశూల, నారాయణ, నిర్జర మధు, మహాతీర్థ, మార్కండేయ, వైరస, వ్యాఘ్ర, శంఖ, శతలింగ, శుక్ల, సప్తఋషి, సప్తకోటి, శూరదర్పహార, స్కందపుర, సప్తసాగర, సప్తకులోద్ధార, సోమ, సూర్య అనే తీర్థాలు మానవులకి పుణ్యలోకాల్ని కల్పిస్తున్నాయి. ఇలా కృష్ణానది పరీవాహక ప్రాంతంలో మొత్తం నూటముప్పై ఎనిమిది తీర్థాలున్నాయి. అయితే వీటిలో పద్దెనిమిది తీర్థాలు చాలా ముఖ్యమైనవని పురాణాలు చెప్తాయి.

అవి ఏవంటే 1. సప్తర్షి తీర్థం, 2. తుంగభద్రా సంగమ క్షేత్రం, 3. లింగాల ఘట్టం, 4. ముక్తి తీర్థం, 5. సాలగ్రామ నరసింహ తీర్థం (వేదాద్రి), 6. అమరేశ్వర తీర్థం (అమరావతి), 7. విష్ణు తీర్థం (వైకుంఠపురం), 8. దుర్గా తీర్థం (విజయవాడ), 9. సీతాహనుమత్తీర్థం (సీతానగరం), 10. సుదర్శన నారసింహతీర్థం (మంగళగిరి), 11. కోటిపల్లి తీర్థం, 12. శుక్ల తీర్థం (వెల్లటూరు), 13. వ్యాఘ్రేశ్వర తీర్థం, 14. వేణీసాగర సంగమ తీర్థం (హంసలదీవి), 15. కుమార తీర్థం (మోపిదేవి), 16. నాగేశ్వర తీర్థం (పెదకళ్ళేపల్లి), 17. గోపాలతీర్థం (మొవ్వ), 18. కృష్ణాసాగర సంగమ తీర్థం అనేవి.

ఈ అన్ని తీర్థాల్లోకి ప్రశస్తమైనది, విశిష్టమైనది బెజవాడ ప్రాంతంలో వున్న దుర్గాతీర్థం.

శ్రీదుర్గా తీర్థం

పవిత్ర కృష్ణానదీ పరీవాహక ప్రాంతమైన బీజపురి (బెజవాడ) క్షేత్రంలోనే సుప్రసిద్ధమైన ఇంద్రకీల పర్వతం వుంది. కృతయుగంనాడు ఈ కీలాద్రి పర్వతం నృసింహకీల పర్వతం (మంగళగిరి కొండ) వరకూ వ్యాపించి వున్నదట. సహ్యాద్రిలో జన్మించిన కృష్ణవేణీనది మహాప్రవాహంతో పరుగులు తీస్తూ తన భర్త అయిన సాగరాన్ని చేరుకోవాలనే ప్రవహిస్తూ రాగా, ఈ కీలాద్రి కృష్ణవేణీ నదికి ఇక్కడ అడ్డంగా కనిపించింది.

కృష్ణా సాగరయోగాయ మార్గం దేహీతి యాచితః।
దేవతావచనం శ్రుత్వా తద్దైవాదా త్సురంగకం ॥

సురంగద్వారతో దేవీ గచ్ఛతీ హుంరవమకరోత్।
హుంకార శ్రవణాదేవ గిరిః ప్రభిదే తదా ॥

ఆదాయ పర్వతం హస్తేక్షిప్త్వా క్రోశద్వయేతదా।
అతస్తత్ఫల్గుణం తీర్థం దుర్గాతీర్థం తదత్రహి ॥

అప్పుడు ఆ కృష్ణవేణీనది కీలాద్రితో "ప్రభూ! నాకు దారినిచ్చి నా పతిని కలుసుకొనేలా చేసి పుణ్యం కట్టుకో అని ప్రార్థించింది". ఆ నది ప్రార్థన విని కీలాద్రి ఏమాత్రం చలించలేదు. అప్పుడు దేవతలంతా కృష్ణవేణికి దారి ఇమ్మని ఆదేశించగా కీలాద్రి చిన్న సొరంగమార్గాన్ని ఇచ్చింది. అంతే కృష్ణవేణమ్మ మహోత్సాహంతో ఆ చిన్న సొరంగం గుండా హుంకార ధ్వనిచేస్తే అత్యంత వేగంగా ప్రవహించ సాగింది. ఆ నదీ ప్రవాహ వేగానికి కీలాద్రి కంపించిపోయి ఒక్కసారిగా మధ్యలో బ్రద్దలయ్యింది.

అలా బ్రద్దలైన పర్వత శకలం కృష్ణానదిలో ఒక క్రోసెడు దూరం కొట్టుకుపోయి యనమల కుదురు అనే ప్రాంతంలో తేలింది. ఆ కొండకే తేలుకొండ (తేలినకొండ) అనే పేరు వచ్చింది. ఈ విధంగా బెజవాడలో వున్న కీలపర్వతం నుంచి తేలుకొండ వరకూ వున్న ప్రాంతమే దుర్గాతీర్థంగా ప్రసిద్ధి చెందింది.

కృష్ణా తీరంలోని క్షేత్రాలు

పరమపవిత్రమైన ఈ కృష్ణవేణీ నదీపరీవాహక ప్రాంతంలో మహా మహిమాన్వితమైన గోకర్ణక్షేత్రం, నరహరి పురక్షేత్రం, గాణుగాపుర క్షేత్రం, శ్రీశైల మల్లికార్జున క్షేత్రం, వేదాద్రినరసింహ క్షేత్రం, అమరలింగేశ్వర క్షేత్రం, శ్రీ కనకదుర్గా క్షేత్రం, హనుమంత క్షేత్రం, అనంతపద్మనాభ క్షేత్రం, లక్ష్మీనృసింహ క్షేత్రం, ఉభయసోమేశ్వర క్షేత్రం, ఉభయనారాయణ క్షేత్రం, శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణు క్షేత్రం, శుక్లపురి క్షేత్రం, వ్యాఘ్రపాదపుర క్షేత్రం, నరకోత్తారక క్షేత్రం, వ్యాఘ్రేశ్వర క్షేత్రం, వాఘ్రపాదాశ్రమ క్షేత్రం, సంగమేశ్వరం, మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర క్షేత్రం, అగస్త్య క్షేత్రం, వేణుగోపాల క్షేత్రం అనే హరిహరశక్త్యాత్మకమైన దివ్యక్షేత్రాలు ఎన్నో కొలువుదీరి వున్నాయి.

శ్రీ కనకదుర్గ క్షేత్రం

ఇలా చెప్పబడిన ఈ దివ్యక్షేత్రాల్లో అత్యంత ప్రభావంతమైనది మహామహిమోపేతమైనది, సుప్రసిద్ధమైనది బెజవాడ శ్రీ కనకదుర్గా క్షేత్రం. ఈ క్షేత్రం ఎటువంటిదంటే...

ఏతత్ క్షేత్రేణ సదృశం నభూతం నభవిష్యతి।
ఏతచ్ఛ్రవణమాత్రేణ పలాయంతే హి పాతకాః॥

భక్త్యా స్నాత్వాత్ర మల్లేశం దుర్గా దుఃఖార్తి నాశనీం।
దృష్ట్వా పాపాత్ప్రముచ్ఛేత దేవీలోకే వసేత్సదా॥

ఇటువంటి దివ్యక్షేత్రం గతంలో ఎక్కడా లేదు, భవిష్యత్తులో మరేదీ కాదు. అంతేకాదు ఈ క్షేత్రం గురించి వింటే చాలు పాపాలన్నీ దూరంగా పారిపోతాయి. ఈ దివ్యక్షేత్రంలో వున్న కృష్ణానదిలో స్నానం చేసి భక్తితో దుర్గతుల్ని నాశనం చేసే దుర్గామల్లేశ్వరుల్ని సేవిస్తే అన్ని పాపాలనుంచీ విముక్తి పొంది చివరికి దేవీలోకానికి మనం చేరుకుంటాం. అని స్కాందపురాణలంలోని కృష్ణామాహాత్మ్యం ఖండంలో చెప్పబడింది.

కృష్ణానది విశేషాలు - కృష్ణానది పుట్టుక

హిమాలయాలకన్న దక్షిణ పీఠభూమి అతి ప్రాచీనమైనది. దీని పడమటి అంచున వరుసగా గోడ పెట్టినట్లున్న పర్వతాలను పడమటి కనుమలు అంటారు.

నైరుతీ రుతుపవనాల వలన ఈ కనుమల మీద అపారవర్షం కురుస్తుంది. దక్షిణ భారతదేశంలోని అనేక నదులకు ఈ కనుమలు జన్మనిస్తున్నాయి. భారతదేశంలో గంగానది పొడవైనది, తరువాత గోదావరి, కృష్ణానదులు రెండు, మూడు స్థానాలు ఆక్రమించాయి.

పడమటి కనుమలలోని మహాదేవ పర్వత సానువుల్లో "మహాబలేశ్వర

శిఖరం". ఈ మహాబలేశ్వరుని ముద్దుబిడ్డగా కృష్ణానది జన్మించింది. గోముఖ రూపంలో చెక్కబడిన శిల్పం ముఖంనుండి సన్నని ధారగా ఈ నదీమతల్లి జన్మించింది. కృష్ణానది జన్మస్థలం 1336 మీటర్ల ఎత్తున వుంది.

బిరబిరా కృష్ణమ్మ పరుగులెడుతూ మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో 560 కిలోమీటర్లు ప్రయాణించి మహబూబ్‌నగర్ జిల్లా, మక్తల్ మండలంలోని తంగిడి గ్రామం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించి 720 కిలోమీటర్లు దూరం ప్రవహించి కృష్ణాజిల్లా పులిగడ్డ వద్ద రెండు పాయలుగా చీలి ఏటిమొగ, ఎదురు మొండిదగ్గర సముద్రంలో (బంగాళా ఖాతంలో) కలుస్తోంది.

కృష్ణానదికి అనేక ఉపనదులున్నాయి. కోయన, పంచగంగ, వరుణ, దూద్‌గంగా, ఘటప్రభ, మలప్రభ, భీమ, తుంగభద్ర నదులు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో కృష్ణానదిలో సంగమించగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించగానే దిండినది మహబూబ్‌నగర్ జిల్లాలో మహాబాద్ కొండల్లో పుట్టి ఏలేశ్వరం దగ్గర కృష్ణానదిలో కలుస్తోంది. మూసీనది అనంతగిరి కొండలలో పుట్టి వజీరాబాద్ వద్ద కృష్ణానదిలో కలుస్తోంది. పాలేరునది నల్గొండ జిల్లాలోని గణపవరం దగ్గర కృష్ణానదిలో కలుస్తోంది. మున్నేరు నది వరంగల్ జిల్లాలో పరకాల దగ్గర కృష్ణానదిలో కలుస్తోంది. మూడు రాష్ట్రాలలో ప్రవహించే ఈ మహానది మూడు రాష్ట్రాల చారిత్రకతకు, ప్రజల నాగరికతా వికాసానికి, సిరిసంపదలకు సాక్షి భూతమై నిలుస్తోంది.

కృష్ణాజలాల ప్రాశస్త్యం

కృష్ణాజలంలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. ముఖ్యంగా ఈ జలానికి తొందరగా జీర్ణింపచేసి ఆకలిపుట్టించే శక్తి వుంది. ఈ నీటికి స్వచ్ఛత, రుచిత్వం, జీవనత్వం, పావనత్వం అనే నాలుగు మంచి లక్షణాలున్నాయనీ ఈ నీరు తాగినవారు ఆరోగ్యవంతులుగా, మంచి వర్చస్సు కలిగి ఉంటారనీ ఆయుర్వేద గ్రంథాలలో రాశారు.

వరాహమిహిరుడు చెప్పినట్లు ఒకేరుచి, ఒకే రంగు, కలిగిన నీరు ఆకాశం వర్షిస్తుంది. అయినా ఆ యా భౌగోళిక విశేష పదార్థాలతో కలసి ఎన్నో రుచులుగా ఎన్నో రంగుల నీరుగా కన్పిస్తుంది. ఉదా॥ గోదావరి నీరు లేత ఆకుపచ్చ రంగులోను, కృష్ణనీరు లేత నీలిరంగులో, గంగనీరు ముదురు గోధుమగింజల రంగులో, యమున నీరు కొంచెం నలుపుగా కన్పిస్తాయి. ఒక్కొక్క నదినీరు ఒక్కొక్క గుణం కలిగి వుంటుంది. అందువలన జల ప్రాశస్త్యాన్ని పరిశీలించి తెలుసుకోవాలి.

భూగర్భంలో మనకి లభించే నీటిలో 98 రకాల ధాతువులు భూమిపై దొరికేనీటిలో 62 రకాల మూల ధాతువులు కలసి కరిగివున్నాయి. అందుకే నదులు ప్రవహించే నేల గల ధాతువుల ఆధారంగా, నీరు రకరకాల రంగులు ఔషధగుణాలు కలిగి వుంటాయి. కృష్ణానదికి, దీని ఉపనదులైన భీమనదికి, తుంగభద్రకు పుష్కరాలున్నాయి. భారతదేశంలోని అతిపెద్ద గంగకు ఉపనదియైన యమునకు, అంతర్వాహిని సరస్వతికి పుష్కరాలున్నాయి. ఇలా

గంగ కృష్ణవేణి ఏదో రూపంలో పన్నెండు పుష్కరాలలో చెరిమూడు కలిగివుండటం ఒక ప్రత్యేకత.

వజ్రాల గని కృష్ణానది

కోహినూర్ రీజెంట్ వజ్రాలు

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కోహినూర్ వజ్రం కృష్ణానదీ తీరంలోనే లభించింది. గుంటూరు జిల్లాలోని పులిచింతల సమీపంలోని కొల్లూరు వద్ద ఈ ప్రాంతంలో ఒకరైతు చేను దున్నుతుండగా భూమిలో ఒక సూటిగా కోణాలు కలిగిన రాయి కనిపించింది. అది మామూలు రాళ్లకంటే ఎంతో బరువుగా ఉంది. మెరుస్తోంది. ఆ రాయి విలువైనదయి వుంటుందనే ఉద్దేశ్యంతో ఆ రైతు దానిని గోల్కొండకు తీసుకువెళ్లాడు. వజ్రాల వ్యాపారి ఒకరు దానిని కొన్నాడు. అయితే ఆ విషయం రహస్యంగా వుండక గోల్కొండలోని ఇతర వజ్రాల వ్యాపారస్తులకు తెలిసిపోయింది. వారంతా ఆ వజ్రం దొరికిన ప్రాంతానికి వెళ్లి అన్వేషణ ప్రారంభించారు. రైతుకు తొలుత లభించిన వజ్రం 25 క్యారెట్లు బరువైనది. ఆ తర్వాత త్రవ్వకాలలో మరింత బరువైన వజ్రాలు లభించాయి. ఎక్కువభాగం 10 నుండి 40 కేరట్ల బరువున్నవి. ఒక వజ్రం మాత్రం 900 కేరట్ల బరువైనది దొరికింది. దీనిని మీర్‌జుమ్లా ఔరంగ్‌జేబ్‌కు బహూకరించాడు. దీనినే మహమ్మదీయులు కొల్లూరు వజ్రంగా పిలిచేవారు. అదే క్రమంగా కొహినూర్ వజ్రంగా పేరుగాంచినది. కొహినూర్ వజ్రం నాదిర్‌షాకు చేరి అక్కడినుండి బ్రిటిష్ వారి వశమైంది.

> “ కృష్ణాజలంలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. ముఖ్యంగా ఈ జలానికి తొందరగా జీర్ణింపచేసి ఆకలిపుట్టించే శక్తి వుంది. ఈ నీటికి స్వచ్ఛత, రుచిత్వం, జీవనత్వం, పావనత్వం అనే నాలుగు మంచి లక్షణాలున్నాయనీ ఈ నీరు తాగినవారు ఆరోగ్యవంతులుగా, మంచి వర్చస్సు కలిగి ఉంటారనీ ఆయుర్వేద గ్రంథాలలో రాశారు. ”

కొహినూర్ తరువాత మరొక అతి విలువైన పిట్ లేదా రీజెంట్ వజ్రం కూడా కృష్ణాతీరంలోనే దొరికింది. కొండపల్లి సర్కారుని బ్రిటీష్ వారికి అప్పగించినప్పటికీ జగ్గయ్యపేట సమీపంలోని పరిటాల గ్రామం వద్ద వజ్రాలు దొరికే ప్రదేశాలను నిజాం తన అధీనంలో ఉంచుకున్నాడు. గనిలోని పనిచేస్తున్న ఒక కార్మికుడు కాలికి గాయం చేసుకొని ఆ గాయంలో ఈ వజ్రాన్ని దాచి కట్టు కట్టుకొని బయటకు తెచ్చాడు. ఆ తర్వాత అది క్రమక్రమంగా చేతులు మారి అప్పటి మద్రాస్ గవర్నర్ అయిన పిట్స్ వద్దకు చేరింది. ఇది ఏ విధంగా పిట్ వద్దకు ప్రయాణించింది పూర్తి వివరాలు తెలియవు. పిట్స్ ఆ వజ్రాన్ని ఐరోపాకు తీసుకువెళ్లాడు. ఆ తరువాత దీనిని ఆర్లియన్స్‌కు చెందిన రీజెంట్ కొన్నాడు. ఆయన పేరుతోనే ఈ వజ్రాలు రిజెంట్ వజ్రంగా పిలవబడుతున్నది. ప్రస్తుతం ఈ వజ్రం ఫ్రెంచి రాజాభరణాలలో ఉంది. ●

తీర్థయాత్రలు - వాటి స్వరూపం

డా॥ శలాక రఘునాథశర్మ

పండ్లలో శ్రేష్ఠమైన యాపిల్ ఏదో ఒక ప్రదేశంలోనే పండుతుంది. ఎంతో విలువైన కుంకుమపువ్వు అపురూపంగా ఎక్కడో ఒక్కచోట మాత్రమే లభిస్తుంది. అది ఆ మట్టికున్న ప్రత్యేకత. ఒక నదిలోని నీటికి రోగాలను పోగొట్టే లక్షణం ఉంటుంది. ఒక నదీజలానికి అమృతప్రాయమైన రుచి ఉంటుంది. ఒక నది నీరు ప్రవహించిన పొలంలో రాజనాలు పెద్దయెత్తున దిగుబడి అవుతాయి. అది ఆయా జలాలకున్న ప్రత్యేకత. ఒక కొండ గృహారామాదుల నిర్మాణానికి కావలసిన బలిష్ఠమైన రాళ్ళను సమకూరుస్తుంది. ఒక్కో పర్వతం వందలకొలది నీటిబుగ్గలతో సస్యలక్ష్మిని తాండవింపచేస్తూ ఉంటుంది. ఒక్కొక్క పర్వతం మీద వింత వింత రుచులుగల ఫలాలు వేలకొలది సంఖ్యలో పండుతాయి. అది ఆయా పర్వతాల ప్రత్యేకత. ఈ విధంగా సాక్షాత్తుగా కానవచ్చే ప్రత్యేకతలను గమనించి మానవుడు ఫలితాలను అనుభవిస్తూనే ఉన్నాడు. పైకి కానరాకుండ ప్రత్యేకతలు గలిగిన స్థలాలు జలాలూ కూడ లేకపోలేదు. ఒక ప్రాంతంలో పుట్టిన కుందేళ్ళు వేటకుక్కలపై విజృంభించి తరిమికొట్టటం చూచి ఒక మహానుభావుడు అచట మహాసామ్రాజ్య కేంద్రస్థానాన్ని నిర్మించాడని మనం వింటున్నాం. ఈ విధంగా భౌతికకారణాలను చెప్పజాలని ఒక ప్రత్యేకత – ముఖ్యంగా పవిత్రత – ఉన్న ప్రదేశాన్ని క్షేత్రమనీ, నదులను, సముద్రప్రాంతాలను తీర్థములనీ వ్యవహరిస్తూ ఉంటాము. ఈ క్షేత్రాలు తీర్థాలు కొన్ని ప్రత్యేక సమయాలలో మానవులు సేవించే పుణ్యస్థలాలుగా ప్రసిద్ధి పొందుతాయి.

అయితే తీర్థాలకు క్షేత్రాలకు నిజంగా మహిమ ఉన్నదా? లేక ఇది కేవలం అంధవిశ్వాసమేనా? అని చాలామందికి ఈ రోజులలో ఆశంక కలగటం సహజం. పరిశీలిద్దాం. ఏ వైద్య విధానం

లోనూ ఎన్ని రోజులు కడచినా నయం కాని కొన్ని రోగాలను తీర్థక్షేత్ర సేవలద్వారా మానవులు రూపుమాపు కోవటం చూస్తున్నాం. సంతానం లేదని పరితపించే దంపతులు ఏ తీర్థంలోనో క్షేత్రంలోనో అర్చనలుచేసి సంతాన వంతులు కావటం వింటున్నాం. ఉన్మాదం, మనోవ్యాధి మొదలైనవి తీర్థసేవలవలన అంతరించటం అనుభవసిద్ధమైన విషయం. అయితే అందరికి అలా జరుగుతున్నదా? అంటే ఆధునిక విజ్ఞానశాస్త్రం సమర్పించే అద్భుతప్రక్రియలు మాత్రం అందరికీ ఒకేవిధంగా ఫలితాలని స్తున్నాయా? ఇంజెక్షన్ తీసుకున్న వాళ్లందరికీ రోగాలు నయమవుతు న్నాయా? కాబట్టి కొంతమందికి ఫలితం లభించనంత మాత్రాన అసలు ఆ ప్రత్యేకత లేదన టం తర్కసమ్మతం కాదు.

భక్తశిఖామణి ప్రహ్లాదుడు తిరుగులేని సత్యాన్ని నొక్కి వక్కాణించాడు. "ఇందు కలడందు లేదని..." అనుభవానికి రావటం అంత సులభం కాదు, రాకపోవటం అపేక్షణీయం కాదు. ఈ విషయాన్ని జాగ్రత్తగా గమనించిన మహానుభావులు వీలయినంత ఎక్కువ పరిధిలో భగవంతుణ్ణి దర్శించ టానికి అనేకమార్గాలు కల్పించారు. అందులో భాగాలే అడుగడుగునా కానవచ్చే దేవాలయాలు, ఏదో ఒక నెపంతో అర్చనలందుకొనే వృక్షాలు, పక్షులు, పశువులు, పాములు, క్షేత్రాలు, తీర్థాలు మొదలైనవి. పెద్దలు ఒకమాట అంటారు – దైవం, గురువు, వైద్యుడూ, తీర్థం మొదలైనవాని విషయంలో మన భావన ఏ ప్రమాణంలో ఉంటుం దో సిద్ధి ఆ ప్రమాణంలో ఉంటుందని. కాబట్టి భారతీయులు చాలమంది తీర్థాదులలో దైవత్వాన్ని దర్శించి సేవిస్తూ ఉంటారు. వారి వారి ప్రమాణ బుద్ధి ననుసరించి ఫలితాలనుపొందుతూ ఉంటారు.

ఈ రోజులలో సాధనసంపత్తి చాలా వృద్ధి పొందింది. కాబట్టి తీర్థాదులు జనసామాన్యానికి బాగా అందుబాటులోనికి వచ్చాయి. ఒకప్పుడు ఎంతో శ్రమపడి ఎన్నో క్రోసుల దూరం కాలినడక సాగించి, నిద్రాహారాలకు కూడ నోచుకోక, మార్గంలో సంభవించే దొంగలభయం, క్రూరమృ గాల భయం మొదలైన వానిని ఎదుర్కొంటూ తీర్థయాత్రలు చేసేవారు. అయినా పట్టుదలా, ఉత్సాహం సడలనిచ్చేవారు కాదు. ఈ రోజులలో కూడా అంతప్రమాణంలో కాకపోయినా, శ్రమ లేదనటానికి లేదు. అప్పుడు దేహశ్రమ అధికమైతే ఇప్పుడు ధనార్జనశ్రమ ఎక్కువగా ఉంటున్నది. మొత్తానికి ఆనాడైనా ఈనాడైనా ఏదోశ్రమలేకుండా తీర్థయాత్రలు చేయటం సాధ్యం కావటంలేదు. ఇంత శ్రమను మానవుడు ఇష్టపూర్వకంగా స్వీకరించి తీర్థయాత్రలు చేస్తున్నాడంటే అతడు సాధారణమైన లౌకిక భోగభాగ్యాదులవలన పొందలేని తృప్తి అక్కడ పొందుతున్నాడని స్పష్టమ వుతున్నది. ఈ అలౌకిక తృప్తి అతని హృదయంలో క్రమంగా సత్ప్రవృత్తినీ, వైరాగ్యాన్నీ కలిగించి మెల్లమెల్లగా పరమపదమార్గం చూపుతుందనటం సత్యదూరం కాదు.

తీర్థయాత్రలు సాధారణంగా రెండు విధాలుగా చేస్తారు. ఎవరికివారు కావలసిన వస్తుసామగ్రిని సమకూర్చుకొని తన భార్యాపుత్రులతో బయలు

దేరటం ఒకపద్ధతి. ఒకడు సంకల్పించి పదిమందితో చెప్పి వారిలో ఉత్సాహాన్ని రేకెత్తించి ఒక సముదాయంగా బయలుదేరటం రెండోపద్ధతి. ఈ రెండోపద్ధతి మొదటిదానికంటె చాల మేలైనదన టంలో సందేహం లేదు. ఎందుకంటే ఇటువంటి ప్రయాణాలలో ఒకరి సాయం ఒకరికి ఎంతో అవసరం. 'కలిసి ఉంటే కలదు సుఖం' అనికదా పెద్దలమాట. ఇక్కడ అనుకోవలసిన మరో ముఖ్యాంశం కూడా ఉంది. దురదృష్టవశాత్తు ఈ రోజులలో మనిషికీ మనిషికీ, అనేక అల్పాల్ప కారణాలవలన, దూరం పెరుగుతున్నది. కులాల పేరిటనో, ఆర్థిక అసమానతల వలననో, అధికారం ప్రాపకం మొదలైన వాని వలననో మానవ హృదయాలలో వైషమ్యాలు పెరిగిపోతున్నాయి. తీర్థయాత్రల వంటివి వీనిని కొంతవరకు అరికట్టి, మానవుల హృదయాలలో ప్రేమాదరాలను కలిగించటానికి దోహదం చేయగలవనటంలో సందేహంలేదు. ఉదాహరణకు ఒక గ్రామంలో ఉండే వ్యక్తులు కొంతమంది కూడ బలుకుకొని యాత్ర చేస్తున్నారంటే వారంతా తప్పనిసరిగా ఐకమత్యంతో ఉండాలి. సంరక్షణకుగానీ, యాత్ర సుఖంగా సాగటానికి గానీ, అసమర్థులకు సమర్థులతోడ్పాటు లభించటానికి గానీ ఈ ఐకమత్యం ఎంతో అవసరం. సాముదాయకంగా వచ్చే కష్టాలు, శ్రమలు మనస్సును అంతగా వేధించవు. అందరూ కలిసి మెలిసి భోజనాదికాలు చేస్తూ వుండటంవల్ల హృదయాలలో పొరపొచ్చాలు అంతరించి పోవటానికి అవకాశం ఏర్పడుతుంది. యాత్రలనుండి తిరిగి వచ్చిన తర్వాత కూడా నెమరుకు వస్తున్న ఆ సుఖానుభవాలు, వింత వింత సంఘటనలు ఎదలలో మంచితనాన్ని పదిలపరచి తుచ్ఛకారణాలవలన ఏర్పడిన అసూయాద్వేషాలను అంతరింపజేస్తాయి.

అంతేకాదు ఒకచోటి ప్రజలు మరో ప్రదేశానికి యాత్రలకు వెళ్లినపుడు ఎన్నో భిన్న భిన్న ప్రాంతాల వారు కలుస్తూ ఉంటారు. ఆ కలయికలో జాతీయ సమైక్యతాభావాన్ని అనుసంధించు కోవటానికి కూడా అవకాశమేర్పడుతుంది. ఆయా ప్రాంతాల ఆచారవ్యవహారాలు తెలుసు కోగలుగుతాం. ఆ విధంగా లోకజ్ఞానం అలవడుతుంది. ఇటువంటి ప్రయోజనాలెన్నో తీర్థయాత్రల వలన మానవ సమాజం పొందవచ్చు.

సాధారణంగా వైద్యులు ఆరోగ్యం చక్కబడటానికి స్థలం మార్పును కూడ సూచిస్తూ ఉంటారు. తీర్థాలు, క్షేత్రాలు, ముఖ్యంగా నదీపరిసరాలు, సుప్రసిద్ధ దేవాలయాలు గల పర్వతప్రాంతాలు నిర్మలమైన వాతావరణంలో అలరారుతూ ఉంటాయి. అవి యాత్రికుల ఆధివ్యాధులను పారద్రోలటానికి మంచి అవకాశా న్నిస్తాయి. ప్రసన్నంగా ప్రవహించే చల్లని జలాలు, పట్టుపరుపుల మెత్తదనాన్ని తలపించే యిసుక తిన్నెలు, మైమరపించే చల్లని పిల్లగాలులూ, ఎటువైపుచూచినా హృదయాలను ఆకర్షించే రమణీయ ప్రకృతిదృశ్యాలు ఇటు దేహానికీ అటు మనస్సుకూ కూడా ఉల్లాసాన్ని కలిగిస్తుంటే, అంతకంటె ఆరోగ్యలక్ష్మికి వేరే నివాసస్థానం ఏమి ఉంటుంది? ఆవిధంగా కూడా తీర్థయాత్రలు మానవులకు అవశ్యకాల వుతున్నాయి. అటువంటి పరమానం దం వెల్లివిరిసే తావులలో పవిత్రత

"ఈ రోజులలో మనిషికీ మనిషికీ మధ్య చిన్న చిన్న కారణాల వలన దూరం పెరుగుతోంది. కులాల పేరిటనో, ఆర్థిక అసమానతల వలననో, అధికారం ప్రాపకం వలననో వైషమ్యాలు పెరుగుతున్నాయి. తీర్థయాత్రలవంటివి వీటిని కొంతవరకు అరికట్టి, మానవుల హృదయాలలో ప్రేమాదరాలను కలిగించటానికి దోహదం చేస్తాయి"

ఉంటుందనటం సత్యదూరం కాదు. పవిత్రత పరమాత్మలక్షణమని మనమంతా అంగీకరించే విషయమే. పవిత్రతనూ, ఆనందాన్నీ అభిలషించటం మానవనైజం. ఆ దృష్టితో తీర్థస్థలాలు భగవన్నివాసాలనీ, తత్సేవ భగవత్సేవ అనీ, దానివలన అలౌకికానందం కలుగుతుందనీ భావించటం ఎంతైనా సముచితం.

మరొక విశేషం. తీర్థస్థలాల నాశ్రయించుకొని దరిద్ర నారాయణు లనేకులు ఉంటారు. అట్టి స్థలాలలో చేసే దానాది కర్మలు అనంత పుణ్యాన్ని స్తాయని మనవారి విశ్వాసం. తదనుగుణంగా యాత్రికులు తమకు ఉన్నంతలో దానధర్మాలు చేస్తూ ఉంటారు. దానివలన పుణ్యం లభించటం మాట అటుంచి ఆకలితో అలమటించే, అంగ వైకల్యంతో క్రుంగిపోయే దీనజనావళికి ఇంత భుక్తి లభిస్తుంది. "సర్వే జనాః సుఖినోభవన్తు" అనే భారతీయుల పరమలక్ష్యానికి ఈ విధంగా తీర్థయాత్రలు కొంతకు కొంత దోహదం చేస్తున్నాయి.

తీర్థయాత్రలు మన సంప్రదాయంలో అనాదిగా వస్తున్న విషయాలు. శ్రీరామచంద్రుడు అరణ్యవాసం చేసినపుడు అనేక తీర్థాలు, క్షేత్రాలు దర్శించినట్లుగా రామాయణం వక్కాణిస్తున్నది. భారతంలో ధర్మరాజు, బలరాముడు, అర్జునుడు తీర్థసేవ చేసినట్లు విస్తృతంగా వర్ణింపబడి ఉంది. తీర్థ విశేషాలనూ, తీర్థయాత్రామహిమనూ భారతగ్రంథంలో పరమోదాత్తంగా వర్ణించారు.

పుణ్యం పురుషార్థం అన్నట్లు తీర్థయాత్రలు మానవులకు హృదయసంస్కారాన్నీ, తోడి మానవులపట్ల సోదరభావాన్నీ, ధర్మానురక్తినీ కలిగిస్తాయనటంలో మరో అభిప్రాయానికి తావు లేదు.

పంద్రెండు సంవత్సరాల కొకమారు ఒక్కొక్క నదికి పుష్కరపుణ్యకాలం వస్తుంది. ఆ సమయంలో ముక్కోటి దేవతలు ఆ నదికి సన్నిహితంగా ఉంటారని మనవారి విశ్వాసం. కృష్ణానది తెలుగు దేశపు నడిగడ్డమీద ప్రవహిస్తూ భుక్తికీ, రక్తికీ, ముక్తికీ దోహదం చేస్తున్నది. ఆ తీర్థంలో ఆ పవిత్ర సమయంలో పవిత్రహృదయంతో స్నానమాడి, సూక్ష్మంలో మోక్షమన్నట్లు తరిద్దాం.

"ఒకచోటి ప్రజలు మరోచోటికి వెళ్లినపుడు విభిన్న ప్రాంతాలవారు కలుస్తూ ఉంటారు. ఆ కలయికలో జాతీయ సమైక్యతాభావాన్ని అనుసంధించుకోవటానికి అవకాశమేర్పడుతుంది. ఆ ప్రాంతాల ఆచారవ్యవహారాలు తెలుసుకోగలుగుతాం. ఆ విధంగా లోకజ్ఞానం అలవడుతుంది. ఇటువంటి ప్రయోజనాలెన్నో తీర్థయాత్రలవల్ల కలుగుతాయి"

మన నదులు – మన సంస్కృతి

చెలుకుపల్లి జమదగ్నిశర్మ

దేశం మనకు తల్లి. దేశమాత అని అంటాం. దేశంలో ప్రవహించే నదులూ మనకు తల్లులే! అవి దేశమాత మెడలో ముత్యాల దండలు, చేతులకు మురుగులు, భుజాలకు బాహుపురులు కాళ్ళకు కడియాలు. దేశాన్ని దివ్యమంగళ విగ్రహమైన తల్లిగా చూడగలగాలే కాని నదులు ఆమెకు సర్వాలంకారాలూ కాగలవు. హిమవత్పర్వత మణికిరీటంతో దివ్యవాహినీ ముక్తాహారాలతో వింధ్యశ్రేణీకాంచీకలాపంతో దక్షిణ వేలామృదుపద పీఠంతో మన భారతదేశమాత భావుకుల కళ్ళల్లో మెదలుతూ ఈ ఇహంలో బ్రదుకంతా ఆమె అనుగ్రహం వల్లనే సాగుతోందనీ, ఆ తల్లి ఒడిలోనే ఆమె పోషణలోనే మన మందరమూ ఉంటున్నామనీ, ఆసేతుశీతాచలం ఏ మూల ఉన్నవారైనా అందరమూ ఆమె బిడ్డలమే అనీ తియ్యని వెలుగులవంటి ఊహాలు తోచి పారవశ్యాన్ని కలిగిస్తాయి.

మన నదులూ మనకు తల్లులే! ఒక్కొక్క నది తన్ను ఆశ్రయించిన జనులను ఒక్కొక్కరకంగా తీర్చిదిద్దుతూ ఉంటుంది. అందుచేతనే నదీ నాగరకతలేర్పడ్డాయని చారిత్రకులు చెప్తూ ఉంటారు. ఓల్గా నాగరకత, నైలునదీనాగరకత, గంగానాగరకత దేనికదే విశిష్టమైనది. మన పూర్వులు యావద్భారతీయైక్యభావాన్ని నదుల మూలంగానే దృఢపరుచుకున్నారు. పైగా అవాంతరసృష్టి ఎప్పుడూ నీళ్ళతోనే ప్రారంభ మవుతుంది. 'అప ఏవ ససర్జాదౌ' (మొదట నీళ్ళనే సృజించెను) అను శ్రుతి వినిపిస్తోంది. భూమి అంతా జలమయమై, ఏకార్ణవమైపోగా వటపత్ర శాయియైన బాలముకుందుడు పెరిగి పెరిగి శ్రీమన్నారాయణుడు కాగా ఆయన నాభి కమలమునుండి చతుర్ముఖ బ్రహ్మ పుట్టి పునస్సృష్టి చేస్తూ ఉంటాడు. 'ఆపో వా ఇదగ్ం సర్వః' అనే శ్రుతి ఆపోమాహాత్మ్యాన్ని సర్వోత్కృష్టంగా వర్ణిస్తోంది. అట్టి నీళ్ళ నుండి భూమి బయటపడి జీవకోటి నిలవడానికి ఆధారమవుతోంది. ఆ జలము జీవమయమే! అసలు జీవనమంటేనే నీళ్ళు. ఆ నీళ్ళు లేకపోతే బ్రతుకే లేదు. అన్నం లేకపోయినా ఉండవచ్చుగాని నీళ్ళు లేకుండా జీవులు బ్రతకలేరు.

గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి ।
నర్మదే సిన్ధు కావేరి జలే-స్మిన్ సన్నిధిం కురు ॥

నిత్యదేవతార్చనలో పూజకై తీసుకున్న జలాన్ని పవిత్రం చేసేందుకు ఆస్తిక భారతీయులు ఈ శ్లోకాన్ని పఠిస్తూ ఉంటారు. "ఓ గంగా! ఓ యమునా! ఓ గోదావరీ! ఓ సరస్వతీ! ఓ నర్మదా! ఓ సింధూ! ఓ కావేరీ! మీలో ప్రతి ఒక్కరూ వచ్చి ఈ నీళ్ళల్లో సన్నిహితులై ఉండండి". ఆ మహానుభావుడెవరో గాని ఒలే చక్కని ప్రార్థన చేశాడు. ఎప్పుడు మొదలుపెట్టాడో యేమో ఇప్పటికీ ఆ ప్రార్థనే చేస్తున్నాము. ఇక ముందూ చేస్తారు. అన్ని పేర్లూ శ్లోకంలో పట్టక కొన్నింటినే పేర్కొన్నాడుగాని ఆ మహర్షి హృదయంలో అన్ని నదులూ ఉన్నాయి. ఎక్కడ పుట్టిన వాడైనా భారతీయుడే ఆర్యుడే పూజ్యుడే అన్న నిత్య

సత్య వైశాల్యమూ ఉన్నది. ఈ శ్లోకం చదువుతూ పులకిత తనులయ్యే పుణ్యాత్ములకు యావద్భారతమూ ఒకే ఒక దేశమన్న అఖండైక్యభావం మాత్రమే కాక ఆయా నదుల పోషణలో ఉన్న సర్వ జీవకోటియందూ సోదరభావమే కలుగుతుంది.

అన్ని నదులూ పవిత్రాలే అయినా గంగ మరీ పవిత్రమైంది. అది విష్ణుపదసంభవ. శివశిర స్సంస్థిత, విష్ణుపద మంటే ఆకాశం. శివశిరస్సంటే హిమగిరి శృంగమైన కైలాస శిఖరం. అన్ని కొండల శిఖరాలూ శివశిరస్సులే! అన్ని నదులూ ఆకాశంలో పుట్టినవే! పర్వత శిఖరాల మీదికి దూకి లోపల్లోపల ఘోషపెట్టి, ఎలాగో సందు చేసుకుని బయటపడి, సన్నకాలువ సాగి వేరు వేరు పాయలు చేరి మహాప్రవాహాలై సముద్రాన్ని చేరుకువేవే! అందుచేత అన్నీ గంగలే! అన్నీ సాగరవత్నులే! సంప్రదాయ విదులు నీటి కెప్పుడూ గంగ అనేవ్యవహరిస్తారు. ''అమ్మా! కాస్త గంగ ఇప్పించమ్మా'' అని అడుగుతారు. మంచి తీర్థమిమ్మంటారు. గంగా శబ్దమూ తీర్థ శబ్దమూ పావిత్ర్యవాచకాలు. గంగా! గంగా! అని ఎన్నో ఆమడల దూరంలో ఉండి ఆ తల్లిని స్మరిస్తేనే చాలునట. ఆ చల్లని తల్లి మహాఘోర పాపపరితాపాన్ని గూడా చల్లార్చి వేస్తుందట! మరి ఆమె ఉత్తమగతిలేక అల్లాడుతున్న సగరపుత్రులరవై వేలమందినీ స్వర్గానికంపించిన కరుణామయి కదా! ఆమె చేయలేనిదేముంటుంది? భక్తుని భక్తివిశేషాన్ని బట్టి ఆమె సాన్నిధ్యాన్ని పొందే సర్వతీర్థాలూ అంతటి మాహాత్మ్యమూ కలవే అవుతాయి. మనం మనసారా గంగను స్మరించి మన బావి నీళ్లే పోసుకున్నా శాస్త్రం ప్రకారం గంగా స్నానపుణ్యాన్ని పొందితీరుతాము. పొందామా లేదా అని నిశ్చయించుకోడానికి మన చిత్తశుద్ధియే నిదర్శనం.

మానవజీవనం భావనామయమైంది. 'యద్భావం తద్భవతి' అనడం వినలేదా? మనమెలా భావిస్తే అలాగే అవుతుంది. నదుల పేర గిరులు గీసి ధరణిని ముక్కలు ముక్కలుగా భావిస్తే ప్రతిదాన్నీ స్వార్థంతో ముక్కలుచేసి పంచుకునే రాక్షసులమే అవుతాము. అలాకాక ఈ నదులు గిరుల శిరస్సులలో పుట్టి ఉన్నచోట నిలువలేక "వివేక భ్రష్టానాం భవతి వినిపాతశ్శతవిధః" అని భర్తృహరి మహాకవి గంగంతటి పరమపవిత్ర నదీమతల్లి నుద్దేశించే అన్నట్లు క్రిందికి జారిపోయి సముద్రంలో కలసిపోయేవే కాబట్టి వాటివల్ల వ్యక్తిత్వాలను పొందిన జనులు ఆ వ్యక్తిత్వాలన్నీ వేర్పాటుతనానికి కాక అన్ని విభిన్న వ్యక్తిత్వాల సమాహారరూపమైన జాతీయ వ్యక్తిత్వానికి దోహదం చెయ్యడానికే అని తెలుసుకుని విశాలహృదయాలతో అఖండభావన చేస్తే దితికి వ్యతిరేక రూపమైన అదితి సంతానం ఆదిత్యులమే అవుతాము. అంటే దేవతలమే అవుతామన్న మాట! మన ఆంధ్ర భూభాగంలో గోదావరీ, కృష్ణా, తుంగభద్రా, పెన్నా, మంజీరాది నదీవిభేదాలెన్నో ఉన్నాయి. ఎక్కడికక్కడ ఎన్నెన్నో వైవిధ్యాలున్నాయి. అవన్నీ కలిసే ఆంధ్రజాతీయత సమగ్రమవుతోంది. ఆంధ్రాది విభిన్నజాతీయతలన్నీ చేరి భారతజాతీయత సమగ్రమవుతోంది. సమగ్రజాతీయతలో ఏ విభిన్నజాతీయత

లోపించినా ఆ మేరకది అసమగ్రమే. ఇట్టి భావన భారతీయుల నందరినీ పరిపూర్ణుల నొనర్చడానికి దోహదకారి అవుతుంది.

బాగా ఆలోచిస్తే పరమార్థమూ చక్కగా బోధపడుతుంది. ఏదో వ్యవహారం జరిగిపోతోంది గదా అని ఆలోచించంగాని స్థిమితంగా కూర్చుని ఆలోచిస్తే తెలియకపోయే రహస్య మీసృష్టిలోనే లేదు. హిందూమహాసముద్రం, బంగాళాఖాతం, పసిఫిక్ మహాసముద్రం, అట్లాంటిక్ మహాసముద్ర మంటూ వేరు వేరు పేర్లు చెప్తున్నాంగాని సముద్రాలు పరస్పర సంబంధం లేనివి అనేకం లేనే లేవనీ, ఉన్నదొక్కటే మహాసముద్రమనీ అందరికీ తెలుసు. అదే పరమాత్మస్వరూపం.

నన్నయ్యగారు ఒకచోట సముద్రాన్ని వర్ణిస్తూ "శశ్వదుదవాన మహావ్రత శీత పీడితాచల ముని సౌఖ్యహేతు విలసద్బడబాగ్ని శిఖాచయంబులన్ వెలిగెడు దాని" అని వర్ణించారు. ఎల్లప్పుడూ నీళ్లల్లో ఉండాలన్న మహావ్రతం పట్టి చలిచే పీడింప బడుతున్నా అచలులైయున్న మునులకు సౌఖ్యాన్ని కలిగిస్తున్న బడబాగ్ని శిఖలతో వెలుగుతున్న సముద్రమట. అట్టి మహావ్రతాన్ని ఆ మునులు పట్టారంటే దానివల్ల వారు పొందదలచిన పరమసుఖ మెటువంటిదో! దానినుండి వేరై ఉన్నవారు దాని రుచి సహించలేరు.

పరమాత్మ సముద్రంవంటి వాడయితే జీవులు నదులవంటి వారు. నదులు భూమిమీద ప్రవహిస్తున్నంతసేపే నామరూపాలు కలిగి ఉంటాయి. ఇది కృష్ణ, ఇది గోదావరి అని మనమెంతో అభిమానంతో పిలుచుకుని గౌరవిస్తున్న కృష్ణా గోదావర్యాది నదులన్నీ సముద్రంలో పడి కలిసి పోయాక నామరూపాలు కోల్పోయి అంతా సముద్రమే అయిపోతున్నది. అంతకుముందు స్వాదుజలాలతో రుచిగా ఉండి అందటిచేతా విడివిడిగా పిలువబడుతున్న ఆ నదులు ప్రత్యేకమైన పేర్లులేకుండా సముద్రమైపోయి మాధుర్యాన్ని కోల్పోయి తాగటాని కుపయోగ పడకుండా పోతున్నాయి. ఎక్కడెక్కడ పుట్టిన నదులూ ఎన్నెన్ని వంకలు తిరిగినా, ఎక్కడెక్కడ మజిలీలుచేసినా, ఏ యే ప్రతిబంధకా లెదుర్కున్నా దగ్గరలోనో దూరంలోనో సముద్రాన్నే చేరుకుని అందులో కలిసిపోతున్నాయి. అసలు ఆ నదులు ఎలా పుట్టాయని విచారిస్తే ఆ సముద్రంలో నుంచే వచ్చాయని విస్పష్టమవుతుంది. అంతేకదా! సూర్యుని తీక్ష్ణకిరణాలవల్ల సముద్రజలం ఆవిరి అయి అది చల్లబడి మేఘాలు ఏర్పడి అని వర్షిస్తే కొండశిఖరాల మీదినుండి కాలువలు సాగి వాగులయి మహానదులయి సముద్రాన్ని చేరుకుం టున్నాయి. సరిగ్గా జీవుల సంగతీ అంతే! పరమాత్మ స్వస్వరూపానందంలో ఉండిపోతే జీవోత్పత్తియే ఉండేదికాదు. స్వశక్తియైన మహామాయా ప్రభావంతో తనకు తనే బహురూపధారణ చేసి అనేక విభిన్నజీవులుగా వ్యవహరిస్తున్నాడు. జీవభావం స్వస్వరూపస్థితికంటె అన్యమేదో ఆనందమన్న అజ్ఞానం వల్లనే కలుగుతోంది. శరీరం ధరించి భార్యాపుత్రులను పొంది బ్రతకడ మానందమను కునే వాడే జీవుడు.

జీవితాలననుభవించి వీటిలో ఆనందం లేదని అనుభవంవల్ల తెలిసికొని వైరాగ్యం పెంపొందించుకుని స్వస్వరూ పావస్థానమే పరమసుఖమని యాథార్థ్యాన్ని గ్రహించి అజ్ఞాన నిర్మూలనానికి శాస్త్రచోదిత మార్గాలలో నిర్విరామ సాధన చేసి చేసి అనుభవ పూర్వకంగా స్వాత్మజ్ఞానాన్ని పొందినవాడు పరమాత్మైక్యాన్ని పొంది ముక్తుడన బడుతున్నాడు. నదులు నామరూపాలు కోల్పోతున్నట్లే ముక్తజీవులూ నామరూప విరహితులవుతారు. వారికి మళ్లీ జన్మలుండవు.

ఈ పరమార్థాన్ని ఎవ్వరూ కాదనడానికి వీల్లేదు. అందుచేత ఇహజీవితాన్ని గురించి ఎందుకు కృషి చేయాలని అనుకుంటే మాత్రం అంతకంటె మూర్ఖత మరొకటి ఉండదు. మన సంస్కృతి బాగా తెలిసినవారు ఎంత వైరాగ్యవంతులో అంత కర్తవ్యనిష్ఠులై ఉంటారు. వారికి బ్రతుకులన్నీ వట్టి నాటకాలని తెలిసినా నాటకాలు కాబట్టే మరింత జాగరూకులవై ఉండాలని ధరించిన వేషంతో ఎన్నడూ తాదాత్మ్యం చెందక పాత్రగతసుఖదుఃఖాదులు నటున కేమాత్రమూ పట్టనట్లే బ్రదుకుతూ ప్రతిజీవితాన్నీ ఆనందమయ కేళిగా వినోదిస్తూ తమ బ్రదుకువల్ల అందరికీ ఆనందాన్ని కలిగిస్తూనే మళ్లీ వేషం వెయ్యవలసిన గతి నతిక్రమించి ఉపసంహరింపబడి పరమాత్మతో ఏకమైపోతారు.

నదులు మనకీ పరమార్థాన్ని బోధిస్తున్నాయి. మమ్మల్ని చూచి మా జీవితాల మిథ్యాత్వాన్ని గ్రహించండంటున్నాయి. నిరంతరం ప్రవహించడం తప్ప నదికి వ్యక్తిత్వమేమున్నది? ఇది నది అని మనచేత చూపబడే జలబిందువు మనం చూపే సమయానికి బారెడుముందుకు సాగిపోయి వెనకెక్కడో ఉన్న బిందువు మన వేలున్నచోటికి వచ్చి ఉంటుంది. అదిమాత్రమక్కడ ఉంటుందా? తరుముకుని వస్తున్న జలబిందువుల త్రోపిడికి నిలువలేక కదిలిపోతూ ఉంటుంది. ఆ నదివంటిదే ఈ విశ్వమంతా! ఇది నిత్యనిరంతర గమనశీలమైంది కాబట్టే జగత్తు. సంసరణశీలమైంది కాబట్టే సంసారం! అనిత్యం! అందులో సందేహం లేదు. అయినా అనిత్యమైన ఈ జగత్తూ శరీరమూ కూడా నిత్యమైన పరమార్థాన్ని అందించడానికే ఉద్దేశింపబడ్డాయి. ఉత్తమమైన మనుష్యశరీరం లభిస్తేనేగాని ఏ జీవుడూ సాధనచేయలేడు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన, అన్నట్లు ఐహికప్రయోజనాలే సాధన లేనిదే సమకూడవు. పరమార్థానికి మరింత సాధన కావాలి. మంచి శరీరం లభించినా జగత్తు లేకపోతే సాధనకు రంగస్థలమే లేదు. జగత్తు ఉండి మంచి శరీరం లేకపోయినా ప్రయోజనం లేదు. "జంతూనాం నరజన్మ దుర్లభ"మని శ్రీ శంకరు లన్నట్లు మనమందరమూ పూర్వ పుణ్యవిశేషంవల్ల దుర్లభమైన నరజన్మను పొందిన ధన్యులము. నారాయణుల మవడానికి యోగ్యులము. మన జీవితాలను మన సంస్కృతి కనుగుణంగా మలచుకుని పరమార్థ సాధకులమై ఈ జన్మకు కాకపోయినా మరికొన్ని జన్మలకయినా తరింపగలుగుతామని ఆశిద్దాము.

నదులు - ధార్మిక భావన

డి.ఆర్. ఆచార్య

పరిచయం

మనదేశంలో ఎన్నో మహానదులు ఇంకెన్నో ఉపనదులు ప్రవహిస్తున్నాయి. మనదేశంలో లాగానే ఇతర దేశాల్లో కూడ ఎన్నో నదులు ప్రవహిస్తున్నాయి. కానీ మన నదులకు ఇతర దేశాల్లో నదులకు తాత్త్వికంగానే ఎంతో తేడా వుంది. అక్కడ సమాజం ఆ నదులను కేవలం జల కేంద్రాలుగా, తమ జీవనానికి ఉపయోగించే జలాశ్రయాలుగా చూడడమే జరుగుతుంది. కానీ మనకో! వేదకాలం నుంచి జలాలు మనకు దేవతలు. హిమవత్పర్వత శిఖరాగ్రంనుంచి పొంగి పొర్లి మహోత్సాహంతో ఉరకలు వేస్తూ ప్రవహించే భాగీరథి దగ్గరనుంచి కుగ్రామం ప్రక్కగా సన్నగా పారుతున్న చిన్న నదివరకు మనమొక పవిత్ర భావాన్ని తరతరాలుగా పెంపొందించు కున్నాం. వాటిని నదీమతల్లులని ఎంతో గౌరవంగా మన తల్లులతో సమానంగా పూజిస్తున్నాం. నిజమే! మనలోమాట. ఈ దేశంలో మధురాతి మధురజల ప్రవాహాలతో సంవత్సరం మొత్తం ప్రవహించే జీవనదులు లేకపోతే మనజాతి ఏమౌతుందో ఊహించండి. ఎలా ఊహించగలం? జలం లేకపోతే ప్రాణికోటికి ఈ గడ్డమీద జీవనమే లేదు. అందుకే 'జీవనం' అనే పదానికి 'జలం' అనికూడా అర్థం ఏర్పడింది. కాబట్టే నదుల్లేకపోతే మన సామాన్యజీవనం కూడా గడవదని స్పష్టంగా తేలింది.

అందరికి కనబడే ఈ బాహ్యప్రయోజనాల కంటే నదులవల్ల అనాదినుంచి మనజాతి పొందుతున్న స్ఫూర్తి అపారమైంది. నదులు మనకందిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక సందేశం అద్వితీయమైంది. మనం ఈనాటికీ సమాజంలో ఇలాంటి ధార్మిక జీవనాన్ని సాగిస్తున్నామంటే అందులో నదులపాత్ర మహోత్కృష్టమైంది. నదులు మనకు తెలియకుండా సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తున్నాయి.

నదీస్వరూపం

మానవుని శరీరంలో కొన్ని ప్రదేశాలు ఎలా పవిత్రమైనవిగా చెప్పబడతాయో అలాగే ఈ భూమాత శరీరంలో కొన్ని ప్రదేశాలు పుణ్యతమమైనవిగా పేర్కొనబడ్డాయి. దానికి కారణం భూమియొక్క, దానిమీద ప్రవహిస్తున్న నదుల యొక్క, తద్గతమైన తేజస్సుయొక్క, అద్భుతమైన ప్రభావం తపస్సంపన్నులైన మహామునులు ఆ ప్రదేశాలలో నివసించి ఆ నదులను పరిగ్రహించడం. ఈ విషయం పద్మపురాణంలో ఇలా చెప్పబడింది.

యథా శరీరస్యోద్దేశాః కేచిన్మేధ్యతమాః స్మృతాః ।
తథా పృథివ్యా ఉద్దేశాః కేచిత్పుణ్యతమాః స్మృతాః ॥

ప్రభావాదద్భుతాద్భూమేః సలిలస్య చ తేజసా ।
పరిగ్రహామునానాం చ తీరానాం పుణ్యతా ముతా ॥

ఋగ్వేదంలోను, తైత్తిరీయ సంహితలోను, అధర్వణవేదంలోను, సాంఖ్యాయన బ్రాహ్మణం లోను ఎన్నోచోట్ల సామాన్యంగా జలప్రశంస విశేషంగా ఆయా నదీప్రశంస కూడ చేయబడింది. ఋగ్వేదంలో పదవ మండలంలో ఇంద్రుడు దేవతలకోసం, మానవులకోసం తొంభై తొమ్మిది నదులను సంపాదించినట్లు పేర్కొనబడింది. అదే పదవ మండలంలో సరస్వతి, సరయు, సింధు అనే ముఖ్యమైన మూడునదుల ప్రస్తావం ఉంది. గంగ, యమున, సరస్వతి మొదలైన ఎన్నో నదుల ప్రస్తావం అక్కడే మనకు కనబడుతుంది.

భౌగోళికంగా చూస్తే ఒక్కొక్క పర్వత పంక్తిలో నుంచి ఒక్కొక్క నది ఉద్భవించినట్లుగా మనం తెలుసుకొంటున్నాం. మనదేశంలో నదులు, తీర్థాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఇదివరకే చెప్పినట్లు నదులన్నీ మనకు తల్లుల్లాంటివి. తల్లి ఎలా పిల్లలను పెంచి పెద్దచేసి వారికి జీవనోపాధిని కల్పిస్తుందో నదికూడా తన తీరంలో ఉన్న ప్రజలకు తాగటానికి తియ్యటి నీళ్ళను ఇవ్వటమే కాకుండా అనేక పంటలనుంచి తినటానికి ఆహారాన్ని ఇస్తోంది. అందుకనే పరమపవిత్రమైన ఈ మహానదుల సంస్మరణం కూడా పుణ్యాన్ని యివ్వ గలదనే విశ్వాసం మన భారతజాతిలో దృఢపడింది. ప్రతి నిత్యం స్నానం చేసేటప్పుడు ఈ నదులను స్మరిస్తూ తమ స్నానానికి ఉపయోగించే నీళ్ళలో ఈ నదీమ తల్లులను సాన్నిధ్యం చేయండి అని ప్రతి భారతీయుడు ఇలా ప్రార్థిస్తున్నాడు.

గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి ।
నర్మదే సింధు కావేరి జలే-స్మిన్ సన్నిధిం కురు ॥

ఇలా సాధారణ కృత్యాలైన స్నానం, పానం దగ్గరినుంచి పర్వదినాల్లో ఆచరించే అనేక వైదికకర్మల వరకు మన జీవితంలో నదులు ఒక ధార్మికచైతన్యాన్ని కలిగిస్తున్నాయి. మానవుడు చేయదలచిన ప్రతి ఉత్తమ కార్యానికి నదులతో సాక్షాత్తుగానో, పరంపరగానో సంబంధం ఉంది. బ్రతికి ఉన్నంతవరకే కాదు చనిపోయిన తరువాత కూడా ఉత్తమగతులకు చేసే కర్మలన్నీ నదీ తీరాల్లోనే జరుగుతాయి. చివరకు అస్థినిమజ్జనం కూడా గంగ మొదలైన పవిత్ర నదుల్లో జరగడం మనమందరం గమనించదగిన విషయం. మొత్తం మీద వీటన్నింటిని పరిశీలిస్తే మానవుడు పుట్టిన దగ్గరనుంచి చనిపోయేవరకు తరువాత కూడా ధార్మికభావన పెంపొందడానికి పవిత్రత చేకూర్చ డానికి నదీస్వరూపం ఎంతగానో ఉపయోగ పడుతుంది. చూడండి! ఇలాంటి సత్సంప్రదాయాన్ని భారతీయులమైన మనకు అందించిన ఆర్షసంస్కృతి ఎంత ఉదాత్తమైందో.

నదీసందేశం

నదులు కేవలం మనకు స్నాన, పాన, ఆహారాది ప్రయోజనాలను సిద్ధింప చేయడానికి, ధార్మిక చైతన్యాన్ని మనజాతికి కలిగించడమేనా లేక యింకేదైనా సందేశాన్ని మనకందిస్తున్నాయా? అని ప్రశాంతంగా ఆలోచిస్తే ఒక మహత్తరమైన సందేశం ఈ నదుల మనుగడద్వారా మనకు లభిస్తోందని తోస్తుంది. ఏమిటా సందేశం?

మహోత్తుంగశిఖరాలనుంచి పుట్టి భూమిపైన ఎన్నో పవిత్రారణ్యాలలో ప్రవహించి అక్కడక్కడా సంక్రమించిన గుణాలను దోషాలను తమలో కలుపుకొని ఎంతో దూరం ప్రయాణం చేసి చివరకు

తమ భర్త అయిన సముద్రుడిలో చేరిపోతున్నాయి ఈ నదీవధూటులు. పుట్టినచోట చాలా చిన్నవిగా ఉన్నా కాలక్రమేణా బాగా పెరిగి తిరిగి సముద్రంలో చేరుతున్నాయి. అందుకనే అంటారు "నదీనాం సాగరో గతిః" అని. జీవులు కూడా భగవదంశగానే పుట్టి, పెరిగి, ఎన్నో గుణదోషాలను సంక్రమింప చేసుకొని ఎన్నో జన్మల సుదీర్ఘ ప్రయాణం చేసి చిట్టచివరికి ఆ పరమాత్మనే చేరుతున్నారు. నదులకిలా ఒక ప్రదేశాన్నిబట్టి నామరూప భేదముందో జీవులకూ అంతే. నదులెలా పుట్టిన దగ్గరనుంచి తమ స్వామి అయిన సముద్రుణ్ణి చేరాలని తహతహలాడుతూ త్వరత్వరగా పరిగెత్తుతుంటాయో, జీవులుకూడా ఆనందస్వరూపుడైన భగవంతుణ్ణి చేరాలని తహతహలాడుతుంటారు. 'కాబట్టి ఎన్నో పేర్లతో ఎన్నోచోట్ల చిత్రవిచిత్రాలుగా మేము ప్రవహిస్తున్నా జలమనే పేరుతో చివరకు ఒకటిగా ఎలా సముద్రాన్ని చేరుతున్నామో అలాగే విభిన్నమైన వేషభాషలు, సంస్కృతులు, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు కలిగి ఉన్న మీరు ఒకేజాతి అనే భావాన్ని బహువిధాలుగా పెంచుకొని పురుషోత్తముని చేరండి' అంటున్నాయి.

మేమెలా శాశ్వతంగా ఒకచోట ఉండక బాగా పెరిగినట్లే కనబడి ఉన్నట్టుండి ఎన్నో మిట్టపల్లాల్లో పడి తగ్గిపోతున్నప్పటికీ ఈ జీవనం అనిత్యమని భావిస్తూ, సమాజసేవను వదలకుండా సముద్రంలో లీనమవుతామో, మీరుకూడా అలాగే మధ్యలో వచ్చిన ఒడుదుడుకులను లెక్కచేయకుండా జీవితం అనిత్యమని మరచిపోకుండా పరమాత్మ సాన్నిధ్యాన్ని చేరడానికి ప్రయత్నించండి' అని చెప్పకచెప్తున్నాయి.

ధార్మిక ప్రవృత్తి

మానవజాతిలో ధార్మికప్రవృత్తి కలగడానికి ఈ నదులెంతో సహకరిస్తున్నాయి. అనేక పర్వదినాల్లో నదీస్నానాలు చేయడం, కొన్ని కోర్కెలు సిద్ధించడానికి నదులకు మొక్కడం, కొన్ని రకాలైన శారీరక, మానసిక రుగ్మతలను పోగొట్టుకోవడానికి పవిత్రమైన నదీజలాలలో అవగాహనం చేయడం నదీతీరాల్లో ఉన్న పుణ్యక్షేత్రాలను. అక్కడ ఉండే విశేషాలను సందర్శించి ప్రభావితులై భక్తిభావాన్ని పెంపొందించుకోవడం ఇవన్నీ ఇలాంటి ఇంకెన్నో నదులవల్లనే మనకు కలుగుతున్నాయి. కన్యాకుమారిలో ఉన్న భారతీయుడు గంగాస్నానం కోసం ఇతర పవిత్ర నదీస్నానాలకోసం ఎక్కడో ఉత్తర భారతదేశానికి వెళ్ళడం, అలాగే కాశ్మీరంలో ఉన్న భారతీయుడు దక్షిణభారతంలో ఉన్న గోదావరి, కృష్ణా, కావేరి మొదలగు మహానదుల్లో స్నానంచేసి, రామేశ్వరంలో సేతుస్నానం చేయడం ఇలాంటి తీర్థయాత్రల మధ్యలో ఎన్నో పుణ్యక్షేత్రాలను, దివ్యస్థలాలను, పీఠాలను, మఠాలను, మహాపురుషులను సందర్శించి సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా వైజ్ఞానికంగా మాత్రమేగాక ధార్మికంగా కూడా నూతన చైతన్యాన్ని సంపాదించుకొంటున్నారు. చూడండి! నదులవల్ల మనకు తెలియకుండానే మన జీవితాలు ఎంత ప్రభావనంపన్నాలవుతున్నాయో, ఇలాంటి భావనను పెంచుకొని, జీవితాన్ని సార్థకం చేసుకొంటూ పరమార్థాన్ని సంపాదించుకొంటున్న భారతజాతిలో పుట్టడం నిజంగా మన అందరి అదృష్ట విశేషం.

మనదేశంలో నదులు, తీర్థాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఇదివరకే చెప్పినట్లు నదులన్నీ మనకు తల్లుల్లాంటివి. తల్లి ఎలా పిల్లలను పెంచి పెద్దచేసి వారికి జీవనోపాధిని కల్పిస్తుందో నది కూడా తన తీరంలో ఉన్న ప్రజలకు తాగటానికి తియ్యటి నీళ్ళను ఇవ్వటమే కాకుండా అనేక పంటలనుంచి తినటానికి ఆహారాన్ని ఇస్తోంది.

ఇతిహాస పురాణాలు పేర్కొన్న నదులు

మురళి - దుర్గ

ప్రపంచ దేశాలలో నదులు అక్కడి ప్రజలకు కేవలం భౌతిక జీవనాధారాలుగా పరిగణింపబడు తున్నాయి. కాని భారతదేశంలో అవి సాంస్కృతిక, ధార్మిక జీవనానికి ఆధారాలుగా పరిగణింపబడు తున్నాయి. భారతీయులు మన నదీనదాల మూలోత్పత్తులను, వాని వెనుకగల అధిదైవిక శక్తులను గుర్తించి పరంపరాగతంగా పరమ పవిత్రాలుగాను, తీర్థక్షేత్రాలుగాను, ముక్తిసాధనాలు గాను ఆరాధిస్తూ వచ్చారు.

"గంగే చ యమునే కృష్ణే గోదావరి సరస్వతి
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు"

అంటూ స్నాన సమయంలో అనే నదులను నిత్యం స్మరిస్తారు. మన ధర్మంలో దైవచింతన, ఆధ్యాత్మికత, దేశ చింతన, సమాజ చింతన, అఖండ జాతీయతా దృష్టి అన్నీ పెనవేసుకుని వున్నాయి. పూర్ణయాత్ర అంటే ఆధ్యాత్మిక దృష్టి, యావద్దేశసందర్శనమే కదా! నిత్యం అన్ని నదులను స్మరించుకోవాలంటే అర్థం దేశం మొత్తాన్ని అందులోని అణువణువును అందులోని దైవీశక్తి సంపదను స్మరించుకోవాలనే కదా!

ఇక గంగ, నర్మద, సరస్వతి, యమున గోదావరి, కృష్ణవేణీ, కావేరి, తామ్రవర్ణి పుష్కర వాహిని, తుంగభద్ర, సింధు, ప్రణీత నదులుమాత్రం పుష్కరనదులుగా చెప్పబడ్డాయి. ఇంకా ఎన్నో పుణ్యనదులు వేదాలలోనే కాక రామాయణ మహాభారతాది పురాణేతిహాసాలలో ప్రస్తావించ బడ్డాయి. ఆ యా నదుల మాహాత్మ్యాలు ప్రశస్తి ఎన్నో విధాలుగ వివరింపబడింది. అందలి కొన్ని అంశాలు ప్రస్తుతం స్మరించుకుందాం.

గంగ : విష్ణు పాదాలనుండి జనించింది. హిమవంతుని పెద్దకుమార్తెయై దేవతల ప్రార్థనతో దివికి వెళ్ళింది. భగీరథుడు తపస్సు చేసి దివినుండి భువికి తీసుకొని వచ్చాడు. భువినుండి పాతాళ లోకంలోనున్న సగరుల భస్మరాసులపై ప్రవహింప

చేస్తాడు. పితరులు ముక్తిని పొందుతారు. అందుకే సాధారణంగా అస్థులను గంగలో కలిపే ఆచారం వచ్చి ఉండవచ్చు. భగీరథుడు ఆ నదీ జలంతోటే తర్పణాలు విడిచారు. అని విశ్వామిత్రుడు గంగను గూర్చి రామలక్ష్మణులతో చెపుతారు.

సీతారామలక్ష్మణులు గంగానదిని దాటి వనంలో ప్రవేశించే సందర్భంలో సీత సురక్షితంగ వనవాసం ముగింప చేయమని గంగకు మ్రొక్కింది. చిత్రకూటపర్వతం వద్ద రాముడు సీతతో మందాకిని గురించి వివరిస్తాడు. ఇందులో

జంతువులన్నీ పరస్పర వైరాలు లేక గుంపులు గుంపులుగా స్నానం చేస్తాయి. ఇంకా రామాయణంలో పలుచోట్ల ఈ నదీ ప్రస్తావన ఉన్నది.

భారతంలో అనుశాసనపర్వంలో భీష్ముడు ధర్మరాజుకి గంగామహాత్మ్యాన్ని వివరిస్తాడు. గరుత్మంతుని చూచి సర్పాలు పరిగెత్తినట్లు గంగలో స్నానం చేస్తే పాపాలు పారిపోతాయి. ఔషధాల్లో తులసికెంత ప్రాధాన్యతుందో నదులలో గంగకంత ప్రాధాన్యత ఉన్నది. గంగానదిని స్మరించిన, స్పృశించిన, దర్శించిన ఏడుతరాల పితృవర్గీయులు తరిస్తారు. సమస్త వ్యాధులు నశిస్తాయి. ధర్మనిలయాలైన తపోవనాలు ఈ నదీతీరాన కోకొల్లలు.

యమున : రాముడు వనవాససమయంలో భరద్వాజాశ్రమంలో విశ్రాంతి తీసుకున్నాడు. తరువాత చిత్రకూట పర్వతం వద్దకు వెళుతూ మధ్యలో గంగాయమునల సంగమాన్ని చూచాడు. యమునాతీరం నుండి తెప్ప సాయంతో యమునా నదిని దాటారు. అక్కడ సీతాదేవి యమునానదికి తమ వనవాసాన్ని శుభప్రదంగ ముగింపచేయమని ప్రార్థించింది. పట్టాభిషేకానంతరం మద్యదానం, గోదానం నీపేర చేయిస్తానని మొక్కింది.

యమునానది ఒడ్డునే మాంధాత జన్మస్థలం ఉన్నది. గంగాయమునల సంగమంలో వేదాలు అధ్యయనం చేయబడ్డాయి. యజ్ఞాలు అనుష్ఠింపబడ్డాయి. 60 కోట్లు పుణ్యతీర్థాలు ఈ సంగమంలో కలసిఉంటాయి. ఇందులో స్నానం చేసినవారు రాజసూయ అశ్వమేధ యజ్ఞాఫలాన్ని పొందుతారు. సత్యవాదు లౌతారు. చతుర్వేద పఠన ఫలాన్ని పొందుతారని భారతంలో ప్రశంసించబడింది.

సరస్వతి : ఇది బ్రహ్మసరస్సునుండి పుట్టింది. దేవతలచే గంగానదివలె ఋషులచే ఈ నది సేవింపబడింది. బలరాముడు భారతయుద్ధంలో కౌరవపాండవుల పక్షం వహించక సరస్వతీ తీర్థయాత్రకు వెళ్ళాడు. ఆ సందర్భంలో భారతంలో సారస్వతోపాఖ్యానమనే పేరుతో అనేకవిధాల వర్ణించబడింది. ఈ నదీతీర ప్రదేశాలన్నీ వేదఘోషలతో ప్రతిధ్వనిస్తాయి. ఇది సప్తసారస్వత మని ఏడు విధాలుగ చెప్పబడింది. దీనిలో వందల కొలది తీర్థాలున్నాయి. ప్రతి తీర్థానికి ఏదోఒక ప్రత్యేకత వుంది. చంద్రుడు యీ నీటమునిగి రాజయక్ష్మ వ్యాధిని పోగొట్టుకున్నాడు. విశ్వా మిత్రుడు ఇక్కడ తపస్సు చేసి బ్రహ్మర్షి అయినాడు. ఇంద్రుడు బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టుకున్నాడు. వరుణుడు జలాధిపత్యాన్ని, కుబేరుడు ధనాధిపత్యాన్ని ఈ నదీ సేవనం వలన పొందారు. శుక్రాచార్యుడు ఈ నదీతీరానగల ఔశనస తీర్థంలో తపస్సు చేసి శుక్రనీతిని రచించాడు. ఈ తీరంలోగల నూతిలో నిరాధారుడైన త్రితుడు సంకల్పబలంతో యజ్ఞాన్ని నిర్వహించి దేవతలను సంతృప్తిపరచి సోమపానం గావించాడు.

ఈ నదీతీరంలో ఉన్న రావిచెట్టుపై కుమారస్వామి నివసించియున్నాడు. బలరాముడు అనేక దానాలు చేస్తూ ఆ తీర్థాలను సేవించాడు. దానం అంటె పరార్థ చింతన. త్యాగం, పరమార్థచింతనే

కదా! భక్తిగాని, సద్గుణాలుగాని యీ నదితో పోలనేరవు.

గంగ యమున సరస్వతుల సంగమాన్నే త్రివేణీ సంగమమంటారు. ఈ తీర్థసేవనం వలన నూరు యాగాల ఫలితాన్ని పొందుతారు. దేవతలు, యోగులు, సిద్ధసాధ్యులు, నాగేంద్రులు సంతోషంతో ఈ తీర్థంలో నివసిస్తారని భారతంలో చెప్పబడింది.

కావేరి : అగస్త్యుని తపస్సువలన విష్ణుమాయయొక్క ఒక అంశ విదర్భరాజుకు లోపాముద్రగా జనించింది. రెండవ అంశ కావేరీరాజునకు కుమార్తెగా జన్మించింది. ఈమెయే కావేరీనదియై తండ్రిని పవిత్రుని చేసింది. ఇందులో స్నానంచేసిన అశ్వమేధ యాగఫలాన్ని పొందుతారని భారతంలో చెప్పబడింది.

గోదావరి : దీనిని దక్షిణగంగ అంటారు. సీతారామలక్ష్మణులు ఈ నదీతీరంలో కల పంచవటిలో నివసించారు. లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులను యిక్కడనే కోసాడు. అదియే నాసికాతీర్థంగా ప్రసిద్ధి కెక్కింది. దశరథ మరణవార్త విన్న రాముడు ఈ నదిలోనే సుస్నాతుడైనాడు. ఆత్మీయుల మరణవార్త విన్న పిదప చక్కగా స్నానం చేయడం హిందువుల ఆచారమే కదా! గోహత్యా నివారణకు శివుని గౌతముడు ప్రార్థించాడు. శివుని జటనొకదానిని తెచ్చి పిండగా ఆ జలంచేత గోవు జీవిస్తుంది. గోవును ఇచ్చింది కనుక గోదావరి అయింది. గౌతము నిచే తేబడింది కనుక గౌతమి అయింది. శివుని జటనుండి గంగలో భాగం ప్రవహించింది కనుక దక్షిణగంగ అయింది. రామాయణ కథాంశంలో భాగమయింది గోదావరి.

నిస్సంతువులు స్నానం చేస్తే సంతానవంతుల వుతారు. ఈ నదీస్నానంవల్ల కుష్ఠు, రక్తపోటు, అజీర్ణ వ్యాధులు హరిస్తాయి. అరణ్యవాస సమయంలో ధర్మరాజు గోదావరిని సేవించాడు.

నర్మద : ఇది మహాభారతంలో ప్రస్తావించబడింది. రేవ, నర్మద రెండు ఒకటేనని అమరంలో ఉంది. నర్మద ఋక్ష్యపర్వతం నుండి, రేవ వింధ్య పర్వతమునుండి జన్మించుటవల్ల వేరు వేరు నదులని అంటారు. ఇది రుద్రుని శిరంనుండి ఉద్భవించింది కావున అయోనిజ, రుద్రకన్య అని పిలువబడు తున్నవి. ఈ నదీతీరంలోనే ఉపపాండవులు

సంహరింపబడ్డారు. ఆత్మనిగ్రహం కలవారు ఈ నదిలో స్నానంచేస్తే 100 తరాల పూర్వీకులు పవిత్రులవుతారని భారతంలో ఉంది.

సరయు : మానససరోవరాన జనించి గంగలో కలిసింది. ఈ నదీజలం పాలు, వెన్న, తేనెలతో పోల్చబడింది. జరాసంధ వధానంతరం భీముడు ఈ నదిని దాటుతాడు. విశ్వామిత్రుడు రామలక్ష్మణులచే ఈ నదికి నమస్కరింప చేస్తాడు. ఇందే రామలక్ష్మణులు తమ అవతారాలు చాలించారు.

తమసా నదీతీరాన వాల్మీకికి రామాయణ రచనకు ప్రేరణ కలిగింది. రాముడు విశ్వామిత్రుని వలన తమసానదీతీరంలోనే బల - అతిబల విద్యలను పొందుతాడు. మొదటి రోజులో ఈ నదీజలంలో ఉపవసించి వనవాసం ఆరంభిస్తాడు. వేదశ్రుతి, గోమతి, స్యందిక నదులను కూడ దాటుతారు, భరతుడు తాతగారి రాజ్యంనుండి అయోధ్యకు వచ్చేమార్గంలో సుదామ, హ్లాదినీ, శతద్రు మొ॥ అనేక నదులు వచ్చాయి. అగస్త్యుని అనుమతితో సుగ్రీవుడు తామ్రపర్ణీనదిని దాటాడు. భీష్మపర్వంలో వందకు పైగా నదుల ప్రస్తావన ఉన్నది.

ఈ విధంగా రామాయణ భారతాలలో అనేక నదులు స్మరింపబడ్డాయి. కృష్ణవేణి భారతంలో మాత్రమే స్పృశించబడ్డది.

ఈ పవిత్ర నదీనదాల ప్రశస్తి మన ఆధ్యాత్మిక సంపదకు మూలభూతం. తీర్థయాత్రల వలన సమాజంలో ప్రతివారు తమకు చేతనయినంత లోకజ్ఞానాన్ని పొందడానికి అవకాశముంది. ఈ పవిత్ర భావాల స్మరణ ద్వారా ప్రతివాడి భావాలు సంస్కరించబడతాయి. అధర్మంగా ప్రవర్తించడానికి కొంత జంకు ఏర్పడుతుంది. రాజు తాను స్వయంగా తీర్థసేవ ఆచరించి ప్రజలకు మార్గదర్శి అయినాడు తనచే పాలింపబడే రాజ్యానికి సరైన న్యాయం చేకూర్చగలుగుతాడు. రాముడు మానవుడు, రాజు, సంపూర్ణ మానవత్వమనేది ఆ జీవితంలో కనిపిస్తుంది. ఆ యా సందర్భాలలో రాముడు తన విధులను సామాన్యునివలె నదులవద్ద నిర్వర్తించాడు. అట్లే అర్జునుడు బలరాముడు మున్నగువారు యాత్రలద్వారా సమాజాన్ని దర్శించి జాతీయ అవగాహన పెంపొందించుకున్నారు. భారతంలో ధర్మపక్షపరులైన ప్రతివారు ఆధ్యాత్మిక జీవితాన్ని పూర్తిగా కొనసాగించకపోయినా కొంతకాలమైన తప్పనిసరిగ దాన్ని ఆచరించి భావసంస్కారాన్ని పొందారు.

ఈ కృష్ణాపుష్కర సమయంలో మన పవిత్ర నదులను వాని ననుసరించి ఉన్న పవిత్ర దేశధర్మభావనలను సంస్మరించుకుంటూ భావస్నాతులమవుదాం. కలి యుగంలో స్మరణే కదా! ముక్తి.

మన దేశంలో జీవనదులు

డా॥ ప్రసాదరాయ కులపతి

జీవనది అనగానే సామాన్యంగా అన్ని ఋతువులలోనూ నీటితో ప్రవహిస్తూ, ఎట్టి పరిస్థితిలోనూ పూర్తిగా ఎండిపోకుండా ఉండేది అని నిర్వచిస్తారు. భారతదేశంలో ఇటువంటి జీవనదులు చాలా ఉన్నాయి. వేదాలలో పురాణాలలో వీటి వర్ణనలు అద్భుతంగా చేయ బడ్డాయి. వీటిలో గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, భీమరథి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, సింధు, ప్రణీతా అనే పన్నెండు, సుప్రసిద్ధమైన జీవనదులు. మేషం మొ॥ పన్నెండు రాసుల్లో వరుసగా గురువు సంచరించే సమయమే ఈ పన్నెండు నదులకు పుష్కరకాలం.

ఈ పన్నెండేకాక మరికొన్ని కూడా పుణ్య నదులు చరిత్రప్రసిద్ధమైనవి ఉన్నాయి. వాటి తీరాలలో కూడా మహత్తరక్షేత్రాలు వెలశాయి. అవికూడా పురాణాలలో మహిమాన్వితమైనవిగా వర్ణించబడ్డాయి. ఈ జీవనదుల చరిత్ర క్లుప్తంగా ఇక్కడ ఇవ్వబడుతోంది.

గంగ : భారతదేశం అంతటి లోకి పరమపవిత్రమైన దిగా ఈ నది కీర్తించబడింది. ఇది హిమాలయ పర్వతం మీద 13,800 అడుగుల ఎత్తున గల గంగోత్రి దగ్గర పుట్టింది. పుట్టినచోట దీనికి భాగీరథి అని పేరు. కొంతదూరం పోయినతర్వాత జాహ్నవి, అలకనంద అనే ఉపనదులు వచ్చి కలుస్తాయి. ప్రయాగ దగ్గర యమున, సరస్వతి కలుస్తాయి. బంగాళాఖాతంలో కలిసేముందు కర్ణావళి, గండక, కోసీ, సోన్ నదులు వచ్చి కలుస్తాయి. అయితే సముద్రంలో కలిపే ముందు 250 మైళ్ళ పూర్వం గంగ ఎన్నో ప్రవాహాలుగా విభక్తమై అద్భుతత్రికోణరూపాన్ని ధరిస్తుంది. అది బ్రహ్మపుత్రానదితో కూడా కలుస్తుంది.

గంగానది ఒడ్డున అసంఖ్యాక పుణ్యక్షేత్రాలు న్నాయి. గంగోత్రి, కనఖల, హరిద్వార, ప్రయాగ, కాశి, గంగాసాగర సంగమం మొదలైనవి. కల కత్తాకు దక్షిణంగా 90 మైళ్ళ దూరంలో గంగా సారమనేచోట కపిలాశ్రమం ఉంది. దీనికి గుహ్యక్షేత్రమని కూడా పేరు. ఇలా గంగ ఒడ్డున అడుగడుగునా పుణ్యక్షేత్రాలు, ఆశ్రమాలు వెలశాయి. గంగా జలకణం సోకితే చాలు సర్వ పాపాలు తొలగిపోతాయని పురాణోక్తి.

యమున : ఇదీ హిమవత్పర్వతంలోనే పుట్టింది. మంచు చరియల మధ్య ఇదిపుట్టిన చోటుకు 4 మైళ్ళ తర్వాత జమునోత్రి ఆలయం ఉంది. మామూలుగా యమున ఇక్కడనించి ఉదయించిందని పేరు. ఇందులో యమునాదేవి విగ్రహం ఉంది. ఇక్కడనించి కదలి చిన్న చిన్న శైలప్రవాహాలను కలుపుకుంటూ దాదాపు 80 మైళ్ళు హిమాలయప్రాంతంలో ప్రయాణంచేసి ఖారా దాటి మరో 15 మైళ్ళు వెళ్ళి ఫైజాబాదు దగ్గర పెద్దనది అయింది. ఇక్కడినుంచే ఈ నదికి చాలా కాలువలు తీశారు.

ఇది ఢిల్లీ, బాగ్‌వట్, బృందావన, మధుర, మహావన, ఆగ్రా, ఫిరోజాబాద్, ఇటావా, కల్పి, హమీర్‌పూర్ మొదలైన ప్రసిద్ధప్రదేశాల మీదుగా ప్రయాణం చేసి అలహాబాద్ దగ్గర గంగానదితో కలిసింది.

గంగా యమునల మధ్య ప్రయాగ నుంచి హరిద్వార్‌దాకా ఉన్న ప్రదేశానికి బ్రహ్మావర్తమని, కుశస్థలి అనీ, అంతర్వేది అనీ పేర్లు.

యమున కళిందశిఖరం నించి ఉదయించటం చేత దానికి కళిందకన్య లేక కాళింది అని కూడా పేరు. వ్యాసుడు యమునలోని చిన్నద్వీపంలోనే పుట్టాడు. శ్రీకృష్ణుని జననం, విహారం యమునతో సన్నిహితమైనవి. పాశ్చాత్యులు టాలమీ, ప్లినీ, అరియన్ ఈ నదిని ఎంతగానో వర్ణించారు. దీనిని కూడా భారతీయులు ఎంతో పవిత్రంగా భావిస్తారు.

సరస్వతి : ఋగ్వేదంలో ఇది పర్వతంనించి పుట్టి సముద్రంలో కలిసేదాకా వేగంగా ప్రయాణం చేస్తున్నట్లు వర్ణించబడింది. ఇప్పుడిది పైకి కనపడదు. హిమాలయాలలో ప్లక్షప్రస్రవణం దీని జన్మస్థానం. ఇది అదృశ్యమై ఇసుకలో అణగిపోయిన చోటుకు వినాశనమని పేరు. ఈ రెంటి మధ్యస్థలం యజ్ఞోచితమైన పవిత్రప్రదేశమని ప్రసిద్ధి. ప్లక్షప్రస్రవణం హిమాలయాలలో శివాలికప్రాంతపు సిరిమూర్ కొండలలో ఉంది. ప్లక్షం ఒకచెట్టు. ఆ చెట్టుమొదట సరస్వతీనది పుట్టిందంటారు. అంబాలా జిల్లాలోని ఆద్‌బద్రీ దగ్గర ఇది బయటకు కనబడుతుంది. మరికొన్ని చోట్ల బ్రహ్మ సరస్సునించి లేక బదరికాశ్రం నించి బయల్వెడలినట్లు చెప్పబడింది. హిమాలయాలలో పుట్టి రాజస్థాన్ ఎడారిలో అదృశ్యమై, ఆబూపర్వతం దగ్గర కనిపించి, కచ్ ఎడారిలో మాయమై మళ్ళీ సౌరాష్ట్రలోని గిర్ అడవిలో కనిపించి ప్రభాస దగ్గర పశ్చిమసముద్రంలో కలిసిందని కొన్నిచోట్ల పురాణాలలో కనిపిస్తుంది.

సుప్రసిద్ధమైన కురుక్షేత్రం దీని ఒడ్డునే ఉంది. ప్రయాగలో ఇది గంగా యమునలతో కలిసి త్రివేణీసంగమంగా పేరు చెంది జగత్పూజ్యమైంది.

సింధునది : హిమాలయలలోని టిబెట్ దీని జన్మస్థానం. కైలాసపర్వతానికి ఉత్తరంగా మానస సరోవరానికి దగ్గరగా పుట్టిన ఈ నది 17,000 అడుగుల ఎత్తునుండి ఈశాన్యంగా ప్రవహించి కాశ్మీరులో ప్రవేశించింది. స్కర్దు, అటక్‌ల మీదుగా ప్రయాణం చేసి కరాచీ దగ్గర ఆరేబియన్ సముద్రంలో కలిసింది. దీని మొత్తం పొడవు 1800 మైళ్ళు. మిఠాన్‌కోట దగ్గర పంజాబ్‌లోని 5 నదులు జీలం, చీనాబ్, రావి, బీయాస్, సట్లెజ్ ఈ నదితో కలిశాయి. వేదకాలం నించి ప్రసిద్ధమైనది.

బ్రహ్మపుత్ర : ఈ నది పుట్టింది కూడా మానవ సరోవరం దగ్గరే. ఇది కూడ 1800 మైళ్ళు పొడవుంది. 800 మైళ్ళు టిబెట్‌లోనే ప్రవహించింది. మన దేశంలో ప్రధానంగా అస్సాంలో ప్రవహిస్తున్నది. అస్సామీ భాషలో దీనికి లోహితనది అని

పేరు. ఇది గంగ ఉపనదియైన పద్మానదితో కలిసి బంగ్లాదేశ్‌లోని మేఘనతో మిళితమౌతున్నది. శక్తిపీఠాలలో ప్రసిద్ధమైన కామాఖ్య దీని ఒడ్డునే ఉంది.

సరయూనది : ఇది కుమాయూన్ పర్వతాలలో పుట్టింది. ప్రఖ్యాతమైన అయోధ్య దీని ఒడ్డున ఉంది. రామాయణ, భారత, స్కాంద పురాణాదులలో దీని ప్రస్తావన ఉంది. ఇది కొంతదూరం తర్వాత గోగ్రానదితో కలిసింది. గోగ్ర గంగయొక్క ఉపనది.

శిప్రానది : స్కాందపురాణంలో దీని మహత్వం ఎంతగానో కీర్తించబడింది. ఇది పారియాత్ర పర్వతంలో పుట్టింది. మాళ్వాలో ఉదయించిన తర్వాత ఉజ్జయిని మొదలైన విఖ్యాత ప్రదేశాల మీదుగా వెళ్ళి చంబల్‌నదితో కలిసి చివరకు యమునలో మిళితమయింది. కాళిదాసమహాకవి ఈ నదిని అద్భుతంగా వర్ణించాడు.

సబర్మతి : దీనికి సభ్రమతి, స్వభ్రవతి, చందన అనే నామాంతరాలున్నాయి. మీవార్ కొండలలో దీని పుట్టుక. ఆరావళీ పర్వతాల దగ్గర ఇది వాయవ్యంగా తిరిగి అర్బుదపర్వతం పక్కగా వెళ్ళి కాంబే అఖాతంలో కలిసింది. దీని పొడవు 200 మైళ్ళు. పద్మాది పురాణాలలో దీని ప్రస్తావన ఉంది. అహమ్మదాబాద్ దీని ఒడ్డున ఉంది. ఖడ్గతీర్థం దీని తీరాననే. 88,000 ఋషులు దీని తీరాల్లో తపస్సు చేశారని పురాణోక్తి. కశ్యపునికి శివుడిచ్చిన వరంవల్ల పుట్టింది గనుక దీనికి కాశ్యపీగంగ అని పేరు. ఈ శతాబ్దపు మహర్షి గాంధీమహాత్ముని ఆశ్రమం దీని ఒడ్డున ప్రసిద్ధికెక్కింది.

మహానది : మధ్యప్రదేశ్‌లో రాయపూర్ జిల్లాలోని సికోవాగ్రామం దీని జన్మస్థలం. బ్రహ్మాండ పురాణంలో ఇది పారియాత్ర పర్వతంమీద పుట్టినట్లు చెప్పబడింది. ఇది ఒరిస్సారాష్ట్రంలో ప్రవహించి

బంగాళాఖాతంలో కలుస్తున్నది. దీని పొడవు 533 మైళ్ళు.

నర్మద : భారతదేశంలోని పెద్దనదులలో ఇది ఒకటి. అమరకంటక పర్వతాల మీద పుట్టి 801 మైళ్ళు

ప్రవహించి బ్రోచ్‌దగ్గర కాంబే అఖాతంలో కలుస్తుంది. మత్స్య, పద్మ, కూర్మ, స్కాంద, పురాణాలలో భారతంలో దీని ప్రస్తావన ఉంది. దీనికే రేవానది అనే మరో పేరుంది. నిజానికి రెండు వేరే. రెండూకలిసి ఒకటై ప్రవహిస్తాయి. అమరకోశంలో దీనికి ఇంకా సోమోద్భవ, మేఖలకన్యకా అన్న పేర్లివ్వబడ్డాయి.

గోదావరి : ఈ నది నాసిక్‌కు 20 మైళ్ళదూరంలోని త్ర్యంబక గ్రామానికి చేరువగా ఉన్న బ్రహ్మగిరిలో ఉదయించింది. భారతదేశంలోని గొప్ప నదులలో ఇది ఒకటి. పశ్చిమ సముద్రతీరానికి 50 మైళ్ళ దూరంలో పుట్టినా ఇది తూర్పుగా 900 మైళ్ళు ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నది. గౌతమమహర్షి తపస్సువల్ల పుట్టింది గనుక దీనికి గౌతమీగంగ అని పేరు.

జ్యోతిర్లింగమైన త్ర్యంబకం, రాజమండ్రి, కోటిపల్లి, దక్షారామం, భద్రాచలం మొదలైన ప్రసిద్ధక్షేత్రాలు దీని ఒడ్డున ఉన్నాయి. సముద్రంలో కలిసేముందు ఈ నది ఏడుపాయలుగా చీలుతున్నది. ఈ పాయలకు సప్తర్షుల పేర్లు పెట్టబడ్డాయి. ఒకప్పుడు శాతవాహనుల రాజధాని ప్రతిష్ఠానపురం – పైఠాన్ దీని ఒడ్డుననే ఉంది.

ప్రణీత : సహ్యాపర్వతాలమీద దీని పుట్టుక. దీనికే ప్రాణహిత అన్న పేరుందని గోదావరితో కలుస్తున్నది. గోదావరి 650 మైళ్ళు తూర్పుగా ప్రవహించి ఆగ్నేయదిక్కున ఈ నదిని కలుపు కుంటున్నది.

భీమ : దీనికే భీమరథి అనికూడా పేరు. పడమటి కనుమలలో సహ్యాపర్వత శిఖరంమీద పుట్టి ఆగ్నేయ దిశగా పూనా, షోలాపూర్, బీజపూర్ మొ॥ వాటి మీదుగా ప్రయాణించి రాయచూరుకు కొంచెం ఉత్తరాన కృష్ణానదితో కలుస్తుంది. భీమశంకర జ్యోతిర్లింగం దీని జన్మస్థలం దగ్గరే ఉంది. మత్స్య, బ్రహ్మ, వామన పురాణాలలో, భారతంలో దీని ప్రస్తావన ఉంది.

తుంగభద్ర : పడమటి కనుమలలోని వరాహ పర్వతం మీద గంగామూల అనేచోట తుంగ, భద్ర అనే రెండునదులు దగ్గర దగ్గరగా పుట్టి షిమోగాకు 9 మైళ్ళదూరంలో కుడ్లి అనేచోట కలిసి తుంగభద్ర అనేపేరుతో ప్రవహించి కృష్ణానదిలో కలుస్తుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో ప్రవహించే ఈ నది ఒడ్డుననే చరిత్రప్రసిద్ధమైన విజయనగరం ఉంది. శృంగేరీపీఠం తుంగాతీరాననే. ఇది పురాణ ప్రసిద్ధమైనది.

కృష్ణ : సహ్యాపర్వతాలమీద ఈ నది పుట్టుక. దీనికి కృష్ణవేణి అని మరోపేరు. దీని పొడవు 300 మైళ్ళు. తూర్పుకనుమలలో ప్రవేశించిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఒక వందమైళ్ళు ప్రవహించి సముద్రంలో కలుస్తున్నది. శ్రీశైలం, అమరావతి, నాగార్జునకొండ, విజయవాడ మొదలైన ప్రసిద్ధ క్షేత్రాలు దీని ఒడ్డున ఉన్నాయి.

తపతి : వింధ్యపర్వతంలో దీని పుట్టుక. 450 మైళ్ళు గుజరాత్ మొదలగు ప్రదే శాలలో ప్రవహించి సూరత్ దగ్గర అరేబియా సముద్రంలో కలుస్తుంది. స్కాంద పురాణంలో తాపీమాహాత్మ్యమన్న ఒక ఖండం దీనిపై ప్రత్యేకంగా ఉంది. భారత భాగవ తాది గ్రంథాలలో దీనిని గురించిన వర్ణనలున్నాయి.

కావేరి : పడమటి కనుమలలో కూర్గులోని బ్రహ్మగిరికొండ దీని జన్మస్థానం. దీనికి దక్షిణగంగ అని కూడా పేరు. ఇది కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలలో 475 మైళ్ళు ప్రవహించి బంగాళా ఖాతంలో కలుస్తుంది. 50 పైగా ఉపనదులు దీనిలో కలుస్తున్నాయి. ఆగ్నేయస్కాందపురాణాలలో దీని ప్రశస్తి చెప్పబడింది. పుట్టినచోట కావేరీవిగ్రహం ఉంది. దీనిని భక్తులు పూజిస్తారు. చిదంబరం. శ్రీరంగపట్టణం, తంజావూరు, తిరువాయూరు, కుంభకోణం, తిరుచ్చిరాపల్లి మొ॥ ప్రసిద్ధక్షేత్రాలు దీని ఒడ్డున ఉన్నాయి.

తామ్రపర్ణి : ఇది పడమటికనుమలలో పుట్టి తిరునల్వేలి జిల్లాలోనించి కేప్‌కామరిన్‌లో ప్రవేశిస్తుంది. ఎన్నోచిన్న ఉపనదులు దీనిలో కలుస్తున్నాయి. శివ, కూర్మ, వాయుపురాణాలలో రామాయణ భారతాలలో ఈ నది ప్రస్తావించ బడింది. దక్షిణ జాహ్నవి అని కూడ దీనినంటారు. అగస్త్యపుత్రిగా దీనికి ప్రసిద్ధి.

పవిత్రాలు, పురాణప్రసిద్ధాలైన నదులెన్నో ఇంకా ఉన్నాయి. వినాకినీ, సువర్ణముఖీ, మొదలైనవి. అయితే వీటిలో కొన్ని ఎండాకాలంలో వట్టిపోయి వర్షాకాలంలో మాత్రమే కనిపి స్తుంటాయి. ఏదైతేనేమి! ఈ దేశం అగణ్యమైన పవిత్ర నదులకు స్థానం.

పురాణములలోని నదీమాహాత్మ్యము

ఆచార్య దివాకర్ల వెంకటావధాని

వర్షమును భగవంతుని కరుణరస ప్రవాహము అని వర్ణింపవచ్చును. అదే నదుల రూపమున దేశమునందు ఎల్లెడ ప్రవహించుచు వంటలకు హేతువై ప్రజల జీవనమునకు ఆధారము అగుచున్నది. పలు ప్రాంతములందు పడిన వర్షము ఒకచోట చేరి మొదట చిన్న కాలువగా ఏర్పడి క్రమముగ మహానదిగా రూపొందును. అందుకు పెక్కు ఉపనదులు వచ్చి దానిలో కలియు చుండుటయే కారణము. ఈ విధముగా నదులు విశాలమైన భూభాగములను పవిత్రము చేసి ఆ ప్రాంతములందలి పంటలకు కారణమై దేశమునకు అభ్యుదయమును చేకూర్చుచున్నవి. అవి లౌకికముగను, పారిలౌకికముగను కూడ జనులకు తోడ్పడుచుండును.

భారతదేశమున పెక్కు నదులు కలవు. వానిలో గంగ, యమున, సింధునది, బ్రహ్మపుత్ర, కృష్ణ, గోదావరి, తుంగభద్ర, కావేరి మున్నగు నదులు మిక్కిలి ప్రసిద్ధములు. వీనిలో స్నానము చేయుట వలనను పితృదేవతలకు తర్పణాదులు అర్పించుట వలనను పవిత్రతతోపాటు పుణ్యము కూడ కలుగును అని భారతీయుల అభిప్రాయము. నదులు అనేక పర్వతములమీదను, వనముల యందును ప్రవహించి వచ్చుచుండును. అచ్చటి ఓషధులు వానిలో కలియుట సంభవించును. ఓషధుల ప్రభావము అపరిమితము అయినట్టిది. మనకు కొన్ని ఓషధులను గుర్తించుటయు వానిని తగినవిధమున ఉపయోగించుకొనుటయు తెలియక పోవచ్చును. అయినను వాని ప్రభావము లేకుండపోదు. నదులలో స్నానము చేయునప్పుడు ఆ ఓషధుల ప్రభావముచే మానవుల దేహములకు పవిత్రత్వమును, తేజస్సును, అనామయమును చేకూరును. భారతీయులు అందుచేతనే, నదులను కూడ దేవతాతుల్యములుగ భావింతురు. శ్రాద్ధసమయములందలి పిండములను నదులలో కలిపినచో పితృదేవతలు తృప్తి పొందుదురని వారు భావింతురు. పుష్కర సమయములందు నదులలో స్నానము చేయుట వలన గొప్పపుణ్యము చేకూరును అని తలంచుట అనాది సిద్ధము. బృహస్పతి ఆయా రాశులలో ప్రవేశించునప్పుడు ఆయా నదులకు పుష్కరములు కలుగుచుండును.

నదులు స్త్రీ లింగములనియు సముద్రుడు నదీభర్త అనియు భావించుట కవిసమయము. ఈ విధముగ నదులు పారలౌకిక సౌఖ్యమునకు కూడ తోడ్పడుచుండును.

'నద శబ్దే' అను ధాతువునుండి నదీశబ్దము ఏర్పడినది అనగా నదించునది లేక శబ్దించునది అని అర్థము. వర్షాకాలమున నదులు ఒడ్డులు ఒరసి ప్రవహించు నప్పుడును, పర్వతముల నడుమ ప్రవహించునప్పుడును, ఒక విధమైన శబ్దము ఉప్పతిల్లును. ఆ కారణము చేతనే నదికి ఆ పేరు కలిగియుండును. ఐహికముగను, ఆముష్మిక ముగను, ప్రజలకుపయోగపడు నదులను వేదకాలము నుండియు భారతీయులు స్తుతించుట కలదు. పెక్కు పురాణములలో "నదీమాహాత్మ్య వర్ణనము" కనిపించును. పురాణములందు వర్ణింపబడిన నదులు కొన్ని ఇప్పుడు కన్పించవు; కొన్ని మారుపేరులను దాల్చినవి. భారతాది గ్రంథముల యందు పెక్కు తీర్థవిశేషముల మహిమలు వర్ణింపబడినవి.

ఆనుశాసనికపర్వమున భీష్ముడు ధర్మరాజునకు పుణ్యతీర్థ విశేషములను, గంగానదీ ప్రభావమును వర్ణించి చెప్పి ఉండెను. చంద్రభాగ, వితస్త, ఊర్మిమాలి అనువానియందు ఏడురోజులు ఆహార విరహితుడై ఉండువాడు మునిసమానుడు అగును. మహావనములు చొచ్చి ప్రవహించు కాశ్మీర మండలమునందలి నదుల నీరు సేవించుటవలన స్వర్గము లభించును. పుష్కరము, ప్రభాసము, నైమిశము, ఇంద్రమార్గము, దేవిక, స్వర్గబిందువు అను తీర్థములందు మునిగినచో జనులు అచ్చరలతో కూడ విమానము లందు విహరింతురు. హిరణ్యబిందువు, కుశేశయము అనునవి ఎల్లపాపములను హరించును. గంధమాదనముతో కూడిన ఇంద్రతోయము, కురంగదేశమందలి కరతోయము, మూడురాత్రులు ఉపవసించి స్నానము చేయువారికి అశ్వమేధ ఫలము కలిగించును. కనఖలమునను, గంగాద్వారమునను కుశావర్తమునను బిల్వకమునను సుస్నాతుడైన నరుడు పాపములు తొలగి స్వర్గలోకవిహారము కావించును. భాగీరథీనది కాశీప్రాంతమున ఉత్తరభాగముగా ప్రవహించుచోట, ఆహార విరహితులై ఉండు నరులు ఒక నెలకు దేవతలను దర్శింతురు. విపాశానదీతీరమున నరుడు బ్రహ్మచర్యదీక్షతో మూడుదివసములు ఉండిన జన్మరాహిత్యము పొందును. కౌశికీనదీ తీరమున మౌనముతో ఇరువదిఒక్కదివసములు ఉపవసించు నరుడు పరమగతిని సాధించును. నర్మదలో స్నానము చేసినచో రాజత్వము సిద్ధించును. మానవుడు అరిషడ్వర్గమును దూరము చేసి తీర్థసేవ కావించినచో అధికఫలసిద్ధి పొందును. తపము, అహింస, శమదమములు అనువానితో తీర్థముల సేవించిన అమితమైన శౌచము కలుగును. లభింపని వానిని కోరక, లభించినవాని అందు మమత్వము లేక నిష్కాములై ఉండు పురుషులు పరమపవిత్రులు. వారికి తీర్థములతో పనియే లేదు. కొన్ని తీర్థములు దుర్గమములు, మిగుల

విషమములు అయి ఉండును. అట్టి వానిని మనసులో స్మరించినంత మాత్రమున పాపములు గంగా సేవనమున సిద్ధించుఫలము నియమ ములతో ఒనర్చు యజ్ఞములు. బ్రహ్మచర్యము, తపము, మున్నగు వానివలన కూడ కలుగనేరదు. దేహమున ఇంచుక సోకిన గంగానదీజలములు జనుల కల్మషకోటులను హరించి వారికి స్వర్గలోకా నందము కలిగించును. పాపములు ఎన్ని చేసినను చివరికి గంగలో స్నానము చేసినచో సూర్యుడు ఉదయించునప్పుడు విరియు చీకటివలె నరుల పాపములు పటాపంచలై పోవును. సోమములేని యజ్ఞమును, చంద్రుడులేని రాత్రియు, రవిలేని ఆకాశమును, ఆత్మధర్మములేని ఆశ్రమమును, పుష్పములులేని చెట్టునువలె గంగానదిలేని దేశము హీనత పొందును. గంగానది నీరుత్రాగినచో కలుగు నిర్మలత్వము శతచాంద్రాయణ వ్రతములు చేసినను కలుగజాలదు. అగ్నిలోపడిన దూదివలె, గంగలో స్నానము చేయువారి పాతకములు రూపుమాసిపోవును. శరణములేని జనులకు గంగ పరమశరణము. దేవతలకు అమృతము వలె నరులకు గంగాజలము అపారమహత్త్వము ఆవహించును. గంగానది యందలి ఇసుక తలపై పోసి కొన్నను అందలి మట్టి నొసట పూసికొన్నను గరుడుని చూచిన పాములవలె పాపములు పారిపోవును. గంగయందలి కెరటముల తుంపురులతో గూడిన గాలి సోకినచో ఘోరపాపములు కూడ దూరములయిపోవును. గంగలో స్నానము చేసినవారు వెనుక ఏడుతరములందునుగల పితరులను పవిత్రులను కావింతురు. గంగను చూచినంత మాత్రముననే త్రికరణ జనితపాప సంతతులు తొలగిపోవును. వినినను, కనినను, చేతితో అంటినను గంగ పితృమాతృకులముల అందుగల పితృదేవతలకు ఎల్ల సద్గతి కలిగించును. ఇక స్నానము చేసినచో ఎంత పుణ్యము కలిగించునో వేరుగా చెప్పనవసరము లేదు. “గంగ, గంగ” అని కీర్తించుచు ఇతర నదుల జలములలో మునిగినను జనుల పాపములు పోవునని పెద్దలు చెప్పుదురు. చూచుటకు శక్తి కలిగి ఉండియు, గంగను చూడకుండువాడు పశుసమానుడు, అంధసమానుడు అగును. ఇంద్రాది దేవతలు కూడ గంగను కోరుదురన్నచో, నరులు కోరకుందురా? మరణకాలమున గంగను తలచినచో మోక్షము చేకూరును. గంగను ప్రశంసించిన ఎడల రాజభయము, చోరభయము, పాప భయము, భూతభయము మున్నగు భయములు సర్వమును నశించును. మూడుమార్గముల చని, మూడు లోకములకును పెంపును, సొంపును కలిగించినట్టి నిర్మలమూర్తియగు గంగను ఆశ్రయించువాడు కృతకృత్యుడు అగును. జనులలో రాజును, గ్రహములలో సూర్యుడును వలె నదులలోనికెల్ల గంగ మహత్త్వమున అధికమైనట్టిది. గంగ ఆకాశమువలన, చంద్రునివలన, సూర్యుని వలన, మేరురూపశోభి తుడు అయిన విష్ణువు వలన,

త్రిపురములను జయించిన శివుని శిరము వలన హిమవత్పర్వతమునకు అవతరించినది. పరమ తాత్పర్యముతో నిశ్చలమైన మనస్సుతో మనుజుడు శరణుపొందినచో గంగానది అనన్యలభ్యమైన మహాపదమును ఒసంగును.

స్కాందపురాణము నందలి ఖండములలో కాశీఖండము ఒకటి. అందు కాశియు, అందలి తీర్థములను వర్ణింపబడినవి. మణికర్ణికా తీర్థమున స్నాన, జప, హోమ వేదాధ్యయనములు ఒనర్చిన వాడు మోక్షఫలమును పొందును. భూతభవిష్య ద్వర్తమాన తీర్థములేవియు దానితో సరికావు. మణికర్ణిక యందు స్నానము చేసి తిల, వ్రీహి, యవములతో పితృదేవతలకు తర్పణ మొనరించు నరుడు సర్వయజ్ఞఫలములను పొందును.

కూర్మపురాణమున కురుక్షేత్రయుద్ధమందు బంధువులను చంపితినని దుఃఖించు ధర్మరాజునకు మార్కండేయమహర్షి ప్రయాగ మహిమ తెల్పి అచ్చటికి అరుగుమని ఉపదేశించును.భూమిని కల పుణ్యక్షేత్రములన్నింటిలో ప్రయాగ శ్రమ లేకుండగనే ఫలమొసంగును. ప్రయాగలో నివసించినచో మానవుడెన్ని జన్మలలో చేసిన పాపములైనను తొలగిపోవును. అందు దేవతలు, విష్ణువు, శివుడు, సూర్యుడు, గంగా యమునలను రక్షించుచుందురు. ప్రయాగను స్మరించినంత మాత్రమునకే పాపములు పటాపంచలగును. అచ్చటి నదీసంగమము నందలి మట్టి శరీరదోషము లన్నియు పోగొట్టును. వేయి యోజనముల దూరమున నుండియు నరుడు గంగను స్మరించినచో, దుష్కర్మఫలవిముక్తుడై ఉత్తమపదము గాంచి, ముల్లోకములందును పూజింపబడును. గంగా యమునల సంగమము నందు ప్రయత్న పూర్వకముగ ప్రాణములను వీడు నరుడు వాంఛితార్థములు పొంది, బంగారు విమానమున స్వర్గపురము చేరును. స్వదేశమందైనను, అరణ్యము నందైనను, స్వగృహము నందైనను ప్రయాగను స్మరించుచు ప్రాణములు విడుచువారు బ్రహ్మలోకము చేరుదురు. గంగా, యమునా సంగమమున మృతినొందువాడు ముక్తుడగును. అచ్చట ఎట్టి ధేనువునైన (గోవునైన) ఈశ్వరప్రీతిగా దానము కావించువాడు ఆ గోవు శరీరమునందు రోమములెన్ని ఉండునో అన్ని ఏండ్లు రుద్రలోక నివాసము కావించును.

వరాహపురాణమున రైభ్యుని తీర్థయాత్రా ప్రసంగము కలదు. అతడు గంగకు పోయి ప్రయాగను సేవించి, పిదప గయకు అరిగెను. గయలో ఫల్గుణీనది కలదు. ఆ నదీజలములందు స్నానము చేసి అతడు గదాధరుని కొలిచి పితృపర్వతము చేరెను. అచ్చట కంఠమెత్తి గోత్ర నామములు చెప్పి హస్తములు పైకెత్తి, పితృగణములను పేరు పేరున పిలిచి నిత్యములు నైమిత్తికములు అయిన నియమములు తీర్చి పిండప్రదానము కావించెను. అచ్చట వటవృక్షము క్రింద కాలోచితకృత్యములు ఆచరించి అతడు మట్టమధ్యాహ్నము పిండప్రదానము చేయగా పితృదేవతలు చేతులు చాచి గ్రహించిరట! అచటనున్న ఇతర తీర్థములందు కూడ స్నానము చేసి తపస్సు ఒనరింపగ సనత్కుమారుడు అతనికి ప్రత్యక్షమై అచట పిండప్రదానము చేయుట

వలనను, ఫల్గుణీనది పవిత్ర జలములందు స్నానమాడుట వలనను కలుగు ఫలములను తెలిపెను.

దక్షిణ భారతమున ఉన్న నదులలో గోదావరి మిక్కిలి పెద్దది. నన్నయ్యభట్టు దీనిని 'దక్షిణగంగ' అని ప్రశంసించెను.

కృష్ణానది మహారాష్ట్రమండలము నందలి మహాబలేశ్వరపు కొండలలో పుట్టి మహారాష్ట్ర, మైసూరు, ఆంధ్రరాష్ట్రములలో ప్రవహించి చివరికి బంగాళాఖాతమున కలియును. కృష్ణాసాగర సంగమమున స్నానము చేసినవారికి ఉత్తమగతి కలుగును. శ్రీశైలపర్వతమున కృష్ణానదిని పాతాళగంగ అని అందురు.

పవిత్రములైన నదులందును సరస్సులందును స్నానము చేయుటచే రోగాదులను పోగొట్టుకొన్నవారును, జవ్వనమును పొందినవారును, పవిత్రులైన వారును పలువురు కలరు. ఆధునిక కాలమున ఇట్టి కథలు అన్నియు అతిశయోక్తులుగను, కల్పితములుగను కన్పించును. కాని నదులకును, పుణ్యతీర్థ ములకును అట్టి ప్రభావము కలదనుటకు సందేహించ వలసిన అవసరము లేదు. భారతీయులకు ఈ విశ్వాసము పూర్తిగా కలదు. అందుచేతనే వారు పుణ్య క్షేత్రములను దర్శించి తీర్థసేవ కావించుటకు ఉవ్విళ్లూరుచుందురు. సామాన్య సమయములందే నదీజలములకు అపార ప్రభావము కలదని తెలియుచుండ, పుష్కర సమయములలో వాని ప్రభావము మరింత అధికమై ఉండునని వేరే చెప్పనక్కరలేదు.

నర్మదాస్తుతి

స్నావగాహనమాత్రేణ యా స్వర్గవనితాజనైః ।
నహ నర్మగిరాం దాత్రీ భజే తాం నర్మదా నదీమ్ ॥ తీ.ప్ర.35 పే.

తనలో స్నానం చేసినవాళ్లకు, స్వర్గాన్ని ఇచ్చి అప్సరః స్త్రీలతో నర్మసంభాషణం చేసే భాగ్యాన్ని కలిగిస్తూ, దానికి తగిన పేరు ప్రసిద్ధికల నర్మదానదిని సేవిస్తున్నాను.

కృష్ణానది మహారాష్ట్రమండల మునందలి మహాబలేశ్వరపు కొండలలో పుట్టి మహారాష్ట్ర, మైసూరు, ఆంధ్రరాష్ట్రములలో ప్రవహించి చివరికి బంగాళాఖాతమున కలియును. కృష్ణాసాగర సంగమమున స్నానము చేసినవారికి ఉత్తమగతి కలుగును. శ్రీశైలపర్వతమున కృష్ణానదిని పాతాళగంగ అని అందురు.

తామ్రపర్ణి ప్రభావం

తామ్రపర్ణీ సరిత్తోయం సేవనీయం ముముక్షుభిః ।
ముక్తీకరోతి యత్రత్యా శుక్తిశ్చ పతితం జలమ్ ॥ తీ.ప్ర.84పే.

ఏ నదిలోని ముత్యపుచిప్ప తనలోపడిన నీటిబిందువులను ముక్తాలు (ముత్యాలు) గా తయారు చేయగలదో, పతితుడై తనలో స్నానం చేసిన వాణ్ణి ముక్తుణ్ణి చేయగల ఆ తామ్రపర్ణీ నది నీటిని ముముక్షువులందఱు సేవించాలి.

శ్రీశైల మహాక్షేత్రం

డా॥ నొస్సం నరసింహాచార్యులు

సౌరాష్ట్రేసోమనాథం చ శ్రీశైలే మల్లికార్జునమ్
ఉజ్జయిన్యాం మహాకాలమోంకారమమరేశ్వరమ్
పరల్యాం వైద్యనాథం చ, ఢాకిన్యాం భీమశంకరమ్
సేతుబంధేతురామేశం, నాగేశం దారుకావనే
వారణస్యాం తు విశ్వేశం త్ర్యంబకం గౌతమీతటే
హిమాలయేతు కేదారం ఘృశ్మేశం చ శివాలయే॥

అంటూ భారతీయులు ద్వాదశ జ్యోతిర్లింగాలను స్మరిస్తుంటారు. వీటిలో రెండవ జ్యోతిర్లింగక్షేత్రం శ్రీశైలం. ఇక్కడ పరమేశ్వరుడు మల్లికార్జునస్వామి పేరుతో వెలిశాడు. అంతేకాదు. శ్రీశైలం జ్యోతిర్లింగక్షేత్రంతోపాటు అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన భ్రమరాంబ శక్తిపీఠం కూడా. అందుకే ఈ క్షేత్రానికి యుగయుగాలలో విశేషమైన ప్రాచుర్యం ఉంది.

రామాయణ భారతాది ఇతిహాసాలతోపాటు స్కాందపురాణం మొదలైన పురాణాలలో కూడా శ్రీశైల ప్రస్తావన కనిపిస్తుంది. కృతయుగంలో హిరణ్యకశిపునికి శ్రీశైలం పూజామందిరం కాగా, అహోబిలం సభామండపం అంటారు. త్రేతాయుగంలో రావణ వధానంతరం కలిగిన బ్రహ్మహత్యాపాతకాన్ని పోగొట్టు కొనేందుకు శ్రీరామచంద్రుడు శ్రీశైలక్షేత్రాన్ని దర్శించాడని ప్రతీతి. ఇక ద్వాపరయుగంలో పంచపాండవులు స్వయంగా ప్రతిష్ఠించిన శివలింగాలు నేటికీ శ్రీశైల ఆలయంలో దర్శనమిస్తాయి. ఇక హైందవులు ఏ శుభకార్యాన్ని చేపట్టినా పూజలు, వ్రతాలు, హోమాలు ఏవైనా ప్రారంభించే ముందు ఆచమనం చేయించి దేశకాల ప్రస్తావన చేస్తూ సంకల్పంలో “జంబూద్వీపే, భరతవర్షే, భరతఖండే, మేరోర్దక్షిణ దిగ్భాగే, శ్రీశైలస్య పశ్చిమప్రదేశే, కృష్ణాకావేర్యోః మధ్యదేశే... అంటారు.

శ్రీశైలం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాను దాదాపు 70కి.మీ దూరంలో కృష్ణానదీ తీరాన దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలోని, పర్వత శ్రేణులపై సముద్ర మట్టానికి దాదాపు 1500 అడుగుల ఎత్తులో వెలిసింది. ఇక్కడ కృష్ణానది పాతాళగంగ పేరుతో ఉత్తరవాహినిగా ప్రవహిస్తుండడం మరో గొప్ప విశేషం. శ్రీశైలక్షేత్రం 384 కి.మీ పొడవు అంతే వెడల్పు కలిగి దాదాపు 1,47,456 చదరపు కి.మీ విస్తీర్ణంతో ఎనిమిది దిక్కుల ఎనిమిది ద్వారాలతో అష్టదళ పద్మం మధ్యలో ఉన్నట్లుగా ఉంటుంది.

ఈ క్షేత్రానికి తూర్పున ప్రకాశంజిల్లా త్రిపురాంతకం, దక్షిణాన కడపజిల్లా –

సిద్దవటం, పశ్చిమాన పాలమూరుజిల్లా అలంపురం, ఉత్తరాన ఉమామహేశ్వరం నలుదిక్కుల నాలుగు ద్వారాలుగాను, కర్నూలు జిల్లా సప్తనదీసంగమ క్షేత్రమైన సంగమేశ్వరం నెల్లూరు కడపల మధ్యనున్న పెన్నాతీరంలోని స్కంద సోమేశ్వరం, పాలమూరు జిల్లాలోని ఏలేశ్వరం, కడపజిల్లా ఉత్తర పినాకిని తీరంలోని పుష్పగిరి, వరుసగా ఈశాన్య, ఆగ్నేయ, నైరుతి వాయవ్య దిశలలోను గల ఎనిమిది ద్వారాలుగా ఉన్న అష్టదళ పద్మం అనీ శ్రీశైలంచుట్టూ ఉన్న ఉపాలయాలు కేసరాలని మల్లికార్జునుడు భ్రామరీదేవితో కలిసి అష్టదళ పద్మం మధ్యలో విహరిస్తూ కర్ణిక వంటి శ్రీశైలంలో సేదదీరుతున్నట్లు స్కాందపురాణం వర్ణిస్తుంది.

శ్రీశైల క్షేత్రం పౌరాణిక గాథలు – స్థలపురాణం

పూర్వం శిలాదుడనే మహర్షి కొన్ని వేల సంవత్సరాలు ఘోరతపస్సు చేశాడు. ఆ తపస్సుకు మెచ్చి పరమశివుడు ప్రత్యక్షమై వరమును కోరుకోమనగా పరమశివ భక్తులైన సంతానాన్ని ప్రసాదించమని కోరాడట. శివుని అనుగ్రహంతో శిలాదమహర్షికి, పర్వతుడు, నంది పుత్రులుగా జన్మించారట. నందిఘోర తపస్సు చేసి పరమశివునికి నిత్యం వాహనంగా మెలిగే వరాన్ని పొందాడట.

పర్వతుడు కూడా నిరాహారియై పంచాగ్ని మధ్యలో నిలబడి ఘోర తపస్సు చేయగా శివుడు ప్రత్యక్షమై వరమును కోరుకోమన్నాడట. అప్పుడు పర్వతుడు "పరమేశ్వరా నీవు పార్వతీమాతతో కలిసి నా శిరసుపైనే నివసిస్తూ భక్తులను అనుగ్రహించవలెను. నేను నీకు నివాసంగా మారే వరాన్ని నాకు అనుగ్రహించు స్వామీ! అని వరాన్ని కోరగా పరమశివుడు అనుగ్రహించాడట. ఆ తర్వాత పర్వతుడు శ్రీపర్వతరూపాన్ని పొందగా పర్వతుని కోరికను మన్నించి పార్వతీపరమేశ్వరులు భ్రమరాంబ, మల్లికార్జునులుగా అవతరించారని స్థలపురాణం చెబుతూంది.

శ్రీశైలంలో వెలిసిన శివునికి "మల్లికార్జునుడు' అనే పేరు రావడానికి స్కాందపురాణంలో మరో ఇతివృత్తం కూడా ఉంది.

పూర్వం మగధ సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్న చంద్రగుప్తునికి పరమేశ్వరుని అనుగ్రహంతో ఒక కుమార్తె జన్మింపగా ఆమెకు "చంద్రావతి" అని పేరుపెట్టారు. ఆ తర్వాత చంద్రగుప్తుడు 16 సంవత్సరాలు దూరదేశయాత్రకు వెళ్ళి తిరిగివస్తాడు. యుక్తవయస్కురాలైన, అత్యంత సౌందర్యరాశి అయిన చంద్రావతిని

తన కుమార్తెగా గుర్తించలేకపోతాడు. తనను ప్రేమించమని వెంటబడతాడు. అలా కృష్ణానదిని దాటేవరకు వెంటాడుతూవస్తున్న చంద్రగుప్తుని భరించలేక చంద్రావతి అతనిని పచ్చబండగా మారాలని పాతాళగంగవద్ద శపిస్తుంది. శ్రీశైలం చేరుకున్న ఆమె అక్కడే నివాసం ఏర్పరచుకొని నిత్యము భక్తిశ్రద్ధలతో అడవిలో దొరికే మల్లికా పుష్పాలను శివుని పూజిస్తుండేది. చంద్రావతి భక్తికి మెచ్చి పరమశివుడు ప్రత్యక్షమై వరము కోరుకో మనగా ఆమె "దేవా! నీవు నాచే మల్లికాపుష్పాలతో పూజింపబడుతున్నావు కనుక "మల్లికార్జున" నామంతో ఇక్కడ విరాజిల్లుతూ భక్తులను అనుగ్రహించవలసింది" అని కోరింది. శివుడు అనుగ్రహించాడు. నాటి నుండి శ్రీశైలంలో వెలసిన శివుడు మల్లికార్జుననిగాను, ఆది శక్తి పార్వతీదేవి భ్రమరరూపాన్ని ధరించి లోకకంటకుడైన అరుణామరుడనే రాక్షసుని సంహరించింది కనుక పార్వతీదేవి "భ్రమరాంబిక" పేరుతోను విరాజిల్లుతూ భక్తులను అనుగ్రహిస్తున్నారు.

శ్రీశైల క్షేత్ర మాహాత్మ్యాన్ని గురించి సాక్షాత్తు పరమేశ్వరుడే పార్వతీదేవికి "దేవీ! నన్ను నమ్మి నిర్మల చిత్తంతో నన్ను దర్శించి మూడుమార్లు ఎవరైతే ప్రదక్షిణలు చేస్తారో వారు శుద్ధచిత్తులై మహాజ్ఞానవంతులవుతారు. కురుక్షేత్రంలో లక్షలాది దానాలు ఇచ్చినా, పవిత్ర గంగానదిలో రెండువేల సార్లు స్నానంచేసినా, నర్మదాతీరంలో బహుకాలం తపస్సుచేసినా, కాశీకా క్షేత్రంలో లక్షల సంవత్స రాలు నివసించినా ఎంత పుణ్యం లభిస్తుందో అంతటి పుణ్యం శ్రీశైలంలో త్రికరణ శుద్ధిగా నన్ను ఆరాధించినంత మాత్రనే లభిస్తుంది.

శ్రీశైలంలో నా దర్శన మాత్రానే పర్వయజ్ఞాలు చేసినంత ఫలం, సర్వతీర్థాలను సేవించినంత ఫలం, కలుగుతుంది. నన్ను ఎవరు తెల్లని తామరపుష్పాలు, మల్లిక పుష్పాలతో పూజిస్తారో వారికి సకల సిరిసంపదలు కలుగుతాయి. సర్వపాపాలు తొలగి పరమపవిత్రులవుతారు" అని స్కాందపురాణం వల్ల తెలుస్తున్నది.

శ్రీశైలక్షేత్ర ఆలయం మండపం, అంతరాలయం, గర్భాలయం అనే 3 భాగాలుగా విస్తరించింది. గర్భాలయంలో మల్లికార్జునుడు లింగా కారంలో పూజలందుకుంటున్నాడు. ఇక్కడ వీరశైవులు స్వామివారికి అర్చకత్వబాధ్యతను నిర్వహిస్తారు. మల్లికార్జునుని దర్శించుకుని బయటకు రాగానే అదే ఆవరణంలో మరోవైపు భ్రమరాంబికదేవి దర్శనమిస్తుంది. ఆ ప్రక్కనే రాజరాజేశ్వరస్వామి - రాజరాజేశ్వరీదేవి ఆలయం కనిపిస్తుంది. ఆ ప్రక్కనే వృద్ధ మల్లికార్జునస్వామి ఆలయం, ఔదుంబర వృక్షం అనే శ్రీదత్తవృక్షం, శ్రీరామ ప్రతిష్ఠిత సహస్రలింగం, పాండవ ప్రతిష్ఠిత పంచ లింగ ఆలయాలు, నవబ్రహ్మాలయాలు, అర్ధనారీశ్వ రాలయాలు కూడా దర్శనమిస్తాయి.

శ్రీశైలక్షేత్రంలో ఆలయానికి నలువైపులా నాలుగు గాలిగోపురాలు ఆకాశాన్ని తాకేంత ఎత్తులో దర్శనమిస్తాయి.

శ్రీశైలమల్లికార్జునుని అర్ధాంగి భ్రమరాంబికా దేవిని దర్శించేందుకు ముఖ్యంగా కన్నడిగులు కుటుంబాలతో సహపాదయాత్రగా వస్తుంటారు. వీరు భ్రమరాంబికాదేవినితమ ఇంటి ఆడపడుచుగా

భావించి కావడిలో చీరసారెలను మోసుకొచ్చి అమ్మకు సమర్పించుకుంటారు.

చరిత్రలో శ్రీశైల క్షేత్రం

శ్రీశైల క్షేత్రం క్రీ.శ. ఒకటో శతాబ్దం నాటికే సుప్రసిద్ధ క్షేత్రంగా పేరొందింది. శాతవాహన రాజులచే సిరిధాన్ క్షేత్రంగా స్మరించబడేది. క్రీ.శ. మూడోశతాబ్దం నాటికి దీనిని శ్రీ పర్వతంగా వర్ణించారు. ఈ క్షేత్రాన్ని మూడో శతాబ్దం వరకు శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు 4వ శతాబ్దం చివరిభాగంలో విష్ణు కుండినులు, ఆరో శతాబ్దం వరకు తెలుగు చోళులు పరిపాలించారు. పదోశతాబ్దం వరకు రాష్ట్రకూటులు, తర్వాత చాళుక్యులు, అటు తర్వాత క్రీ.శ. 1162 వరకు చాళుక్య చోళులు, క్రీ.శ. 1323 వరకు కాకతీయులు, తర్వాత 1420 వరకు రెడ్డిరాజులు ఈ క్షేత్రాన్ని పరిపాలించారు. రెడ్డిరాజుల కాలంలో క్రీ.శ. 1326-35 మధ్య నాగలూటినుంచి పెద్దచెరువు, భీమునికొలను మీదుగా శ్రీశైలానికి మెట్ల నిర్మాణం జరిగింది. ఇప్పటికీ కర్ణాటక ప్రాంతం నుంచి శ్రీశైలం కాలినడకన చేరుకునే నిర్మాణం జరిగింది. క్రీ.శ. 1377లో పినతండ్రి అన్నయ్య రెడ్డికోసం అనవేమారెడ్డి ఆలయం ముందు భాగాన వీర శిరోమండపం కట్టించారు. 1398లో అనపోతారెడ్డి కుమారుడు కుమారగిరి రెడ్డికి ఆయన భార్య పుణ్యంకోసం మంత్రి కాటమవేముడు శిఖరేశ్వరునికి మెట్లు నిర్మించాడు. రెడ్డిరాజుల తర్వాత విజయనగర రాజులు శ్రీశైలక్షేత్రాన్ని పాలించారు. వీరి కాలంలో పాతాళగంగకు మెట్లు, ఆలయ ముఖ మండపం, దక్షిణ గోపుర నిర్మాణం జరిగింది. శ్రీకృష్ణదేవరాయలు తూర్పుగోపురాన్ని, సాలు మండపాలను కట్టించాడు.

దర్శనీయ స్థలాలు

1. పంచమఠాలు

పూర్వం శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం మఠాలు ప్రధాన పాత్రను పోషించాయి. క్రీ.శ. 8, 9 శతాబ్దాలలో నిర్మింపబడిన ఈ మఠాలు ముఖమండపం, అంతరాళం, గర్భాలయాలతో దేవాలయాన్ని తలపిస్తుంటాయి. పూర్వం ఇక్కడ అనేక మఠాలు విరాజిల్లినా ప్రస్తుతం మాత్రం ఆలయానికి వాయవ్యభాగంలో ఘంటామఠం, భీమశంకరమఠం, రుద్రాక్షమఠం, వీరభద్రమఠం, విభూతిమఠం, సారంగధరమఠం అనే ఆరు మఠాలు మాత్రమే ఉన్నాయి. వీటిలో వీరభద్ర మఠం తప్ప మిగిలిన అయిదు మఠాలు పంచ మఠాలుగా పిలువబడుతున్నాయి.

2. శిఖరేశ్వరం

శ్రీశైలానికి 8 కి.మీ.దూరంలో రోడ్డును ఆనుకొని శిఖరేశ్వరం ఉంది. శ్రీశైలం కొండల్లో అతి ఎత్తైన కొండ ఈ శిఖరేశ్వరం. దీని ఎత్తు సముద్రమట్టానికి 2,830 అడుగులు. ఇక్కడ ప్రాచీన వీరశంకర ఆలయం ఉంది. ఈ ఆలయం పై భాగంలో ఒక పొత్రంపై నంది అమర్చబడి ఉన్నాయి. ఇక్కడికి వచ్చే భక్తులు

ఆలయ పై భాగానికి వెళ్ళి నందీశ్వరుని రెండు కొమ్ముల మధ్యనుండి ఎత్తైన ప్రధానాలయ శిఖరాన్ని చూస్తారు. ఆలయశిఖరం కనిపించిన వారికి కైలాసప్రాప్తి తప్పక కలుగుతుందని విశ్వాసం.

3. హటకేశ్వరం

శ్రీశైలం నుండి 3 కి.మీ.దూరంలో 10, 11 శతాబ్దాలనాటి ప్రాచీన హటకేశ్వరాలయం ఉంది. ఇక్కడ కొన్ని ఆశ్రమాలుకూడా ఉన్నాయి.

ఇక్కడ శివుడు హటకేశ్వరునిగా కీర్తింపబడు తున్నాడు.

4. ఫాలధార - పంచధార

హటకేశ్వరానికి ఎదురుగా రోడ్డుకి మరోవైపున ఉన్న లోయప్రాంతమే ఫాలధార - పంచధార. ఇక్కడ ఎత్తైన బండరాళ్ళ పైనుండి దాదాపు ప్రక్కప్రక్కగా ఒకచోట ఒకజలధార, మరోవైపు 5 జలధారలు నిరంతరం ప్రవహిస్తుం టాయి. ఆదిశంకరులవారు ఇక్కడ తపస్సుచేసి శివానంద లహరిని వ్రాశారని చెపుతారు. ఇక్కడ ఆదిశంకరుల మందిరం ఉంది.



5. సాక్షి గణపతి

ప్రధాన ఆలయానికి 2కి.మీ.దూరంలో ఈ సాక్షి గణపతి ఆలయం ఉంది. శ్రీశైలానికి వచ్చే భక్తులను గుర్తించుకొని కైలాసంలో ఈ గణపతి సాక్ష్యం చెపుతాడని కనుకనే ఇతనికి సాక్షి గణపతి అని పేరు వచ్చినట్లు ప్రతీతి. ఈ ఆలయంలో గణనాథుడు శ్రీశైలమల్లికార్జునుని దర్శిం చేందుకు వచ్చిన భక్తుల పేర్లను నమోదుచేస్తున్న భంగిమలో ఒకచేత తాళ పత్రం, మరోచేత ఘంట మును ధరించి ఉంటాడు.

6. ఇష్టకామేశ్వరి

శ్రీశైలంలో ఇటీవలి కాలంలో బాగా వెలుగులోకి వచ్చిన ఆలయం ఇష్టకామేశ్వరీ ఆలయం. శ్రీశైలానికి 21 కి.మీ. దూరంలో దోర్నాల మార్గంలో 10 కి.మీ. ప్రయాణించి ఎడమవైపున దట్టమైన అటవీప్రాంతంలో మరో 11 కి.మీ. ప్రయాణిస్తే ఈ ఆలయం వస్తుంది.

ఇది 8, 9 శతాబ్దాలకు చెందిన ఆలయం. ఈ ఆలయం భూగుహలో 3 అడుగుల ఎత్తు ఉంటుంది. ఆలయంలో అమ్మవారిని దర్శించాలంటే మోకాళ్ళ పై వంగి వెళ్లాల్సిందే. ఈ అమ్మవారి విగ్రహాన్ని పోలిన విగ్రహం భారతీయ శిల్పసంప్రదాయంలో మరెక్కడా లేదు. ఈ ఆలయానికి తూర్పువైపున ఒక సెలయేరు నిరంతరం ప్రవహిస్తూ ఉంటుంది.

7. నాగలూటి

శ్రీశైలకొండ అటవీప్రాంతంలో విజయనగర రాజులకాలంలో నిర్మించబడిన ఆలయం ఈ నాగలూటి. ఈ ఆలయంలో వీరభద్రస్వామి పూజలందుకుంటున్నాడు.

ఇంతేకాక ఈ క్షేత్ర పరిసరాలలో అక్క మహాదేవిగుహలు, సహజ శిలాతోరణం, కదళీవనం, భ్రమరాంబ చెరువు మొదలైన దర్శించదగ్గ ప్రాంతాలు అనేకం ఉన్నాయి.

శ్రీశైల ఉత్సవ విశేషాలు

శ్రీశైల మహాక్షేత్రంలో ప్రతిరోజు పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఇక్కడ స్వామివారికి నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాలు జరుగుతుంటాయి. కాగా మహాశివరాత్రి, ఉగాది మొదలైన ఉత్సవాలకు దేశవిదేశాలనుండి కూడా భక్తులు పాల్గొంటుంటారు. స్వామివారికి జరిగే సేవల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే వాహనసేవలు శివరాత్రినాడు జరిగే రుద్రాభిషేకం, పాగాలంకరణ, కల్యాణోత్సవం మరునాడు జరిగే రథోత్సవం చాలా ప్రసిద్ధమైనవి. ఈ క్షేత్రంలో ఉగాది ఉత్సవాలు 5 రోజులపాటు వైభవంగా నిర్వహిస్తారు. ఉగాది ముందురోజున కర్ణాట భక్తులుచేసే వీరాచార విన్యాసాలు ప్రజలను ఆకట్టుకుంటాయి.

శ్రీశైల భ్రమరాంబిక అమ్మవారికి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. అలాగే ప్రతిఏటా చైత్రపౌర్ణమి ముందు వచ్చే మంగళవారం లేదా శుక్రవారాలలో అమ్మవారికి కుంభోత్సవం, సాత్త్వికబలి వైభవంగా నిర్వహిస్తారు.

జననమరణరూప సంసారచక్రంనుండి మోక్షాన్ని పొందాలంటే శ్రీశైలశిఖర సందర్శనం చాలునని స్కాందపురాణంలోని శ్రీశైలఖండం చెబుతూంది.

శ్లో॥ కేదారేహ్యుదకం పీత్వా వారణాస్యాం మృతస్తథా
శ్రీశైలే శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే
కాశ్యాస్తు మరణాన్ముక్తిః స్మరణాదరుణాచలే
దర్శనాదేవ చ శ్రీశైలే: పునర్జన్మ న విద్యతే

– అని ఋషివాణి.

హిమాలయాల్లోని కేదారేశ్వరంలో నీరు తాగినా, వారణాసిలో సహజ మరణం పొందినా, శ్రీశైలశిఖరాన్ని చూసినా పునర్జన్మ ఉండదని పైశ్లోకం యొక్క అర్థం.

అలంపూరు - సంగమేశ్వరం - సోమశిలక్షేత్రాలు

డా॥ గడియారం రామకృష్ణశర్మ

అలంపూరు

అలంపూరు కృష్ణాతీరంలో లేకపోయినా దాని ఉపనది తుంగభద్రా తీరంలో ఉంది. ఇప్పుడు కృష్ణా తుంగభద్రా సంగమము అలంపూరుకు నాలుగు మైళ్ళ దూరంలో ఏర్పడింది. అందువల్ల ఈ క్షేత్రాన్ని పరిచయం చేయడమైంది.

ఈ క్షేత్రం చాలా ప్రాచీనమైంది. ఈ పరిసరాలలో చరిత్రకందని కాలపు సమాధులున్నాయి. మౌర్యులకాలం నుండి చరిత్ర ఉంది. 7-12 శతాబ్దాలమధ్య నిర్మించబడిన దేవాలయాలున్నాయి. 7-16 శతాబ్దాల నడుమ దక్షిణ దేశాన్ని పరిపాలించిన రాజ వంశాలవారు వేయించిన శాసనాలున్నాయి. వైదిక షణ్మతాలకు చెందిన దేవ మూర్తులున్నాయి. తాంత్రికోపాసనల ప్రతీకలున్నాయి. ఈ విధంగా అనేక ధార్మిక వాస్తు శిల్పవిశేషాల ఆకరమైన అలంపూరును గురించి ఈ వ్యాసంలో తెలుపబూనడం సాహసమే. అయినా యాత్రికుల కొరకై సంగ్రహ పరిచయం చేస్తున్నాను. అలంపూరు మహబూబ్‌నగరం జిల్లాలో సికిందరాబాదు-ద్రోణాచలం రైలుమార్గంలో ఉంది. కర్నూలుకు సమీపం, కర్నూలునుండి బస్సు సౌకర్యం ఉంది. ఇది ఉత్తరవాహిని తుంగభద్రాతీరంలో నెలకొనింది.

క్షేత్రమహిమ

ఇది పురాణప్రసిద్ధి పొందిన క్షేత్రం. స్కాంద పురాణం శ్రీశైల ఖండంలో ఈ క్షేత్రం ప్రశంసించబడింది.

1. ఇక్కడి దైవం బ్రహ్మేశ్వరుడు. బ్రహ్మదేవుడు ఈ స్థలంలో తపస్సు చేసి ఇక్కడ రసలింగాన్ని ప్రతిష్ఠించి నాడు, అందువల్ల బ్రహ్మేశ్వరుడైనాడు.

2. దక్షిణకాశి - కాశీ క్షేత్రానికీ దీనికి చాలా పోలికలున్నాయి.

3. పరశురామ క్షేత్రం - ఇక్కడ జమదగ్ని ఆశ్రమం ఉండేది. ఒకనాడు ఆ మహర్షి భార్య అయిన రేణుకాదేవి మీద కోపంతో ఆమె తల

నరుకమని పరశురాముని ఆదేశించెను. అతడు వెంటనే తల్లి తల నరికెను. ప్రసన్నుడైన తండ్రిని తల్లిని బ్రతికింప గోరెను. ఆమె తల చండాల వాటికలో పడినందున వీలుకాలేదు. ఆ తల 'ఎల్లమ్మ'గాను, మొండెము 'భూదేవి'గాను జనులచే ఆరాధించబడునట్లు అనుగ్రహించెను. భూదేవి సంతాన హీనులచే పూజింపబడుతూ సంతాన దాయిని అయి ఉంది.

4. భాస్కర క్షేత్రం–ఎక్కడ షణ్మతాలకు చెందిన దేవతలకు గుడులుంటాయో ఆ క్షేత్రాన్ని భాస్కర క్షేత్రం అంటారు. భారతదేశంలో ఇవి పది ఉన్నాయి. ఇదొకటి.

5. శ్రీశైల పశ్చిమద్వారం – శ్రీశైలక్షేత్రానికి నాలుగు దిక్కులలో నాలుగు ద్వారాలున్నాయి. తూర్పున 'త్రిపురాంతకము', దక్షిణాన 'సిద్ధవటం', పశ్చిమంలో 'అలంపూరు', ఉత్తరాన 'ఉమా మహేశ్వరం' – నాలుగు ద్వారాలుగా ఉన్నాయి.

6. మహాశక్తి పీఠం– అష్టాదశ శక్తిపీఠాలలో ఒకటైన శ్రీ జోగుళాంబాపీఠం అలంపూరులో ఉంది.

స్థలచరిత్ర

ఈ ప్రాంతాన్ని మౌర్యులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు పాలించినట్లు ఆధారాలున్నాయి. బాదామి చాళుక్యుల నుండి విజయనగర రాజుల వరకు వారి వారి శాసనాలున్నాయి. రెండవ పులకేశి కంచి పల్లవులను జయించి అక్కడి శిల్పులను తెచ్చి ఇక్కడ నవబ్రహ్మేశ్వరాలయాల నిర్మాణం ప్రారంభించగా ఆ వంశీయులు ప్రథమ విక్రమాదిత్య, వినయాదిత్య – విజయాదిత్యులు పూర్తి చేసినారు. ఇక్కడ ద్రావిడ వాస్తురీతిలోని పల్లవ దేవాలయం నరసింహవర్మ కాలంలో నిర్మించ బడింది. తరువాత రాష్ట్రకూటులు ఏలినారు. ధారావర్షధ్రువ మహారాజు ఇక్కడి మహా ద్వారాన్ని కట్టించినాడు. కల్యాణి చాళుక్యులు జగదేకమల్ల, త్రైలోక్యమల్ల, త్రిభువనమల్లమహారాజుల కాలంలో నదీతీరంలో ఘట్టాలు – తీర్థాలు నరసింహాలయ, సూర్యనారాయణాలయాలు కట్టించబడినాయి. కలచుర్యులు, కాకతీయులు కొంతకాలం పాలించారు. విజయనగర రాజులు మొదటి దేవరాయలు ఇక్కడి దేవాలయాలను రక్షించెను. కృష్ణ దేవరాయలు ఇక్కడికి వచ్చి ఆలయాలకు భూదానాలు చేసి, క్షేత్రరక్షణకు కోటను కట్టించెను. ఆ తరువాత ఆదిల్షాహీ – కుతుబ్షాహీ – అసఫ్జాహీ నవాబులు ఏలినారు. 14వ శతాబ్దిలో బహమనీ సైన్యాలు ఆలయాలను పాడు చేసెను. అప్పుడు దేవరాయలు కాపాడినాడు. ఆ సమయంలో ఒక ముస్లిం ముఖ్యుడు ప్రజలచేత చంపబడగా అతని దర్గా వెలిసింది. దానికి ఉర్సు జరుపుతారు.

ముఖ్యదేవాలయాలు

ప్రధానాలయం బాల బ్రహ్మేశ్వరాలయం. ఈ స్వామికి శ్రావణ కార్తీక – ధనుర్మాసాలలో విశేష పూజలు జరుగుతాయి. నిత్యపూజ, అఖండ దీపారాధన, నైవేద్యాలు మహాశివ రాత్రికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ ఆలయంలోనే

జోగుళాంబాదేవి ఉండేది – ఆమె ప్రత్యేకాలయం పాడైన తరువాత ఇక్కడ చిన్నగుడిలో పెట్టుకొని పూజించేవారు. ఇటీవల ప్రభుత్వంవారు – శ్రీ అజేయకల్లం, ఐ.ఎ.ఎస్. గారు ఎండోమెంటు కమీషనరుగా ఉన్నప్పుడు దాదాపు 2 కోట్ల రూపాయల అంచనాతో అమ్మవారికి నూతనాలయం నిర్మించే పని ప్రారంభించినారు. పూర్వముండిన స్థలంలోనే అప్పుడున్నట్లే భవ్యదేవాలయ నిర్మాణం పూర్తి అయిన పిదప శ్రీ జోగుళాంబ ప్రతిష్ఠించ బడింది. అమ్మవారికి నిత్య పూజలు, శుక్రవారం నాడు విశేష పూజలు, శరన్నవ రాత్రులలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఆలయంలో ఒక మూల ఇక్కడి బ్రహ్మపురి విద్యాపీఠంలోని కులపతి ఆచార్యుల విగ్రహాలు న్నాయి. తక్కిన కుమార, అర్క, వీర, విశ్వ, తారక, గరుడ, స్వర్గ, పద్మ, బ్రహ్మేశ్వరుల ఆలయాలు దర్శనీయమైనవి. అన్నీ శిల్పకళా విరాజితాలు. ఇటీవల బ్రహ్మేశ్వ రాలయానికి దక్షిణ దిశలో వెంకటేశ్వరాలయం నిర్మించబడింది. రాష్ట్రకూటులు నిర్మించిన మహాద్వారంలో కంచి కామాక్షి ఏకామ్రేశ్వరులు పూజలందు కుంటున్నారు. ఊరిలో యోగానంద నరసింహాలయం, సూర్యనారాయణ స్వామి ఆలయం, ఊరికి కిలోమీటరు దూరంలో పాపనాశినీ తీర్థముంది. అక్కడ దేవాలయ సమూహముంది.

వాస్తుకళా విశేషాలు

భారతీయ వాస్తు శిల్పం వేదకాలం నుండే వ్యాప్తిలోకి వచ్చింది. మూర్తి శిల్పం గూడ ప్రాచీనమైంది, హరప్పా, మొహంజోదారోల త్రవ్వకాలలో మన వాస్తుమూర్తి శిల్పమూర్తులు బయట పడినాయి. భారతదేశంలో జైన – బౌద్ధ వాస్తు శిల్పరీతుల తరువాత 'కళింగ – గుప్త – బాదామీ చాళుక్య పల్లవ – రాష్ట్రకూట – కల్యాణి చాళుక్య, హొయిసల, చోళ, కాకతీయ, విజయనగర వాస్తు శిల్పరీతులు పూర్ణవికాసం పొందినాయి. ఇక్కడి ఆలయాలు ప్రధానంగా బాదామి చాళుక్య వాస్తురీతికి చెందినట్టివి. రెండవ పులకేశి కంచిని జయించినప్పుడు అక్కడి శిల్పులను తెచ్చి వారిచేత నాగర, ద్రావిడ వాస్తురీతులను సమ్మేళనం చేయించి చాళుక్య వాస్తురీతిని రూపొందించినాడు. ఈ వాస్తురీతిలో మొదట బాదామి, పట్టదకల్లు, మహాకూటేశ్వ రాలలో దేవాలయాలను కట్టించినాడు. అవి ప్రారంభదశను తెలుపుతాయి. అలంపూరు ఆలయంలో సంపూర్ణ వికాసం కనబడుతుంది.

ఈ మహాక్షేత్రాన్ని దర్శించడానికి దేశ విదేశ యాత్రికులు విశేషంగా వస్తుంటారు. ఇంకొక విశేషం ఏమిటంటే ప్రౌఢసరస్వతి, గండ్రకోట కుమారస్వామిశాస్త్రిగారు నెల్లూరు నివాసులు ఇక్కడికి 19వ శతాబ్దిలో వచ్చి ఇక్కడ అన్ని వర్ణాల యాత్రికులకు శాశ్వత అన్నదాన సత్రాన్ని స్థాపించి, సన్యసించి, ఇక్కడే సమాధి అయినారు. ప్రభుత్వం శ్రద్ధ వహిస్తే క్షేత్రం అభివృద్ధి చెందుతుంది.

సంగమేశ్వరం

అలంపూరికి 12 మైళ్ళ దూరంలో కృష్ణా – తుంగభద్రా సంగమం ఉండేది. దీన్ని చిన్నసంగం

– షణ్ణదీ సంగం, కూడలి సంగం అనేవాళ్ళు. ఇక్కడ కృష్ణలో అదివరకే వేణీ, మలప్రభా, భీమానదులు కలిసి ఉన్నాయి. తుంగభద్రలో తుంగా – భద్రా నదులు కలిసి ఉన్నాయి అందువల్ల ఇది ఆరునదుల సంగమం అయింది. రెండు నదులూ కలిసేచోట బాదామీ చాళుక్య వాస్తురీతిలో కట్టబడిన సుందర దేవాలయమున్నది. లోపల సంగమేశ్వర లింగమూ, వీరభద్ర మూర్తి ఉన్నాయి. ఆలయం చుట్టూ గోడలమీద మనోహర శిల్పమూర్తులు నిలిపినారు. ఆలయం చుట్టూ శిలాప్రాకారం ముంది.

శ్రీశైలం ప్రాజెక్టు వల్ల ఈ ప్రదేశంతోపాటు ఏడు ఎనిమిది మైళ్ళ వరకు గ్రామాలు మునిగి పోయినాయి. ఇప్పుడు కృష్ణాతుంగభద్రా నదుల సంగమం అలంపూరికి నాలుగు మైళ్ళ దూరంలో గొందిమళ్ళ గ్రామం దగ్గరికి వచ్చింది. ఆలయాన్ని ప్రాకారంతోపాటు అలంపూరుకు తరలించి యధాతధంగా పునర్నిర్మాణం చేసినారు. ఆ క్షేత్రం అంతరించింది.

పెద్ద సంగమేశ్వరం

ఈ క్షేత్రాన్ని **'సప్తనదీ సంగమం' నివృత్తి సంగమం** అంటారు. ఇక్కడ ఆరునదులు కలిసి కృష్ణలో భవనాశినీ నది కలుస్తున్నందున సప్తనదీ సంగమమైంది. పాపనివృత్తి చేసే క్షేత్రం కాబట్టి నివృత్తి సంగమమంటారు. ఆలయం రెండు నదులు కలిసేచోట ఉంది. ఇందలి లింగాన్ని గురించి స్థల పురాణంలో ఒక కథ ఉంది. పూర్వం ధర్మరాజు తమ్ములతో అరణ్యవాసం చేసినప్పుడు ఇక్కడికి వచ్చినాడు. స్థానికులు ఆయనను కలిసి ఈ సంగమం దగ్గర ఒక శివ లింగాన్ని ప్రతిష్ఠించ గోరినారు. ఆయన అంగీకరించి తమ్ముడు భీముణ్ణి లింగాన్ని తెమ్మని కాశికి పంపినాడు. ఋషులు సుముహూర్తం నిర్ణయించి కార్యకలాపం ప్రారంభించినారు. కాని భీముడు ఎన్నాళ్ళు గడచినా లింగాన్ని తేలేదు. ముహూర్తం సమీపించింది. ఋత్విక్కుల ఆదేశంతో వేపమొద్దును కోయించి సకాలంలో లింగంగా ప్రతిష్ఠ చేసినాడు. తరువాత భీముడు పెద్దలింగాన్ని తెచ్చినాడు. ప్రతిష్ఠ జరిగిపోయింది. కోపంతో తాను

తెచ్చిన లింగాన్ని నదిలోకి విసరివేసినాడు. అది నది ఒడ్డున పడింది. ధర్మరాజు తమ్ముణ్ణి సమాధాన పరచి నీవు తెచ్చిన లింగం భీమలింగం అనే పేరుతో మొదటి పూజ అందుకుంటుంది అని అక్కడనే సోపానాల దగ్గర వేదిక కట్టించి ఒరిగిపడిన భీమలింగాన్ని ప్రతిష్ఠించినాడు. ఇప్పటికీ భక్తులు స్నానంచేసి భీమ లింగాన్ని పూజించి తరువాత ఆలయంలో పూజలు చేస్తారు.

ఇక్కడి ప్రాచీనాలయం భగ్నమై పోగా రెండు, మూడు వందల ఏండ్లకిందట ఏ శిల్పమూ లేకుండా సాధారణంగా గుడి కట్టినారు. ఈ ఆలయానికి పెద్ద ప్రాకారమూ తూర్పున మహాద్వారమూ, ఉత్తరాన నదిలోకి దిగే ద్వారమూ ఉన్నాయి. ఇది ప్రకృతి రమణీయ స్థలం. ఇక్కడ పంచేశ్వరాలయా లున్నాయి. కపిలేశ్వరం, సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, సోమశిల, అగస్త్యేశ్వరం అనే పేరుతో పూజింప బడుతుండేవి. ఊరిలో వేంగీచాళుక్యులు కట్టించిన రథాకృతి దేవాలయం, దాని దగ్గర భుజంగేశ్వ రాలయం వాస్తుశిల్ప కళాశోభితమై ఉన్నాయి. ఈ ప్రాంతాలలో రాజరాజ నరేంద్రుని కొడుకు కులోత్తుంగ చోళుని శాసనం లభించింది.

ఈ మహాక్షేత్రం గూడ శ్రీశైలం ప్రాజెక్టు మునుకలో ఉంది. ఇక్కడి కపిలేశ్వరం, సంగమేశ్వరం, సిద్ధేశ్వరం ఆలయాలు సాధారణంగా ఉన్నందున వీటిని తరలించక ఇక్కడనే ఉంచినారు. నది ఆవల ఉన్న సోమశిల, అగస్త్యేశ్వరాలయాలను వేరేచోటుకి తరలించి పునర్నిర్మాణం చేసినారు. కృష్ణానది ఆషాఢ, మార్గశిర మాసాల మధ్యకాలంలో పూర్ణ ప్రవాహంతో ఉంటుంది. ఆలయాలు మునిగి పోతాయి. మహాశివరాత్రి నాటికి సంగమేశ్వరా లయం బైట పడుతుంది. అప్పుడు భక్తులు విశేష సంఖ్యలో చేరి స్వామిని అర్చించు కుంటారు. ఆ సమయంలో కర్నూలు నుండి బస్సులు నడుస్తాయి.

సోమశిల

పంచేశ్వరాలయాలలో సోమశిల ఒకటి. దీన్ని సోమేశ్వరం అంటారు. కృష్ణాతీరంలో ఉంది. ఆలయం ప్రాచీనమైంది. శిల్పవిశేషాలు లేక సాధారణంగా ఉంది. ఇక్కడి విశేష మేమంటే ఒకేచోట గుంపుగా 13 చిన్న శివాలయాలు కట్టినారు. అవి కల్యాణి చాళుక్యులనాటివి. కాకతి ప్రతాపరుద్రుడు అన్నింటికీ కలిపి ఒకే విశాల మంటపం కట్టించినాడు. పూజాపునస్కారాలు లేవు. ఈ ఆలయ సమూహాన్ని కొల్లాపురానికి తరలించి పునర్నిర్మాణం చేసినారు. ప్రాజెక్టుల వలన ఎన్నో మహాక్షేత్రాలు అంతరించినాయి. మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలలో కృష్ణా, తుంగభద్రా తీరాలలో ఉండే 96 గ్రామాలు మునిగిపోయినాయి. సారవంతమైన వేల ఎకరాల నల్లరేగడి పంటపొలా లు నీళ్లపాలైనాయి. ఈ ప్రాజెక్టువల్ల గ్రామాలు, భూములే మహాక్షేత్రాలు పోయినాయి. కొన్ని ప్రసిద్ధ క్షేత్రాల ఆలయాలనుమాత్రం వేరేచోటికి తరలించి కట్టించినారు. అలంపూరు దేవాలయాలను నేను హైపవర్ కమిటీ సభ్యుడుగా ఉండి తరలించడాన్ని ప్రతిఘటించినాను. ప్రభుత్వంతో పోరాడి అలంపూ రుచుట్టూ కోటిరూపాయలతో రక్షణకుడ్యం నిర్మింప జేసినాను. ఇదంతా క్షేత్రదైవముల అనుగ్రహం.

ప్రథమ పంచారామ క్షేత్రము - శ్రీ అమరారామము

దిట్టకవి కన్నబాబు

ఆంధ్రదేశంలోని పవిత్ర పంచారామ క్షేత్రాలలో ప్రథమారామం దివ్యశ్రీ అమరారామం. గుంటూరు పట్టణానికి 35 కి.మీల దూరంలోగల అమరావతి (ఉ.అ.16 34', తూ.రే.80 17) గ్రామంలో పుణ్యకృష్ణవేణీనది దక్షిణ తీరాన ఉన్నది. దక్షిణ భారతదేశమునందలి శైవ పుణ్యక్షేత్రములలో అగ్రగణ్యమైనదే కాక పురాతనమైనది. శ్రీ అమరలింగేశ్వరుడు ఇందలి ప్రధాన ఆరాధనా మూర్తి. స్వామివారితోపాటు దేవళమున బాల చాముండేశ్వరీ దేవి కొలువై భక్తులపాలిటి కల్పద్రుమమై విరాజిల్లుచున్నది.

పవిత్ర కృష్ణవేణీ నదీతీరమున వెలసిన శైవతీర్థ రాజమగు అమరారామము పురాణ కాలమునుండి ప్రసిద్ధి గాంచినది. దేవాలయ ప్రాంగణమును తాకుతూ ఉత్తరమున పూర్వ వాహినియై ప్రవహించుచున్న కృష్ణానదీ తోయములలో స్నానమాచరించి అమరేశ్వర మూర్తి దివ్యదర్శనము గావించుకొన్నచో భుక్తి ముక్తి ఫలప్రదం అని పురాణములు వాకొనుచున్నవి. పౌరాణికగాథ ననుసరించి పూర్వకాలమున అసురుడగు తారకుని ఆగడ ములు పెచ్చురిల్లి ప్రజాకం టకుడై బాధించుచుం డెను. వాని దురాగ తములు తాళలేక ముని బృంద ములు మహా దేవునికి ప్రణమిల్లి రక్షింపుమని వేడుకొన స్వామి దేవసేనానియగు స్కందుని పిలిచి, తారకాసురుని సంహరించి లోకరక్షణము చేయుమని గణములనిచ్చి పంపెను. కాని అసురుడు మహాదేవ ప్రసాదితమగు దివ్య లింగమును హారముగా ధరించినందున వానిని జయింప శక్యము కాలేదు. చివరికి కుమారస్వామి అసురుని కంఠహార శోభితమైన దివ్యలింగమును ఛేదింప అది ఐదు భాగములై ఐదు ప్రదేశములందు పడుటచే ఆ క్షేత్రములు పంచారామక్షేత్రాలై వాసిగాంచినవి. ఐదు లింగాలలో మొదటిది పెద్దది కృష్ణవేణీ తల్లి తీరమున ఇంద్రునిచే

ప్రతిష్ఠింపబడి ప్రథమారామమై త్రిలోకపూజితమై విరాజిల్లుచున్నది. భీమేశ్వర పురాణము ఈ గాథను రమ్యముగా వర్ణించినది.

అంతటి మహిమాన్వితము మోక్షప్రదమగుటచే అమరారామము ప్రథమారామముగా గణుతికెక్కి నేటికిని మోక్షార్థుల సేవలందుకొనుచున్నది. అమరారామ చారిత్రక ప్రాచీనతను తెల్పు విభిన్న కాలములకు చెందిన 35కు పైగా శాసనములు ఆలయమునందు లభించినవి. నైవేద్యాది నిత్యసేవలు అందుకొని అంగరంగ వైభవముగా కొలువుదీరి యున్నట్లు తెలియుచున్నది. లభ్యమయిన శాసనములు చాళుక్య, చోడ, కోట, చాగి, వెలనాడు, కాకతీయ, విజయనగర రాజవంశముల పరిపాలనా కాలములకు చెందినవి.

పంచారామ క్షేత్రములను పూర్వ చాళుక్య ప్రభువగు భీముడు (క్రీ.శ.927 నుండి క్రీ.శ.945 వరకు) అమరేశ్వరాలయమును కూడా అతడే కృష్ణవేణీ నదీతటమున సుందరముగా తీర్చిదిద్దెను. వివిధ సందర్భములందు పలురాజవంశపు రాజులు – రాణులు, పూజారులు – పురజనులు, తమకు, తమ తల్లి తండ్రులకు, సోదరులకు 'అక్షయ పుణ్యము' కొఱకు, తమ సంతతికి ఆయురారోగ్యాభివృద్ధి కొఱకు, అఖండ వత్తి దీపములు, నిత్యనైవేద్యములు, పూలతోటలు మున్నగునవి ఆచంద్రార్కముగా గ్రామాదులను దానము చేసినట్లు తెలియుచున్నది. స్వామికి అఖండ వత్తి దీపమునకై గోవులు, మేకలు బహూకరించిరి. అక్షయ నామ

సంవత్సర శ్రావణ బహుళ దశమి ఆదివారంనాడు 'ధరణికోట అమరేశ్వర లింగమునకు' మూడవసారి ప్రతిష్ఠ చేసినట్లు ఆయన వేయించిన శిలాశాసనము పేర్కొనుచున్నది.

ఇంద్రుడు ధాన్యవాటి నమృతేశు ప్రతిష్ఠ యొనర్చె పంటరెడ్డీంద్రుడు అన్న వేమధరణీశ్వరు చేసె పునః ప్రతిష్ఠ ఆ
చంద్ర దినేంద్రతారకము శాశ్వతమవునని యాశ్వరాజ్ఞచే
హాంద్రికపెద్దమంత్రి సుగుణాంబునిధి నిల్పెను
సప్రతిష్ఠయున్.

రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయనిచేతను (1795-1797), 1980వ సం॥లో కృష్ణవేణీనది పుష్కర మహోత్సవముల సందర్భముగా నాలుగవ పునఃప్రతిష్ఠ, పునరుద్ధరణములు జరిగినవి.

క్రీ.శ.9వ శతాబ్దమున తూర్పు చాళుక్య ప్రభువు భీమునిచే నిర్మితములైన పంచారామ దేవళములు పశ్చిమ చాళుక్య దేవాలయ నిర్మాణరీతిలో నిర్మించిన బిక్కవోలు మొదలు ఆలయములకన్న రూప సౌందర్యము, వాస్తు నిర్మాణచాతురి కలిగినవి. ద్రాక్షారామ, భీమవరము లందలి ఆలయములు ఇందుకు చక్కని ఉదాహర ణములు. పంచారామముల వాస్తు నిర్మాణ రీతి విలక్షణమైనది. ఆంధ్రదేశమునందలి ఆనాటి దేవాలయములందు వీటితో పోలిన ఘనమైన గోపుర, శిఖర, విశాల ప్రాంగణ ప్రాకారాదులు కలిగినవి లేవు. గర్భ గృహములు 'ద్విభూమి' వాస్తుశైలిలో నిర్మించబడినవి. లింగమూర్తులు క్రింద నుండి మొదటి అంతస్తుకు ఎదిగినవి. కిందే నిత్యపూజాదికములు నెరవేర్చు చున్నారు. ఆరామ క్షేత్రముల బహిర్ప్రాంగణ మునకు నాలుగు ప్రవేశ ద్వారములు కలిగి 'సర్వతో భద్ర ఆలయశైలి'లో నిర్మింపబడినవి. ఈ ఐదింటి యందును ప్రాంతీయమగు చిన్న చిన్న మార్పులు- చేర్పులు కలిగియున్నవి.

పంచారామములలో ప్రథమారామ మయిన అమరారామము కూడా చాళుక్య భీమునిచే నిర్మితమై ద్రాక్షారామ, భీమవర ఆలయముల 'ద్విభూమి' వాస్తు విన్యాసముతో విరాజిల్లుచున్నది. ఆలయము ఎత్తైన వేదికపై రెండు అంతస్థులలో నిర్మాణమైనది. పై అంతస్థులలో అమరేశ్వరుడు కొలువుదీరి యుండగా క్రింది అంతస్థ సువిశాల మగు త్రిప్రాకార వలయితమై పూర్వాభిముఖముగా యున్నది. మూడు ప్రాకారములందును పదునొక లింగములు ప్రతిష్ఠింపబడి పూజలు గైకొనుచున్నవి.

మొదటి ప్రాకారము సువిశాలమై నాలుగు దిక్కుల నాలుగు ప్రవేశ ద్వారములు కలిగి యున్నది. నాలుగు ప్రవేశములందు దక్షిణపు వైపుగలది ప్రధాన ద్వారము. దక్షిణ రాజగోపుర ప్రవేశ ద్వారమునుండి ప్రదక్షిణరీతిలో ఎడమచేతి వైపునుండి పరిశీలించుచు సాగినచో ప్రణవేశ్వర, వీరభద్ర, జ్వాలాముఖి, పార్థివేశ్వర, సోమేశ్వర, మహిష మర్థిని, కోసలేశ్వరులకు ప్రత్యేక ఆలయములు కలవు. బాలాచాముండేశ్వరీ సమేత శ్రీమదమ రేశ్వరునకు ప్రథమ ప్రాంగణము నందే కళ్యాణ మండపము కలదు.

రెండవ ప్రాకారములోపల ఆగ్నేయ, నైరుతి, వాయువ్య, ఈశాన్య దిశలయందు వరుసగా విఘ్నేశ్వర, కాలభైరవ, కుమార, ఆంజనేయస్వామి వారలకు చిన్న ఆలయములు కలవు. రెండవ ప్రాకారమునందు దక్షిణపువైపున శ్రీకృష్ణదేవరాయలు వారు 1515వ సం॥లో పూర్వదిగ్విజయ యాత్రను ముగించుకుని అమరారామము దర్శించి అమరేశునకు 'తులాపురుషదానం' చేసిన సందర్భంగా కట్టించిన తులాభార మంటపము, జమిందారు రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు మహాదేవుని సన్నిధిలో తులాభారము తూగినపుడు నిర్మించిన తులాభార మండపములు రెండు గత వైభవమునకు సాక్షిగా నిలచియున్నవి.

రెండవ ప్రాకారమధ్య భాగము నుండి ఎత్తైన వేదికపైగల మూడవ ప్రాకారమున చేరుటకు తూర్పు, ఉత్తర, దక్షిణపు వైపుల మెట్లతో

కూడిన ప్రవేశ మార్గములు నిర్మింపబడినవి. ఉత్తరపు వైపునగల నదిలో స్నానమాచరించి భక్తులు తూర్పు ప్రవేశమార్గము నుండి మెట్లపై నడచి మూడవ ప్రాంగణము చేరుచున్నారు. దాదాపు 20 అడుగుల ఎత్తైన వేదిక గోడలచుట్టును చిన్న చిన్న స్తంభములు అలంకరింపబడి యున్నవి. వాటిపై చిన్న కపోత పట్టికగలదు. కపోతమునకు పైన నిర్మించబడిన చిరుగోడయే మూడవ ప్రాకారాకృతి దాల్చుచున్నది. మూడవ ప్రాకార ఆవరణమునందు నాలుగు దిశలలో శ్రీ కాళహస్తీశ్వర, శ్రీశైల మల్లికార్జున, శ్రీకాశీవిశ్వేశ్వర, చండీశ్వరులకు ఆలయములు కలవు. అమరలింగేశ్వరునకు ఉత్తరమున అనగా ఎడమ వైపున శ్రీ వేణుగోపాల స్వామి క్షేత్రపాలకుడై వేంచేసి యున్నాడు.

అమరారామమునందలి ప్రత్యేకత ఏమనగా ఆలయమునకు ఎదురుగా ప్రధాన ధ్వజస్తంభముతోపాటు ఉత్తర, దక్షిణ, పశ్చిమ దిశలయందు మూడు కీర్తి స్తంభములతో దేవళము అలరారుచున్నది. ప్రాంగణమునడుమ అమరేశ సన్నిధి విజయము చేయుచున్నది.

అమరేశుని గర్భమందిరమునకు ఎదురుగా అంతరాల, ముఖమంటపములు కలవు. మహామంటపము నందు నాలుగేసి వరుసలలో ఆరుస్తంభములు కలవు. స్తంభములన్ని అలంకార రహితములు. మహామంటపమునందే శ్రీ మదమరేశ్వర స్వామికి అంజలి ఘటించుచున్న రాజా శ్రీ వాసిరెడ్డి వెంకటాద్రి నాయని నిలువెత్తు విగ్రహము కలదు. మంటపము నందలి లోపలి కప్పుపై భాగమున వికసిత పద్మము కలంటికిం పును, మంటపములకు సౌందర్యములను బొసగుచున్నది. మహామండపము నందలి ఉత్తరపు వైపున విశ్వజనని బాలచాముండేశ్వరీ దేవి ఆలయము విరాజిల్లు చున్నది.

నాలుగు వైపుల సింహరక్షితమైన అమరావతీశ్వరుని విమానము ద్రాక్షారామము, భీమవరము లందలి ఆలయములపైగల విమాన శిఖరశైలిని పోలియున్నది. ప్రధాన ఆలయ శిఖరముపై 'నాగర' దేవాలయ శిఖరశైలిలో

రూపొందించిన చిరు విమానములు కలవు. చిన్ని విమానములన్నియు రెండు వరుసలు గలిగి 'వేసర' శిఖరములను తలపించుచున్నవి. ఇప్పుడు మెట్లపైకి ఎక్కి పై అంతస్థులో కనబడే సుమారు 3 అడుగుల లింగదర్శనాన్ని చేసుకోవచ్చును క్రింది అంతస్థులో ప్రవేశము లేదు. ఇంద్రునిచే ప్రతిష్ఠింపబడిన వాడు కాబట్టి ఇంద్రవైభవంతో అన్ని ఉత్సవ పర్వదినాలు శోభాయమానంగా జరుగుతాయి. ఆలయ బయట కృష్ణ వేణీనది స్నానఘట్టం ఉండడం యాత్రీకులకు ప్రత్యేకమైన ఆకర్షణ. ఇక్కడ స్నానమాచరించి శివుణ్ణి చూడడానికి వీలుగా ఉంది.

కృష్ణాతీర నరసింహక్షేత్రాలు

కె.ఆర్. నరసింహన్

ధర్మాన్ని నిలబెట్టుటకు తాను యుగ యుగంలోను సంభవిస్తాను అని శ్రీకృష్ణపరమాత్మ భరోసా ఇస్తాడు భగవద్గీతలో. అందుకు తగ్గట్టుగానే దశావతారాలు ఉన్నాయి. స్వామి సహస్రావతారి అంటె అసంఖ్యావతారి అన్నా జరుగుతుంది. అధ్యయనానికి అనుకూలం అయిన ఈ కోవలో దశావతారాన్ని గుర్తించడం కద్దు. వీటిలో నరసింహావతారం ప్రముఖమైనది. వరుసలో నాల్గవది. మత్స్యకూర్మవరాహావతారాలు అవతారాల ఆరోహణ క్రమంలో మొదటి మూడు మెట్లను సూచించినా, నాల్గవదైన నరసింహుడికి నరమృగాకారం క్షణావతారవేకాని సర్వలోకాలనూ ఆకర్షించిన అవతారం. 'కృతో నరసింహోబభూవ' అని యుగావతారదైవంగా గుర్తించడం అయినది.

కృష్ణవేణీ నదీతీరం నరసిఁహునికి క్రీడారంగ మనడంలో అతిశయోక్తి లేదు. కృష్ణవేణి హరిహర రూపమై దక్షిణభారతదేశంలోని పశ్చిమ సముద్ర తీరంలో పుట్టి (మహాబలేశ్వరం అరబ్బీ సముద్రానికి వందకిలోమీటర్ల దగ్గరలో ఉన్నది) పూర్వ వాహినిగా బంగాళఖాతంను చేరుతుంది. దాదాపు 1400 కి.మీ. దూరము క్రమించి మూడు రాష్ట్రాల మూలకంగా ప్రవహించి పలు ఉపనదులతో కలిసి మధ్య భూములనంతా ఫలవంతం చేసి పంట పొలాలను పెంచి, ఇహసంపదాభివృద్ధికి కారణమవడమే గాకుండ తన తీరప్రాంతాలలో పలు ఆలయాలను పొంది ఆధ్యాత్మిక సంపదాభివృద్ధికీ కారణమయింది. ఇందులో నరసింహస్వామి ఆలయాలు అసంఖ్యాకం. నరసింహుడు పలు రూపాలలో పలు భంగిమలలో కనువిందు చేస్తూ ఆత్మతృప్తిని కలిగిస్తాడు.

సహ్యాద్రిలోని మహాబలేశ్వరంలో పుట్టిన కృష్ణకొండ దిగుతుండగా

ధూమాక్షేత్రమున్నది. (సతారా నుంచి 50 కీ.మీ దూరం) ఇక్కడ సహ్యాద్రి నరసింహు డున్నాడు. ఇక్కడ ఒక కోట పాండవగఢం అనేది ఉన్నది. ధౌమ్యమునులు ఆరాధన చేశారు గాబట్టి క్షేత్రం ధూమాక్షేత్రమైనది. ఇక్కడ నదికి బ్యారేజు కూడ నిర్మాణమయింది. ఆలయంలో మొదట ఉగ్రనరసింహుడు దర్శనమిస్తే ఆయన వెనుక లక్ష్మీనరసింహుడున్నాడు. నాలుగు చేతులున్న ఈ మూర్తి స్వయంభూ అంటారు.

కృష్ణానదీతీరంలో సాంగ్లి దగ్గరలోని కోలె క్షేత్రంలోని నరసింహాలయం ప్రత్యేకత వేరు – ఇది ఒక భూగృహంలో ఉండే దేవుడు. పదహారు చేతుల నృసింహమూర్తి. హిరణ్యకశ్యపుడిని ఉదరంలో గోరుపెట్టి చీలుస్తున్న స్వామి రుద్రరమణీయంగా కనబడతాడు. ఒక్కప్పుడు పరాశరమునులు స్వయంభువై ప్రత్యక్షమైన స్వామిని పూజించి, కృష్ణానదిలో ఉంచారు. దానిని తరువాతి కాలంలో కుందళ గ్రామం పాళయగాడు భీమరాజు ఇక్కడ ఆలయం నిర్మించి ప్రతిష్ఠాపన చేశాడంటారు. దేవగిరి యాదవుల కాలంలోనే ఆలయం వెలసింది. పేశ్వాలు ఆలయాన్ని నదినుంచి కాపాడటానికిగాను ఎత్తైన ప్రహరి గోడ కట్టించారు. ఈ క్షేత్రానికి ఛత్రపతి సాహు మహారాజు, పేశ్వామోరోపంత, గ్వాలియర్‌రాజు మహాదాజి సింధ్య, నానాఫడ్నవీస్ మున్నగువారలు అనేక దానాల నిచ్చారు. పలు ప్రముఖ భక్తి పంథాలలోని హరిదాసులు దర్శించి కొనియాడారు.

భీమానీరా సంగమస్థానంలో ఉండే ఆలయం నీరా నరసింహక్షేత్రం. భీమరథీనది కూడ సహ్యాద్రి పర్వత శ్రేణులలో పుట్టి పలు నదులను తనలో కలుపుకొని కర్నాటక రాష్ట్రంలో కృష్ణానదిని చేరుతుంది. ఇచ్చట నీరానది భీమానదిలో కలిసే చోటు సంగమస్థానంలో ఆలయమున్నది. ఆలయ ప్రాంగణంలో నీళ్ళలో నడిచి స్వామి సన్నిధికి చేరుకోవాలి. ఇక్కడ విగ్రహాలు రెండున్నాయి. ఒకదాన్ని ప్రహ్లాదకృత రామరాజు అనియూ మరొకదాన్ని ప్రహ్లాదకృత నరసింహు డనియూ అంటారు.

కర్నాటకలోని రాయభాగ్‌లో కూడా ఒక నరసింహాలయ మున్నది. ఇక్కడ గుడికి మెట్లు దిగి నడవాలి. ఈ ఆలయాన్ని మరాఠా రాజు ఛత్రపతి రాజారాముడు అప్పుడపుడు సందర్శనం చేస్తూ అభివృద్ధి పరిచాడు. గర్భగృహంలోని స్వామి ఉగ్రనరసింహుడు. పదహారు చేతుల విగ్రహం. శత్రుసంహారంలో మగ్నుడై ఉండే స్వామిని అతి సమీపంనుంచి చూసే అవకాశం ఇక్కడుంది. జ్వాలారూపి నరసింహుడు అని పిలవటం కద్దు.

బాదామి గుహాలయాలు చరిత్రలో పేరు పొందిన గుహాలయాలు. ఇక్కడి వైష్ణవ గుహల్లోని నరసింహుడు అతి ఉన్నతంగా నిలిచి ఉన్నాడు. హంపి, ఎల్లోరాలలో కూడ ఇటువంటి ఉన్నతమైన (పూజలేని) విగ్రహాలను చూడవచ్చును. ఇక్కడి ఆయుధాలు పైచేతులలోనివి రెండూ పురుష ముఖాల్ని కలిగి ఉన్నవి. ఆయుధ పురుషులన్న మాట. క్రింది చేతులలో గదాదేవి పద్మదేవిలున్నారు. శిల్పంలోని శిరోభాగంలో బ్రహ్మారుద్రులు దేవేరులతో ఉన్నారు. స్థానికంగా దీనిని శాంత నరసింహ అంటారు.

బాదామి మలాపహారి నదీ సమీక్ష క్షేత్రమైతె శూర్పాలయం కృష్ణాతీర క్షేత్రం. శూర్పాలయాన్ని చూసిన పరశురాముడు ఆనందించినాడు. అప్పుడు అతని కన్నులు ఆనందజలంతో నిండాయి. రెండుబొట్లు నేలమీదపడి అశ్వత్థవృక్షం పెరిగింది. ఇక్కడ కృష్ణానదిలో ఒక అంధుడికి నరసింహస్వామి విగ్రహం దొరికి అతడు కళ్ళు పొందాడు. ఆ అశ్వత్థ వృక్షమూలంలో నరసింహుడిని ప్రతిష్ఠ చేశారు. ఇది స్వయంవ్యక్తమై ప్రతిష్ఠపొందిన విగ్రహం.

మలప్రభా, మలాపహారి, మలప్రహరి ఒకే నది పేర్లు. ఇది కృష్ణానదిని కూడల సంగమంలో చేరుతుంది. మలప్రభాతీరంలోని హుబ్బళ్ళికి మూడు కి.మీ. దూరంలోని ముగుటఖాన క్షేత్రంలో మొదట అశ్వత్థ వృక్షమూలాన్ని నరసింహ రూపమని పూజించడం జరిగింది. దీని సమీపంలో శిలాప్రతిమ పెట్టి పూజించే పద్ధతి ఆచరణలోకి వచ్చింది. వియజయనగరరాజులు ఈ వృక్ష రూపి నరసింహుడిని ఆరాధించారు. అచ్యుతరాయడు అశ్వత్థ వృక్షానికి చుట్టూ ఒక వేదికను నిర్మించాడు. దీనిని "అచ్యుతరాయల కట్ట" అని పిలుస్తారు. యాదవాచార్యులవారు ఇక్కడికి వచ్చినప్పుడు వారికి నదిలో నల్లరాయి నరసింహ విగ్రహం దొరికింది. ఆయన దానిని అచ్యుతరాయల కట్టలో ప్రతిష్ఠించాడు. మాధ్వయతులు ఇక్కడ బహుభక్తి ప్రపత్తులతో పూజాదులు నెరవేరుస్తారు.

రాయచూరు జిల్లా కొప్రలో కూడ నరసింహుడు వృక్షరూపి. కృష్ణానదీ తీరంలోని ఈ క్షేత్రంలో ఒక అశ్వత్థవృక్షం ఎండిపోతూ ఎండి పోతూ దాని రెమ్మలు విరిగిపడిపోతుండినాయి. ఒక్కొక్క రెమ్మ విరిగినపుడూ దానినుండి ఒక్కొక్క సాలిగ్రామరూపీ నరసింహుడు బయటపడినాడు. తుదకు కాండం మాత్రం మిగిలి, అదీ ఒకనాడు విరిగి రెండు ముక్కలైతే అక్కడ జ్వాలానరసింహుడు ఉద్భవించాడు. పక్కనే మరొక అశ్వత్థ వృక్షం చిగురించి. ఇక్కడ ఉద్భవించిన జ్వాలానరసింహు డిని ఇక్కడే ఉంచి పక్కన మొలచిన అశ్వత్థ తరువు చుట్టూ సాలిగ్రామ నరసింహులను పెట్టి పూజ చేయనారంభించారు. ఆలయం పెద్ద భవనం. మందిరం, వాస్తు, శిల్పం అనే ఎటువంటి విశేషాలు కనపడవు. భక్తియే వాస్తు, ప్రపత్తియే శిల్పం. ఇంకో విశేషమంటె స్వామి సన్నిధిలో కాలానంతరం శ్రీ వేంకటేశ్వరుడు కూడా చేరి నిత్యపూజలందు కొంటున్నాడు.

బీదర్ జిల్లాలో ఉండే నరసింహుడు – కారంజి నరసింహుడు. ఇతనిని ఝరణి నరసింహ అనికూడ అంటారు. బీదర్ నగరానికి మూడు కిలోమీటర్ల దూరంలో మణిచూల పర్వతాలలో నదీ ప్రాంగణంలో ఉన్న గుహానరసింహుడు ఈ ఝరణి నరసింహుడు.

కారంజి నరసింహుడు ఉండేది ఒక గుహలో. ఒక అర్ధమైలు పొడవైన ఎనిమిది పది అడుగుల ఎత్తుగల గుహలో నడుము లోతైన నీళ్ళలో నడిచి వెళ్లాలి. ఆరు – ఎనిమిది అడుగుల వంకర వంకరగా ఉన్న సొరంగము. గాలికి వెలుతురుకు గొట్టాలు, విద్యుత్ దీపాలు వేసి ఉంచారు. ఇక్కడ నీరు స్వామి పాదంలో పుడుతూ ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది. స్వామి సొరంగం ముక్తాయ ఘట్టంలోని ఎత్తైన వేదికపై నిర్మించిన మంటపంలో ఉన్నాడు. ఇక్కడ హిరణ్యకశిపుణ్ణి చంపుతూ ఉన్న స్వామి జూలు విప్పుకొని రక్తాన్ని తాగటానికై నాలుక బయట చాపి ఉండటం అతి భయంకరం, మనోహరం. పూలు కుంకుమ వాడటంవల్ల స్వామివారి తొడమీది రాక్షస ఉదర భేదనం స్పష్టంగా కనపడటం లేదు.

స్వామికి లంబకోణంలోని చిన్న గుడిలో శివుడు లింగరూపంలో ఉన్నాడు. ముందు నంది విగ్రహం ఉన్నది. దీని ఎదురుగా ఒక గుహ కనపడుతుంది. దాని సొరంగం వాకిలిలోనే ఐదు పడగల శేషునిపై ఆసీనుడైన లక్ష్మీనరసింహస్వామి కనులవిందుగా దర్శనమిస్తాడు. నిత్యపూజా నివేదనలను స్వీకరించే స్వామి ఇతడు.

(తుంగభద్రానది ఒడ్డున హంపిలో ఒక బృహదాకారి నరసింహుడున్నాడు. వాస్తవంగా ఈయన లక్ష్మీనరసింహుడు. లక్ష్మీవిగ్రహం భగ్నమైంది. చేతులూ లేవు. యోగ నరసింహ రూపంలో కనబడే ఈ మూర్తిని విజయనగర పరిపాలనాకాలంలో చెక్కడమైనది. దీనిగురించి హంపి లేఖనంలో చూడవచ్చును.)

అహోబిలం ప్రసిద్ధ నవనారసింహక్షేత్రం. కృష్ణానది ఉపనది భవనాశినీ నదీ ఒడ్డున ఉండే పర్వత సానుప్రదేశం. అన్నమయ్య పాడిన దేవుడు అహోబిల నరసింహుడు. మంగళగిరి కృష్ణానదికి ఇవతల ఉండే పానకాల నరసింహస్వామి క్షేత్రం. ఇవేగాక ప్రసిద్ధ పంచ నారసింహక్షేత్రాలు కృష్ణానది ఒడ్డున ఉన్నాయి.

కన్నడమూలం – నరసింహపదార్థ
***సంగ్రహానువాదం* – బి.ఎస్.ఎస్.**



కృష్ణాతీరపు ప్రసిద్ధ ఆలయాలు

కోరాడ రామకృష్ణ

శ్రీకాకుళం

పావన కృష్ణాతీరాన వెలసిన శ్రీకాకుళేశ్వరుడు ఆంధ్రవిష్ణువుగా చరిత్రపుటలకెక్కిన దేవాలయం. చారిత్రకాలంకంటే ముందుగా పురాణయుగం నాటి ప్రస్తావన ఉన్నటువంటి దివ్యక్షేత్రం ఇది. ఆంధ్రశాతవాహన రాజులకు మొదటి రాజధాని. ఆంధ్ర దివ్యక్షేత్రాల్లో ఇది ఒకటి. కూచిపూడి గ్రామానికి 8 కి.మీ. దూరంలో చల్లపల్లికి దగ్గరగా ఉన్నది.

పూర్వం ఒకప్పుడు ఈ ప్రాంతంలో బ్రహ్మ దేవుడు విష్ణువుకోసం తపస్సు చేశాడు. విష్ణువు ప్రత్యక్షంకాగా భూలోకవాసులను ఉద్ధరించటానికి అర్చామూర్తిగా ఇక్కడే

వసించమని కోరగా సరేనన్నాడట. అంతేకాకుండా ఈ ప్రాంతం అంతా తన పేరున ప్రసిద్ధమయ్యే విధంగా అనుగ్రహించమని కోరగా సరేనన్నాడట. అప్పటినుంచి ఈ క్షేత్రానికి 'కాకుళమ'ని పేరువచ్చింది. బ్రహ్మకు స్థానమైనది కాబట్టి కాకుళము. దానికి శ్రీ చేరి శ్రీకాకుళము అనే పేరు స్థిరపడిందని పురాణ గాథ ప్రచారంలో ఉన్నది.

పూర్వకాలంలో ఈ ప్రాంతంలో రాక్షసుల బాధను తట్టుకోలేక మునులందరూ వెళ్ళి కల్యాణినగరాన్ని పాలించే ఆంధ్రనాయకుని శరణువేడగా అతడు సైన్యంతో వెళ్ళి రాక్షసులను నిర్మూలించి వారిబారి నుండి ప్రజలకు విముక్తిని కలిగించాడట. నాటినుండి ఆంధ్రనాయకుడు శ్రీకాకుళం తన రాజధానిగా చేసుకొని రాజ్యపాలన చేశాడు. కేవలం ప్రభువు మాత్రమే కాకుండా అర్చామూర్తిగా ప్రజలచే పూజింపబడుతూ వచ్చినట్లు పురాణగాథ.

ఆలయం మొదట కృష్ణానదిలో ఉన్నట్లు వరదలవల్ల ఆలయం దెబ్బతినగా నది ఒడ్డున ప్రస్తుతం

ఉన్నచోట పునర్నిర్మించినట్లు తెలుపుతున్నారు. కృష్ణానది ఒడ్డున ఉండడం కారణంగా ఎత్తులేక పోవడం వల్ల వరదలు వచ్చినపుడు, వర్షాకాలంలో నీరు లోపలికి రావడం వలన పూజాకార్యక్ర మాలకు ఇబ్బందిగా ఉండడం వలన 1992 సంవత్సరంలో ఆలయం ఎత్తు పెంచి పునర్నిర్మాణం చేయటం జరిగింది. ఉపాలయంలో ఉత్తరాభిముఖంగా దక్షిణపు పక్క భాగ్యలక్ష్మి అమ్మవారు, ఉత్తరపు పక్క, ఆంజనేయస్వామి వారు ఉన్నారు. ముద్దులొలికే శ్రీకాకుళ ఆంధ్రవిష్ణువు గర్భాలయంలో దర్శనమి స్తాడు. మూలవిరాట్టు పై దశావతారాలను చూడ వచ్చును. శంఖచక్రాలు వ్యత్యస్తంగా ఉన్నాయి. స్వామివారి పంచలోహ రథోత్సవర్లమీద రాతలను బట్టి విగ్రహాలు శా.శ.1205వ సం॥లో భృగుమళ్ళ అనంభోగయ్య అనువారు చేయించి దానమిచ్చి నట్లు తెలుస్తోంది.

కృష్ణదేవరాయలు ఆలయప్రాం గణంలో బస చేసినపుడు ఆంధ్ర మహావిష్ణువు స్వప్నంలో సాక్షాత్కరించి కావ్యాన్ని రచించమని కోరగా ఆముక్త మాల్యద రచన ఆ ప్రాంగణంలోనే రూపుదిద్దుకు న్నది. ఆలయ ప్రాంగణంలో ఆగ్నేయ దిశలో ఉన్న 16 స్తంభాలమండపం క్షీణదశకు రాగా 'ఆముక్త మాల్యదా' మండపం పునర్నిర్మించడం జరిగింది.

అవనిగడ్డ

బందరు పట్టణానికి 37 కి.మీ. దూరంలో అవనిగడ్డ గ్రామం ఉన్నది. చాత్రక ప్రసిద్ధి పొందిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయం ఉన్నది. కృష్ణానదీ తీరంలో ఉండడంవల్ల వరదల కారణంగా ఆలయం దెబ్బతింది. తరువాత ఆలయాన్ని తరలించి నిర్మించటం జరిగిందని చెబుతారు. లక్ష్మీనారాయణస్వామి శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించారని అంటారు. అవనిగడ్డ లోని ఏడు అంతస్థుల గాలిగోపురం దివిసీమలోనే పెద్దది. గర్భాలయంలో లక్ష్మీనారాయణస్వామి వారి విగ్రహం అతిమనోహరంగా ఉంటుంది.

ఎడమతొడ మీద అమ్మవారు కూర్చొని ఉంటారు.

కూచిపూడి

భారతదేశంలో ఆంధ్రరాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని అర్జించిపెట్టిన ఒక ప్రత్యేక సంప్రదాయమే కూచిపూడి నాట్యకళ, ఈ గ్రామంలో చాలామంది నాట్యకళాకోవిదులు, స్త్రీపాత్రలను సైతం పురుషులే ధరించి రంజింప జేసినవారు వీరు కూచిపూడి భామాకలాపం జగత్ప్రసిద్ధి పొందింది.

రామలింగేశ్వర స్వామివారి దేవాలయం

ఇంతటి ప్రసిద్ధిగాంచిన ఈ కూచిపూడి గ్రామంలో వెలసిన స్వామి రామలింగేశ్వరుడు. ప్రాచీనకాలంలో కృష్ణాతీరంలో ఉన్న ఆలయం

శిథిలమైందనీ మరల గ్రామస్థులు పునర్నిర్మిం చుకున్నారని తెలిస్తోంది. క్రీ.శ.1785వ సం॥లో సయ్యద్ జంగ్ చేసిన దోపిడికి గురి అయ్యినట్లు తెలుస్తున్నది. ఈ సమయంలో ఈ ఆలయం దెబ్బతిన్నదని అంటారు. మొత్తంమీద ఈ ఆలయం పాతకొత్తల కలయిక. ఒకరిం టిలో దొరికిన ఆంజనేయస్వామివారి విగ్రహం ఈ ఆలయంలో పూజలందుకొంటున్నది. ముఖమండపంలో ఉన్న ఎనిమిది స్తంభాలలో 108 నాట్యాభికరణాలు ఉన్నాయి. స్వామి వారికి ఒకవైపు వీరభద్రుడు, మరోవైపు బాలాత్రిపురసుందరీ అమ్మవారు ఉన్నారు. గోపుర విమానంపై సిద్ధేంద్రయోగితోబాటు నృత్యభంగిమలు చిత్రించబడినాయి. నూతన గోపుర నిర్మాణం 1983 సం॥లో నిర్మిం చబడింది.

సిద్ధేంద్రయోగి మందిరం

కూచిపూడి గ్రామంలో ప్రభాకరశాస్త్రి, త్రిపురసుందరీ దంపతులకు యోగి మహారాజ్ అనుగ్రహాన శ్రీ సిద్ధేంద్రయోగులవారు క్రీ.శ.1301 సం॥లో జన్మించారు. పూర్వా శ్రమంలో వీరిపేరు కృష్ణశాస్త్రి. వీరు భామాకలాప స్రష్ట. ఆంధ్రులకు గర్వకారణంగా నిలిచిన భామాకలాప సృష్టి క్రీ.శ. 1341లో జరిగింది. ఇది ఒక అపూర్వ కళా ఖండం. అధ్యాత్మిక దృశ్యకావ్యం. సిద్ధేంద్రయోగుల వారు జ్యోతిషశాస్త్ర పారంగతులు. సత్యభామాకలాపం సిద్ధేంద్రయోగి దర్శించిన ఒక నూతన నాట్య ఫణితి, భారతీయ సంప్రదాయంలో నాట్యం ఒక పూజాంగం.

పూజలో ఒక ఉపచార సమర్పణ. కూచిపూడి గ్రామానికే కాక యావద్భారతదేశానికి పేరు తెచ్చిన యోగి పుంగవులు. వారికి కూచిపూడి గ్రామంలో వారిపేర ఒక మందిర నిర్మాణం గావించబడింది.

శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి కళాపీఠం

సిద్ధేంద్ర యోగిపై అభిమానం తో వారు చేసిన సేవకుగాను తెలుగు విశ్వవిద్యాలయం వారు కళాపీఠాన్ని ఈ మధ్యనే 52 లక్షల రూపయలతో భవననిర్మాణం గావించారు. అందు కూచిపూడి నాట్యబోధన చేయడం జరుగుతుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతిగా ఉన్న ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారి ప్రయత్నంతో ఈ కళాపీఠం సర్వతోముఖాభివృద్ధి జరుగుతోంది.

మొవ్వ - వేణుగోపాల స్వామి ఆలయం

కూచిపూడి సమీపంలోనే మొవ్వ గ్రామం ఉంది. సంగీతానికి పదాలు కూర్చిన క్షేత్రయ్య వల్ల ఈ గ్రామానికి ప్రాధాన్యత కలిగింది. దాదాపు 700 సం॥ల క్రితం నిర్మించబడిన వేణుగోపాల స్వామి ఆలయం ఉన్నది. ముద్గల మహర్షిచే శివలింగ ప్రతిష్ఠ చేయబడిన గ్రామం కావడం వలన ఈ గ్రామానికి మొవ్వ అని పేరు వచ్చినదని, నటరాజు తాండవ సమయంలో ఆయన కాలి గజ్జెలలో ఒక మొవ్వ క్రింద రాలిపడటం వలన ఈ గ్రామానికి మొవ్వ అని పేరు వచ్చినదని పలు రకాలుగా ప్రజలు చెప్పుకుంటారు.

17వ శతాబ్దిలో సంపన్న కుటుంబంలో పుట్టిన వరదయ్య, అదే గ్రామంలో వెలసిన వేణుగోపాలస్వామి అనుగ్రహ ఫలితంగానే పదకర్త, వాగ్గేయకారుడుగా ఖ్యాతి గడించాడు.

ఇచటి స్వామి వేణుగోపాలుడు. రాజ్యలక్ష్మి అమ్మవారు ఒకవైపు, మరోవైపు గోదాదేవి విడి విడిగా భిన్నరూపాలలో కొలువై ఉన్నారు. ప్రదక్షిణా పథంలో వెనుక విగ్రహమండపం ఉన్నది. విగ్రహ మండపంలో సిమెంటుతో చేసిన క్షేత్రయ్య విగ్రహం కూడ ఉన్నది. పూర్వం ముద్గలమహర్షిచే పూజింప బడిన విగ్రహంతోపాటు, ఖడ్గ ఆంజనేయ స్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవారు, విభిన, భక్త ఆంజనేయ స్వామివారి విగ్రహాలు ఉన్నాయి. వాహనమండ పాన్ని చూసుకుంటు ప్రదక్షిణాకథాంశానికి ముందు కువస్తే ఖడ్గ ఆంజనేయ స్వామి ఉపాలయం ఉన్నది.

ఈ ప్రాచీన ఆలయాన్ని 2002 సం॥లో పునరుద్ధరణ చేయటం జరిగింది.

మోపిదేవి

అవనిగడ్డకు చల్లపల్లికి మధ్య మోపిదేవి గ్రామమున్నది. మోపిదేవి గ్రామాన కుమారస్వామి సర్పాకారంలో ఇక్కడ వెలిశారు. ఆంధ్రదేశంలో తొలుత ఉన్న జాతులలో నాగజాతి ఒకటి. వారు సర్పాన్ని కులదేవతగా కొలుచుకునే వాళ్ళుకాబట్టి వీరికి నాగజాతివారని పేరు వచ్చింది. ఆంధ్రదే శంలో ముఖ్యంగా నేటి దివి తాలుకా కృష్ణకు ఉత్తర ప్రక్కగా ఉన్న ప్రాంతం అంతా కలిపి పూర్వం నాగభూమిగా వ్యవహరించేవారు. సుబ్రహ్మణ్యేశ్వ రుడు అని పిలువబడే శివలింగం ఇక్కడ పాము పాన్పు (పానపట్టు) పైన ఉన్నాడు. కాబట్టి సుబ్ర హ్మణ్యేశ్వరుడన్నారు. ఒకప్పుడు అగస్త్యునిచేత అర్చింపబడినవాడు ఈ స్వామి. కాలక్రమంలో చిన్న చిన్న నిర్మాణాలతో ఆరంభమై ఆలయంగా తీర్చిదిద్దబడింది. 1993 సం॥లో చల్లపల్లి రాజా వారి జ్యేష్ఠ పుత్రిక కోయంబత్తూరు వాసులు అయిన

రాజ్యలక్ష్మి మరియు ఆమె భర్త జయవర్ధన వేలు వారు ఇచటి కళ్యాణ మండపాన్ని నిర్మించారు.

ఐలూరు

ఉభయ రామేశ్వర క్షేత్రం కృష్ణానది ఒడ్డున త్రేతాయుగంలో రాములవారు, రావణబ్రహ్మను చంపిన పాపశమనానికి శివలింగ ప్రతిష్ఠ చేశారు. ఆంజనేయ స్వామివారు తీసుకువచ్చిన శివ లింగాన్ని చిలుమూరు క్షేత్రంలో నదికి అవతలి ఒడ్డున ప్రతిష్ఠించారు. అందువలన ఈ రెంటికి ఉభయ రామేశ్వర క్షేత్రాలుగా ప్రసిద్ధి పొందినవి.

పెదకళ్లేపల్లి

పూర్వం కదళిపురంగా ప్రసిద్ధిపొందిన పెదకళ్లెపల్లి క్షేత్రం మచిలీపట్నానికి 24 కి.మీ. దూరంలో కృష్ణాతీరాన వున్నది. ఇచ్చట కృష్ణానది ఉత్తర వాహినిగా సాగే శ్రీస్వామివారి దృష్టి పడినంత మేర అలాగే సాగి తిరిగి తూర్పుగా ప్రవహించి హంసలదీవి వద్ద సముద్రంలో కలుస్తోంది. ఇచ్చట నాగేశ్వరస్వామితోపాటు దుర్గా అమ్మవారు చాలా మహిమగల తల్లిగా భావిస్తారు. దేవాలయానికి దక్షిణ భాగంలో 'సర్పస్తంభం' అనే 2 గజాల రాతిస్తంభం దిగువున క్షేత్రరూపుడైన కర్కోటకుని శిల ప్రతిష్ఠించబడినది. పూర్వం ఎవరి చేతనైనా నిజం చెప్పించాలంటే ఈ స్తంభం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తే వారినోటి వెంట నిజమే వచ్చేదట! అబద్ధం చెపితే ఆ వ్యక్తికి ఏదో ఒక ఆపదవచ్చి తీరుతుందని అనుభవ పూర్వకంగా చెప్తారు.

ఈ దుర్గానాగేశ్వర దేవాలయాన్ని 1292 లో సోమశివాచార్యులు నిర్మించారు. తదుపరి 1782లో చల్లపల్లి దేవరకోట సంస్థానాధిశులు శ్రీరాజా కోదండరామన్న ప్రభువు పునరుద్ధరించారు. ఈ గుడికి దక్షిణాన శ్రీ వీరభద్రాలయం, కుడివైపున శ్రీదుర్గాదేవి ఆలయం, ఉత్తరదిక్కున దక్షిణాభి ముఖంగా కాలభైరవాలయం, నైరుతి దిక్కున శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరాలయం గలవు. శ్రీ దుర్గాదేవి చాలా మహిమాన్వితమైన దేవేరిగా భక్తుల కోర్కెలు ఈతి బాధలు పరిష్కరిస్తుందని నమ్మిక. మహాశివరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతుంది. ఈ దేవాలయం ఇప్పటికి చల్లపల్లి సంస్థానం పరిపాలన లోనే వున్నది.

హంసలదీవి

రుక్మిణీసత్యభామాసహిత వేణుగోపాల స్వామి దేవాలయం. సహ్యాద్రిపర్వతాలలో మహాబలే శ్వరంవద్ద పుట్టిన కృష్ణవేణమ్మ మహారాష్ట్ర, కర్ణాటకలలో ప్రవహించి ఆంధ్రప్రదేశ్ లో అడుగుపెడుతూంది. దారిలో నదులు, ఉపనదులను, వాగువం

కలను కలుపుకొని కృష్ణాజిల్లాలో పులిగడ్డవద్ద రెండు పాయలుగా చీలుతుంది. ఎడమపాయ హంసలదీవి దగ్గర సాగరసంగమం చేస్తుంది.

ఈ పవిత్ర ప్రాంతంలో వేణుగోపాల స్వామి దేవాలయం ప్రశాంత వాతావరణంలో నెలకొని ఉన్నది. ప్రాచీనమైనది. మోపిదేవికి 28 కి.మీ. దూరంలో ఉన్నది.

ఈ ప్రాంతానికి హంసలదీవి అనిపేరు రావడానికి ఒక కథ ప్రచారంలో ఉన్నది. భక్తుల స్నానాలతో అపవిత్రమైన గంగానది శ్రీ మహా విష్ణువును శరణుకోరగా తన అంశతో జన్మించిన కృష్ణానది సాగరసంగమస్థానంలో కాకిరూపంలో వెళ్ళినట్లయితే హంసరూపం పొందుతావని వరమిచ్చాడు. ఆ విధంగా గంగ పునీతమైంది.



అప్పటినుండి ఈ ప్రదేశానికి హంసలదీవి అని పేరువచ్చిందంటారు.

ఇచటి వేణుగోపాలస్వామి నీలమేఘశ్యా ముడిగా దర్శనమిస్తాడు. ఆలయం ప్రవేశమండపం, ముఖమండపాలతో, అంతరాలయ గర్భాలయాలతో ఉంటుంది. మూడు ఉపాలయాలు ఉన్నాయి. స్వామి శంఖచక్రాలతో చిద్విలాసంతో నిలుచు న్నాడు. రుక్మిణీ సత్యభామ దేవేరులు ఇరుపక్కలా ఉన్నారు. స్వామివారికి దక్షిణంవైపున్న ఉప ఆలయంలో లక్ష్మీనరసింహ విగ్రహం ఉన్నది. ఉత్తర దిశవైపున్న ఉపాలయంలో మహావిష్ణువు విగ్రహం ఉన్నది. మరొక ఉపాలయంలో రాజ్యలక్ష్మీ అమ్మ వారు ఉన్నారు. ఆలయస్తంభాలు శిల్పకళా వైభవంతో, మకర ముఖాలతో నాగబంధాలతో శిల్పకళా వైభవంతో శోభాయమానంగా ఉన్నాయి. శిల్పకళ ఇప్పుడు పూర్తిగా కనిపించదు. ఆకారం చెడకుండా ప్లాస్టరింగ్ చేశారు.

1977వ సం॥లో దివిసీమకు వచ్చిన పెనుతుపాను కారణంగా ఉప్పెననీరు ఆలయం లోనికి వచ్చి స్వామివారిపాదాలను తాకి వెళ్ళింది. ఆలయంలో స్వామిచెంత చేరిన ప్రజలు రక్షింప బడ్డారు. దెబ్బతిన్న దానిని బాగు చేయటం జరిగింది.

ఉప్పెన కారణంగా ఊరిలో దెబ్బతిన్న ప్రజలకు ఉడుపి పెజావరు స్వామివారు 110 ఇళ్ళు కట్టించి ఇచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం సామాజిక సంక్షేమ భవనం కట్టించి ఇచ్చింది. ఇప్పుడు ఇందులో ఒకవైపు గ్రామపంచాయతి కార్యాలయం ఉన్నది.

నదీతీరాల్లో పుణ్యక్షేత్రాలు

డా॥ ఎస్.బి. రఘునాథాచార్య

పరిచయం

మనం జంబూద్వీపంలో భరతవర్షంలో భరతఖండంలో నివసిస్తూ, భారతీయులమని పిలువబడుతున్నాం. ఈ ద్వీపంలో భరతఖండానికి ఏర్పడిన ప్రశస్తి ఇక్కడ ఉన్న అనేక విషయాలపై ఆధారపడి ఉంది. భగవంతుడు ఎన్నో అవతారాల నెత్తి తన పరిపూర్ణానుగ్రహాన్ని ప్రకటించిన భూమి యిది. ధర్మతత్త్వాన్ని బాగా అర్థం చేసుకోవాలనుకొనే వారు చేరవలసిన చిట్టచివరి మజిలీ ఈదేశం. సౌజన్యానికి, ఆదర్శప్రవృత్తికీ, నిస్స్వార్థభావనలకు, విరక్తికి, తపోనిష్ఠకు, ఆచారణానికి, దివ్యమై, ప్రసన్నమై శాంతసుందరమైన బాహ్యప్రకృతికి, ఒక్కటేమిటి? ఇలా ఇంకెన్నింటికో ఆస్పదమైన భూమి మన భారత భూమి. ఏ కోణంలోనుంచి చూసినా, సమగ్రతను పరిపూర్ణతను సాధించిన సాధుజనులెందరో పుట్టిపెరిగిన పవిత్రమైన గడ్డ యిది. అనేక రకాల ఈ దేశానికి ప్రసిద్ధిని సంపాదించిన లక్షణాలు ఎన్నో ఉన్నా పరంపరగా వచ్చే మన సంప్రదాయాన్ని, సంస్కృతిని, జాతీయ సమైక్యతాభావాన్ని ప్రతిబింబింపజేస్తూ, జాతికి మొత్తానికి చక్కని స్ఫూర్తిని, నూతన సముత్తేజాన్ని, మొక్కబోని చైతన్యాన్ని ఎప్పటి కప్పుడు అందిస్తూ, మన జనీనవాహినిలో ప్రముఖస్థానాన్ని ఆక్రమించుకొన్నాయి పుణ్యక్షేత్రాలు.

పుణ్యక్షేత్రాలు

'తీర్థం' అనే పదానికి పుణ్యమనికూడా అర్థం. తీర్థక్షేత్రమంటే పుణ్యక్షేత్రమన్నమాట సామాన్యంగా లోకంలో ప్రసిద్ధమైన దేవాలయాలకు దివ్యక్షేత్రాలనే వ్యవహారముంది. భగవంతుడు అక్కడ తన సాన్నిధ్యాన్ని ఇచ్చి భక్తులను అనుగ్రహించడమే దానికి కారణం. అది అన్నివిధాలా పవిత్రమైంది కాబట్టి తీర్థక్షేత్రమైంది. మన అందరి పుణ్యంవల్ల అక్కడ భగవంతుని సాన్నిధ్యం కలిగింది కాబట్టి, అక్కడ నెలకొన్న స్వామిని సేవిస్తూ మనం పుణ్యాన్ని సంపాదించుకొంటున్నాం కాబట్టి కూడా దాన్ని పుణ్యక్షేత్రమని అంటున్నాం. ఈ పుణ్యక్షేత్రాలకు మనదేశంలో కనబడుతున్న భౌగోళిక – ఆధ్యాత్మిక ధార్మిక – జీవనపరమైన సంబంధం ఇతరఖండా లలో లేదని చెప్పవచ్చు. కన్యాకుమారి నుంచి కాశ్మీరు వరకు ఉన్న భారతీయ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తే ప్రతి ఒక్కక్షేత్రంలోను ఎన్నో అద్భుత చరిత్రలు, అనుభవాలు, అనుభూతులు, సాక్షా త్కారాలు, వైభవాలు, మన మనస్సును ఆకట్టు కొంటాయి. వాటి వెనుక ఉన్న అనాదియైన కాలాన్ని, అద్వితీయమైన సంప్రదాయాన్ని, సముజ్జ్వలమైన సంస్కృతిని, సరిగ్గా అర్థం చేసుకోకుండా, అవన్నీ పుక్కిడి పురాణాలనుకుంటే అంతకంటే దురదృష్టం ఇంకోటి ఉండదు.

పుణ్యక్షేత్రాలు నదీతీరాల్లో ఎందుకున్నాయి?

ఎక్కడ చూచినా ప్రసిద్ధమైన, ప్రాచీనమైన దేవాలయాలు నదీతీరంలోనో, కొండలపైననో, కోనల్లోనో, సముద్రతీరంలోనో, అరణ్యాల్లోనో వుండడం కనిపిస్తుంది. ఇలా ఈ పవిత్రక్షేత్రాలను ఏర్పాటుచేసిన మన పూర్వులు అభిప్రాయాలు ఏమై వుంటాయి? ఇలా అవి ఏర్పడడానికి ఇంకేమైనా కారణాలున్నాయా? పైప్రదేశాలలో కాక మనం నివసించే పల్లెల్లోనో పట్టణాల్లోనో మన మధ్యలోనే ఎందుకు దేవాలయాలు వుండకూడదు? అని మనకెన్నో సంశయాలు కలుగుతాయి. ఈ సంశయాలకు ఇది సంగ్రహంగా సమాధానం.

మానవుడి మనస్సు చాల చంచలమైంది. కరిగిన లక్క మనం ఏమూసలో పోస్తే ఆ ఆకృతిలో తయారయినట్లు మన మనస్సుకూడా మనం ఎలాంటి విషయంలో ప్రవేశపెట్టినా దానితో అనుబంధాన్ని తీవ్రంగా పెంచుకొంటుంది. అది దాని స్వభావం. గట్టిపడిపోయి ఒక ఆకారాన్ని ధరించిన లక్కబొమ్మను మనం ఏంచేసినా మళ్ళా ఆ ఆకారం మారదు. అది కరిగినప్పుడే యింకో ఆకారం దాంట్లో సాధ్యమవుతుంది. అలాగే దైనందిన జీవితంలో ఎన్నో అభ్యాసాలకు గురై సమస్యల నెదుర్కొంటూ రాగ, ద్వేష మోహాలకు బద్ధుడైన మానవుడు వీటికి దూరంగా పోయి ఆహ్లాదకరమైన ప్రకృతిని చూచి పవిత్రాలు ప్రభావసంపన్నాలు అయిన నదీజలాలలో స్వేచ్ఛగా స్నానంచేసి మహోన్నతమైన పర్వతపంక్తులను పరిశీలించి మానసికంగా ఒక ఆర్ద్రతను, అనుభూతిని పొందుతాడు. నిర్మలంగా శాంతంగా ఉన్న ఆ మనస్సుకు అపుడు కలిగిన ఏ భావమైనా సహజంగా స్థిరంగా నిలబడుతుంది. పరవశించిన అతని హృదయంలో వ్యక్తిగతమైన బరువులు, బాధ్యతలు, కష్టాలు కనపడవు. ఆ క్షణంలో అతడి మనస్సు భగవంతునికి సన్నిహితమౌతుంది. అందుకనే మనపూర్వులు ఈ సంసార విషవల యాన్నుంచి మనస్సును కొంచెం పక్కకు తప్పించి భగవంతునికి దగ్గరగా చేయాలనే ఈ దేవాలయా లను మనం నివసించేచోట కాకుండా, దూరంగా ఏర్పాటు చేశారు.

మన ఇతిహాస పురాణాలు పరిశీలిస్తే ఎందరో మహాభక్తులు కొండలపైన, నదీతీరాల్లోను గొప్ప గొప్ప తపస్సులు చేసినట్లుగా కనబడుతుంది. వారిని అనుగ్రహించడానికి అక్కడికి దయచేసిన వారి ఇష్టదేవత ఆ భక్తుల ప్రార్థనపై అక్కడే ఒక రూపాన్ని ధరించడం కూడా మన క్షేత్ర మాహాత్మ్య ులలో గమనించవచ్చు. కొన్ని పుణ్యక్షేత్రాలు మనదేశంలో అలా ఏర్పడ్డాయి.

ఆగమశాస్త్రాలను పరిశీలిస్తే గ్రామపట్టణాది నిర్మాణానికి ముందే నిర్దిష్టప్రదేశంలో దేవాల యాలను నిర్మించినట్లు మనకు తెలుస్తుంది. అలా నిర్మించడం తప్పనడానికి వీలులేదు కాని పుణ్యక్షేత్ర ప్రయోజనం పట్టణాదుల్లో కంటే నదీతీరాల్లో కాని నగాగ్రాలపైకాని తేలికగా సిద్ధిస్తుంది. అనేది ప్రత్యక్షసత్యం. ఆధునిక కాలంలో అరచేతిలో వైకుంఠాన్ని చూడాలనుకొనే మానవుడు ఎంతో

దూరంలో ఎక్కడోవున్న పుణ్యక్షేత్రానికి పోలేక తను నివసించేచోటే దేవమందిరాలను నిర్మించడం ఎక్కువగా మనం చూస్తుంటాం. ఇళ్ళల్లో దేవమందిరాలున్నా, శాంతి, సమాధానం లేక, ఎక్కడో దూరంగా దేవాలయానికిపోవడం ఆ కాసేపయినా ఇంటిని, మరచిపోవాలని మనం చేసే ప్రయత్నమే కాని దేని పవిత్రతా, ప్రభావం దానికే వున్నాయి.

ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు

తనచుట్టూ ఉన్న ప్రపంచంలో అణువణువునా పరమాత్మను సాక్షాత్కరించుకో గలిగిన సంస్కృతి మనది. భగవంతుడు సర్వాంతర్యామిగా ఉన్నా పొదుగులోనే ఆవుపాలు లభిస్తున్నట్లు, అగ్గిపెట్టెతోనే నిప్పు పుడ్తున్నట్లు, మంచి బల్బులోనే విద్యుత్తు కాంతి నిస్తున్నట్లు కొన్నిచోట్లనే ఆయన సాన్నిధ్యం అధికంగా కనబడుతుంది. ఇంతకు పూర్వం చెప్పినట్లు అలాంటి పుణ్యక్షేత్రాలు మనదేశంలో ప్రతికొండలోనూ, ప్రతికోనలోనూ, ప్రతి నదీ తీరాల్లోనూ, ఇన్ని అని చెప్పడానికి వీలులేకుండా కోకొల్లలుగా వున్నాయి. నదీసాగరతీరాల్లో సుప్రసిద్ధంగా వున్న ఈ కింది పుణ్యక్షేత్రాలు మన అందరికీ తెలిసినవే.

1. శ్రీరంగం : ఇది తిరుచ్చినాపల్లికి ఉత్తరంగా కావేరీనదీతీరంలో ఉన్న పుణ్యక్షేత్రం. భూదేవి. నీలాదేవులతో శ్రీరంగనాథస్వామి అక్కడ వేంచేసి ఉన్నాడు. ఇది మనకున్న దివ్యదేశాలలో చాల ముఖ్యమైంది.

2. మధుర : యమునానదీతీరంలో ప్రస్తుతం ఢిల్లీ, ఆగ్రాలకు మధ్య వున్న పుణ్యక్షేత్రం మధుర. త్రేతాయుగంలో ఈప్రాంతానికి మధువనమనే పేరుండేది. దానికి అధిపతి మధువనే రాక్షసుడు.

శత్రుఘ్నుడు ఆ మధువనే రాక్షసుణ్ణి సంహరించి అక్కడ మధురాపట్టణాన్ని నిర్మించాడు. పూర్వం ధ్రువుడు తపస్సు చేసిన స్థలం ఇదేనని ప్రసిద్ధి. ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు జన్మించింది ఈ క్షేత్రంలోనే. ఈ మధురా నగరానికి దగ్గర్లోనే గోకులం, బృందావనం ఉన్నాయి. ఇప్పటికీ శ్రీకృష్ణుడు పుట్టిన చోటును మనం అక్కడ దర్శించుకోవచ్చు.

3. వారణాసి (కాశి) : ఇది వరణ, అసి రెండునదుల సంగమస్థానంలో ఉన్న పుణ్యక్షేత్రం. ఇక్కడ అన్నపూర్ణాదేవితో కూడా విశ్వేశ్వరుడున్నాడు. గొప్ప ఈశ్వర తేజస్సు యిక్కడ ప్రకాశిస్తుండడంవల్ల దీనికి కాశి అనిపేరు వచ్చింది. ఇక్కడ పరమ పవిత్రమైన

నదీమతల్లి గంగ ప్రవహిస్తున్నది. ఈ నదీతీరంలో పుణ్యప్రదమైన దశాశ్వమేధ ఘట్టం, మణికర్ణికా ఘట్టం, హరిశ్చంద్ర ఘట్టం మొదలైన ఎన్నో ఘట్టాలున్నాయి.

4. రామేశ్వరం : దక్షిణసముద్రసేతు సమీపంలో పర్వతవర్ధిని సమేతుడై రామలింగేశ్వరుడు వేంచేసిన స్థలమిది. సముద్రప్రాంతంలో కల పుణ్యక్షేత్రాలలో యిది చాల సుప్రసిద్ధమయింది. రావణవధ తర్వాత శ్రీరాముడు ఈ లింగాన్ని ప్రతిష్ఠ చేసినట్లు ప్రసిద్ధి వుంది. కేవలం పర్వతాగ్రాలపై ఉన్న పుణ్యక్షేత్రాలు ప్రస్తుతం కాదు కాబట్టి, ప్రస్తావించ డంలేదు. మన ఆంధ్ర ప్రదేశాన్ని మాత్రం దృష్టిలో ఉంచుకొన్నప్పుడు నదీతీరాల్లో ప్రకాశిస్తున్న ఈ క్రింది పుణ్యక్షేత్రాలు మనదేశానికే గొప్ప విశిష్టతను సంపాదిస్తున్నవని చెప్పక తప్పదు.

ఆంధ్రలో కొన్ని పుణ్యక్షేత్రాలు

1. భద్రాచలం : పవిత్రమైన గోదావరీతీరంలో భద్రుడికోరికపై సీతాలక్ష్మణులతో శ్రీరాముడు స్వయంగా వెలసిన క్షేత్రమిది. మహాభక్తుడైన రామదాసు నమ్మిన దైవం ఈ క్షేత్రంలో వున్నాడు. నేటికి యావద్భారతాన్ని ఆకర్షించే సీతాకల్యాణం ప్రతి శ్రీరామనవమికి యిక్కడ జరుగుతుంది. గోదావరి తూర్పుగా ప్రవహిస్తూ ఈ క్షేత్రానికి ప్రదక్షిణం చేస్తున్నట్లుంది.

2. శ్రీశైలం : పాతాళగంగ అనే పేరుతో నల్లమలకొండలలో కృష్ణానది ప్రవహిస్తున్నది. దానికి సమీపంలో భ్రమరాంబా దేవితో మల్లికార్జునుడు ఇక్కడ వేంచేసి యున్నాడు.

3. శ్రీకూర్మం : వంశధారా, లాంగలి నదులమధ్య వున్న క్షేత్రం శ్రీకూర్మం. ఇచ్చటి స్వామి శ్రీకూర్మనాథుడు. యావద్భారతదేశంలో కూర్మావతారక్షేత్రం యిదొక్కటే.

4. సింహాచలం : విశాఖపట్టణానికి ఉత్తరంగా సముద్రతీరంలో సింహాచలంపై వెలసిన స్వామి శ్రీనృసింహస్వామి. ఇచటి స్వామి ఎప్పుడూ గంధంతో నింపబడి వుంటాడు. వైశాఖశుద్ధతదియ చందనయాత్రోత్సవం జరుగుతుంది. ఆనాడు పైనున్న గంధమంతా తీసివేయగా ఎందరో భక్తులు స్వామి నిజరూపసందర్శనం చేసుకొంటారు.

5. అన్నవరం : పంపానదీతీరంలో అనంతలక్ష్మి, సత్యవతీసహితుడై శ్రీవీర వేంకటసత్యనారాయణ స్వామి ఇక్కడ వేంచేసియున్నాడు. ఇక్కడ నిరతాన్నదానం జరగడంవల్ల దీనికి అన్నవరం అనే పేరు వచ్చిందంటారు.



6. వేదాద్రి : కృష్ణానదీతీరంలో జగ్గయ్యపేట సమీపంలో ఇక్కడ రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అనే ఇద్దరు దేవేరులతో శ్రీయోగానందలక్ష్మీ నృసింహస్వామి వేంచేసిన క్షేత్ర మిది.

7. విజయవాడ : కృష్ణానదీ తీరంలోనే దుర్గాఘట్టానికెదురుగా ఇంద్రకీలాద్రి పర్వతంమీద శ్రీ కనకదుర్గ ఇక్కడ వేంచేసి వుంది. అష్టాదశశక్తి పీఠాలలో ఇది ఒకటి. శుంభ, నిశుంభుల వధ తరువాత ఈమె కనకవర్షం కురిపించడం చేత కనకదుర్గ అనే పేరు ఏర్పడిందంటారు. మహాబలేశ్వర్‌లో పుట్టిన కృష్ణానది 700 మైళ్ళు ప్రయాణం తర్వాత

విజయవాడలో ఈ పర్వతం ప్రక్కగా ప్రవహిస్తున్నది.

8. అమరావతి : కృష్ణానదీతీరంలో యిక్కడ అమరేశ్వరస్వామి నెలకొని వున్నాడు.

9. మాచెర్ల : చంద్రవంకనదికి దక్షిణాన చారిత్రిక ప్రసిద్ధిగల శ్రీ చెన్నకేశవస్వామి యిక్కడ వేంచేసి యున్నాడు.

10. తల్పగిరి : (నెల్లూరు) - పినాకిని అనే నామాంతరంగల పెన్నానది ఒడ్డున ఈ క్షేత్రం వుంది. దీనికే ఉత్తరశ్రీరంగం అని పేరు. ఇక్కడ శ్రీరంగనాయకస్వామి వేంచేసి యున్నాడు.

11. మోపిదేవి : కృష్ణానదీతీరంలో చల్లపల్లికి దగ్గరగావున్న ఈక్షేత్రంలో సుబ్రహ్మణ్యస్వామి వేంచేసి యున్నాడు.

12. హంసలదీవి : కృష్ణాసాగరసంగమస్థానమైన ఈక్షేత్రంలో శ్రీ వేణుగోపాలస్వామి వేంచేసి యున్నాడు.

13. శ్రీకాళహస్తి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి 20 మైళ్ళదూరంలో స్వర్ణముఖీ నదీతీరంలో ఈ క్షేత్రం వెలసివుంది. సాలెపురుగు, సర్పం, ఏనుగు



- ఈ మూడూ ఇక్కడ తరించడంవల్ల ఈక్షేత్రం శ్రీకాళహస్తిగ పేరు పొందింది. ఇక్కడ మహాభక్తుడైన తిన్నప్ప స్వామిలో ఐక్యమయినాడు. జ్ఞాన ప్రసూనాంబ ఇక్కడి అమ్మవారు. ఇక్కడ ఇంకా ఎన్నో తీర్థాలున్నాయి.

14. పుష్పగిరి : పెన్నా నదీతీరంలో సంతాన మల్లీశ్వర, ఉమామహేశ్వర చెన్నకేశవులు వెలసిన క్షేత్రమిది. ఇచటి ప్రకృతి చాల మనోహరమైంది.

సమాజం దృష్టి

ఇలా నదీతీరాల్లో పర్వత శిఖరాలపైన ఉన్న అనేక పుణ్యక్షేత్రాలను సందర్శించడంకోసం మనవారు తీర్థయాత్రావిధిని ఏర్పాటు చేశారు. నిత్యజీవితంలో అనేక సాంసారిక యాతనలకు గురి అవుతున్న మానవులు తీర్థయాత్రాదృష్టితో తోటి వారితో కొందరికో కలసి ఆ యా పవిత్రనదుల్లో స్నానంచేసి, అచట వెలసిన స్వాములను సేవించి శాంతిని, సౌఖ్యాన్ని పొందుతున్నారు. అంతేగాక సామాజిక దృష్టితో ఆలోచిస్తే, కలసి తీర్థయాత్రలు చేయడంద్వారా సహజీవనాన్ని, అక్కడక్కడ వున్న విజ్ఞాన విశేషాలను తెలుసుకోవడం ద్వారా చక్కని లోకజ్ఞానాన్ని, విశాల దృక్పథాన్ని పెంచుకొని, స్వార్థాన్ని కొంతకు కొంత తగ్గించుకొంటూ ప్రపంచంలో అన్నిచోట్ల అందరిలోను సర్వాంత ర్యామియైన భగవంతుణ్ణి చూడగలిగే సంస్కారాన్ని పెంపొందించుకోవడానికి అవకాశ ముంది. అప్పుడే ఈ దేశం నాది, నాసంస్కృతి విశిష్టమైంది, ఈ దేశానికి ఈ సంస్కృతికి, మహత్తరమైన చరిత్ర వుంది అనే భావం కలిగి ప్రతివ్యక్తి సమష్టి భావం పెంపొందించుకోవడానికి ప్రయత్నిస్తాడు.

కృష్ణానదీతీరంలో తీర్థక్షేత్ర మాహాత్మ్యం

డా॥ సింగరాజు దక్షిణామూర్తి

నైమిశారణ్య వర్ణన

సకలసంపదలకు నిలయమై పవిత్ర నదీతీరంలో ఎల్లప్పుడూ పూలతో, పండ్లతో శోభిల్లే ఎన్నో వృక్షాలతోనిండి, కన్నులపండువుచేస్తూ, క్రూరజంతువులు సైతం సత్త్వగుణం గలిగి, చిలుకలు, గోరువంకలు మొదలైన పక్షులుకూడ భగవంతుని దివ్య నామములనే ఉచ్చరిస్తూఉండగా, ఆ నామామృతం ఓంకారనాదమై నాల్గుదిక్కుల వ్యాపించి తరంగితమగుచుండగా, మంగళమై, శుభకరమై ఎల్లవేళల మునిపుంగవులు నిర్వహిస్తున్న యజ్ఞవేదికలనుండి వెలువడే ధూమరాశి నీలాకాశమంతా నిండగా, ఎందరో తపస్వులు, మునిశ్రేష్ఠులతోను, శాస్త్రాలను అధ్యయనంచేసే శిష్యుల సమూహములతోను, మహర్షి గణములు గలిగి పరమపుణ్యస్థలియైన నైమిశారణ్యం అలరారుతూ ఉంది.

నారదమహర్షి ఆగమనం

అటువంటి నైమిశారణ్యంలో నివసించే మహర్షులు ఒకనాడు పరమేశ్వరుని ప్రీతికై ''సత్రయాగ''మనే పేరుగలిగి, పన్నెండు సంవత్సరాలు చేయవలసిన సుదీర్ఘ యజ్ఞదీక్షను అనుష్ఠిస్తూ సాయం కాలాలలో పౌరాణికుడైన సూతుడుచెప్పే పురాణకథలను వీనులవిందుగా వింటూఉండగా హఠాత్తుగా ఆ సమయంలో నారద మునీంద్రుల వారు వేంచేశారు. పారవశ్యంతో హరిహర కథామృత శ్రవణం చేస్తున్న శౌనకాది మహర్షులు ఆ దేవర్షికి ప్రణమిల్లారు. అర్ఘ్యపాద్యాది విధులాచరించారు. సంతోషస్వాంతుడైన ఆ మహర్షికి వినమ్రంగా నమస్కరించి "మహాత్మా! మీ దర్శనం వలన మేము కృతార్థులమయ్యాము. మా జన్మలు సఫలమైనవి. మా నివాసాలు పావన మయ్యాయి" అని అనేక విధాలుగా స్తుతించారు. నారదమహర్షి చిరునవ్వు నవ్వుతూ ఆశ్రమవాసుల యోగక్షేమాలను విచారించారు. క్రతువిధానాన్ని దర్శించారు. పూజ్యపాదులైన నైమిశీయ మహర్షులను ప్రస్తుతించారు.

శౌనకాది మునుల ప్రశ్న

ఉత్సాహము, ఔత్సుక్యము, జిజ్ఞాస ముప్పేట పెనగొనగా, మునిసమూహము మందస్మిత సుందర వదనారవిందుడు, బ్రహ్మమానసపుత్రుడైన నారదమహర్షితో "విజ్ఞాననిధీ! సకల శాస్త్ర పురాణేతి హాస రహస్యవేదీ! నిగమార్థభాసిత వచనరచనారూ ఢమతీ! వివిధ పుణ్యకథా కథన దక్షుడైన రోమహర్షణి కృపాకటాక్షంతో శివకేశవ ప్రతిపాదితాలైన పుణ్యకథలు అనేకం ఆలకించి ధన్యులమయ్యాము.

తలచినంత మాత్రము చేతనే సమస్తపాపములను హరింప చేయునది శ్రీకృష్ణాపుష్కర మాహాత్మ్యాన్ని మీ ప్రసన్న మృదుమధుర వాక్కలాపంనుండి వినాలని ఉవ్విళ్లూరుతున్నాము. మాపై ప్రసన్న చిత్తులై కృపసేయవలయునని ప్రార్థించారు. ఆ మాహాత్మ్యాన్ని ఆలకించడానికి కుతూహలంతో తమతమ ఆసనాలలో ఆసీనులయ్యారు.

అప్పుడు, మునిజనపరీవృతుడైన నారదుడు ఆదరంతో "మహర్షులారా! మీరడిగిన విషయం అతిరహస్యమైనది, మోక్షాన్ని కల్గించేది, కోర్కెలను తీర్చేది, భక్తియుక్తుడైన మానవుడు కృష్ణానదీ సందర్శనం చేతనే నూరుజన్మలనుండి ఆర్జించిన పాపాలనుండి కృష్ణాతీర్థ సంస్పర్శనం వలన జన్మజన్మాంతరకృత పాపాలనుండియేగాక కృష్ణానదీ పుష్కరస్నానం వలన సహస్ర జన్మలనుండి సంపాదించిన పాపాలనుండి విముక్తుడగుచున్నాడు.

శివుడు, కుమారస్వామి ప్రభృతులకు చెప్పిన కృష్ణాపుష్కర మాహాత్మ్యమును నారదుడు శౌనకాది మహర్షులకు చెప్పుట

ఒకప్పుడు భక్తజనవశంవదుడైన భవానీ శంకరుడు అనర్ఘరత్న మణిఖచితసంశోభితము, పుణ్యపురుషనివాసయోగ్యము, చతుర్విధ ఫలపురుషార్థప్రదము, అంతులేని ఐశ్వర్యములకు నిలయము, బృందారక బృందాభినందితమైన రజతశైలమున సుధాకరుడు పండువెన్నెల కురిపించుచుండగా సనక సనందనాది మహర్షులు, బ్రహ్మ విష్ణువులు, గరుడ యక్షకిన్నర కింపురుషాదులు, రంభాది అప్సరసల బృందాలు, ప్రమధగణాలు, షణ్ముఖుడు, గణేశుడుతనను పరివేష్టించియుండగా అమోఘమైన రత్న సింహాసనం మీద పార్వతీ సహితుడై అధిష్ఠించి యుండగా, ఆ సమయంలో దేవసేనానియైన కుమారస్వామి ఆ మహాపరిషత్తు లో తండ్రియెదుట సవినయంగా నిలిచి నమస్కరించి "ఓ శివమహాదేవా! నీవు ఆద్యంతరహితుడవు. సంత తానందధాముడవు, స్వయంప్రకాశుడవు, అవాఙ్మానస గోచరుడవు, నీపాదపద్మములకు శిరస్సువంచి నమస్కరిస్తున్నాను. పరమ శివుడైన నిన్ను ఆరాధించుచున్నాను, అభ్యర్థించుచున్నాను. మహాత్మా! దృశ్యమానమైన ఈ ప్రపంచమంతా నీ రూపవిలాసమే! చరాచర జగత్తు సర్వం నీ కరుణాకటాక్షంవల్లనే జనించి, వృద్ధిపొంది నశిస్తూ ఉన్నది. నిరంతర తపోమూర్తివైన నీ సచ్చిదానంద స్వరూపాన్ని వర్ణించడం ఎవ్వరికి సాధ్యం? దయాసాగరా! సర్వజ్ఞుడవైన నీకు తెలియనిదేమున్నది? నాయందుప్రసన్నుడవై అద్భుతము, అచింత్యము, అమోఘము, అగణ్య పుణ్యఫలదాయకమైన కృష్ణాపుష్కర మాహాత్మ్యమును అనుగ్రహింపవలసినదిగా ప్రార్థించుచున్నాను" అని వేడుకొన్నాడు.

కృష్ణాపుష్కర మహత్వములో మొదటిదైన కృష్ణామాహాత్మ్యాన్ని శివుడు ప్రమథగణ పరిషత్తునకు వివరించుట

పిమ్మట భుజగ భూషణుడును, కపాల మాలికాధరుడును, శార్దూల చర్మాంబరుడును, తేజోమూర్తియు, భసితప్లావిత విగ్రహుడునైన ఆ మహాదేవుడు "తనయా! బ్రహ్మహత్యాపాత కాన్నైనా పోగొట్టేదీ, ఆదిశేషునికైన వేనోళ్ల వర్ణింపరానిదీ,

అతిరహస్యమయమైన ఈ మాహాత్మ్యాన్ని పుత్రవాత్సల్యం చేత నీకు చెబుతున్నాను. సభాసదులైన మీరంతా ఈ మాహాత్మ్యశ్రవణఫలం వలన మోక్షసామ్రాజ్యాన్ని పొందగలరు. ఏ రాష్ట్రంలో ఈ కృష్ణాపుష్కర మాహాత్మ్యం శ్రద్ధాభక్తులతో గానం చేయబడుతుందో, ఆ రాష్ట్రంలో దరిద్రదేవత జాడతెలియక అదృశ్యమగుటయే కాదు, అక్కడ ఉండటానికి కూడ ఇష్టపడదు. సరికదా, భయపడుతుంది" అని ఆ మాహాత్మ్యాన్ని యిలా వివరించాడు. ఆ వేళావిశేష మెటువంటిదోగాని ఆ సమయంలో నేనక్కడ ఉండటంమూలాన ఆ మాహాత్మ్యాన్ని పూర్తిగా విన్నాను. కాబట్టి ఓ మునిశ్రేష్ఠులారా! కృష్ణాపుష్కర మాహాత్మ్యం" వినండి అంటూ నారదుడు ఇలా చెప్పసాగాడు.

కథాముఖం

పడమటి సముద్రతీరంలో ఈ భూమి అనే లక్ష్మీదేవికి అలంకారములైన సహ్యపర్వతాలున్నాయి. ఆ పర్వతాలు నవరత్నములచే ప్రకాశించే కొండచఱియలు గలవి. మిక్కిలి పవిత్రమైన నదులచే కూడుకొన్నవి. బ్రహ్మ, ఇంద్రాది దేవతాసమూహములచే పేరెన్నిక గన్నవి. గొప్ప ఓషధీలతలకు, సత్త్వగుణం గల్గిన క్రూర జంతువులకు, పరిపక్వమైన పండ్ల బరువుచే వంగిన మామిడి మొదలైన చెట్లచే రమణీయమైనవి. పరమేశ్వరుని పాదార విందాలను సందర్శించాలని తహతహలాడే మునీంద్రులకు కాంతిమంతములైన పగడపుతీగల పొదరిండ్లతోను, వీనులకింపుగా వినిపించే కోకిలల కుహూ కుహూ రావముల తోను, చిలుకల చిలిపిశబ్దములతోను, నెమళ్ల క్రేంకారములతోను మధురానుభూతిని కల్గించు మనోహర వాతావరణముగలవి. దేవలోకపు అప్సరసలు ఆ పర్వత సానువుల బండరాళ్లుసైతం కరిగి ప్రవహించే విధంగా గానంచేయగల కోమల కంఠస్వరంతో, జంత్ర వాద్యములను మేళవించి ఆడుచుపాడుచు తమతమ ప్రియులకు మానసోల్లాసం కల్గిస్తూ ఉంటారు. వేయిమాట లెందుకు? అక్కడ లేని విచిత్రాలు మరెక్కడా లేవు. అటువంటి పావన సహ్యాద్రిపైగల ఉత్తర శిఖరానికి 'బ్రహ్మగిరి' యని, దక్షిణశిఖరానికి 'వేదగిరి' యని పేర్లు ఏర్పడ్డాయి.

వేదగిరి ప్రశంస

పురాతనకాలంలో చతుర్వేదాలు మానవాకృతిని ధరించి, సహ్యపర్వత దక్షిణభాగంలో భక్తజనమందారుడైన కందర్ప సంహారునిగూర్చి సుదీర్ఘకాలం తీవ్రమైన తపస్సుచేయగా, పార్వతీ ప్రాణవల్లభుడైన శంకరుడు వేదపురుషునెదుట సాక్షాత్కరించి, భక్తవత్సలా! నీ తపోనిష్ఠకు, నాయందుగల దృఢానురాగానికి చాల సంతసించాను. నీకోరికయేమిటో తెల్పు, నెరవేరుస్తాను" అని చెప్పగా, వేదపురుషుడు కేల్మోడ్చి వినయంగా "చరాచరజగత్కారణుడవైన ఓ పరమేశ్వరా! వేదములు నిన్ను వర్ణించడానికి పూనుకోగా ఆ వాక్కు లను తమకు తగిన శక్తిలేక కొంతదూరం ప్రయాణించి తిరిగి వచ్చేశాయి. నిన్ను వర్ణించడంలో వేదములే వైఫల్యము చెందినవనగా

ఇక నెవ్వరికి సాధ్యం? కనుక ఓ మహాత్మా! భక్తవరదా! మీ పాదారవిందాలను అర్చించు కుంటూ, పావన గంగాస్నానం చేస్తూ ఉండడంకన్న నాకేమీ అవసరంలేదు. ఈ రెండు వరాలను ప్రసాదించవలెనని వేడుకొంటున్నాను" అని అన్నాడు వేదపురుషుడు.

దానికి ఆ పరమేశ్వరుడు 'ఓ వేదపురుషా! నేను ఈ సహ్యపర్వతంలో ఉసిరికచెట్టురూపంలో ఉంటూ నా జటాజూటము నుండి గంగను ప్రవహింపజేస్తాను. వేణినుండి ప్రవహించడం వలన ఆ స్రవంతికకు "వేణి" అనే పేరు ఏర్పడుతుంది. కొంతకాలంవరకు నదిగాని, నేనుగాని మనుష్యమాత్రుని కంటబడే అవకాశం లేదు. పుణ్యపురుషులకుమాత్రమే దర్శనాన్ని అనుగ్రహిస్తాను' అని చెప్పి అక్కడ అవతరించాడు.

వేదపురుషుడు, సహ్యాద్రికి ఉత్తర దక్షిణ శిఖరాలైన బ్రహ్మగిరి వేదగిరుల మధ్యభాగంలో ఉసిరికచెట్టుగా ఆవిర్భవించిన పరమేశ్వరుని సేవించుకొంటూ వేణీనదీస్నానంచే పునీతుడై, ధన్యుడై తృప్తితో జీవితాన్ని గడుపుతూ పరమేశ్వ రానుగ్రహానికి పాత్రుడయ్యాడు. అప్పటినుండి సహ్యాద్రి దక్షిణశిఖరానికి 'వేదగిరి' అనేపేరు సార్థకమై అన్వర్థమయింది.

బ్రహ్మగిరి ప్రశంస

సృష్ట్యాదిలో బ్రహ్మ, దేవతలకందరికీ పెద్ద దిక్కైన నారాయణుని గూర్చి ఘోరతపస్సు చేయగా, శ్రీమన్నారాయణుడు దర్శనమను గ్రహించి "కుమారా! నీవిక తపస్సును చాలించు. తపోగ్నిచే లోకాలు దహింపబడుతున్నాయి. నిన్ను సత్య లోకానికి అధిపతిగా చేస్తున్నాను. అంతేగాక, సంకల్పమాత్రంచేత నా శరీరంనుండి పుట్టిన కృష్ణాకుమారికను నీకు పుత్రికగా ఇస్తున్నాను. ఆమె సహాయంచే ఓషధులను, నదీనదాలను, సృష్టించు. పుత్రా! అవీ యివీ చెప్పడమెందుకు? ఈ ప్రపంచానికి ఆవశ్యకమైనవి ఏవేవి కావాలో అవన్నీ సృష్టింపుమని ఆజ్ఞాపించి అంతర్ధానమయ్యాడు. అదిమొదలుకొని హంసవాహనుడైన బ్రహ్మ సహ్యాద్రి ఉత్తరగిరిపై కృష్ణాదేవితో సృష్టికార్య నిర్వహణ పరతంత్రుడైనాడు. సహ్యగిరి ఉత్తరశిఖరంపై అనుకూలమైన తన సృష్టికార్యానికి ఆ విధాత అపరిమితానందభరితుడై ఆ స్థానానికి **'బ్రహ్మగిరి'** అనిపేరు పెట్టాడు. అప్పటినుండి సహ్యాద్రి ఉత్తరగిరి శిఖరానికి **'బ్రహ్మగిరి'** అనేపేరు శాశ్వతంగా నిల్చిపోయింది.

లోకపాలకులు నారాయణుని సన్నిధి కేగుట

కృత, త్రేతా, ద్వాపరయుగాలు గడిచాయి. నాల్గవదైన కలికాలదోషం వలన ప్రజలు అసూయా పరులయ్యారు. ధర్మప్రచారం అడుగంటింది. అధర్మదేవత వేయిముఖాలతో అన్నిచోట్ల సంచారం చేయసాగింది. ప్రజలకు పాపభీతియే లేదు. చెడ్డ పనులు ప్రబలిపోయాయి. వర్ణాశ్రమ ధర్మాలు అంతమొందాయి. యజ్ఞంచేసే వైదిక బ్రాహ్మణు డొక్కడైనా లేడు. దేవతలకు హవిస్సులు లేవు. అగ్నిహోత్రుని కాజ్యాహుతులు లేవు. రాజభక్తి శూన్యమయింది. దేశభక్తి దిక్కులేకుండా పోయింది.

దైవభక్తి దేవుడికే ఎఱుక! గురుద్రోహులు, సంఘవిద్రోహులు అసంఖ్యాకుల య్యారు. రాజ, బ్రాహ్మణ, మిత్రాది, ద్రోహాలు అధికములయ్యాయి. ఎక్కడచూచినా దారిద్ర్యదేవత తాండవమాడ సాగింది. అరాచక కృత్యాలు మిన్నుముట్టాయి. మారీ స్ఫోటకాలకు వివిధ రోగాలకు, ప్రజలు బలియయ్యారు. కలిదోష ప్రాప్తాలైన ఈ వృత్తాంతాలను ఆలకించి దేవత లందరూ వైకుంఠ ధాముడైన శ్రీ మహావిష్ణుసన్నిధికి పోయి చేతులు జోడించి "జగదుద్ధారకా! ధర్మ సంరక్షకా! కలికాలదోషం చేత ప్రజానీకం చెప్పడానికి వీలుకాని ఇక్కట్లతో, అగచాట్లతో పాపభూయిష్ఠమైన నికృష్టదశను పొందియున్నది. పాపాంధకార నివృత్తికిని, లోకకల్యాణానికి మీ కరుణాకటాక్ష లేశాన్ని అర్థిస్తున్నాము. ఓ కారుణ్యనిధీ! మా ప్రార్థన మంగీకరించు" మని పరిపరి విధాలుగా ప్రార్థించే దేవగణాలను దయాదృష్టితో వీక్షించి జనార్దనుడు ఇట్లన్నాడు.

"ఓ దేవతలారా! మీ ప్రయత్నం సఫలమగు గాక! పాపులను పునీతులనుగాచేసి భక్తిముక్తుల ననుగ్రహించడానికి బ్రహ్మ దత్తపుత్రికయైన కృష్ణను భూలోకానికి అవతరింపజేస్తున్నాను. సహ్యాద్రిపైగల ఉసిరిక చెట్టురూపంలో అవత రించిన దయా సముద్రుడైన పరమేశ్వరుని పూజించుచు అక్కడ నివసిస్తూ ఉన్నది. మనమంతా అక్కడికి పోదాం రండి" అని దేవతా సమూహాలతో నారాయణుడు సహ్యాద్రిపై వెలసిన శంకర దర్శనార్థము బయలుదేరాడు.

'కృష్ణావతరణం - వేణీ' సంగమం

సహ్యాపర్వతంపై మహావిష్ణువునుగూర్చి ఒక మునిపుంగవుడు తపస్సు చేయసాగాడు. ఆ తపస్వి తనకెదురుగా శ్రీశంకర దర్శనార్థం వెళ్లే నారాయణుని చరణారవిందాలను పట్టుకొని అనేక విధాలుగా స్తోత్రము చేయగా వాసుదేవుడు కరుణించి యిట్లన్నాడు.

"మునిరూపధారియైన ఓ సహ్యపర్వతరాజా! నీకేమి కావలయునో కోరుకో యిస్తాను" అంటున్న పరంధామునితో ఆ పర్వతరాజు "ఓభక్త కల్పద్రుమా! నీవిక్కడనే అధివసించి దీనుడైన నాకు నిత్యదర్శన మనుగ్రహించాలని, మోక్షసామ్రాజ్యాన్ని కృపసే యు" మని కోరగా విష్ణువు సరేనని శివమ హాదేవుని దగ్గరకు పోయి శివకైంకర్య పరాయణియైన కృష్ణాదేవిని చూచి సంతుష్టాంతరంగుడై ముక్కోటి దేవతలతోపాటు తానుగూడ నిర్గుణ స్వరూపుడగు శివుని పెక్కువిధాలుగా ప్రశంసించాడు.

ఆ స్తోత్రాలకు ఉబ్బిపోయి భోళాశంకరుడు చిరునవ్వులు చిందిస్తూ "దేవతలారా! నారాయణు డిక్కడనే శ్వేతాశ్వత్థరూపంలో అవతరించి కృష్ణానది ని ప్రవహింపజేస్తాడు. నేనుకూడ లోకకల్యాణానికై వేణీనదిని సర్వజనలోచన గోచర అయ్యేట్లుగా చేస్తాను. ఈ మహానదులలో స్నానమాడిన జనులు పాపాలనుండి విముక్తులవుతారు. జగత్తు ధర్మసమృద్ధమై ఉంటుంది. మీమీ నివాసాలకు వెళ్లవలసినదని ఆజ్ఞాపించాడు. లోకకల్యాణం కోసం శ్రీమహావిష్ణువు శ్వేతాశ్వత్థ రూపంలో అవతరించి

కృష్ణానదిని స్వమూలముల నుండి ప్రవహింప జేశాడు. కృష్ణ, దానికత్యంత సన్నిహితమైన వేణితోకూడ కలిసి ప్రవహించడం చేత కృష్ణానదికి **"కృష్ణవేణి"** అనే పేరేర్పడింది.

కృష్ణవేణీ సంగమ మాహాత్మ్యము

మహర్షులారా! పాపిష్ఠులైన ప్రజలు తరించడానికి చక్కటి మార్గమైన కృష్ణవేణీ సంగమమాహాత్మ్యం వినండి. పూర్వం 'నందిగ్రామ' మనే పల్లెలో దేవశర్మ అనే బ్రాహ్మణునికి యజ్ఞశర్మ అనేపేరుగల కుమారుడుండేవాడు. ఆ బ్రాహ్మణ పుత్రుడు కొంతమంది దుర్మార్గులతో సహవాసం చేసి ఎల్లప్పుడు అధర్మ మార్గంలో నడుస్తూ, పూర్వజన్మలో చేసుకొన్న ఏ కొంచెం పుణ్యమో వెన్నంటిరాగా మునులలో శ్రేష్ఠుడైన వసిష్ఠుని ఒక మహారణ్యంలో చూచి, వినయంతో శిరస్సు వంచి ఎన్నో విధాలుగా ఆయనను ప్రస్తుతించాడు.

అప్పుడా మహాముని అనుగ్రహించి "వత్సా! నీచరిత్రను దివ్యదృష్టితో చూడగా అది పాపపంకిలమైయున్నది. తుచ్ఛ సుఖాలను ఆశించి అవసానకాలంలో యమభటుల చేతిలో ఎందుకు నానాహింసల పాలవుతావు? నిత్యదుఃఖమైన ఈ సంసారమనే అంధకారకూపంలో మునిగిపోయి జ్ఞానజ్యోతిని చూడలేక ఎందుకు దుఃఖిస్తావు? ప్రస్తుతం నీ నడవడిక ఇహలోకసుఖాలకే పరిమితమైపోయినప్పుడు, పరలోక సుఖాలను గురించికూడ ఆలోచించవలసిన అవసరం లేదా?" అని ప్రశ్నించగా యజ్ఞశర్మ చింతలో మునిగిపోయి, సద్గురూ! మహాపాపియైన ఈ దుర్మార్గుని అపరాధాలను క్షమించండి. కామమే ప్రధానంగా భావించిననేను నా శరీరాన్ని అగ్ని దగ్ధం చేసినప్పటికీ, చేసిన క్రూర కర్మలకు ప్రాయశ్చిత్తం పొందలేను. మహాత్మా! నేను మిక్కిలి క్రూరుణ్ణి! నా పాపాలకు నిష్కృతిలేదు. ఓ తపస్విసత్తమా! ఏ ప్రయత్నం చేతకూడ పోగొట్టలేని నా పాపాలనే కొండంత దూదిని నీ దయాదృష్టి అనే తేజోకిరణాలచే భస్మీపటలం చేసివేయి. పెద్దల మాటలు ఎన్నటికీ వ్యర్థంకావు" అని పరిపరివిధాల ఆ మునిశ్రేష్ఠుని ప్రార్థించాడు యజ్ఞశర్మ.

శరణు పొందినవారిని కాపాడే ఉదార స్వభావుడైన ఆ వసిష్ఠ మహర్షి, దీనుడై ప్రార్థించే ఆ యజ్ఞశర్మను వాత్సల్యంతో స్పృశించి, ఓ పుత్రా! కృష్ణవేణీ సంగమమాహాత్మ్యం అత్యద్భుతం. త్రిమూర్తులకు ప్రియమైన ఆ సంగమంలో మునిగి "ఓం నమశ్శివాయ" అనే షడక్షరీ మహామంత్రాన్ని నిశ్చలచిత్తంతో జపించు. ఆ తర్వాత ఆ తీర్ధానికి అధిదేవతయైన కర్హాటేశ్వరుని దర్శించుకొని సేవించు. కరుణామయుడైన ఆ మహాదేవుని

అనుగ్రహం సంపాదించావనుకో, నీవు నిష్కల్మష శరీరంతో శోభిస్తావు, సందేహం లేదని'' మంత్రోపదేశం చేసి, పోవడానికి అనుమతించాడు వసిష్ఠ మహర్షి.

అప్పుడా బ్రాహ్మణ యువకుడైన యజ్ఞశర్మ పెన్నిధి దొరికిన పేదవానివలె ఆ తీర్థాన్ని దర్శించి చేతులు మోడ్చి, ఎన్నో విధాలుగా ఆ శ్రేష్ఠమైన నదిని ప్రశంసించి, స్నానంచేసి వసిష్ఠ మహర్షి ఉపదేశించిన షడక్షరీ మంత్రరాజాన్ని జపించి, పవిత్ర శరీరుడై కర్వాటేశ్వరుడనే పేరుగల శివుని సేవించి, నిత్యానందమయమైన మోక్ష సామ్రాజ్యాన్ని చూరగొన్నాడు. కాబట్టి, ఓ మునినాథులారా! అత్యంత పావనమైన ఈ కృష్ణవేణీ నదీసంగమం ముక్తికాములకు సులభ సాధ్యమైన మార్గమై ఉన్నది.

కృష్ణానదీ తీరంలోని తీర్థ, క్షేత్ర మాహాత్మ్య సంగ్రహ కథనం

చూచినంతమాత్రం చేతనే పాపాన్ని నశింప జేసేదీ, ముక్తిని ప్రసాదించే తీర్థాలు, క్షేత్రాలు సహ్యాద్రినుండి, కృష్ణానదీ సాగర సంగమంవరకు లెక్కకు మించి ఉన్నాయి. ఆయా మాహాత్మ్యాలను వర్ణించి చెప్పడానికి నాల్గుముఖాల బ్రహ్మకుకూడ వీలుకాదు. ఒక్కొక్క తీర్థంలో ఆ తీర్థం పేరుతో భగవంతుడు ఆ ప్రాంతంలో వెలసి భక్తులకు భుక్తి, ముక్తి దాయకుడుగా ఉంటున్నాడు. భగవంతునికి నివాసస్థానాలైన ఆ యా స్థలాలు క్షేత్రాలని పిలువబడుతాయి. అవి ఏవనగా - శ్రీశైలక్షేత్రం, దుర్గాక్షేత్రం, వైరాజక్షేత్రం, నారసింహక్షేత్రం, గోకర్ణక్షేత్రములనే పేరుతో ప్రసిద్ధికెక్కాయి. కృష్ణానదిలో విలీనములయ్యే తీర్థాలివి. గోకర్ణతీర్థం, ధూతపాపతీర్థం, విశ్వేశ్వరతీర్థం, వామనతీర్థం, వాల్మీకితీర్థం, మలాపహారతీర్థం, ఘృతతీర్థం, జాహ్నవీ తీర్థం, మార్కండేయ తీర్థం, కృష్ణాతీర్థం ఇత్యాది తీర్థాలెన్నో లోకకల్యాణాన్ని కల్గించే సాధనాలుగా వెలసి ఉన్నాయి.

భగవంతుని అనుగ్రహించే ప్రవాహ రూపంగా వస్తున్న కృష్ణానదిని దేవతల సమూహాలు ఆరాధించి శ్రీశైలాన్ని ఛేదించుకొని ప్రవహింప వలసిందిగా ప్రార్థించారు. నదులలో శ్రేష్ఠురాలైన ఆ కృష్ణవేణి అఖండమైనశక్తితో వేగంతో శ్రీశైలాన్ని ఛేదించుకొని ప్రవహించింది. అప్పుడు దేవతలందరూ **"పాతాళగంగ"** అనే పేరుతో పిలవడం మూలాన దానికాపేరు సార్థకమైనిలచి పోయింది. ఆ నదిని పూజించి సఫలమనోరథుల య్యారు మానవులు. సరస్వతి మొదలైన నదులిందులో చేరడంవలన మహాదేవుడైన శివుడు మల్లికార్జున నామధేయుడై ఆ ప్రాంతాలలో పర్వతవాసుడు కావడంచేత ఈ కృష్ణానది ఎల్లప్పుడు పవిత్రమై వుంటుంది. ఈ నదిలో స్నానంచేసి మానవుడు **"శ్రీశైల శిఖరం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే"**. "శ్రీశైల శిఖరాన్ని దర్శించినంత మాత్రంచేత పునర్జన్మలేని మోక్షపదవి సిద్ధిస్తుంది" అనే మాటప్రకారం కృష్ణానదీ స్నానం, శ్రీశైల శిఖరదర్శనం, మల్లికార్జున ఆరాధన చేసినవారు అనాయాసంగా కోరిన కోర్కెలెల్ల తీరగా కైలాసవాసుని సన్నిధి చేరగలరు.

కొండపల్లి విశిష్టత

ఎం.పి. శాస్త్రి

విజయవాడకు 15 కిలోమీటర్ల దూరంలో కొండపల్లి ఉంది. కొండపల్లి అనగానే మనకు మనసులో మెదిలేవి బొమ్మలు, హస్తకళలు, కోట.

కొండవీటి రాజ్యాధిపతులలో పేరెన్నికగన్న ప్రోలయ వేమారెడ్డి కొండపల్లిలో క్రీ.శ. 1360 సంవత్సరంలో అభేద్యమైన దుర్గాన్ని నిర్మించి పరిపాలన సాగించాడు. అనంతరం ఒరిస్సా గజపతులు, బహమని సుల్తానులు, కృష్ణదేవరాయలు, ఆ పిమ్మట ఆంగ్లేయులు ఈ దుర్గాన్ని పాలించారు. శ్రీకృష్ణదేవరాయలు ఈ దుర్గాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఆరు నెలలు యుద్ధం చేయవలసి వచ్చింది. అనేక రాజవంశ చేతుల్లో అనేక భయంకర దాడులు గురి అయి, ఈనాడు నామమాత్రంగా ఉంది. గోలకొండ ద్వారం, ఎఱ్ఱబురుజు హనుమంతుని కొండబురుజు మొదలైనవి ఇప్పటికీ బాగానే ఉన్నాయి.

ప్రపంచమంతా ప్రశంసించిన కొయ్య బొమ్మలు తయారీ ఈ ఊరిదే. ఇచ్చటి హస్త కళాకారులు అనేక రకాలైన బొమ్మలు, అనేక రంగుల్లో తయారు చేసి తమ హస్తకళా నైపుణ్యంతో కళాప్రపంచంలో ఆంధ్రప్రదేశ్‌కు ఒక పెద్దపీటను సమర్పించారు. రంగురంగుల కొండపల్లి బొమ్మలు దేశవిదేశాల్లో పేరు ప్రఖ్యాతులు గడించాయి. కొండపల్లి గ్రామంలో గ్రామీణ కళాకారులు కొన్ని కుటుంబాలు ఈ కళను అంటిపెట్టుకొని జీవిస్తున్నారు. వారి పూర్వులు రాజస్తాన్ నుంచి కొన్ని తరాలముందు వచ్చి స్థిరపడిపోయారు. కొండపల్లి ప్రక్కన అడవుల్లో దొరికే ప్రత్యేకమైన, తేలికపాటి "పుణికి' అనే కఱ్ఱతో తయారుచేసే ఈ బొమ్మలు తెలుగు జానపద జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. ఇచ్చటి బొమ్మలలో రాజుగారి ఏనుగు, అంబారి, దశావతారాలు ప్రత్యేక స్థానాన్ని ఆక్రమిస్తాయి. కొన్ని దేవాలయాల్లోని శిల్పాలను, కళాఖండాలను ఈ కొండపల్లి శిల్పులే చెక్కారని చెబుతారు.

నూజివీడు

పమ్మి సత్యనారాయణ శాస్త్రి

కృష్ణాతీర సంస్థానాలు

సీ॥ రమ్యపర్వత పంక్తిరహి చుట్టు గలచోటు,
విపులాగ్ర వనలక్ష్మి వెలయు చోటు
కులపూర్వులొగి దండి కోటగట్టిన చోటు,
గురుపాదరజముచే వరలు చోటు,
రాజగోపాలు సంరక్ష గల్గిన చోటు,
పరమేశు కరుణతో ప్రబలు చోటు
వీర రక్తపుధారలూరి కారినచోటు,
దీనజనత్రాణమైన చోటు

గీ॥ ఘనతరాంధ్ర భూపుల మెప్పుగాంచు చోటు
పదియునెన్మిది పరగణాల్ మొదటి చోటు
అప్పరాణ్మండల విధానమైన చోటు
సతులు సుతులురాజిల్లు చోటు నూజివీడు॥

(కోటదేవిడి శిలపై వున్న పద్యం)

నూజివీడు అనగానే గుర్తొచ్చేవి బంగినపల్లి మామిడి, కోటద్వారాలపై ఈటెలు, కుక్కలతోనూ, గుర్రపుస్వారీ చేస్తున్న వీరులైన పద్మనాయక ప్రభువుల ఎత్తైన శిల్పాలు, కోటమహిషమ్మవారి దేవాలయం కనులవిందు చేస్తాయి.

16వ శతాబ్దంలో విజయప్పారావు బిరుదుగల అప్పన్నగారు గొల్లపల్లి దుర్గంనుండి వేటకై బయలుదేరి పోతూండగా ఒకచోట నూవుల చేలల్లో మేక తోడేలును ఎదిరించుట చూచి ఆశ్చర్యపడి, బంధువులను పిలిపించి, ఆ చేలలోనే సమావేశమేర్పరచి, ఆ ప్రదేశం శౌర్య నిలయంగా గుర్తించి, అప్పటికే గొల్లపల్లి కోట శిథిలావస్థలో ఉండడంవల్ల, అక్కడ 50 ఎకరాల స్థలంలో నూజివీడు కోటను నిర్మించడానికి నిశ్చయించాడు. నువ్వుచేల ప్రదేశంగాన అప్పుడు దానిని నూజేలవీడుగా నామకరణం చేశారు. కాలక్రమేణా అది నూజివీడుగా ప్రసిద్ధి పొందింది. అప్పటినుండి నూజివీడు మూడు శతాబ్దాలపాటు రాజధానిగా ఉంది.

నూజివీడు సంస్థాన స్థాపనకు కారణమైనది శౌర్యంగల మేక కనుక ఈ రాజులకు మేకావారని, అప్పన్నగారు నిర్మించారు కనుక వారి వంశనామం అప్పారావుగా స్థిరపడింది. ఈ సంస్థానాధీశులు విప్పర్ల గోత్రజులు. పద్మనాయక రాచ వెలమలు. వీరికె మన్నెవెలమలనీ, వెలమదొరలనీ వాడుక పేర్లు. వెలమల అనగా కొండకు ఆవలివైపు అని నిర్వచనం. అంటే వింధ్య పర్వతాలకు ఆవలివారు. నందవంశీయులైన మహాపద్మనంద, పద్మావతుల సంతతివారైన పద్మ నాయకులు మగధ సామ్రాజ్యంలో ఉండేవారు. కౌటిల్యుని కోపానికి గురియై మగధను విడచి తెనుగు దేశంలో స్థిరపడినారట. వీరు పదకొండు గణాలుగా, గణానికి ఏడుగోత్రాల చొప్పున డెబ్బది ఏడు గోత్రాలు కలవారు.

కాకతీయ సామ్రాజ్యంలో గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు, మొదలైన చక్రవర్తుల పాలనలో ఈ పద్మనాయకులు మాండలిక,

సామంత, దండనాయక బాధ్యతలను నిర్వహించిన వారు. నూజివీటి రాజవంశానికి మూలపురుషుడైన విప్పర్ల బసవదండ నాథుడు రాణీ రుద్రమదేవికి అంగరక్షక దళాధ్యక్షుడు. వీరి వంశీయులు, ఖండ్యారావు (మల్లివీడు), గుండయ, ప్రసాదిత్య నాయుడు, సింగమనాయుళ్లు – అశ్వ, గూఢాచార, సర్వ సైన్యాధ్యక్షులుగా ఉండేవారు.

12 శతాబ్ధంలో నూజివీడు సంస్థానం ఏర్పడిన నాటినుండి సంస్థానాలు ప్రభుత్వపరం అయ్యేంతవరకూ సుమారు 20 తరాలకు పైగా పరిపాలించారు వీరు. కృష్ణా గోదావరీ మధ్య ప్రదేశంలో 18 పరగణాలను పరిపాలించిన 36 ఇంటిపేర్లు గల వారున్నారు. వీరిలో మేకావారు ప్రముఖులు. యంలమంద్రం, మీర్జాపురం, తేలప్రోలు, ఉయ్యూరు, వెంట్రప్రగడ, ముసునూరు, కపిలేశ్వర పురం, గన్నవరం, శనివారపుపేట, మేడూరు, ఆత్కూరు రాజులు ప్రముఖులు.

7వ తరానికి చెందిన విజయప్పారావు 1565లో విజయనగరాధిపతి రామరాయల పక్షాన తాళికోట యుద్ధంలో గోల్కొండ సుల్తానులతో పోరాడినవాడు. తర్వాతి కాలంలో అహమ్మదునగర రాణి చాంద్‌బీబీ పక్షాన మొగలు రాజులతో పోరాడి 'విజయ' బిరుదాన్ని పొందాడు. 1572లో మొగల్ సేనలతో గోల్కొండ మహమ్మద్ కుతుబ్‌షాకు సహాయంగా పోరాడుతూ వీరస్వర్గాన్ని పొందాడు.

8వ తరానికి చెందిన 1వ వెంకటాద్రప్పారావు బహద్దరు నూజివీడు దుర్గాన్ని పటిష్ఠం చేసి, కోటకూ, పేటకూ నీటి సౌకర్యార్థమై మొగిల్ల చెరువును, రాజగోపాల ఆలయాన్ని అందుండి రహస్య మార్గాన్ని నిర్మించినాడు. దానశీలి. 11వ తరానికి చెందిన నరసింహప్పారావు అష్టదిగ్గజాలలో ఒకరైన ధూర్జటి మనుమడు కుమార ధూర్జటి రచించిన ఇందుమతీ పరిణయ ప్రబంధాన్ని కృతి పొందాడు. వీరు సంస్కృతాంధ్రాలలో పండితులు. ఆనివెల్లి వేంకటశాస్త్రి గారు తమ అప్పరాయ యశశ్చంద్రోదయమును సంస్కృత లక్షణ గ్రంథమును కృతి నిచ్చారు. వీరికి ఢిల్లీ పాదుషా తీన్‌హజారమున్ సబదార్, పజులాలత్ అనే బిరుదాలతో గౌరవించారు. 12వ శతాబ్దపు జగన్నాధప్పారావు సాహితీ వల్లభులే గాక రణకోవిదులు. ఆనివెల్లి వేంకట శాస్త్రిగారి కుమారుడు నారాయణ శాస్త్రిగారి చేత సాహిత్య కల్పద్రుమమును రచింపజేసి కృతిభర్తయైనాడు. నిజాంవారి నిమిత్తమై ఫ్రెంచివారితో కల్‌బర్గి (గుల్‌బర్గా) దుర్గంలో పోరాడుతూ మరణించాడు.

కాకతీయ రాజులకు సామంతులుగానూ, సేనాపతులుగానూ ఉండిన వీరు కాలక్రమేణా విజయనగరం, నైజాం, మొగల్ మొదలగు రాజులకు సామంతులుగా అవసరమై నప్పుడు సైన్యాన్ని సమ కూర్చేవారు. 18వ తరానికి చెందిన నారయప్పారావుగారు ఆంధ్రభూమిపై బ్రిటిషు పాలనను ఎదిరించి గజగజలాడించిన వీరసింహుడు. వీరు రెబెల్ నారయప్పారావుగా పేరుపొందారు. వీరపాండ్య కట్టబొమ్మన్‌కు సమకాలీనులు. నూజివీడు సంస్థానాన్ని వశపరచు కోవడానికి కర్నల్ మౌంట్ గోమెరీ ఆధ్వర్యంలో మేజర్లు నానేజీ, టీస్సులు; లెఫ్టినెంట్లు- లాడ్సు, జాన్‌లీ, కాక్రేన్, కోల్బు, షెన్సర్డ్‌లు ఒకేమారు 20-11-1783 నుండి 10-12-1783 వరకూ 21 రోజులు 4 వేలమందితో కోట మూడువైపులా ముట్టడించారు. ఆ విషయం ముందుగానే తెలిసిన నారయప్పారావు గారు, 10 వేలమంది సైనికులను కోటలో ఉంచుకున్నారు. తర్వాత జన నష్టం కావడానికిష్టం లేక నాల్గవవైపు నుండి రాణీవాసంతో పాటు వేణుగోపాలస్వామి ఆలయంలోని రహస్య సొరంగంద్వారా సైనికులతో పాటు బయటపడి, 4 సంవత్సరాలపాటు బయటనుండే పరిపాలన సాగించిన మనిషి. వీరిసేనకు హనుమత్ సేనా వాహిని అని పేరు.

వీరి కుమారులే శ్రీవేంకట నరశింహప్పా రావు. వీరు ధర్మప్పారావుగా పేరుపొందారు. వీరి కాలంలో (1793) పద్మనాయకుల పాలనలో ఉన్న 18 పరగణాలు బ్రిటిషు వారి ఈస్టిండియా కంపెనీకే స్వాధీనం చేశారు. వీరు ఏలూరు దగ్గరలోని శనివారపు పేట రాజధానిగా పరిపాలించారు. వీరు అనేక ధర్మ ప్రజాహిత కార్యాలు చేశారు. సంస్థాన ధనమంతా హరించుకుపోగా మంత్రులు, సామంతులు కలిసి కవి, పండిత గోసాయిలను రాజావారి దర్శనం కలగకుండా నిషేధించారు. ఒకసారి రాజదర్శనార్థమై వచ్చిన ఒక బ్రాహ్మణ పండితుడు రోజులతరబడి దేవడీముఖద్వారం వద్ద ఉండిపోయాడట. కొన్నాళ్లకు చంద్రగ్రహణా నంతరం సూర్యోదయపు వేళలో తమ్మిలేరులో స్నానం చేయడానికి బయలుదేరిన ధర్మప్పారావు గారిని గుర్తించి వారికి వినబడేటట్లుగా ఆ పండితుడు ఒక పద్యపాదాన్ని చెప్పాడట.

చం॥ **వెలమకులంబునుందు నిలువెల్లరు కాంతలనగ విందు, నప్పులుకు అబద్ధమాయె...** అదివిని రాజాగారికి విపరీతమైన కోపంవచ్చి మేనాలోంచి దిగుతుండగా తక్కిన పద్యభాగం చదివి వారి మన్ననలను పొందాడట. ఆ పద్యభాగం ఇది. **కులపాలకధీమణీ, అప్పరాయరాట్కులభయు కీర్తికాంత కృతికాంత మహీజయకాంత ముప్పురుం గల జగమంతయుం దిరుగగా గనుగొంటిమి చోద్యమిద్దరిన్॥** వీరి స్మృత్యర్థం వీరి ప్రాచీన భవనాన్ని దానమిచ్చి ధర్మప్పారావు కళాశాలను స్థాపించారు.

నూజివీడు అప్పారావులు - అశ్వారావులుగా పేరుపొందారు. అశ్వారోహకులుగా, శిక్షకులుగా పేరుపొందారు. నిజాం నవాబు ప్రకటించిన గుర్రపు పందేలలో విజయం పొందినవారు. 15వ తరానికి చెందిన శ్రీరాజా శోభనాద్రప్పారావుగారు అంతవరకూ వైష్ణవభక్తులుగా ఉన్నవారు నూజి

వీడులో శిష్టావారిచే శివాలయాన్ని నిర్మించి శివభక్తులయ్యారు. అదిగాక ఇతర మతాల్నికూడా ప్రోత్సహించేవారు. మసీదులను, కట్టించి పీర్లపండుగకు వెండి పీర్లను తయారు చేయించి ఇవ్వడంతోపాటు వారి ఏడుగురు కుమారులను గుర్రాలతో పంపించి ఊరేగింపుకు ముందు వెళ్లేటట్లు చేసేవారట. ఇప్పటికీ ఈ పీర్లపండుగ నూజివీడులో ఆనందంగా నిర్వహిస్తారు. గాంగేయే శ్వరసూరి తమ సత్రాజితీయ పరిణయమను సంస్కృత ప్రబంధాన్ని వీరికి కృతినిచ్చారు. శ్రీ నారయప్పారావుగారు వ్యవసాయోపయోగమైన అనేకకార్యాలు చేశారు. **ఆగిరిపల్లిలోని వీరి రాజవంశపు శ్రీ శోభనాచలేశ్వర దేవాలయాన్ని నిర్మించారు.**

16వ తరానికి చెందిన వుయ్యూరు రాజాగా పేరుపొందిన శ్రీ రాజారంగయప్పారావు గారు సంస్కృతాంధ్ర పర్షియా భాషాకోవిదులు. పర్షియాలోనున్న షహనామా అను గ్రంథాన్ని పారశీక ధరాధీశ చరిత్రగా వ్రాశారు. నూజివీడులోనూ, వనపాములలోనూ ఉన్నత పాఠశాలలను, విజయవాడలో కళాశాలను, వికలాంగులకు సత్రాన్ని స్థాపించారు. శిల్పమందు నిపుణులు. నూజివీడులోని కోట ద్వారంపైన వేటచిన్నహంగా వేటకుక్కలు, ఈటె చేపట్టిన తన భీమబలుడైన సోదరుడు జగన్నాథప్పారావు దండలు కట్టుకొని నిలబడిన శిల్పాన్ని నిర్మింపజేశారు. వీరి ఆస్థాన పండితులు చిలకమర్తి లక్ష్మణాచార్యులు, బుక్కపట్నం రాఘవాచారి గారలు. వీరు తమ కువలయాశ్వ విజయమను గ్రంథాన్ని శ్రీ రాజావారి కంకితమిచ్చారు.

శ్రీ సింహాద్ర్యప్పారావు గారు గజశిక్షణా ప్రవీణులు. 18 ఏనుగులను పోషించి పెంచేవారట. మీర్జాపురం రాజా శ్రీవేంకట నృశింహప్పారావు బహద్దరుగారు రాజా బాబయ్యగా ప్రసిద్ధిపొందారు. వీరికి రాచకురుపు పుట్టగా మత్తుమందు తీసుకోవడానికి నిరాకరించి యూరోపియను డాక్టర్లచేత శస్త్రచికిత్స చేయించుకొన్న ధైర్యశాలి. 16వ తరానికి చెందిన శ్రీరాజా పార్థసారథప్పారావుగారు నైజాం ప్రభువునుండి పాల్వంచ, భద్రాచలం ఎస్టేటులనూ; సవాయి, అశ్వారావు బిరుదులను పొందినారు. భారతదేశంలో నూజివీడు మామిడికి పేరు తెచ్చినవారు 17వ తరానికి చెందిన గన్నవరం రాజాగారు వరద రాజప్పారావు బహద్దరుగారు. వీరు వారి చెమ్మన్‌లో అంట్లుకట్టు విధానంలో అనేక ప్రయోగాలు చేశారట. వీరు జహంగీరు, హిమాయత్ రకం మామిడులు దేశానికి అందించారు. ఈ తరానికే చెందినవారు కవులు, పండితులైన నాలుగవ రామచంద్రప్పారావు గారు. వీరికి విశ్వనాథ సత్యనారాయణ గారు తమ అనార్కలీ నాటకాన్ని అంకితమిచ్చారు. వీరికి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు, వింజమూరి శివరామారావుగారలు సన్నిహితులు.

సాహితీవల్లభ, కళాప్రపూర్ణ బిరుదాంకితులు శ్రీరాజా వేంకటాద్ర్యప్పారావు గారు (ఉయ్యూరు రాజా) రాజారంగయ్యప్పారావుగారి దత్తపుత్రులు. సంగీత, సాహిత్య, జ్యోతిష, నృత్య, వాస్తు, చిత్రకళలయందు పండితులు. మృగయా వినోదం, అశ్వశిక్షణలలో ప్రతిభాశాలురు. కోడిపందాల నుండి గుర్రపు పందాలవరకూ, పుట్‌బాల్‌నుండి

పోలోవరకూ ఆటలెరిగిన క్రీడాకారులు. కవిపండిత పోషకులు. వీరి ఆస్థానంలో బొమ్మ కంటి వీరరాఘవా చార్యులు, మల్లాది సత్యనారాయణ శాస్త్రి, చివుకుల సత్యనారాయణ శాస్త్రివంటి వారెందరో పండితులుగా నుండేవారు. వీరు స్వీయచరిత్రతో పాటు నాటకాలు, పద్యకావ్యాలు, యక్షగానాలు. అనువాదాలు, దండకాలు, చరిత్రలు, కీర్తనలు, దైవ సహస్రనామాలు మొదలైన 24 గ్రంథాలను వ్రాసి ప్రకటించారు. అముద్రితాల నేకం. నూజివీడులో అనేక శిల్పాలను నిర్మించారు. విజయవాడ – ఏలూరు రహదారి నుండి నూజివీడు పోయే నాల్గురోడ్ల కూడలిలో హనుమాన్ విగ్రహాన్ని నిర్మింపజేసి హనుమాన్ జంక్షనుగా చేసినవారు వీరే. 1929లో గాంధీమహాత్ముని ఆహ్వానించి, తాము రైతులనుండి పొందే 5 లక్షల రూపాయల ఆదాయాన్ని అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుడు. తిరుపతి వేంకటకవులు వీరికి ఆప్తులు. భగవద్గీత కృష్ణార్జున సంవాదం కనుక దానిని ఉపన్యాసాలుగా గాక సంవాదంగా రూపొందించి ప్రజలముందు వైకుంఠ ఏకాదశి రోజున ప్రదర్శించేవారు. అందులో కృష్ణుని పాత్ర శ్రీ చివుకుల వేంకట సుబ్బావధానులుగారు, అర్జునపాత్ర శ్రీ జొన్నలగడ్డ మృత్యుంజయ శర్మ, వైద్యుల నారాయణరావు, శ్రీసూరి సీతారామాంజ నేయులు, శ్రీమతుకుమిల్లి కృష్ణారావు గారలు పోషించేవారు.

వీరి పుత్రులే కుమారరాజాగా ప్రసిద్ధి గాంచిన మంత్రివర్యులు మేకా రంగయప్పారావు గారు. వీరు ఆంధ్రవిశ్వ విద్యాలయమునకు వైస్ ఛాన్సలర్‌గా చాలా కాలం ఉన్నారు. నాటక, నృత్య, సాహిత్య పరిషత్తులకు రెండు దశాబ్దాలు నేతృత్వం వహించారు. రుబాయత్, ఆంధ్రుల సంస్కృతి, ప్రజాస్వామ్య సోషలిజం, పంచాయితీ రాజ్యం – అనేవి వీరి రచనలు. వీరు కృతిపొందిన రచనలు – విశ్వనాథవారి మాబాబు, జమ్మలమడక వారి 'కుంతకుని వక్రోక్తి', పాటింబండవారి నాగానందం, దురిశేటివారి అనార్కలి, పోణంగివారి తెలుగు నాటక వికాసము, పులివర్తివారి అమరుక కావ్యానువాదం, తూమాటివారి జానపదకళా సంపద, యర్రోజువారి మాఘవలయం, అత్తిలి వారి హంసగీతి, స్తోత్రమంజరి మొదలైనవి. వీరి అనుచరులుగా సహచరులుగా మిత్రునిగా మంత్రి గానుండి కుమారరాజావారి జీవిత సాఫల్యమునకు సర్వవిధాలా తోడ్పడిన కీ.శే. యర్రోజు మాధవాచార్యుల ప్రోత్సాహం వల్లనే శ్రీ కుమార రాజావారు నూజివీడులో ధర్మప్పారావు కళాశాల స్థాపించారు. వీరి కృషివల్లనే నూజివీడు లోని ఆత్కూరు ఎస్టేటు భవనంలో పోస్టు గ్రాడ్యుయేట్ సెంటరు వచ్చింది.

శ్రీరాజా వెంకట్రామప్పారావు (మీర్జాపురం రాజా) గారు మద్రాసు అసెంబ్లీకి రెండుమార్లు ఎన్నుకోబడ్డారు. శ్రీ శోభనాచల స్టూడియోను (ఇప్పటి వీనస్ స్టూడియో) స్థాపించి అనేక కళాకారులను పోషించారు. వీరి భార్య రాణీ భూదేవమ్మారావు గారు దానశీలి. నిత్యం బస్తా నూకలను జావ కాయించి బీదలకు వితరణ చేసిన తర్వాతనే వారు భోజనం చేసేవారట.

అనేక కళలను పోషించి, ప్రజలను ధర్మ మార్గాన్ని నడిపించి, తమ రాజ్యాన్ని తమ ఉనికిని కాపాడుకుంటూ, వీరులై, సాహితీ వల్లభులై మూడు శతాబ్దాలపాటు ప్రజారంజకంగా పాలించినవారు నూజివీడు ప్రభువులు.

శాసనాదులలో కృష్ణానది

డా॥ గల్లా చలపతి

అవతారేషు శ్రేష్ఠం కథయతి బుధః కృష్ణమపి చ,
తదాఖ్యా పాంచాలీ ప్రథయతి పురంధ్రీషు సతతం,
తదాఖ్యాకో వ్యాసః ఋషివర ఇతి ఖ్యాతి మగమత్,
తథైవ త్వం కృష్ణే! సకల తటినీషు ప్రభవసి.

కృష్ణ అంటే నలుపని, ప్రకరణార్థాన్ని బట్టి శ్రేష్ఠమని అర్థం. కృష్ణుడు, పాంచాలి, వ్యాసుడు నల్లనివారు. ఈ మువ్వురూ ఎంత ప్రసిద్ధులో చెప్పనవసరం లేదు. అలాగే కృష్ణానది నదులన్నిటిలో తలమానికమని చెప్పడానికి ఆ పేరే చాలు. ఈ నదికి 'కృష్ణవేణి' అనే ప్రసిద్ధి ఉంది. మహారాష్ట్రలోని సహ్యాద్రి ఉత్తర శిఖరమైన బ్రహ్మగిరిలో పుట్టిన కృష్ణ గుట్టలు మిట్టలు అడవులు కొండలను అతిక్రమిస్తూ సుదీర్ఘంగా ప్రవహించి వేదగిరిలో 'వేణి'ని తనలో కలుపుకొని కృష్ణవేణిగా మారి కృష్ణాజిల్లా హంసలదీవి దగ్గర సాగర సంగమం చేస్తుంది. తన పరీవాహక ప్రాంతాలను బంగారు పండే పంట పొలాలుగా మార్చిన ఈ నదీమతల్లికి మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రజాతుల సంస్కృతిని పునీతం చేసిన చరిత్ర ఉంది. కృష్ణవేణి చక్కని కనులు గలదిగా, శ్యామల దేహం గలదిగా, శంఖచక్రాది విష్ణు చిహ్నాలు గలదిగా, చతుర్బాహువులు పీతాంబరం కలదిగా, ప్రసన్నరూపం గలదిగా స్కంధపురాణం అభివర్ణించింది. కలియుగారంభంలో నిష్ఠాగరిష్ఠుడైన సహ్యముని తపస్సుకు మెచ్చి శ్రీకృష్ణుడా మునిని సహ్యాద్రిగా అవతరించమన్నాడు. తన అంశ అయిన కృష్ణ ఆ మునిమేనుపై సదా ప్రవహిస్తుందని వరమిచ్చాడు. ముని అందుకంగీకరించి సహ్యాద్రి అయినాడు. శ్రీకృష్ణుడు కృష్ణానదిగా ఆముని మేనుపై ప్రవహిస్తూనే ఉన్నాడు. కలియుగ కల్మషాలను కడిగి పారవేయడానికి కృష్ణ ఈ రకంగా అవతరించింది. కృష్ణ జన్మకు సంబంధించిన పురాణ కథనాలివి.

నది సాగితేనే మానవజీవితం సాగుతుంది. మానవసంస్కృతి నదీమూలాలలోనే వికసించింది. జలమే ప్రాణం కాబట్టి మానవజీవితంలో నదుల కింత ప్రాధాన్యం. నదులను దేవతామ తల్లులుగా ఆరాధిస్తున్నదిందుకే. కృష్ణ అందంగా, గంభీరంగా ప్రవహించే జలస్రోతస్విని. ప్రాచీనుల నుండి ఆధునికుల వరకు ఎందరో కృష్ణవేణి సోయగాలను తమ కావ్యాలలో గానం చేశారు. ప్రాచీనకాలం నుండి ఎన్నో శాసనాలలో కృష్ణవేణి అనేక పేర్లతో కనిపిస్తున్నది. బౌద్ధ నాగరికత కృష్ణ కిరువైపులా వికసించినట్లు చరిత్ర ఎన్నో సాక్ష్యాలను చూపిస్తున్నది. బౌద్ధ స్తూపాలలో తలమానికమైన అమరావతి స్తూపం కృష్ణ ఒడ్డుననే నిర్మింపబడి ఉంది. శాతవాహనుల నుండి ఆంధ్రను పాలించిన రాజ వంశాలన్నింటికి కృష్ణతో అనుబంధముంది. ఇక్ష్వాకు వంశపు రాజులు కృష్ణానదీ సైకతాలపై నడిచినవారే. ఆ వంశపు రాణి రుద్రధర భట్టారిక పారాణి గుర్తులు

కృష్ణా సైకతాలమీద ఇప్పటికీ కనిపిస్తాయని అడవి బాపిరాజుగారు 'అడవి శాంతిశ్రీ' నవలలో భావుకత్వాన్ని ప్రదర్శించారు.

శాసనాలు : జాతక కథలలో కృష్ణకు **'కణ్ణజెన్న'** అని పేరుంది. **శంఖపాల జాతకం** కణ్ణజెన్న ప్రాంతమే నాగలోకమని చెపుతున్నది. ప్రాచీన కాలంలో కృష్ణా ఉత్తర తటప్రాంతానికి నాగభూమి అని పేరున్నట్లు ప్రాచీనాంధ్ర సంస్కృతిని పరిశీలిస్తే తెలుస్తుంది. ప్రాకృతంలో కృష్ణానదికి **కణ్ణబెణ్ణ, కరబేదా, కన్హవణ్ణా** అనే పేర్లున్నాయి. మొట్టమొదటి సారిగా కృష్ణానది క్రీ.పూ. ఒకటవ శతాబ్దానికి చెందిన ఒక ప్రాకృత శాసనంలో కనిపిస్తున్నది. కళింగరాజు ఖారవేలుని జీవిత దశలను వివరించే హాథీగుంఫా శాసనంలో**'దుతియేచవసే కన్హబేంణాం గతాయచ సేనాయ వితాసితి అసికనగరం'** అనే వాక్యంలో ఈ నది **'కన్హబేంణా'** అనే పేరుతో కనిపిస్తున్నది. ఆ రాజు రెండవ పరిపాలనా సంవత్సరంలో కృష్ణవేణినదీ తటంపైగల ఋషిక నగరం సమీపంలో సేనను మోహరించాడని పై ప్రాకృత వాక్యానికి తాత్పర్యం. క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందిన **నాసిక్ గుహా శాసనాల**లోని ఒక శాసనంలో నహపానుని అల్లుడైన **ఉషవదాత** అనేరాజు బ్రాహ్మణులకు చేసిన అనేక దాన వివరాలున్నాయి. దానాలు చేసిన సందర్భంలో ఈ రాజు బాటసారులను ఉచితంగా నదులు దాటించ డానికి అనేక పడవలను ఏర్పాటు చేయించాడు. ఇబా, పారాదా, దమణ, తాపి, కరబెణా, దాహనుకా నదులను దాటడానికి ఈ పడవలు ఉద్దేశింపబడి నట్లు శాసన కథనం. ఈ నదుల ఇరు గట్లమీద ప్రయాణీకుల సౌకర్యార్థం శిబిరాలు గూడా నిర్మింపబడినాయి. **కరబెణా కృష్ణానదేనని వెంటనే అర్థమవుతుంది.** ఇక ఆ పట్టికలోని మిగిలిన నదుల సంగతి సరిగా తెలియదు.

మధ్యయుగ ఆంధ్రచరిత్రలో కృష్ణానదికి ఎంతో ప్రాధాన్యం ఏర్పడినట్లు శాసనాలు నిరూపి స్తున్నాయి. విరాట్పురుషుడైన శ్రీకృష్ణునిలో సమస్త విశ్వమూ ఉన్నట్లు ఆ మహాపురుషుని పేరుతో ఏర్పడిన ఈ నదిలో సమస్త పుణ్యనదులు సంగమిం చినట్లు ఆస్తికుల విశ్వాసం. కృష్ణానదిలో స్నానం పరమపుణ్యప్రదమని భావించేవాళ్లు ఈ నది స్నానఘట్టాల దగ్గర అనేకరకాల పూజలు నిర్వహి స్తారు. ఈ పూజలలో ఆబ్దిక క్రియలు ముఖ్యమైనవి. దేశ సరిహద్దులను గుర్తించడానికి కృష్ణవేణీ నదీ తీర దక్షిణప్రాంతం, ఉత్తరప్రాంతం అని పేర్కొనడం అనేక తెలుగు శాసనా లలో కనిపిస్తుంది. క్రీ.శ. 1129 నాటి ఒక శాసనంలోని **'కృష్ణవేణ్ణా నదీతీర**

దక్షిణ షట్సహస్ర విషయాధీశ్వర' అనే విషయం, క్రీ.శ.1131 నాటి మరొక శాసనంలో '**క్రిష్ణవెణ్ణా నదీతీర దక్షిణ షట్సహస్ర విషయాధీశ్వర**' అనే విషయం దీన్ని నిరూపించే అంశాలు. దాతలు దానం చేసే సందర్భాలలో నదీ తీరానికి వచ్చి దానం చేస్తే అనంతమైన పుణ్యం దక్కుతుందని నమ్మేవారు. కృష్ణానదీ తీరంలో దానం చేసిన సందర్భాలెన్నో మధ్యయుగ శాసనాలలో లిఖించబడి కనిపిస్తున్నాయి. 'శ్రీకృష్ణవేణీ నదీతీరమందు... హవిబల్యర్చన సంపూర్త్యర్థముగాను ఆచంద్రార్క స్థాయిగాను ధారా పూర్వకమగు నట్టుగా...' దానం చేసిన విషయం ఒక శాసనంలో ఉంది. ఈ శాసనంలో 'ధారా పూర్వక' అన్న విషయం గమనింపదగిన విశేషం. దాత కృష్ణానదిలోని నీటిని దోసిటితో దానగ్రహీత చేతులలో పోస్తూ దానం చేయడాన్ని ఈ మాట తెలుపుతుంది. క్రీ.శ.1258 నాటి నాదెండ్ల గోవర్ధన స్వామి దేవాలయ స్తంభం మీద చెక్కబడిన ఒక శాసనంలో అప్సరాంగనలు కృష్ణవేణి నీటిలో క్రీడించిన విషయం ఈ శ్లోకంలో చెప్పబడింది.

యద్వార వధ్వః పయసాం విహారే కుర్వంతి పీనస్తన కుంకుమేవ
భువస్సింధూర పరాగయోగాం సీమంత రేఖామివ కృష్ణ వేణ్ణాం

సాధారణంగా శాసనాల ప్రారంభంలో దేవతాస్తుతులు కనిపిస్తాయి. శాసనం వేయించే వాళ్ళ భక్తి ప్రపత్తులనుబట్టి వాళ్లకిష్టమైన దేవతల స్తోత్రాలు కనిపించడం సహజం. శాసనాల చివర శాపోక్తులు ఉంటాయి. శాసనోద్దేశాన్ని చెడగొట్టిన వాడు గంగానది ఒడ్డున గోవును వధించిన పాపం పొందుతాడని, కన్న కొడుకును వధించిన పాపాన పోతాడని ఇత్యాది మాటలు శాసనాల రక్షణకోసం పొందుపరచినవి. ఇలాంటి సందర్భాలలో నదీ స్తుతులు కనిపిస్తున్నాయి. పైన చూపిన శ్లోకంలాంటి శ్లోకాలు కృష్ణానది గొప్పతనాన్ని వివరిస్తూ ఎన్నో శాసనాలలో కనిపిస్తాయి.

కృష్ణకు తెలుగులో 'పేరేఱు' అని, కన్నడంలో 'పేర్దొఱె' అని, తమిళంలో 'పేరాఱు' అని పేర్లున్నట్లు ప్రాచీన శాసనాలవల్ల తెలుస్తుంది. ఈ మూడు మాటలకు ఒకటే అర్థం. అఱు, తెఱె, ఏరు సమానార్థకాలు. ఏఱంటే నదీ ప్రవాహం. పేరేఱు అంటే పెద్ద ఏఱని, నదీ ప్రవాహమని అర్థం. క్రీ.శ.1061 నాటి ఒక శాసనంలో "స్వస్తిశ్రీ సర్వలోకాశ్రయ శ్రీవిష్ణువర్ధన మహారాజులు... శకవర్షంబులు 983 నేంటి ప్లవ సంవత్సరమంబున బేరేటి దక్షిణంబున యాఱువేల వెలనంటి... గ్రహారంబు" అని ఉంది. ఇందులో కనిపించే పేరేఱు కృష్ణానదే. వెలనాడు కృష్ణానదీ దక్షిణ తీరానగల ప్రసిద్ధమైన నాడులలో ఒకటి కాబట్టి పేరేఱు కృష్ణానదేనని చెప్పడానికి వీలుంది.

సాహిత్యం : కృష్ణానదిని ఒక నదిగా గుర్తించిన సాహిత్య గ్రంథాలెన్నో ఉన్నాయి. నదులలో పవిత్రమైన నదిగా, మహత్తుగలనదిగా, స్వర్గ వాసాన్ని కలిగించే నదిగా కృష్ణానది సాహిత్యంలో కనిపిస్తుంది. స్కాంధ పురాణంలో కృష్ణానది ఒక అందమైన స్త్రీమూర్తిగా చిత్రించబడింది. మన దేశంలో ప్రవహించే నదులన్నీ సాహిత్య గ్రంథాలలో అద్భుతమైన స్త్రీ మూర్తులుగా వర్ణింపబడినాయి. నదీ

ప్రవాహం గమనశీలం కలది కాబట్టి, చలత్వం నదులకు సహజగుణం కాబట్టి నదీమూర్తుల అవయవ సౌందర్యంలో ప్రవాహపు వంపులు సొంపులు సౌందర్యస్ఫోరకంగా కనిపిస్తాయి. నదులను నాయికలుగా వర్ణించిన కవులున్నారు. భారత ఆదిపర్వంలో గంగానది అందమైన స్త్రీగా చిత్రింపబడి శంతనమహారాజును ఆకర్షించిన కథ ఉంది. భట్టుమూర్తి వసుచరిత్రలో శుక్తిమతీనదిని మహాసౌందర్యవతియైన స్త్రీగా వర్ణించాడు. పరిశీలిస్తే ఇలాంటి ఉదాహరణలు ఎన్నో దొరుకుతాయి.

మత్స్యవామన పురాణాలలో కృష్ణ అగ్నిదేవుని భార్యలలో ఒకతెగా చిత్రింపబడి ఉంది. కృష్ణ, వేణి వేర్వేరు నదులుగా చెప్పిన కవులున్నారు. రాజశేఖరుని కావ్య మీమాంసలో దక్షిణభారత నదుల పట్టిక కనిపిస్తుంది. ఈ పట్టికలో గోదావరి, కావేరి, భీమరథి, వేణి, కృష్ణవేణి, వంజుల, తుంగభద్ర, తామ్రపర్ణి, ఉత్పలావతి నదులు పేర్కొనబడినాయి. కృష్ణవేణి, వేణీనదులు వేర్వేరని రాజశేఖరుని అభిప్రాయమైనా వేణీనది కలిసిన తరువాతనే కృష్ణవేణి అయినట్లు భావించడానికి అనేక ఆధారాలున్నాయి. భారతం అరణ్యపర్వంలోని పుణ్యతీర్థాల ప్రసక్తి సందర్భంలో 'తొల్లి క్రతుండు మూడు క్రతువుల సేయుట జేసి పవిత్రంబయిన **కృష్ణవేణియందు దేవహ్రదంబాడిన సర్వపాప వినాశంబగును"** అని చెప్పబడింది. భీష్మపర్వంలో కనిపించే నదుల పట్టిక ఇది – "గంగయు, దుంగభద్రయు, వేత్రవతియు, **గృష్ణవేణియు,** బెన్నయు, యమునయు, శరావతియు, గావేరియు, నర్మదయు, బాహుదయు, సరయువును, శతద్రువును, వితస్తయు, విపాశయు, తామ్రపర్ణియు నను మహానదులు". మనదేశంలో ప్రవహించే ప్రధాననదుల పట్టికలో కృష్ణవేణి కనిపిస్తున్నది.

పద్మపురాణ ఉత్తరఖండంలో కృష్ణానది జన్మఘట్టముంది. దీనిని పిశుపాటి చిదంబర శాస్త్రిగారు తెనిగించారు. దీనికి సంబంధించిన చిన్న కథ ఇది – చాక్షుష మన్వంతరంలో బ్రహ్మ సహ్యగిరి శిఖరంపై యజ్ఞం చేయ సంకల్పించి దేవతలందరినీ ఆహ్వానించాడు. ఆయనకు స్వరరామి, గాయత్రి ఇద్దరు భార్యలు. ముహూర్త సమయానికి స్వరరామి రాలేదు. బ్రహ్మ రెండవ భార్యయైన గాయత్రితో యజ్ఞాన్ని నిర్వహించాడు. అయిపోయిన తరువాత స్వరరామివచ్చింది. విపరీతమైన కోపంతో అక్కడున్న వాళ్లనందరిని నిమ్నగలు (నదులు) గమ్మని శపించింది. ఈ హఠాత్పరిణామానికి ఆశ్చర్యపడినా కోపం రావడంతో గాయత్రి స్వరరామికి కూడా అలాంటి శాపమే ఇచ్చింది. మేమంతా నదులమైతే ముల్లోకాలు లుప్తమైపోతాయి. కాబట్టి శాపాన్ని ఉపసంహరించమని దేవతలు కోరారు. యజ్ఞారంభంలో వినాయక పూజ చేయక పోవడంవల్ల అలా జరిగిందని, శాపాన్ని మళ్లించే శక్తి తనకు లేదని స్వరరామి చెప్పింది. మీరు మీ మీ అంశాలతో నదులు గమ్మని సూచించింది. ఆమె గాయత్రితో కలసి గంగగా అవతరించింది. తరువాత తమతమ అంశలతో విష్ణువు కృష్ణానదీత్వాన్ని, ఈశ్వరుడు వేణీనదీత్వాన్ని, బ్రహ్మ కకుద్మతీ నదీత్వాన్ని, తక్కిన దేవతలందరూ వివిధ నదీ రూపాలను పొంది సహ్యాద్రినుండి పూర్వవాహి

నులుగా ప్రవహించారు. ఆ నిర్జరుల పత్నులు పశ్చిమ వాహినులుగా ప్రవహించారు. ఈ కథద్వారా మనకు కృష్ణవేణీ నది హరిహరుల అంశలతో కూడిన పవిత్రనదిగా అర్థమవుతుంది.

కృష్ణానది కాపేరు ఎలా ఏర్పడిందో చెప్పడానికి భట్టుమూర్తి విరచిత వసుచరిత్రలో ఒక చమత్కార పూర్వకమైన విషయముంది. వసు చరిత్రను అంకితం తీసుకొన్న తిరుమల రాయల తమ్ముడు రఘునాథరాయలు తురుష్క సైన్యాన్ని రూపుమాపాడు. వాళ్ల భార్యలు దుఃఖించి కన్నీళ్లు కార్చారు. కాటుక కలసిన వాళ్ళ కన్నీళ్లు ప్రవాహమై కృష్ణలో కలియడంవల్ల ఆ నది నీరు నల్లగా మారి కృష్ణకు ఆ పేరేర్పడిందట. ఈ విషయాన్ని వివరించే పద్యమిది –

"యాదోరాశి గభీరమూర్తి రఘునాథాధీశుడుద్దండ బా
హా దర్పాంధ సపాద మల్కిక నిజామానీకముల్ ద్రుంప జ
న్యాదూరస్థితి బారు కృష్ణకును గృష్ణాంకంబు నాడబ్బె బి
బ్బీ దీవ్యన్నయనాబ్జ కజ్జల జలాభీల ప్రవాహంబనన్"

ఆధునిక కవులు కృష్ణానదిని అనేక రాజ వంశాల పరిపాలను గమనించిన నదిగా, తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని తన నీటిద్వారా ప్రజల కందించే పుణ్యస్రోతస్వినిగా కీర్తించారు. జాతీయోద్యమ కవులు మనదేశ ఔన్నత్యాన్ని వర్ణించే సందర్భంలో జాతి ప్రాణాన్ని నిలిపే నదీమతల్లులను ఎంతగానో శ్లాఘించారు. ఇలాంటి పుణ్యనదీ నదాలు గల పుడమి అస్వతంత్రమై అరాచక స్థితికి ఆలవాలం కావడం దుర్భరమని దేశమాతను కాపాడుకోవలసిన బాధ్యతను గుర్తు చేశారు. ఈ సందర్భంలో కృష్ణానదికి సంబంధించిన కొన్ని విషయాలను క్లుప్తంగా చూద్దాం. ఖండకావ్య కవులెందరో కృష్ణానదిని కవితావస్తువుగా గ్రహించారు. 'ఆంధ్ర పౌరుషం' అనే ఖండికలో విశ్వనాథ సత్యనారాయణ గారు కృష్ణానది నిలా ప్రస్తుతించారు.

కృష్ణాంతరంగ నిర్నిద్రగానముతోడ
శిల్పమ్ము తొలి పూజ సేయునాడు
అక్షరజ్ఞాన మెఱుగదో ఆంధ్రజాతి
విమలకృష్ణానదీసైకతములయందు
కోకిలపు పాట పిచ్చుక గూండ్లు కట్టి
నేర్చుకొన్నది పూర్ణిమానిశలయందు.

కృష్ణాతీరంలో ఉంటున్న గ్రామీణుల జీవన శైలిని వివరించే కథలు కూడా వచ్చాయి. శంకరమంచి పార్థసారథిగారి అమరావతి కథలు, (ఇవి హిందిభాషలో బుల్లితెర మీదకు సైతం ఎక్కాయి) పోలవరపు కోటీశ్వరరావుగారి కాకళయ్య కథలు, కృష్ణాతరంగాలు వాటిలో కొన్ని.

పోలవరపు కోటీశ్వర రావుగారు 1994లో 'కృష్ణవేణి' అనే పేరుతో ఒక గేయకావ్యం రాశారు. ఆయన కృష్ణాతీర ప్రాంతవాసి. ఈ నదిమీద ఆయన కెంత మక్కువో చెప్పలేం.

జలబిందువై, రమ్యకరుణాంగివై
పరమేశు మెప్పించు నవనృత్తమై
మమ్మేలు కమనీయకల్యాణివై
రూపొందినావమ్మ! మాపాలి భాగ్యమ్ము!!

మా తల్లి కృష్ణమ్మ వందనాలందు కొమ్మా.

అంటూ మొదలైన ఈ కృష్ణవేణి కావ్యం–

జలబిందువై రూపొంది, పరిపూర్ణ జలధారయై
జీవవాహినియై, మహారాష్ట్ర కర్ణాట ఆంధ్రప్రజల
ఆరాధ్యదేవతగా రూపొందింది కృష్ణవేణి

అనేకజాతుల మతాల తెగల జీవద్వాహిని కృష్ణవేణి
సంస్కృతి ప్రవాహమై, సర్వజనామోదమై
సకల సంపద్విలసితమై కన్నతల్లిగా నిలచింది కృష్ణవేణి
కమనీయచరితలను రూపొందించింది కృష్ణవేణి.

అంటూ ముగిసింది. పడమటి కనుమలలో సహ్యాద్రిలో జన్మించి సాగరసంగమం చేసేవరకూ కృష్ణానది పునీతం చేసిన ప్రాంతాల కథలు, చరిత్ర, కళలు – ఈ కావ్యంలో రసవత్తరంగా వర్ణింపబడి నాయి. కృష్ణవేణీ ప్రవాహంలో తెలుగు సిరులు కలసి ఉన్నాయి. అందుకే ఆ నది ప్రవహించిన ప్రాంతాలలో ప్రజల జీవితం నెమ్మదిగా ఉంది. తెలుగు సొగసులు విరబోసుకొని ప్రవహించే కృష్ణ స్వరూపాన్ని కవిగారిలా దర్శించారు.

నొసట కుంకుమ రాగరంజితంబొనరించె
తొగరు కుచ్చెళ్లు పారాణి జీరాడె
కలికి కాటుక కనుల తెలుగు సిరులే మెరిసె
అల్లనల్లన కృష్ణ ఆంధ్రలో నడచె.

ఎందరో కవులకు, కళలకులకు, గాయకులకు, శిల్పులకు కృష్ణవేణి ఎన్నో రకాలుగా ప్రేరణనిచ్చింది, తన తీరాలలోని దేవాలయాల ద్వారా ఆధ్యాత్మిక సంపదను పంచింది. కర్షకుల కడగండ్లను తొలగించింది. రైతుల పాలిట వరంగా, భూమాత కంఠంలో సరంగా, సకలనదులలో శ్రేయస్కరంగా, తెలుగు సంస్కృతిని గానం చేస్తూ ప్రవహించే ఈ నదీలలామ ఔన్నత్యాన్ని అంచనా వేయలేం. అమృతతుల్యమైన జలంతో ఎప్పటికీ ప్రవహించే ఈ జీవనది కళాకారుల కెందరికో స్ఫూర్తిప్రదాయిని.

జనజీవననిధి - కృష్ణానది

డా॥ కలువగుంట రామమూర్తి

లోకపావనికృష్ణ! సాహితీ పరితృష్ణ!
విజయపురి కాపురికి అర్ఘ్యపాద్యభినిష్ణ!
నువు బ్రహ్మగిరిలోపుట్టి - వేదగిరి "వేణి"తో
కలగలసి ప్రవహించి కృష్ణవేణయ్యావు! ॥పల్లవి॥

శాతవాహనరాజ్యసిరిసంపదలు నీవి
అమరావతికి అమరకీర్తి నందించావు
ఆ దీపాల దిన్నె వెన్నెలల వెలుగులు నీవి!
బౌద్ధమత దీధితుల ప్రతిఫలించావు!

శ్రీశైలక్షేత్రాన్ని - అహోబిల ప్రాంతాన్ని
హంపీ విరూపాక్ష - విఠలాలయాలను
భక్తి భావాలతో అర్చించి అలరారి
హంసలదీవిలో రాజహంసిగ చరించావు!

జాయపసేనాని నృత్తరత్నావళికి
దివి సీమ సిద్ధేంద్ర కూచిపూడి ప్రభకు
మొవ్వలో క్షేత్రయ్య మువ్వల గోపాలునికి
గొజ్జంగి పూదండల నీ కైదండలేశావు!

ఆ కొల్లేరు సరసున విహంగ విన్యాసాలు
ఆ లక్షల పక్షుల చక్షురుత్సవసొబగు
పింగళి సూరన్న - అరిపిరాల - దండమూడి
ఆ పద్యవిద్యా వాయులీన మృదంగాలు!

మేకమేయనితీగ మూలికల కషాయాలు
ఆయుర్వేద వైద్యాలతో మా ఆయుస్సు పెంచావు
హస్తకళలకు దారి అద్దక కలంకారి
ఆ కొండపల్లి బొమ్మలకొమ్మల సోయగాలు!

నీ తీరభూమిలో ఆకులన్నీ నీకు ఆలయాలమ్మా!
సురభిళ పుష్పాలు నీ పూజకు సహస్రదీపాలు!
యక్షులే పక్షులై నీ స్తుతులు చేస్తుంటాయి!
వెన్నెలలు తారకలు నీ అభిషేక అర్చనలు!

మా తీరభూములను హరితభరితం చేస్తూ
సర్వప్రాణులకున్న దాహార్తులను తీరుస్తూ
సస్యశ్యామల సుజల సుఫలాల నందించు
మా ఆయురారోగ్యాల బలము నీ జలమేనమ్మా!!

అమరావతి పురావస్తు సంగ్రహాలయము

దిట్టకవి కన్నబాబు

భారతదేశంలోగల క్షేత్ర పురావస్తు సంగ్రహాలయములలో గుంటూరు పట్టణానికి 35 కి.మీ.ల దూరంలోవున్న అమరావతి (ఉ.అ. 16.34 / తూ.రే. 80.17) గ్రామములో నిర్మింపబడిన పురావస్తు సంగ్రహాలయం చాలా ప్రాచీనమైనది. బౌద్ధసంస్కృతికి చెందిన అనేక అపురూప వాస్తు - శిల్ప కళాఖండములను ప్రదర్శించుచు ప్రపంచ ప్రఖ్యాతిని ఆర్జించినది. యావత్ దక్షిణ భారతదేశంలో పూర్వేతిహాస ఇతిహాస కాలపు కళాకోవిదులగు మానవులు సృజించిన చిన్న చిన్న పూసలు నుండి బుద్ధ భగవానుని జీవితకథా ఘట్టములతో మలచిన బౌద్ధ సంస్కృతి శోభలీనే అపూర్వమైన పెద్దపెద్ద శిల్పమాలికలు - వాస్తు తోరణముల వరకు విభిన్న ప్రాచీన వస్తుసముదాయము ఈ ప్రదర్శన శాలయందు భద్రపరచబడినవి. ఇతిహాస కాలపునాటి మానవుల సృజనాత్మకత, కళాసౌం దర్యోపాసన, నిర్మాణ దక్షతలు వుట్టిపడే పలు వస్తు సముదాయమును ఒకేచోట చూడవలయు నన్నచో అమరావతిలో గల పురావస్తు సంగ్రహాల యమును దర్శించవలసినదే!

స్థాపన నేపథ్యము : ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రము - శాతవాహన రాజవంశమునకు రాజధాని పట్టణమైన శ్రీ ధాన్యకటకంలో క్రీ.పూ. 3వ శతాబ్ది నుండి క్రీ.శ.14వ శతాబ్ది వరకు 'దీపాల దిన్నె' అనే పేరుతో దేదీప్యమానంగా వెలుగొందిన మహాచైత్యం కాలక్రమమున తన పూర్వపు శోభను కోల్పోయి క్రీ.శ.18వ శతాబ్దాంతమున కు నామమాత్రపు దిబ్బగా మారింది. మరల ఈ 'దీపాలదిన్నె' ఈస్టిండియా కంపెనీలో సర్వే అధికారిగా పని చేసిన కర్నల్ కాలిన్ మెకంజీ ద్వారా వెలుగులోనికి కొనిరాబడింది. 1797 సం॥లో ఆయన అమరావతి గ్రామమును దర్శించునాటికి మహాచైత్యమును స్థానిక ప్రజల చిందర వందరగా త్రవ్వి పాడుచేసి అపురూప శిల్పములను ముగ్గుకొరకై నాశనము చేసి ప్రాచీన ఆంధ్రప్రజ అనేక శ్రమలకోర్చి నిర్మించు కున్న కళానిలయమును చేజేతుల రూపుమాపిరి. మెకంజీ స్థానిక జమిందారుని కలిసి విన్నవించి నను విధ్వంసకాండ ఆగలేదు. చివరిగా మెకంజీ జోక్యముతో నాడు మచిలీపట్టణము నందున్న కలెక్టరు అమరావతిని దర్శించి దాని చారిత్రక వైభవమును అర్థము గావించుకుని త్రవ్వకములు - పరిశోధన నిమిత్తమై మహాచైత్యపు ప్రదేశము ను ఈస్టిండియా కంపెనీవారి అధీనములోనికి తీసుకొని వచ్చెను. తదనంతర కాలమునందు సర్ వాల్టర్‌స్మిత్ (1845), రాబర్ట్ సీవెల్ (1877), జేమ్స్‌బర్జెస్ (1881), అలెగ్జాండర్ రీ (1888-89, 1905-06, 1908-09) ప్రభృతులు 'దీపాలదిన్నె' పై త్రవ్వకములు జరిపి చలువరా తిపై చెక్కిన వెలలేని శిల్పములు వెలుగులోనికి తీసుకొని వచ్చారు. నాటినుండి అమరావతి శిల్పములు ప్రపంచ పౌరుల దృష్టిని విశేషముగా ఆకట్టుకొన్నవి. క్రమంగా విదేశీ సందర్శకులు

అమరావతి కుగ్రామానికి రావటం స్తూప, విహార, శిల్పవైభవాలను చూసి అబ్బురపడటం ప్రారంభమైంది, ఈలోపుగా, ఈస్టిండియా కంపెనీ వారిపాలన ప్రారంభమవడంవల్ల అమరావతిలో బయటపడిన అపురూప శిల్ప సంపదను తొలుత మద్రాసు పట్టణానికి తరలించి వాటిని రెండు తరగతులుగా విభజించి అతి విశిష్టమైన వాటిని లండన్ మహానగరమునకు తరలించారు. కొన్ని పారిస్, జర్మనీలకు పయనమైపో యినవి. రెండవ తరగతి కళాకృతులన్నింటిని చెన్నై పట్టణం నందలి 'ఎగ్మోర్' ప్రదర్శనశాలలో భద్రపరచారు. స్థానికంగా మిగిలిన వాస్తు-శిల్ప విశేషాలను మహాచైత్య ప్రాంగణంనందే నెలకొల్పబడిన చిన్నగదులలో ప్రదర్శించారు. ఇదే పురావస్తు సంగ్రహాలయ స్థాపనకు నాందీ ప్రస్తావన పలికింది. భారతదేశము స్వాతంత్ర్యం పొందిన తరువాత, ప్రభుత్వం అమరావతి మహాచైత్యపు వైభవమును, చారిత్రక ప్రాముఖ్య తను గుర్తించి స్తూపక్షేత్రము, అమరావతిని ఆనుకొనివున్న గ్రామంనందలి శాతవాహన రాజవంశపు ప్రాకారవలయిత రాజధాని నగర కోటదిబ్బలను భారతీయ పురావస్తు సర్వేక్షణ ఆధ్వర్యం క్రింద 'జాతీయ రక్షణ స్మారకములు'గా ప్రకటించి పరిరక్షించినది. 1952 సం॥లో మహాచైత్య ప్రాంగణంలో విశాలమగు చక్కని సంగ్రహాలయ భవనమును నిర్మించి బ్రిటీషువారు నిర్లక్ష్యంగా వదలివేసి పోయిన కళాఖండాలను భద్రపరచి ప్రదర్శించినది. తదనంతర కాలమునందు 1958-59, 1973-75 సం॥లలో చైత్యము చుట్టూ నిర్వహించిన త్రవ్వకాలలో లభించిన పురావస్తు సంపదతోపాటు అమరావతిని ఆనుకొని పశ్చిమంగా ఒక కి.మీ. దూరంలో గల ధరణికోట గ్రామ చేరువలోనున్న శాతవాహన కాలీన ప్రాకారసహిత మహానగరపు కోటదిబ్బపై జరిగిన త్రవ్వకములలో వెలుగుచూచిన ఇతిహాస కాలంనాటి వస్తు సంజాతమును సంగ్రహాలయం నందు ప్రదర్శించుచున్నారు.



ఇంకనూ లింగరాజువల్లె (విశాఖపట్టణం జిల్లా), అల్లూరు, గుమ్మడిదుర్రు (కృష్ణా జిల్లా) మొదలగు ప్రసిద్ధ బౌద్ధ క్షేత్రముల నుండి సేకరించిన కళాకృతులను కూడా ఇందు ఆకర్షణీయముగా సందర్శకులకొరకు పొందుపరచారు. ఒక్కమాటలో చెప్పాలంటే! క్రీ.శ.పూ.3వ శతాబ్దము నుండి క్రీ.శ.12వ శతాబ్దముల నడుమ ధాన్యకటక మహానగరమునందు వర్ధిల్లిన విభిన్న సంస్కృతులకు చెందినపురావస్తు సంజాతమును ప్రదర్శనశాలలో వాటి వాటి కాలపరిణామ దశల ననుసరించి చూపరులకు కంటికి ఇంపుగా అమరిక గావింపబడినవి.

మొదటి విభాగము : సంగ్రహా లయమునందు ప్రవేశింపగనే అమరావతీ శిల్పసంపదకు మకుటాయమానమన దగు 'పూర్ణకుంభ' శిల్పములు సందర్శకులకు స్వాగతము పలుకు

చున్నవి. ఇవి నాటి ప్రజలకు పరమ పవిత్రములయిన శుభచిహ్నములు. పూర్ణకుంభ శిల్పములు పరిపూర్ణత – ఐశ్వర్యములకు ప్రతీకలు. పూర్ణ కుంభ పవిత్ర లాంఛనములను వారి స్తూప – శిల్ప ప్రపంచమునందు విస్తారంగా శిల్పీకరించిరి. రెండు పూర్ణకుంభ శిల్పముల నడుమ ఆకుపచ్చని చలువరాతిపై చెక్కిన సంపూర్ణముగా వికసించిన పద్మఫలకము గలదు. వికసిత పద్మమును నాటి బౌద్ధులు పవిత్ర లాంఛనంగా బుద్ధభగవానుని ప్రతిరూపుగా ఆరాధించిరి. పూర్ణకుంభ వికసిత పద్మములు మంగళచిహ్నాలు అగుటచే అమరావతీ మహా చైత్యశిల్పజగత్తులో పదే పదే కానవచ్చును. వీటికి ఎడమవైపున చక్కగా అమర్చిన సుందరమైన మేధీఫలకములు రెండు కలవు. మేధీ ఫలకములపై మహాచైత్యం దాని వివిధ వాస్తు నిర్మాణ విశేషాలను, అండభాగం మీద బుద్ధ భగవానుని పూర్వజన్మలను విశదీక రించి శిబి, మాంధాత, వెస్సంతర జాతక కథాఘట్టములను, బుద్ధ పాదములు, అగ్నిస్తంభము, సింహాసనముపై ధర్మచక్రములను, ఇరువైపుల చామరధారులగు భక్తులను కలిగి ఉన్నవి. గుమ్మడిదుర్రుబౌద్ధ స్తూపము నుండి లభ్యమైన వరదముద్రాంకితుడగు బుద్ధభగవానుని నిండైన శిల్పంకూడా ఈ విభాగమునందే ఒక పేటికయందు కన్నులకు ఇంపుగా ప్రదర్శించినారు.

రెండవ విభాగము : రెండవ విభాగమునందు కాలిడిగనే కరుణాసముద్రుడు – ప్రశాంత వదనుడగు బుద్ధభగవానుని విలక్షణ శిల్పమూర్తి సందర్శకులను విశేషంగా ఆకర్షించుచూ కాలు కదలనీయదు. అమరావతీ బౌద్ధ శిల్పి భగవానుని మూర్తిని సృజించుటలో గాంధార – మధుర శిల్పులకంటెనూ క్రొత్త పుంతలు త్రొక్కెను. నాటి బౌద్ధాచార్యుల తత్త్వసిద్ధాంతముల సరిపోవు సమ్యక్ సంబుద్ధమూర్తిని మహాపురుష లక్షణంతో సృజించెను. బుద్ధిని మూర్తి ప్రశాంత కోమల వదనం, శరీర దారుఢ్యం, గుండ్రని భుజస్కంధాలు కలిగి చూపరుల చూపులను వేరొక వస్తువుపైకి మరలనీయదు. మహాముని శరీరముపై లింగరాజు పల్లె (విశాఖపట్టణము జిల్లా) నుండి గ్రహింపబడిన విలక్షణ ధర్మచక్రము బుద్ధ భగవానుమూర్తికి ఎడమచేతి వైపుగా ఎత్తైన పీఠంపై సుందరంగా అమర్చినారు. ధర్మచక్రము లోపల 28 చక్రపుటాకులు కలిగిచుట్టునూ అంచుపై భాగముపై శుభకరములైన త్రిరత్న చిహ్నములను అలంకరించుట గమనింప వచ్చును. శ్రీధాన్యకటక మహానగరము నందలి మహాచైత్య ప్రాంగణ (నేటి అమరావతి) కోట దిబ్బలపై (నేటి ధరణికోట) జరుపబడిన

త్రవ్వకములలో లభ్యమైన సుకుమారమగు పూసలు, చెవిపోగులు, కాటుక పుల్లలు, తాయత్తులు, కడియములు, వ్రాత పనిముట్లు, మౌర్య – శాతవాహన వంశముల నాణేలు, ఇనుప పనిముట్లు, నవశిలాయుగపు రాతి పనిముట్లు వాటి కాలము ప్రాముఖ్యతలకు దీటుగా ఈ విభాగమందలి ఒక చిన్నగది గోడకు ఆనుకొని నిర్మించిన అద్దాల పెట్టెలో ప్రదర్శించ బడినవి.

పై వానితోపాటు బుద్ధుని జీవిత కథాఘ ట్టములను తెలిపెడు మేఢీఫలకములు, త్రిరత్న ములు, పరుగులు తీయు జంతువుల వరుసలు, ఆరాధకులతో కూడిన అండ ఫలకములు, సూచీ ఫలకములు చక్కగా అమరిక గావింపబడినవి. ఈ శిల్పసముదాయం ఎక్కడ దొరికిందో తెలియజేసే పటములు కూడా దర్శకుల సౌకర్యార్థము ఏర్పాటు చేయడం జరిగింది. వేరొక అద్భుత సూచీ ఫలకమునందు జ్ఞాన సముపార్జనానంతరము బుద్ధుని కపిలవస్తు సందర్శన సందర్భముగా శుద్ధోధనుడు బుద్ధుని కుమారుడగు రాహులుని తండ్రికి పరిచయ మొనర్చి అప్పగించుటను అంతఃపురవాసులు విస్మయాశ్చర్యములతో భగవానుని అర్థనిమీలిత నేత్రులై కాంచుటను కథాంశమునందు లీనమై శిల్పి చిత్రీకరించెను.

మూడవ విభాగము : మూడవ విభాగము ప్రదర్శనశాల గదులన్నింటిలోకి పెద్దది. క్రీ.పూ. 2వ శతాబ్దికి చెందిన శిల్పములు, శాసన లిఖితస్తంభములు, ఉష్ణీషములు, మేఢీశిల్పములు, స్తూపాండమునకు అలంకరింపబడిన శిల్పములు ఇందు చక్కగా ప్రదర్శించబడినవి. వీటితోపాటు అల్లూరు నుండి సేకరించిన రమ్యమగు రెండు బుద్ధ ప్రతిమలు కూడా అందముగా తీర్చిదిద్దిరి. విభాగము గోడమీద నిలిపిన యక్షి శిల్పము క్రీ.పూ. 2వ శతాబ్దికి చెందిన బార్హుత్ శిల్ప కళా సంప్రదాయములకు చెందినది. శాతవాహన రాజవంశ పరిపాలనా కాలమునకు చెందిన క్రీ.శ. 2వ శతాబ్ది వరకు నిలువెత్తు అండ అలంకరణ ఫలకము బౌద్ధ ధర్మము నందలి త్రిరత్నములను – బుద్ధ (మహాబోధి) ధర్మ (ధర్మ చక్రము) సంఘము (స్తూపారాధన) లతో రసవత్తరముగా చూపరులను ఇట్టే నిలబెట్టు కున్నది. ఇవికాక మాలాలంకార ఉష్ణీష ఫలకములు, పవిత్ర బౌద్ధ క్షేత్రములగు శ్రావస్తి, వైశాలి, ధంఖడ శ్రీధాన్యకటకము అమరావతి పట్టణములు వాటియందలి ముఖ్య బౌద్ధారామ ములు – ఆ యా దృశ్యములను గుర్తించుటకు వీలుగా చెక్కిన బ్రాహ్మీశాసనములు గల అద్భుత చతుర్ముఖ స్తంభము ఇందు గలవు. ఇంకనూ క్రీ.పూ. 3వ శతాబ్దమునకు చెందిన అశోకుని ధర్మశాసన స్తంభము, క్రీ.పూ. 2వ శతాబ్దము నుండి క్రీ.పూ. 12వ శతాబ్దముల నడిమి కాల ములకు చెందిన శాసన లిఖిత స్తంభములు, ఫలకములు, చక్కని పీఠములపై వివరణ పట్టి కలతోసహా విజ్ఞాన దాయకముగా ప్రదర్శించబడి నవి. మూడవ విభాగ మధ్యమున ప్రదర్శింప బడిన శాతవాహన కాలీన మిధున శిల్పము అత్యంత ఆకర్షణీయము. వజ్రయాన బౌద్ధ దేవతా శిల్పములు సరసన జైనతీర్థంకర ప్రతిమ కలదు. త్రవ్వకాలలో దొరకిన అమూల్యములగు విభిన్న మట్టి పాత్రలను ఈ విభాగమునందే

ప్రత్యేకంగా చేసిన అద్దాల పెట్టెలో భద్రపరచిన శాతవాహన కాలీన (క్రీ.శ. 2వ శతాబ్దము) **నిలువెత్తు సాలంకృత నందీశ్వర శిల్పము** ప్రదర్శనశాలకే గాంభీర్యమును, గౌరవమును కొనివచ్చినది. సజీవ నందీశ్వరుని యథాతథముగా ఆకుపచ్చని చలువరాతిపై మలచి అమరావతి శిల్పి చరితార్థుడైనాడు. తన సహజ శరీర సౌష్ఠవంతో, హొయలుతో నందీశ్వరుడు చూపరులను ఇట్టే ఆకట్టి అడుగు ముందుకు వేయనిచ్చుట లేదు. **యావత్ దక్షిణ భారత దేశమునందు ఇదియే ప్రాచీనమైన ప్రప్రథమ నందీశ్వర విగ్రహశిల్పం.**

నాల్గవ విభాగము : నాల్గవ విభాగము నందు ప్రవేశింపగనే ఎన్నో శ్రమలకు, వ్యయప్రయాసలకు ఓర్చి భారతీయ పురావస్తు సర్వేక్షణ నిర్మించిన శిల్పాలంకృత అమరావతి మహా చైత్యపు నమూనా, మహాచైత్యపు బృహత్ప్రాకార భాగము యథాపరిమాణమున అన్ని వాస్తు విశేషములతో పునర్నిర్మింపబడిన నమూనాలు పర్యాటకులను విశేషముగా ఆకట్టుకొనుచున్నవి. ప్రాచీనాంధ్రుల వాస్తు - శిల్పి సాంప్రదాయములు, ఆ యా రంగములందు సాధించిన విజయములు సామాన్య మానవులకు అందించవలననే సదాశయముతో వీటి నిర్మించారు. బృహత్ప్రాకారమునందు సూచి, ఉష్ణీషశిల్ప ఫలకములపై విశదముగా పొందుపరచిన నాళగిరి వృత్తాంతము, కంధకాశ్వము మహాభినిష్క్రమణ వృత్తాంతమును శుద్ధోధనునకు విన్నవించుట మొదలగు బుద్ధభగవానుని జాతక జీవిత కథాఘట్టములు చూడగలము.

గౌతమ సిద్ధార్థుడు మహాభినిష్క్రమణ సమయమున భార్య యశోధర, కుమారుడు రాహులుని కడసారి వీక్షించు హృదయ విదారక దృశ్యము శిల్పీకరించిన అండ ఫలకము చక్కని వేదికపై అమర్చినారు. బ్రిటీషువారు మద్రాసు నగరమునందు 'ఎగ్మోర్' సంగ్రహాలయమునకు తరలించుకు పోయిన కొన్ని అపురూప శిల్పములకు నమూనాలు ఎక్కువగా నాల్గవ విభాగంలో దర్శనమిస్తాయి. మహోన్నత దశయందున్న అమరావతీ మహాచైత్యరూపమును శిల్పీకరించిన పెద్దశిల్ప ఫలకము, వెస్సంతర ఛద్దంత జాతక కథఘట్టములు కల ఉష్ణీషశిల్పములు, బుద్ధ పాద ఫలకము, చక్రవర్తి లాంఛనోపేత మాంధాత శిల్ప ఫలకము, తొలిరూపములలో నున్న 'గణేశ - లక్ష్మీ దేవతామూర్తులు' గల శాసన సహిత ఉష్ణీష శిల్పము, విభాగపు చివరన పీఠముపై పద్మాసీనుడై చిరునగవుతో సమస్త ప్రాణికోటిని అభయ హస్తముతో దీవించుచున్న బుద్ధభగవానుని ప్రతిమ సందర్శకులందరికి మనఃశాంతి, దిటవు, ఊరటలను, కలిగించుచున్నవి.

అమరావతి పురావస్తు ప్రదర్శనశాల ప్రాచీనాంధ్రుల సంస్కృతి, వాస్తు - శిల్ప కళావిజ్ఞానములను సందర్శకులకు పంచిపెట్టు కళాశాల వలెను, ప్రాపంచిక బాధలనుండి మైమరపు, చిత్త శాంతి, నిబ్బరములను కలిగించు 'బుద్ధ దేవర' గుడివలెను పర్యాటకులకు సేవ చేయుచున్నది.

విభిన్నములు, అపూర్వములు అయినపైన విశదీకరించిన ప్రాచీన వస్తు సముదాయము అమరావతి ప్రదర్శనశాలకు అతి విశిష్ట స్థానమును ఆర్జించి పెట్టినవి. ●

కృష్ణాతీరం - ఆయుర్వేదం

పమ్మి సత్యనారాయణ శాస్త్రి

విజయవాడ ఆయుర్వేదోన్నతికి పట్టుకొమ్మ. అనేక ప్రముఖ వైద్యులు, పండితులు, కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంస్థలు వాటి కార్యకలాపాలను ఇచ్చటనుండే నిర్వహించారు. పత్రికల ప్రచురణ, గ్రంథప్రచురణ విజయవాడ నుండి జరిగింది. ఆయుర్వేదౌషధ నిర్మాణశాల లనేకం విజయవాడ లో స్థాపింపబడ్డాయి. ప్రముఖ పండితులు, గ్రంథకర్తలు కొందరిని పరిచయం చేసుకునే ప్రయత్నం ఇక్కడ చేయడం జరిగింది.

1. పండిత నోరి రామశాస్త్రి (15-2-1883 - 21-4-1956) వీరు కీ.శే. అపరధన్వంతరి, భిషఙ్మణి, ఆయుర్వేద మార్తాండ, వైద్యరత్న పండిత దీవి గోపాలచార్యులు, డా।। ఆచంట లక్ష్మిపతిగారల శిష్యులు, గురువులాదేశాను సారం - ఆయుర్వేద ప్రచార కర్తవ్యమనే నినాదాన్ని స్వీకరించి విజయ వాడలో ఆయుర్వేద కళాశాలను స్థాపించి, రాణీ ప్రసాదచైనులుగారివంటి మహాపండితులను రప్పించి నిర్వహించిన మహానుభావులు. యశః కాయులు. వైద్యులుగానూ, ఔషధనిర్మాణ కర్తగాను, సంఘసేవకునిగానూ, కులపతిగానూ బహుళ కీర్తినార్జించారు. చరకసంహిత ఇంద్రియస్థానానికి ఆంధ్రానువాదం చేసి ప్రచురించారు. విషూచి నివారిణి, క్షీరవర్ధని, జీవనవటి వంటి అపురూపమైన ఔషధాలను దేశానికందించిన వారు. వీరు ఆంధ్రవైద్య సమ్మేళనమునకు కార్యదర్శిగా నున్నారు.

2. కీ.శే. ఆయుర్వేదాచార్య ముక్కామల వెంకట శాస్త్రి (నవంబరు 1903 - 30-4-1967) వీరి జన్మస్థలం తూ.గో. జిల్లాలోని ముంగండ. కాని వీరి కార్యస్థానం విజయవాడ. మంచి పండితులు. డా।। ఆచంట లక్ష్మీపతులకు ఆప్తులు. వీరు ఆయుర్వేద లఘుత్రయంలో ముఖ్యమైన భావప్రకాశ గ్రంథాన్ని అనువదించి, తమ ఆస్తులనమ్మి ప్రకటించారు. వీరి త్రిధాతు సర్వస్వమను గ్రంథం వీరి ఆయుర్వేద పాండిత్యానికి మచ్చుతునక. వీరు డా।। ఆచంట లక్ష్మీపతిగారి ఆయుర్వేద శిక్షా సిరీస్‌లో శారీర గ్రంథ రచనలు చేశారు. వీరి మరొక గ్రంథం ఆయుర్వేద శారీర శబ్ద సంగ్రహము. వీరు ఆయుర్వేద కళాశాల పట్టభద్రుల సంఘానికి అధ్యక్షులు. వివిధ ఆయుర్వేద పత్రికలలో వీరి అనేక వ్యాసాలు ప్రచురితమ య్యాయి. వీరి శతజయంతి ఈ సంవత్సరం జరగవలసి వుంది.

3. రాణీ వేంకటాచలపతి ప్రసాద చైనులు మహోగ్ని జిత్ హజ్వి : కీ.శే. నోరి రామశాస్త్రి గారు వీరిని తూ.గో. జిల్లా ఏనుగల మహాల్ నుండి రప్పించి తమ వేంకటేశ్వరాయుర్వేద కళాశాలలో ఉపాధ్యాయులుగా నియమించారు. అనేక వైద్యులను, పండితులను తయారుచేసిన కులపతి. తెలుగునాట ఆయుర్వేద నిఘంటువు యొక్క అవసరాన్ని గుర్తించి, ప్రప్రథమంగా శబ్ద ప్రాసాదమను నిఘంటువు ప్రకటించారు. అదే మొదటిదీ, ఈనాటి వరకూ చివరిదీ. వీరు ఆయుర్వేద ప్రముఖులే గాక వేదవేదాంగాల అధ్యయన పరులు. నైష్ఠికులు, ఆధునిక రసాయన శాస్త్రముతో ఆయుర్వేద రసాయన శాస్త్రమును సమన్వయపరచి ఆ విజ్ఞానమున ప్రజ్ఞ సంపాదించిన పండిత ప్రకాండులు. వీరి ఇతర రచనలు – ఆగమకల్పవల్లి, శల్యతంత్రము, ఆయుర్వేద తత్వవివేకము, రసేంద్రమంగలము, కక్షపుట తంత్రము మొదలైనవి. వీరు సన్యాసాశ్రమం స్వీకరించి అధ్యాత్మిక గ్రంథాలను ప్రకటించి పూర్ణాయుష్కులై వంద సంవత్సరముల పైగా జీవించి పరమపదించారు.

దీవి శ్రీనివాసాచార్యులు : వణుకూరు వైద్యమను పేరు కల్గించిన చికిత్సానిపుణులు. ఆంధ్రాయుర్వేద పరిషత్తు నిర్వహణకు సహాయపడ్డారు. వణుకూరులో రాష్ట్రస్థాయి సభలను నిర్వహించారు. వీరు స్వయంగా ఔషధాలు నిర్మాణం చేసుకొనే వారు. అదే వారిని చికిత్సకులుగా నిలబెట్టినదని అందరి నమ్మకం. మహా భల్లాతకిలేహ్యం, అమృతభల్లాతకి లేహ్యం, వసన హతం, ఆశ్వగంధబలా లాక్షాది తైలం, పూర్ణచంద్రోదయం, వసంతకుసుమాకరం, చ్యవనప్రాశలేహ్యం వీరికి పేరు తెచ్చిపెట్టిన ఔషధాలు.

గూడూరి వియ్యన్న : వీరు విజయవాడలో మృత్యుంజయ ఫార్మసీని నెలకొల్పి అత్యుత్తమమైన మందులను తయారుచేసి విక్రయించేవారు. వీరు ఆయుర్వేద వైద్యులే గాక సాహిత్యంలో పరిచయమున్నవారు. అనేక ప్రముఖ కవి పండితులు వీరి ఆతిథ్యాన్ని తీసుకొనేవారు. వారిలో అడవి బాపిరాజు, పింగళి లక్ష్మీకాంతం గారు, విశ్వనాథ సత్యనారాయణ గారు మొదలైనవారు. వీరి స్నేహానికి తార్కాణంగా అడవి బాపిరాజుగారు మృత్యుంజయుడు, శ్రీ ధన్వంతరి చిత్రాల్ని గీసి బహూకరించారు. వీరి దత్తపుత్రులు గూడూరి నమశ్శివాయగారి మరణానంతరం ఫార్మసి, దానితోపాటు మృత్యుంజయుని చిత్రం నశించి పోయాయి. కేవలం ఫోటో మాత్రమే మిగిలింది.

కవిరాజ గూడూరి నమ్మశ్శివాయ : వీరు గూడూరి వియన్నగారి దత్తపుత్రులు. మృత్యుంజయ ఫార్మసీ నిర్వహిస్తూ, ఆంధ్రాయుర్వేద పరిషత్తు కార్యదర్శిగా, ఆయుర్వేద మాసపత్రిక సంపాదకులుగా, శ్రీధన్వంతరి సహాయ సంపాదకులుగా, కవి పండిత పోషకులుగా పేరుపొందారు. విమర్శకులు. వీరి విమర్శ చాలాసార్లు కటువుగా ఉండేవి. దానితో కొద్దిమంది అహితులు కూడా ఉండేవారు. వీరి అనుయాయులుగానున్న వారిలోని క్రియాశీలతను గుర్తించి వారికి మెరుగు పెట్టడంలో దిట్ట. సాహితీపరులు, వైద్యులు, విమర్శకులు,

పండితులు, చిత్రకారులు, రాజకీయవేత్తలు, అన్నిరంగాలకు చెందినవారు వీరికి మిత్రులు. విషయసేకరణలో వీరికి మించినవారు లేరు. ఏఏ గ్రంథం ఎక్కడ వున్నదీ, ఏఏ మూలికలు, ఖనిజాలు, ద్రవ్యాలు ఎక్కడ దొరికేది వీరికి కరతలామలకము. జీవిత సంగ్రహాలు సేకరించుటలో బహు శ్రద్ధ చూపేవారు. వీరు చాలామంది విశిష్ట వ్యక్తుల జీవిత విశేషాలను పత్రికలద్వారా ప్రకటించారు. అనేక పురాతన ఆయుర్వేద గ్రంథాలను సేకరించి తెలుగులోకి అనువాదం చేయించేవారు. రసాచార్య చివుకుల సత్యనారాయణ శాస్త్రి గారిచే **రసరత్న సముచ్ఛయ** ఉత్తరఖండం అనువాదం చేయించారు. ప్రస్తుత వ్యాసకర్తచే గోవింద భగవత్పాదుల **రసహృదయ తంత్రం,** మాహుక విరచిత వైద్యవల్లభం, సురేశ్వరాచార్యకృత లోహ సర్వస్వం, కాయస్థచాముండిని, రససంకేతకలికలను అనువదించుటకు కారకులు.

రసాచార్య, ఆయుర్వేద స్థాపక, ఆయుర్వేద మహామహోపాధ్యాయ, పండిత చివుకుల సత్యనారాయణ శాస్త్రి : వీరు ఉయ్యూరు ఆస్థాన పండితులు. రాజాగారితో కలసి అనేక రచనలు చేశారు. ఆ కాలంలోనే రావణవధ అనే గ్రంథాన్ని వ్రాశారు. తర్వాత కాలంలో శ్రీ అఖండం శ్రీరామ శర్మగారి ప్రేరణతో ఆయుర్వేదాన్ని అధ్యయనం చేసి చికిత్సకులుగా, గ్రంథకర్తగా, పండితునిగా పేరు ప్రఖ్యాతుల నందుకొన్నారు. వీరు వాజీకరణ, రసతంత్రాలలో ఎదురులేని ప్రావీణ్యం పొందారు. నాగార్జునాచార్యుని తర్వాత తెలుగునాట రసాచార్య బిరుదును పొందిన ఏకైక వ్యక్తి. వీరు చక్రదత్త, రసరత్న సముచ్ఛయము, భారత భైషజ్యమంజరి (భైషజ్యరత్నావళి) తెలుగు అనువాదాలతో పాటు స్వయంగా వైద్యకల్పద్రుమము, వాజీకరణ తంత్రములను రచించి ప్రకటించారు. శ్రీధన్వంతరి వ్రతకల్పాన్ని పురాణోక్తంగా వ్రాసి ప్రప్రథమంగా ప్రకటించారు. అనేక సభలలో పాల్గొన్నారు. తామ్రభస్మం, అభ్రకభస్మం, స్వర్ణవంగం, అయారిజ్, చందనాది చూర్ణం, చంద్రహాసరసం, జీవరసాయనం వీరి అభిమానమైనవి. శతశః ఉపయోగించిన అనుభవ ఔషధాలు. కీ.శే. ద్విభాష్యం వెంకటేశ్వర్లు గారిచే చింతలూరులో వెంకటేశ్వరాయుర్వేద నిలయ స్థాపనకు కారకులని చెప్తారు.

ఆయుర్వేద భూషణ, ఆయుర్వేద మహా మహోపాధ్యాయ, భిషగ్వర కీ.శే. వేటూరి శంకరశాస్త్రి : వీరు పండిత దీవిగోపాలాచార్యులు, డా॥ ఆచంట లక్ష్మీపతుల శిష్యులు. ప్రముఖ వైద్యులు వేటూరి సుందరశాస్త్రిగారి కుమారులు, ఆంధ్రసారస్వతంలో పేరొందిన వేటూరి ప్రభాకర శాస్త్రిగారి సోదరులు. ముక్త్యాలరాజాగారి ఆధ్వర్యవంలో ఆర్షరసాయన శాలను నిర్వహిస్తూ నిర్దుష్టమైన ఔషధాలను తయారు చేయుటయే గాక, పురాతన ఆయుర్వేద గ్రంథాలను వెలికితీసి, తప్పులను దిద్ది, తమ సంపాదకత్వమున శ్రీ ధన్వంతరి పత్రికద్వారా ప్రకటించిన వాటిల్లో, భిషక్సుధార్ణవం, బహోబం, కళ్యాణకారకం, చారుచర్య, ఆనందకందం, శారీరతత్వ వివేకం, కక్షపుటం, మొదలైనవి. వీరు

స్వయంగా ఆయుర్వేద ఇతిహాసం, ఆచారాలు - ఆంతర్యాలు; శ్రీ ముదిగొండ గోపాలరావు గారితో కలసి, వైద్యకశారీర శబ్దకోశం, వేదములు - ఆయుర్వేదం, ఆచార్య తిరుమల గారితో ప్రాకృతంలోనున్న హారమేఖల (అనువాదం) ప్రకటించారు. వీరు మంచి పరిశోధకులు. ఆయుర్వేదానికి చెందిన అనేక శాసనాలను శోధించి ప్రకటించారు. బహుముఖ ప్రజ్ఞాశాలురు.

భిషగ్రత్న, ఆయుర్వేదోద్ధారక, ఆయుర్వేద బృహస్మతి, ప్రాణాచార్య, ఆయుర్వేద వాచస్పతి డా॥ ఆచంట లక్ష్మీపతి (3-3-1820 - 4-6-62) వీరు మద్రాసులో నున్నప్పటికీ విజయవాడ కార్యస్థానంగా అనేక ఆయుర్వేద సేవలు చేసిన అనన్య సామాన్యులు. వీరు ఆధునిక వైద్య ప్రవీణు లైనప్పటికీ, పండిత దీవి గోపాలాచార్యుల స్ఫూర్తితో జీవితాంతం ఆయుర్వేద సేవ చేసిన ఏకైక వ్యక్తి. వీరికి సమానులింత వరకూ లేరు. ఆయుర్వేద శిక్షా సీరీస్ పేర 40 పైగా గ్రంథాలను రచియింప జేసి ప్రచురించిన ఘనులు. ఇవిగాక, అతి పురాతన గ్రంథములైన ఆంధ్రవైద్య చింతామణి, వైద్యసార ములను ప్రచురించారు. శ్రీధన్వంతరి పత్రికను విజయవాడ కేంద్రంగా ప్రకటించారు. ఆంధ్రా యుర్వేద బోర్డుకు అధ్యక్షులుగానున్నారు. వీరి పూర్తి పరిచయం ఒక గ్రంథమే కాగలదు.

డా॥ వై. సూర్యనారాయణ రావు (30-9-1906 - 1980) : ఆధునిక, ఆయుర్వేదములను సమన్వయ పరచేందుకై ఏర్పడిన యల్.ఐ.యం. పట్టా పొందారు. తదనుగుణంగానే జీవితాంతం తమ వృత్తిని సాగించడమే గాక గ్రంథరచన చేసి ఇంటిగ్రేటెడ్ వైద్యానికి మార్గదర్శకం చేసిన మహానుభావులు. నేషనల్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ అసోసియేషన్‌కు ప్రప్రథమ అధ్యక్షులుగా ఎన్నుకొనబడిన తెలుగు వారు. కృష్ణాతీరం వారు. వీరి రచనలలో ఆధునిక వైద్యము, వైద్యవిద్యార్థి, గృహవైద్యం, యూనాని యోగమంజరి మొదలైనవి. వీరు కెప్టెన్ జి.శ్రీనివాస మూర్తిగారి శిష్యులు. వీరు తమ గ్రంథముల అమ్మకం ద్వారా వచ్చిన సొమ్మును ట్రస్టుగా ఏర్పరచిన దానశీలి. అదే ఈనాటి ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేదిక్ లిటరేచర్ ఇంప్రూమెంట్ ట్రస్ట్. ఈ ట్రస్టుద్వారా ఆంధ్రదేశంలో ప్రప్రథమంగా బి.ఏ.యం.యస్. విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయిం చిన పాఠ్యప్రణాళికననుసరించి పాఠ్యగ్రం థాలను వ్రాయించి ప్రకటించారు. భారతదేశంలోనే అపురూపమైన ఇటువంటి సంస్థను ఏర్పాటు చేసి చిరస్మరణీయులైనారు.

బృహత్రయీరత్న డా॥ నంబూరి హనుమంతరావు: వీరు కెప్టెన్ జి. శ్రీనివాసమూర్తిగారి ప్రియశిష్యులు. యల్.ఐ.యం. పట్టభద్రులు. ఇంటిగ్రేటెడ్ వైద్యము ద్వారానే ఆయుర్వేద ప్రచారము చేయువారు. కేంద్రప్రభుత్వం ఆయుర్వేద పరిశోధన సంస్థను నెలకొల్పుటకు ముందే 1961లో అకాడమీ ఆఫ్ ఆయుర్వేద అను సంస్థను విజయవాడలో స్థాపించి అనేక పరిశోధనలు చేసిన భారతదేశ ఆయుర్వేద రంగంలో ప్రత్యేకమైన స్థానాన్ని పొందిన పరిశో ధకులు. పేరు పొందిన వైద్యులు. ఆయుర్వేదంలో ఉపయోగించే భస్మాల మానవీకరణకై నంబూరి

ఫేజ్ స్పాట్ మెథడ్‌ను కనుగొని ఆయుర్వేద జగత్తుకు అందించిన మహానుభావులు. పంచభూత సిద్ధాంతంపై వీరి పరిశోధనా గ్రంథం ఇటీవలనే ప్రకటింపబడింది. న్యాయవైశేషిక సిద్ధాంతము వీరి మరొక రచన. వైద్యులకుపయోగార్థం అకాడమీ ఆఫ్ ఆయుర్వేద తరపున గత 37 సంవత్సరాలుగా ప్రతి నెలా మొదటి ఆదివారం నిరాఘాటంగా 441 క్లినికల్ ప్రసంగాలనేర్పాటు చేసిన మహామనీషి. అప్పటి నుండి ప్రతి రెండు సంవత్సరాలకూ భారతదేశంలోని ప్రముఖ వైద్యులను రావించి వారిచే ప్రసంగాలనేర్పాటు చేసి వారిని సత్కరిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా పరిశోధకులలోనూ, విద్యార్థులలోనూ ఆయుర్వేదమున అభినివేశమును పెంపొందించుటకై యోగ్యులైన వారిని ఎన్నుకొని స్వర్ణ, రజత పతకములనిచ్చి సత్కరిస్తున్నారు. వీరు అమెరికా, ఫిలిప్పీన్ దేశపర్యటన చేసి ఒకేసారి 50 పైగా ఆయుర్వేద కేంద్రాలను ప్రారంభం చేసిన వైద్య విద్వన్మణులు. కేరళ రాష్ట్రంలో వీరి ఆయుర్వేద సేవలను గుర్తించి - **బృహత్త్రయీరత్న** - అను బిరుదునిచ్చి గౌరవించారు. గుజరాత్ ఆయుర్వేద విశ్వవిద్యాలయం, ఫార్మకోగిదియా కమిటీ, ఇండియన్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కోఆపరేటివ్ ఫార్మసీ మొదలగు సంస్థలలో ప్రధానమైన హోదాలను నిర్వహించారు. 85 సంవత్సరాలు పైబడిన వృద్ధ వైద్యపండితులు.

పండిత ప్రతివాది భయంకర కృష్ణమాచార్యులు : 20వ శతాబ్దమున ఆంధ్రదేశమందలి ఆయుర్వేదాభివృద్ధికై బహుముఖముగ 40 సంవత్సరములు తమ ధన, మన, ప్రాణములను ధారపోసిన వారిలో ప్రముఖులు. విజయవాడలోని రామమోహనాయుర్వేద కళాశాలకు ప్రధానాచార్యులుగా నుండిరి. ఆంధ్రాయుర్వేద సమ్మేళనమునకు స్థాపక సభ్యులుగానూ, కార్యదర్శిగానూ, సమ్మేళన పత్రికకు సంపాదకులుగానూ ఉండిరి. గణనాథ సేన ఆధునిక అనాటమీని ప్రత్యక్షశారీరమను పేర సంస్కృతంలో వ్రాసిన గ్రంథానికి వ్యతిరేకం ఆయుర్వేదాంగ శారీర శాస్త్రసంగ్రహమను అపురూపమైన గ్రంథాన్ని రచించిన మహానుభావులు. వీరు అనేక రచనలు చేయడమే గాక అనేక మందిని ప్రోత్సహించి ఆయుర్వేద గ్రంథరచనకు తోడ్పడిన వారు. వీరి రచనలలో ద్రవ్య విజ్ఞానము, కరువు - ఆహారము, మానపరిభాష, త్రిదోష సిద్ధాంతము, బ్రహ్మచర్యము, ఆయుర్వేద విద్యా సముచ్చయములు ప్రధానమైనవి. వీరు స్వయంగా కుమార మిత్ర యను మాసపత్రికను నడిపారు.

భిషగ్రత్న ప్రకాశచంద్ర శతపథి (1913 - 5-12-2000) : భారతదేశంలో చరకసంహితను సంపూర్ణమైన అధ్యయనము చేసిన పండితులను 10 మందిని ఎన్నుకుంటే అందులో చేర్చగల తెలుగువారిలో ఏకైకవ్యక్తి. ఆంధ్ర ఆయుర్వేద మహామండలి కార్యదర్శిగా రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణన్ గార్లను సందర్శించి శుద్ధాయుర్వేద ప్రోత్సాహావశ్యకతను వివరించిన వారు. ఆయుర్వేదమునకు వ్యతిరేకమైన వారికి శాస్త్రపరంగా జాతీయ వైద్య విధానమని నిరూపించిన ఆయుర్వేద పండితులు.

చక్రవర్తుల నరశింహాచార్యులు : వీరు రామ మోహనాయుర్వేద ధర్మవైద్యశాల సంఘపు ప్రధాన వైద్యులుగా, వైద్యకళ పత్రిక సంపాదకులుగా పేరు పొందిన చికిత్సకులు. పండితులు. వీరి శత జయంతి కూడా ఈ సంవత్సరం జరగవలసి ఉంది.

ఆయుర్వేదాచార్య ఆతీ సత్యనారాయణ శాస్త్రి : వీరు నోరి రామశాస్త్రి శిష్యులు. కలాశాలలో అధ్యాపకులుగా అన్ని ఆయుర్వేదాంగములను బోధించిన కులపతులు.

డా॥ కర్రా నిష్ఠేశ్వర్ : వీరు తూ.గో. జిల్లాలో జన్మించినప్పటికి, వారి వైద్యవిద్యాభ్యాస సమయం నుండి ఇప్పటివరకూ విజయవాడలోనే ఉంటున్న వారు. ఆయుర్వేదంలో పిహెచ్.డి. చేసినవారు. ద్రవ్యగుణశాస్త్రంలో అప్రతిహతమైన జ్ఞానం కలిగినవారు. అనేక రాష్ట్ర, జాతీయ సెమినార్లలో పాల్గొన్నారు. వీరు వివిధ ఆయుర్వేద విషయాలపై రెండు పదులకు పైగా ఆంధ్రాంగ్లములలో గ్రంథ రచన చేశారు. విజయవాడ ఆయుర్వేద కళాశాలలో ఆచార్యులుగా ఉన్నారు.

విజయవాడ నుండి ప్రకటింపబడిన ఆయుర్వేద పత్రికలు : ఆంధ్రవైద్య సమ్మేళన పత్రిక, ఆంధ్రా యుర్వేద పరిషత్తు తరపున – ఆయుర్వేద, ప్రతివాది భయంకరం కృష్ణమాచార్యుల కుమారమిత్ర, కంభంమెట్టు విష్ణువర్ధన రావుగారి నాగార్జున, ఇండియన్ మెడిసిన్ ఇండస్ట్రీస్ వారి ఇండియన్ మెడిసిన్ (తెలుగు) (కొద్దికాలం ఇంగ్లీషు పత్రిక), ఇండియన్ మెడిసిన్ హౌస్‌వారి ఇండియన్ మెడిసిన్ హౌస్ జర్నల్, మస్‌ఫారా వారి మస్‌ఫార్‌వైద్య పత్రిక, రామమోహనాయుర్వేద ధర్మవైద్యశాల సంఘం తరుపున వైద్యకళ, ఒకటి రెండు సంవత్స రాలపాటు ఆయుధ అనే పత్రిక వచ్చేది. గత 10 సంవత్సరాలుగా విజయవాడ నుండి ఒక్క పత్రిక కూడా ప్రచురింపబడక పోవడం శోచనీయం.

విజయవాడలోని ప్రభుత్వ ఆయుర్వేద సంస్థలు : డా॥ నోరి రామశాస్త్రి ప్రభుత్వాయుర్వేద కళాశాల, డా॥ ఆచంటలక్ష్మీపతి ప్రభుత్వాయుర్వేద ఆసుపత్రి, కేంద్రప్రభుత్వం వారి ప్రాంతీయ పరిశోధనాల యములు.

(వ్యాసకర్త : పమ్మి సత్యనారాయణ శాస్త్రిగారు రసాచార్య పండిత చివుకుల సత్య నారాయణశాస్త్రిగారి దౌహిత్రులు, ఆనువంశిక వైద్యులు. హారీత ఆయుర్వేద కేంద్రమునకు కార్యదర్శిగా నుండి తమ వద్దనున్న 2000లుపైగా ఆయుర్వేద గ్రంథాలను బహూకరించి డా॥ ఆచంట లక్ష్మీపతి ఆయుర్వేద గ్రంథాలయాన్ని స్థాపించి, దానికి శాశ్వత భవనాన్ని ఏర్పరచి, రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నవారు. ఈ ఆయుర్వేద గ్రంథాలయం దక్షిణ భారతంలో అపురూపమైనది.)

కృష్ణాతీరం - వనమూలికాసంపద

డా॥ కొప్పుల హేమాద్రి

విశాలాంధ్రను ధాన్యలక్ష్మికి కొలువుగా, వనమూలికా సంపదకు ఖజానాగా రూపుదిద్దిన నదులు కృష్ణా గోదావరులు. ఈ రెండు జీవనదులూ మహారాష్ట్రలోని సహ్యాద్రి కనుమల్లోనే ఉద్భ వించాయి. గతవత్సరం స్వభానులో గోదావరి పుష్కరాలతో మనరాష్ట్రం పునీతమయింది. ప్రస్తుత దుర్ముఖి నామసంవత్సరంలో కృష్ణా పుష్కరాలతో మరోసారి పుణ్యకార్యాలకు అవకాశం వచ్చింది.

అన్ని జీవరాసుల మనుగడకు జలమే ఆధారం. జలంలేని జీవనం ఊహించలేనిది. ఆ జలానికి ఆధారం ప్రాణవాయువు. అట్టి ప్రాణవాయువునే కాక క్షుద్బాధను తీర్చే ఆహారాన్ని సైతం సూర్య కిరణాల సహాయంతో తయారుచేసి సర్వ ప్రాణులకు ఉదారంగా ధారపోసేవి మొక్కలు మాత్రమే! ప్రతి మొక్కలో అనేక 'సూక్ష్మ రసాయన కర్మాగారాలు' నిక్షిప్తమై ఉన్నాయి. అందుకే ఒకే మొక్కలోని వివిధ అంగాలు వాటిలో తయారయ్యే ఉన్నాయి. అందుకే ఒకే మొక్కలోని వివిధ అంగాలు వాటిలో తయారయ్యే రసాయనాలను బట్టి వేర్వేరు గుణాలను కలిగి ఉంటాయి. కొన్ని మొక్కలు తమ వేరుల్లో విషతుల్యమయిన పదార్థాలను తయారు చేస్తే, యితర భాగాలలో అమృత తుల్యమయిన రసాయనాలను కూడ ఏకకాలంలో తయారు చేయగలవు మన ఆలనా పాలనా లేకపోయినా సరే! ఒక మొక్క తయారు చేసే అనేక 'ఏక్టివ్ ప్రిన్స్‌పల్స్'లో ఏ ఒక్కదానిని ప్రయోగశాలలో చెయ్యాలన్నా లక్షలాది రూపాయలు వెచ్చించవలసి వస్తుందన్న సంగతి అందరికీ తెలిసిందే. కనుక మానవాళికి ప్రాణభిక్ష పెట్టే ఓషధీ యుక్తమయిన వనమూలికలు - కృష్ణానదీ పరీవాహక ప్రదేశాలలో పెరిగే కొన్నిటి గురించి తెలుసుకుందాం. కృష్ణానది సతారా జిల్లాలోని 'కోయ్నా' అనే పర్వత ప్రాంతంలో పుట్టి, దారిలో పుణె జిల్లానుండి బయలుదేరిన భీమానదిని, చిక్‌మగళూరు జిల్లాలో నడకలు నేర్చిన తుంగ-భద్రలను తనలో ఇముడ్చుకుని ఆంధ్రప్రదేశ్ నడిబొడ్డు గుండా ప్రవహించి దివిసీమ దగ్గర బంగాళాఖాతంలో కలుస్తుంది. దారిలో అనేక మహిమాన్విత మూలికాసారాలను, వాటి గుణాలను తనలో ఐక్యం చేసుకుని మహబూబ్‌నగర్, కర్నూలు, ప్రకాశం, నల్గొండ, గుంటూరు, కృష్ణా జిల్లాల నేలలను స్పృశిస్తుంది. కృష్ణానదీ ప్రవాహం దారి పొడవునా శ్రీశైలం ఆదిగాగల పుణ్య క్షేత్రాలతో కూడిన నల్లమలవంటి కీకారణ్యాలు ముండ్ల మొక్కలతో నిండిన చిట్టి అడవులూ, వరి, జొన్నవంటి తృణధాన్యాలు, కంది, శనగవంటి పప్పుధాన్యాలు, పసుపు, పొగాకు, ప్రత్తి, మిరప, నువ్వులు తదితర వాణిజ్యపరమైన దినుసులను ఉత్పాదించగల పంట భూములూ ఉన్నాయి. అందుకే ఎంతో వైవిధ్యంగల వృక్షసంతతి గల

కృష్ణాతీర వనసంపద మానవాళికి అందిస్తున్న తీరును పరికిద్దాం.

కృష్ణానది ప్రవహించే ఆరు జిల్లాలు ఎక్కువ మూలికాసంపద కలిగి ఉన్నవి. కర్నూలు, మహబూబ్‌నగర్ మరియు ప్రకాశం జిల్లాలు, నల్గొండ, గుంటూరు, కృష్ణా జిల్లాలలో మూలికా వైవిధ్యం తక్కువ. ఈ ఆరు జిల్లాలలో పర్వతాలూ నల్లమల శ్రేణులకు సంబంధించినవే. అయినా చివరి మూడు జిల్లాలలోని కొండలు ప్రధాన పర్వత శ్రేణి నుండి దూరంగా విసరి వేయబడినట్లు మాత్రమే ఉండడం ఈ తేడాకు ఒక కారణం. నల్లమల అడవుల్లో పెరిగే కొన్ని వృక్షాలు 20 నుండి 30 మీటర్ల ఎత్తు పెరుగుతాయి. జీర్ణశక్తిని పెంచేదీ, నరాల బలహీనతను పోగొట్టేదీ అయిన 'దశమూలారిష్ట'లో ఉపయోగించే బృహత్ పంచమూలాలను ప్రసాదించే మారేడు చెట్టు, పెగ్గుమ్ముడుచెట్టు, పంపిన లేక దుందిలంచెట్టు, పాదిరిచెట్టు, తక్కలి చెట్టు కూడ యీ ప్రాంతాలలో పెరుగుతాయి. లఘుపంచమూలాల్లో నేలవాకుడు, పల్లేరు, కోలాకు పొన్న మాత్రం విరివిగా వస్తాయి. నేను కనిపెట్టిన 'అర్జినియా నాగార్జున' (గంజిగడ్డ) అనే చర్మరోగాలలో పనిచేసే ఉల్లిపాయ వంటి మొక్క కూడ కృష్ణాతీరం అడవుల్లో పెరుగుతుంది.

మరికొన్ని ఓషధుల ఉపయోగాలు

కరక, తాడి, ఉసిరి

కరక్కాయ, తాడికాయ, ఉసిరికాయ తెలుసుగా
సమభాగంలో కలిపిన త్రిఫలచూర్ణమౌనుగా
మలబద్ధానికి శత్రువు త్రిఫలమ్ముల చూర్ణము
ప్రతి రాత్రీ తీసుకొనిన వాతాపి జీర్ణము!

కొండపిండి

మూత్రాశయ మార్గంలో రాళ్ళు పేరుకున్న
తుత్తునియలుగా చేయుటకైతే యిది మిన్న!
మూత్రంలో సుద్దపడిన, 'తెల్లబట్ట' అయినా
కషాయాన్ని కాచుకుని త్రాగ బాగుపడునన్నా!

అత్తపత్తి

అత్తపత్తి, సిగ్గుచింత, 'మైమోజా పడికా',
నిద్రగన్ని, కునుకురొద్ద, 'లజ్జాలూ' మూలిక!
సిగ్గులుగుట్టి, లజ్జగుచ్చ, ఎన్నిపేర్లు దీనికి?
తాకినంత ఆకులన్ని ముడుచుకునేదానికి!
పొలంగట్టు, అడవితట్టు, కొల్లేరూ కొలనుచుట్టు
ఆంధ్రావని నేలనంటి చిరుచాపలు పరచినట్టు!
అత్తపత్తి వేరు తెచ్చి రసంతీసి పుచ్చుకో
మూలవ్యాధి, చలిజ్వరముల బారినుండి తప్పుకో!

చిల్లగింజ

తేలు, జెర్రి, విషపురుగులు కుట్టిన వెనువెంటనే,
అరగదీసి గింజపెట్టు, విరుగు విషముఅటులనే!
అతి మూత్రం వ్యాధి ఉన్న గింజనోటబెట్టు!
నీట ఒంద్రుమట్టి ఉన్న చాది కలియబెట్టు!

ఊడుగ

ఉబ్బసం, పొడిదగ్గులు ఉన్నవారికి
కుదరచెట్టుగుణం బెరడు కషాయానిది!
ఆకులతో నీళ్ళుకాచి స్నానమాడిన
ఒళ్ళుతీపు మంత్రమువలె తీయకపోనా?
కుక్కకాటుపైన వేరుపట్ట నూరి కట్టుము,
పండ్లగుజ్జు తిన్న యెడల కండ్లకలక దూరము!

గుంటకలగరాకు

గుంటగలగరాకు రసం ప్రతిరోజూ తీసుకో,
కాలేయం, పిత్తకోశ రోగాలను ఆపుకో!

తిప్పతీగ

తిప్పతీగ కామెర్లకు, జ్వరాలకు అంకుశం,
యౌవనాన్ని రక్షించుట దీనికున్న లక్షణం!

రెప్పాల, పలవరి లేక అంకుడు

పచ్చి అంకుడాకు తెచ్చి ముక్కలుగా కోసి
టెంకాయ నూనెలోన మునిగినంత వేసి
పళ్ళెరాన రెండు మూడు దినము లెండబెట్టు
సారమంత నూనెలోకి దిగును నమ్ము! ఒట్టు!
పొట్టువలెను ఊడివచ్చు పొల్లుచర్మవ్యాధికి
కొంతరుద్దు, యింతమ్రింగు రానేరదు సోదికి!

తెల్లమద్ది

తెల్లమద్ది పట్ట తెచ్చికషాయాన్ని కాచుకో
గుండెపోటు రాకుండ ప్రతిదినము తీసుకో!

నేల ఉసిరి

నేల ఉసిరి కలుపు మొక్క కృష్ణతీర మంతటా
'భూమ్యామలకీ' అన్నది శాస్త్రీయపు పేరట!
'ఫిలాంథస్ అమరస్' అని వృక్షశాస్త్రనామము
కీర్తిగాంచె కామెర్లకు తిరుగులేని బాణము!
అతిమూత్రం వ్యాధిలోన అనువైనది చూర్ణము,
శ్వేత ప్రదర ప్రమదలకై వెనుకాడక వాడుము!

నేలతాడిగడ్డ

నేలతాడి, తాలమూలి, కాలీముసలీ,
అడవిలోన చెట్లనీడ పెరుగురా భళీ!
'కర్‌క్యులిగొ ఆర్ఖియాయిడిస్' లాటిన్ పేరు
వయసు ఉరక వేయుటకై వాడుమురా వేరు!

చప్పటాకు, నేలమర్రి

నేలమర్రి ఆకుదంచి చనుకట్టుకు కట్టుమా
వ్రణము ఉన్న తగ్గబెట్టి ప్రాణము కాపాడుమా!
వ్రేళ్ళుత్రవ్వి యెండబెట్టి చూర్ణముగా వాడిన
బాలెంతల రోగమ్ముల బారినుండి రక్షణ!
ఆకులేమొ తక్కువ, వేళ్ళు లెక్కకెక్కువ,
'వ్రణమర్ద'గ సంస్కృతాన పిలవాలని మక్కువ!

నేలవేము

'భూనింబా' శాస్త్రీయం, తెలుగు 'నేలవేము'
పరమచేదురుచికి, దీని నోట బెట్టలేము!
రక్తనాళ మార్గంలో రక్తగడ్డలడ్డుపడిన
కరగబెట్టి ప్రాణభిక్ష పెట్టునట్టి జాణ!
'ఎయిడ్స్'నే మహమ్మారి మూలాన్నే మట్టుపెట్టి
జగతిలోన జనరక్షణ గావించే ఘనాపాఠి!
చలిజ్వరముకు, కేన్సర్లకు నేలవేము మందు,
ఇట్టి దివ్యమూలిక నే నెటుల పొగడకుందు?

పసుపు

పసుపుగుండ క్రిమినాశని, పడిశానికి మందు
రక్తమ్మును శుభ్రపరచు గుణమున్నది యిందు!
సొగసు నొసగు సాధనమ్ము, ఇంతులకిది పెన్నిధి,
సుందర, ముఖారవింద సుదతులకిది సన్నిధి!
ముత్యమంత పసుపుతోడ ముఖమంతా పసిడి!
అందమె ఆనందమ్మని ఉందికదా నానుడి!

బొమ్మడోలు, పెన్నేరు గడ్డ

పెన్నేరుగడ్డ బలకరం, వీర్యవృద్ధికరము,
హృదయానికి శక్తినిచ్చు, నిద్రలేమి
హతము!

'పేరులేని రోగానికి పెన్నేరే' కద మందూ,
'కొరియన్ జిన్‌సెంగ్' కన్న వేలయేళ్ళముందు!

బొొక్కెనాకు

బొక్కెనాకు తెచ్చుకుని కషాయాన్ని కాచుకో,
కీళ్ళనొప్పి, కడుపుబ్బరమున్నప్పుడు తీసుకో!

పొడపత్రి

చూర్ణించిన పొడపత్రిని ప్రతిదినమ్ముఇమ్ము
మధుమేహం యేమున్నా అదుపులోకి తెమ్ము!
దెబ్బతగిలి కంటిలో పొరవచ్చిన తోడనే
ఆకు రసం చుక్కవాడి కరగబెట్టు వెంటనే!

బుట్ట బురగ తీగ

'శతక్రతులత' అంటే బుడ్డకాకరా
పొదలమీద గజిబిజిగా ప్రాకుతీగరా!
బుడగలాంటి ముక్కోణపు కాయలతోఇది
కృష్ణానది తీరమంత పెరుగుతుంటది!
బుట్ట బురగ తీగతెచ్చి కషాయం కాచి
పొట్టకింత పొయ్యి, ఉరుకు నడుం నొప్పిబూచి!

మల్లేరుతీగ, తీగ పల్లేరు

అడవిదారి వెంట చూడు ఆషాఢపు మాసంలో
పగులుతున్న గుత్తులెన్నొ సిందూరపు రంగులో!
మల్లేరు గింజ తైలానికి దోమ సద్దు మణగును,
మెదడుకెంతొ బలమునిచ్చి ముదిమి మరుపు తగ్గును!

వెల్తురు చెట్టు

మూత్రాశయమాశ్రయించి రాళ్ళు పెరిగి ఉన్న
గింజలు చూర్ణమ్ము చేసి మ్రింగబెట్టుమన్న!
వేరుతెచ్చి రసంతీసి చేరెడంతయిస్తివా,
కీళ్ళవాపు లేమున్నా త్వరితగతిని మానవా?

ముక్కుతుమ్ముడుతీగ, పాలకూరతీగ

ఒంగోలు చుట్టుపట్ల గ్రామాల్లో మహిళలు
'పాలకొరకు' పాలకూర వండుకు తింటారు!
గోవుకైన, బఱ్ఱెకైన తినబెట్టిన ప్రతిదినం
గతం కన్న అమితంగా క్షీరధార వర్ధనం!
కోళ్ళమేతలోన కలుపు పత్రమ్ముల చూర్ణము
గుడ్ల సంఖ్య పెరుగుతుంది, కనుము మరీ చోద్యము!

మేకమేయని తీగ

ఒకటి రెండు ఆకులను నమిలి నీళ్ళు మ్రింగినా,
ముద్దచేసి పెరుగుతోడ గమ్మున గుటకేసినా,
కఫమంతా వాంతిపోయి ఉబ్బసమే మాయము!
మూడు-ఆరునెలల పిదప మరోసారి మ్రింగుము!

వెంపలి

శ్వాస, కాసరోగాలను మత్తుగా, గమత్తుగా
'శరపంఖ'ను సేవించిన ఓడించును చిత్తుగా!
కాలేయము ఓపి కతో పని చేయాలంటే,
ఏమున్నది మంచిమందు ఈ వెంపలి కంటే!

సముద్ర పాలక

సముద్రపాలఆకు రక్తగడ్డలపై కట్టు
వేరుదంచి, రసం త్రాగు మలబద్ధత మట్టు!
ఆకునూరి వొరుపులకు, తామరకు రాయి,
త్వరితముగ మానుపట్టు, అనుభవించు హాయి!

సరస్వతి ఆకు

పిన్నవయసులో రోజూ రసం త్రాగినా,
ఎండబెట్టి పొడిగకొట్టి లోనికిచ్చినా,

జ్ఞాపకశక్తిని పెంచును మండూకపర్ణి
విని ఉందురు దీని మహిమ కర్ణాకర్ణి!

సంబరేణి మొక్క

కంపవాతరోగానికి, నరముల బలహీనతకు,
సంబరేణి రసంత్రాగు చక్కని ఫలితాలకు!
జ్ఞాపకశక్తిని పెంచే 'బకోసైడ్స్' సారమున్న
'జలబ్రహ్మి'ని వాడుతున్న మరపు దరికి రాదన్నా!

సుగంధిపాల మరియు మారడిగడ్డలు

సుగంధి తీగ వేరునిండ సుగంధాలపట్ట!
అదిసుగుణాలపుట్ట!
రక్తశుద్ధి, చలువచేయు మహామంచి దిట్ట!
అది దివ్యమైన పట్ట!
శ్రీశైలం మన్ననూరు అటవీ ప్రాంతాలలో
మారడిగడ్డల నెన్నో త్రవ్వితీతురు
సుగంధిపాలవేరు బదులు వాడుకొందురు
వేసవి చవి పానీయం చేసుకొందురు!

ఆకులు, చెట్లు అందరికీ తెలిసినా ప్రాంతీయ భేదాలతో పేర్లు తికమక పట్టించడానికి అవకాశముంది. అందువల్ల సమానార్థక పదకోశాన్ని ఇక్కడ పొందుపరచడం జరిగింది.

కృష్ణాతీరంలో లభించే కొన్ని ముఖ్యమైన వనమూలికలు

లాటిన్ పేరు	ప్రాంతీయం పేరు	సంస్కృత నామం
Abutilon indicum	ముద్రబెండ, బొట్లబెండ	అతిబలా
Aegle marmelos	మారేడు	బిల్వ
Aerva lanata	పిండికూర, కొండపిండి	పాషాణభేద
Aloe barbadensis	కలబంద	కుమారీ
Andrographis paniculata	నేలవేము	భూనింబా
Argyreia nervosa	సముద్రపాలకతీగ	వృద్ధదారు
Aristolochia bracteolata	గాడిదగడపాకు	కీటమారీ
Aristolochia indica	నల్లఈశ్వరి	ఈశ్వరీ
Asparagus racemosus	చల్లగడ్డల తీగ	శతావరీ
Azadirachta indica	వేప, యాపచెట్టు	నింబా
Bacopa monnierii	సాంబ్రాణి ఆకు	జలబ్రాహ్మీ
Boerhaavia diffusa	అటుకమామిడి	పునర్నవా
Boswellia serrata	అందుగుచెట్టు	శల్లకి
Butea monosperma	మోదుగు చెట్టు	పలాశ
Calotropis gigantea	జిల్లేడు, తెల్లజిల్లేడు	అర్క - శ్వేతార్క
Calotropis procera	జిల్లేడు	అర్క భేదం

లాటిన్ పేరు	ప్రాంతీయం పేరు	సంస్కృత నామం
Capparis sepiaria	నల్లఉప్పి	కాకాదని
Cardiospermum halicacabum	బుడ్డకాకర తీగ	శతక్రతులతా
Cassia fistula	రేలచెట్టు	ఆరగ్వధా
Celastrus paniculatus	తీగపల్లేరు, మాలకగ్ని	జ్యోతిష్మతీ
Centella asiatica	సరస్వతి ఆకు	మండూక బ్రహ్మీ
chlorophytum arundinaceum	కుచ్చేరు పువ్వు	శ్వేత ముసలీ
Chlorophytum tuberosum–	శ్వేతముసలీ భేదం	
Citrullus lanatus	చేదుపుచ్చ తీగ	ఇంద్రవారుణీ
Clerodendrum phlomidis	తక్కలి	లఘువగ్నిమంథా
Cochlospermum religiosum	కొండగోగు	పీతకార్పాస
Coleus forskohlii	'కోలియస్'	?
Costus speciosus	కేవుకంద	కేబుక
Crateva adansonii var. odora	ఉలిమిరిచెట్టు	వరుణ
Curcuma domestica	పసుపు	హరిద్రా
Curculigo orchioides	నేలతాడి	తాలమూరీ
Decalepis hamiltonii	మారడిగడ్డలు, షర్బత్‌గడ్డలతీగ	శ్వేత శారిబా
Desmodium gangeticum	కోలాకు పొన్న	శాలపర్ణీ
Dichrostachys cinerea	వెల్తురు చెట్టు	వీరతరు
Diplocyclos palmatus	లింగదొండ	లింగినీ
Dregea volubilis	తుమ్మిడితీగ, బండి గురిజతీగ	?
Elytraria acaulis	చప్పటాకు	వ్రణమర్ద
Enicostema hyssopifolium	నేలగొలిమిడి	మామజ్జక
Evolvulus alsinoides	విష్ణుక్రాంత	విష్ణుక్రాంత
Ficus racemosa	మేడిచెట్టు	ఉదుంబర
Flacourtia indica	కానరేగు	వికంకత
Gardenia gummifera	బిక్కి	నాడీహింగు
Gardenia resinifera	కారింగువ	నాడీహింగు
Gmelina arborea	గుమ్మడిటేక్	గంభారీ
Gymnema sylvestre	పొడపత్రం తీగ	మేషశృంగీ

లాటిన్ పేరు	ప్రాంతీయం పేరు	సంస్కృత నామం
Hemidesmus indicus	గుడపాల, పాలసుగంధి	శ్వేతశారిబా
Hesperethusa crenulata	వేయిగండ్ల చెట్టు, తెర్రిఎలగ	?
Holarrhena antidysenterica	కోలముఖి, ఆకుపాల	కుటజ, ఇంద్రయవ
Holrtelea integrifolia	తప్సాసి, నెమిలి చెట్టు	చిరబిల్వ
Holostemma adakodien	పాలగడ్డతీగ	?
Hybanthus suffruticosum	రత్నపురుష	రత్నపురుష
Hygrophila auriculata	నీరు గొలిమిడి	కోకిలాక్ష
Indigofera tinctoria	నీలి	నీలి
Ipomoea paniculata	పాలగుమ్ముడు తీగ	క్షీరవిదారీ
Lannea coromandelica	గుంపెన, గుంపిడిచెట్టు	జింగినీ
Leptadenia reticulata	పాలకూరతీగ	జీవంతీ
Leucas aspera	తుమ్మికూర	ద్రోణపుష్పీ
Leucas cephalotes	తుమ్మికూర	ద్రోణపిష్పీ
Litsea glutinosa	నరమామిడి చెక్కచెట్టు	'మైదాలక్డి'
Luffa acutangula var. amara	చేదుబీర	కోశాతకీ
Madhuca latifolia	ఇప్పచెట్టు	మధూక
Maeruva oblongifolia	భూచక్రం గడ్డతీగ	?
Mallotus philippensis	సిందూరి చెట్టు	కంపిల్ల
Melia composita	మున్నూట కరకబెట్టు	?
Moringa concanensis	కారుమునగ	వనశిగ్రు
Nyctanthes arbortristis	కరిసె, పారిజాతం	పారిజాత
Oroxylum indicum	పంపిని, దుందిలము	అరలు, శ్యోనాక
Ougeinia oogeinensis	చిక్కుడు చెట్టు, వందనం	తినిశ
Pentatropis capensis	చిటపట ఆకుతీగ	?
Peuravia tuberosa	నేలగుమ్ముడు	విదారీ
Phyla nodiflora	బొక్కెనాకు	జలపిప్పలీ
Phyllanthus amarus	నేల ఉసిరి	భూమ్యామలకీ
Phyllanthus emblica	ఉసిరి	ఆమలకీ
Plumbago zeylanica	చిత్రమూలం	చిత్రక

లాటిన్ పేరు	ప్రాంతీయం పేరు	సంస్కృత నామం
Pongamia pinnata	కానుగ చెట్టు	కరంజ
Pterocarpus marsupium	వేగిస	బీజసార
Pterocarpus santalinus	ఎర్రచందనం	రక్తచందన
Randia dumetorum	మంగ	మదన
Salvadora persica	వరగోగు చెట్టు	పీలు
Semecarpus anacardium	నల్లజీడి	భల్లాతక
Sida acuta	పరాసుకంప	బలా
Sida cordifolia	చిట్టాముట్టి	బలా
Solanum nigrum	కామంచి	కాకమాచి
Solanum surattense	నేలవాకుడు	కంటకారి
Sphaeranthus indicus	బోడతరం	ముండీ
Soymida febrifuga	సోమిచెట్టు	మాంసరోహిణి
Sterculiaurens	ఎర్ర పొలికి	కతీర
Streblus asper	బర్రింక	శాఖోటక
Stereospermum Suaveolens	పాదిరి చెట్టు	పాటలా
Strychnos nuxvomica	ముషిణి చెట్టు	కుపీలు, విషముష్ఠి
Strychnos potatorum	చిల్లగింజ, నిర్మలి	కతక
Syzygium cumini	అలంనేరేడు, అల్లనేరేడు	జంబూ
Tamarindus indica	చింతచెట్టు	చించా
Tephrosia purpurea	వెంపలి	శరపుంఖా
Terminalia arjuna	ఏరుమద్ది, తెల్లమద్ది	అర్జునా
Terminalia bellirica	తాండ్ర, తాని	విభీతకీ
Terminalia chebula	కరక చెట్టు	హారీతకీ
Urginea nagarjunae	గంజిగడ్డ, అడవి ఉల్లిగడ్డ	నాగార్జున పలాండు
Vernonia anthelmintica	అడవిజీలకర్ర, చేదుజీలకర్ర	వనజీరక
Vitex negundo	వావిలి చెట్టు	నిర్గుండీ
Withania somnifera	పెన్నేరుగడ్డ, బొమ్మడోలు	అశ్వగంధా
Woodfordia fruticosa	ఆరెపువ్వు	ధాతకీ
Wrightia tinctoria	రెప్పాల, పలవరి, అంకుడ	అసితకుటజా

దేశీనృత్యం - జాయపసేనాని

ఆచార్య ఎస్.గంగప్ప

"ఆగత్య బ్రహ్మలోకాదిహభరతమునిః శాస్త్రమేతన్మదీయం
దృష్ట్వా భూయః కృతాదౌ ప్రస్వమరపులకవ్యంజితాంతః ప్రమోదః
'ఆశ్చర్యం పశ్యతేదం కథ మధిగతవానాశయం మే సమగ్రం
స శ్రీమాన్ జాయసేనాపతి' రితినియతం వక్ష్యతేஉగ్రే మునీనామ్ ॥"

(నృత్తరత్నావళి-1 అధ్యాయం శ్లో. 16)

(రాబోవు కృతయుగం ఆదియందు మరల బ్రహ్మలోకంనుండి ఇక్కడికి వచ్చి భరతముని, నా యీ శాస్త్రాన్ని చూచి, నిండినపులకలచే లోపలి సంతోషాన్ని వెలిబుచ్చుచు 'ఈ ఆశ్చర్యం చూడుడు! ఆహా! శ్రీ జాయపసేనాని నా ఆశయమంతయు ఎట్లు కనుగొన్నాడు!' అని మునుల ముందు తప్పక చెప్పును. రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారి అనువాదం. పు.9)

జాయపసేనాపతి నృత్యరత్నావళి శాస్త్ర రచనాప్రారంభంలో గ్రంథప్రశస్తిని గూర్చి చెప్పుకొన్నాడు. ఇంతకుముందెప్పుడో భరతముని నాట్య శాస్త్రం రచించాడు. బ్రహ్మలోకానికి వెళ్లిపోయాడు. అంతటి నాట్య శాస్త్రకర్త భరతముని మళ్లీ దేవలోకం నుంచి భూలోకానికి వచ్చి తన నృత్యరత్నావళిని పరిశీలించి ఆశ్చర్యచకితుడై మనుషులతో 'చూశారా! ఈ ఆశ్చర్యాన్ని! నా ఆశయాన్ని పరిపూర్ణంగా గుర్తించిన జాయపసేనాపతి నృత్యరత్నావళిలో సముచిత రీతిని పరిపూర్ణంగా రచించాడు' అని తప్పక చెబుతాడని తెలుపుకొన్నాడు. ఇది జాయపసేనాని ఆత్మ ప్రత్యయం. భరతుని నాట్యశాస్త్రంలోలేని విషయాలను జాయప వివరించాడని అర్థం.

తెలుగు ప్రజలందరినీ సమైక్యంగా ఏకచ్ఛత్రాధిపత్యంతో పాలించిన ఘనత కాకతీయ రాజులదని చెప్పడం సహజం. కాకతీయరాజులందరిలో విశిష్టచక్రవర్తి గణపతి దేవచక్రవర్తి. ఈ గణపతి దేవచక్రవర్తి ప్రోత్సాహంతోనే జాయప సేనాని సంస్కృతంలో నృత్యరత్నావళి రచించి, కీర్తి గడించాడు; జాయపను గజ సైన్యాధిపతిని చేసిన ఘనతగూడ గణపతి దేవచక్రవర్తిదే. కృష్ణానది సముద్రంలో కలిసే చోటున్న (హంసల) దీవి యందు గొప్ప పట్టణం నిర్మించి అయ్య వంశీకులు పాలిస్తూండేవారు. కృష్ణాజిల్లా దివిసీమఅంతా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రసాదించిన ప్రదేశం. ఈ దివిసీమ కళలకు కాణాచి, సాహిత్యానికి నిలయం. పద పద్య కవితలకు, సంగీత

సాహిత్యాలకు, నాట్యాభినయాలకు దివిసీమ పట్టుగొమ్మ.

గణపతిదేవ చక్రవర్తి ఓరుగల్లు నందు నిలదొక్కుకొన్న తరువాత సముద్రతీరాంధ్ర దేశాన్ని – కృష్ణానది చివరి వరకు – నది సముద్రంలో కలిసేంతవరకు దండెత్తి పోయాడు. వెలనాటి రాజైన పృథ్వీశ్వరుడు తాత్కాలికంగా చందవోలు నుంచి పిఠాపురానికి రాజధాని మార్చుకొని తన బలాన్ని కృష్ణాప్రాంతంపై ప్రయోగిస్తున్నాడు. గణపతిదేవుని ఆదేశానుసారం మల్యాల చాముండ సేనాని కృష్ణానది సముద్రంలో కలిసే ప్రదేశమైన దీవి (హంసలదీవి) పై దండెత్తి వెళ్లాడు. అప్పటికి అయ్యవంశీకులలో పిన్న చోడుడు ఈ దీవిని పరిపాలిస్తున్నాడు. ఈ అయ్యవంశీకులు వెలనాటి పృథ్వీశ్వరునకు లోబడి పాలనం చేస్తున్నారు. పిన్నచోడ సైన్యాలు గట్టిగా ఎదుర్కొన్నా, గణపతి దేవుని సేనలు దీవికోటను సర్వమూ ఆక్రమించుకున్నాయి. మల్యాల చాముడం బొక్కసమంతా కైవసం చేసుకొని పృథ్వీశ్వరుని అనర్ఘ మణి మాణిక్యాలతో గణపతిదేవుని కోశాన్ని నింపివేశాడు. రాజనీతిలో భాగంగా కయ్యంతో ప్రారంభమైనా, పిన్నచోడుని సాహస పరాక్రమాలను మెచ్చుకొని తనకు లోబడి రాజ్యం చేసుకొమ్మని ఇచ్చివేశాడు. పిన్నచోడునితో వియ్యమందుకొన్నాడు గణపతి చక్రవర్తి. పిన్నచోడుని కుమార్తెలు నారాంబ, పేరాంబలను వివాహమాడి బాంధవ్యాన్ని స్థిరపరచాడు. ఇంతేగాక చిన్నవాడైన పిన్నచోడుని పుత్రుడు జాయపను అతని శౌర్యపరాక్రమాన్ని స్ఫూర్తిమంతమైన కళాత్మకతను, ఉత్తమ గుణగణాలను గుర్తించి తనతోపాటు తీసుకొని వెళ్లి గుండామాత్యునిచేత శిక్షణ నిప్పించి నాట్యాభినయాల్లో ఆరితేరేట్లుచేసి నృత్తరత్నావళి గ్రంథరచన చేయించాడు. గజసైన్యాధిపతిని చేశాడు.

ఈ సందర్భంలో 'అయ్యవంశీకులు' అంటే పిన్నచోడుని పూర్వీకులను గూర్చి కొంత తెలుసుకోవడం అవసరం. **జాయపకు జాయన, జాయసేనాని, జాయపసేనాపతి, జాయచమూపతి, జాయగజసేనాపతి, జాయపగజసాహిణి – అని పలు పేర్లున్నాయి.** జాయప తాత ముత్తాతలది వెలనాడులోని క్రొయ్యూరు. దీన్నే క్రోసూరు అంటారు కొందరు. ఇతని తండ్రి తాతలు చందవోలు రాజధానిగా తెలుగుదేశాన్ని పరిపాలించిన వెలనాటిచోళ మహీపతులకు సామంతులై ఉండేవారు. ఈ వంశానికి మూలపురుషుడు భీమయ్య. ఇతనికి చల్లయ్య, నారయ్య, మారయ్యలని ముగ్గురు పుత్రులు. మొదటిపుత్రుడైన చల్లయ్య తమచోళ ప్రభువులు తమ సేనానాయకుడుగా నియమించుకొన్నారు. చల్లయ్య తమ్ముడు నారయ్య చోళప్రభువుల ఆదేశానుసారం కృష్ణానదీ సాగర సంగమ ప్రాంతాన్ని – అంటే ఈనాటి హంసలదీవి ప్రాంతాన్ని ఆనాడు జన నివాసయోగ్యంగాని ప్రదేశాన్ని – నివాసయోగ్యంగా చేసి ఒక కోట నిర్మాణం చేసి దానికి ఆధిపత్యం వహించాడు. వెలనాటిచోళ భూపాలుడు నారయ్య

ను తన సైన్యాధ్యక్షునిగా నియమించుకొన్నాడు. వెలనాటిలో భాగమైన ఆ ప్రాంతాన్ని తలగడదీవి, హంసలదీవి, మోపిదీవి, నాగాయలంక, అవనిగడ్డ మొదలైన తీరస్థాంధ్ర ప్రాంతాన్ని దివిసీమగా మార్చిన ఘనత నారయ్యది. ఈ నారయ్యకు చోడయ్య, పినచోడయ్య, భీమయ్య, బ్రహ్మయ్య అని నలుగురు పుత్రులు. ఈ నలుగురు వెలనాటి మహామండలేశ్వరులకు సేనానులై నాలుగు దిక్కులు రక్షిస్తూ వచ్చారు. రెండో కుమారుడు పినచోడయ్యకు భార్య దాయమ్మ. ఈ దంపతుల పుణ్యఫలంగా నారమ్మ, పేరమ్మ అనే ఇద్దరు పుత్రికలు, పృథ్వీపతి, జాయప, నారయ్య అనే ముగ్గురు పుత్రులు జన్మించారు. ఈ దివిసీమను జయించిన కాకతి గణపతిదేవుడు నారమ్మ, పేరమ్మలను వివాహమాడాడు. జాయప స్ఫూర్తిమత్వాన్ని గుర్తించి తన గజసైన్యాధిపతిగా చేసుకున్నాడు.

పిన్న వయస్కుడైన జాయప ప్రతిభాపాటవం, శక్తిసామర్థ్యాలు, వీరపరాక్రమాలను గుర్తించి, గణపతిదేవ చక్రవర్తి తన అమాత్యుల్లోని గుండామాత్యుని కప్పగించి నాట్యాభినయాల్లో పదేళ్లపాటు శిక్షణ నిప్పించాడు. మరోపక్క గజసైన్యాన్ని నిర్వహించడానికి ప్రోత్సహించాడు. ఆరితేరిన వెనుక జాయపను గజసైన్యాధ్యక్షుని చేశాడు. జాయపసేనుని మెచ్చి ఆందోళికాకరపత్రాది గౌరవాలను ప్రసాదించి 1213లో తామ్రపురిని (గుంటూరు జిల్లాలోని చేబ్రోలును) పరిపాలించమని ప్రసాదించాడు. చేబ్రోలు శాసనంలో జాయప సేనాని కళాకౌశలాదులు వివరించబడ్డాయి.

చేబ్రోలుపాలకుడైన తరువాత జాయపసేనాని తన తండ్రి పినచోడుని పేరుమీద చౌడేశ్వరాలయం నిర్మింపజేసి, చోడసముద్రం తవ్వించాడు. అక్కడ దేవాలయంలో అంగరంగవైభోగానికి నియమితుడైన దేవదాసీల నివాసానికి రెండతస్థుల భవన నిర్మాణం చేయించాడు. ఈ దేవభోగానికి గాను మోరాతుకూరు ఈనాటి మోదుకూరును దానం చేశాడు.

ఇంతేగాక దాక్షారామంలో భీమేశ్వరస్వామికి అఖండ దీపారాధనకైంకర్యానికి ఏర్పాటు చేశాడు జాయప. తన ఏలిక గణపతిదేవ చక్రవర్తిపేరిట గణపేశ్వరాలయం నిర్మింపచేసి దాని రక్షణార్థం అనేక గ్రామాలు దానం చేసిన ఘనత జాయపసేనానిది. దానికితోడు పడవకి ఒక పణం పన్ను వసూలు చేసుకొనేట్లు అధికారాన్ని ప్రసాదించాడు. ఇలా అనేక ధర్మకార్యాలు చేశాడు.

కళింగయుద్ధంలో జయించి వచ్చిన గజసేనాని జాయపకు 'వైరిగోధూమఘరట్ట' అనే బిరుదుతో గణపతిదేవ చక్రవర్తి సత్కరించాడు.

ఒకపక్క ఖడ్గచాలనతో యుద్ధనైపుణ్యమూ, మరోపక్క గజసైన్య నిర్వహణ ప్రావీణ్యమూ, ఇంకోపక్క ఘంటంపట్టి రచన చేయగల సామర్థ్యం జాయపను వరించాయి. గుండామాత్యుని

శిక్షణలో సంస్కృత పాండిత్యమూ, నాట్యాభినయాల పరిపూర్ణ జ్ఞానమూ సంపాదించుకొని, కేవలం నాట్యాచార్యు డేగాక, నృత్త రత్నావళిని తన రాజు ఆదేశంతో రచించి తెలుగుజాతి దేశీనృత్య గ్రంథాన్ని ప్రసాదిం చిన ఘనత జాయపసేనానిది.

నృత్తం దేశి, జానపదకళారూపం, గీతవాద్య నృత్తాల మూడింటి సమ్మేళనం సంగీతం. ఇది రెండు విధాలు – మార్గ – దేశి అని. ఈ విభజన మొదట సంగీతపరంగాను, తరువాత నృత్యపరంగాను, ఆ వెనుక సాహిత్యపరంగాను నిరూపించబడింది. నృత్తం అతిప్రాచీనమైంది. అతిపురాతన కాలంలో తనకు కలిగిన ఆవేశకావేశాలకు సంతోష దుఃఖాలకు, ఉత్సాహ నిరుత్సాహాలకు, వలపు తలపులకు అనుగుణంగా హృదయ స్పందనలతో ప్రాక్తన మానవుడు వేసిన గంతు ఈ నృత్తానికి మూలరూపమై ఉంటుంది. అది ప్రాక్తనమానవుని ఆట. ఇందులో మాటపాటలకు అవకాశమేలేదు. మాటరాకముందే కూనిరాగాలు తీసి ఉంటాడు.

అది జానపద సంగీతానికి మూలం. ఆ వెనుక మాటతో పాట వచ్చి ఉంటుంది. అంటే ఆట, మాట, పాట క్రమం. ఇది నిబద్ధంకాదు. అయినా జానపదుల ప్రచారంలో వుంటుంది. ఇదే లక్షణబద్ధమై, శాస్త్రీయమై శిష్టనాట్యమై దానికి శాస్త్రం – అంటే నాట్యశాస్త్రం వెలిసింది. ఆ వెనుక తెలుగు సీమలో ఒక గజసైన్యాధిపతి శిష్టేతరకళ నృత్యానికి లక్షణగ్రంథం, సంస్కృతంలో రాయడం విశేషాల్లో విశేషం. శిష్ట సమ్మతమూ, శాస్త్రాను గుణమూ, నిబద్ధమైనది దేశి. నృత్త, నృత్య, నాట్యప దాల గూర్చి చెప్పిన ప్రథముడు నందికేశ్వరుడు. అదే రీతిన నృత్యావళిలో నృత్త, నృత్య, నాట్య లక్షణాలను వివరించాడు జాయపసేనాని.

దేశీనృత్తంపై అత్యంత ప్రీతిగల కాకతి గణపతిదేవుడు, జాయపసేనాని ప్రజ్ఞాపాటవాలను గురించి తెలుసుకొని గుండామాత్యునికి అప్పగించి నృత్యం నేర్పించాడు. జాయప గురుశుశ్రూషతో నృత్తంలో ఆరితేరిన తరువాత గణపతి దేవచక్రవర్తి ఆదేశంతో నృత్తరత్నావళి లక్షణ గ్రంథం రచిం చాడు. జాయపసేనాని కృతమైన సంస్కృత నృత్తరత్నావళి కీ.శే.రాళ్లపల్లి అనంత కృష్ణశర్మగారి సంస్కృత మూలంతో అనువాదాన్ని ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ, హైదరాబాదువారు డా|| వి.ఎస్.ఆర్.అప్పారావుగారి విపులపీఠికతో 1969లో ప్రకటించారు. ఇందుకు డా.వి.రాఘవన్ గారి 30 యేళ్ల పరిశోధన శ్రమ ఫలితంగా వెలువడిన సంస్కృత రత్నావళి మూలం ఉపక రించింది.

నృత్తరత్నావళి దేశీనృత్తరీతులు వివరణాత్మకమైన ఉత్తమ లక్షణగ్రంథం. అంతకుపూర్వమే సంస్కృతంలో భరత కృత నాట్యశాస్త్రమున్నా, అది మార్గసంబంధి నృత్యాభినయాన్ని వివరిస్తుంది. దేశీనృత్తరీతుల వివరణ లేనిలోటు జాయప తీర్చాడు.

నృత్తరత్నావళిలో ఎనిమిది అధ్యాయాలున్నాయి. మొదటి నాలుగు అధ్యాయాలు మార్గ నృత్య వివరణాత్మకమైనవి. తక్కిన అయిదో అధ్యాయం మొదలు ఎనిమిదో అధ్యాయం వరకు దేశీనృత్త రీతులు వివరించబడ్డాయి.

నృత్తరత్నావళిలోని మొదటి అధ్యాయం నర్తన వివేకాన్ని తెలుపుతుంది. రెండో అధ్యాయం అంగ నిరూపణం చేస్తుంది. మూడో అధ్యాయం చారీ, స్థానక, మండల లక్షణాలను వివరిస్తుంది. నాల్గో అధ్యాయంలో కరణం, ఆహారాదులు వివేచన ఉంది. ఈ నాల్గు అధ్యాయాల్లోను మార్గ నృత్యరీతులు వివరించబడ్డాయి. ఇవి గతానుగతికమే అయినా జాయప నిర్వచన నిరూపణలో మౌలికతను ప్రదర్శించాడు.

కాగా అయిదో అధ్యాయం మొదలుకొని ఎనిమిదో అధ్యాయం వరకు దేశీనృత్తరీతులు వివరించబడ్డాయి. అయిదో అధ్యాయంలో దేశీ స్థానక, కరణ, భ్రమరీ లక్షణాలు నిర్వచించబడ్డాయి. దేశీ నృత్తరీతులు ఆరు, ఏడు, ఎనిమిది అధ్యాయాల్లో ప్రాధాన్యం వహించాయి. గొండ్లి, పేరణి, ప్రేక్కణం (ప్రేంకణం), రాసకం, చర్చరీ, నాట్యరాసకం, దండరాసకం, శివప్రియం, చింతు (చిందు), కందుకం, భాండకం, ఘటిసణి, చారణం, బహురూపం, కొలాటం (కోలాటం) అనే దేశీనృత్త రీతులు వివరించబడ్డాయి. వీటి నిర్వచనాలన్నీ స్వయంగా జాయప నాట్యాచార్యుడు కావడంవల్ల విశిష్టంగా వర్ణించినట్లు స్పష్టమవుతుంది. ఆనాడు ఒక ఆంధ్రుడు, బ్రాహ్మణేతరుడు సంస్కతభాషలో రచించడం ఎంతో ప్రశంసనీయం.

దేశీ సంబంధి నృత్తరీతులు ఆనాడు జానపదుల్లో ప్రాచుర్యంలో ఉన్నవాటిని పాల్కురికి సోమనాథుడు బసవపురాణం (పు. 59,60), పండితారాధ్య చరిత్ర (పు. 435–65)లలో ఉదాహరించాడు. తిక్కన సైతం సంస్కృత భారతంలోలేని దేశీనృత్తరీతుల్ని కొన్నింటిని పేర్కొన్నాడు. పశ్చిమ చాళుక్యరాజు సోమేశ్వరుడు అభిలషితార్థచింతామణి అనే 'మానసోల్లాస' (క్రీ.శ. 1131) గ్రంథాన్ని రచించాడు. ఇతడు పేర్కొన్న 'గోండలి' నృత్తాన్ని తెలుపుతూ ఇది సోమేశ్వరుని సృష్టి అని ప్రశంసించాడు జాయపసేనాని. ఇదో విశేషం.

జాయపసేనాని నిర్వచించి, వివరించిన దేశీనృత్యరీతులన్నీ జానపద కళారూపాలు. అందులో పేరణినృత్యం పురుష ప్రాధాన్యంగల నృత్తరీతి. దీని వివరణ నృత్తరత్నావళిలో సప్తమాధ్యాయం (పుట. 344 నుండి 351 వరకు)గల శ్లోకాలు, వాటి అనువాదమూ పరిశీలనార్హం. జాయపసేనాని పేర్కొని, వివరించిన నృత్తరీతులకు రామప్ప

దేవాలయ శిల్పాలు చక్కటి ఉదాహరణలు. ఈ రామప్ప దేవాలయ నిర్మాత గణపతి దేవచక్రవర్తి ప్రధానులలో ప్రముఖుడు రుద్రసేనాని కళా హృదయానికి రూపమైన నిర్మాణం. ఈ రుద్రసేనాని 1203లో ప్రారంభించి, 1213లో నిర్మాణం పూర్తి చేసినట్లు తెలుస్తుంది. (నృత్తర త్నావళి పీఠిక – పుట. 3).

భూమిపై నటరాజు – నటరాజ రామకృష్ణ గారు. ఆంధ్రనాట్యం పేరిణి శివతాండవం – రామప్ప దేవాలయ శిల్పాల మూలలను పునరుద్ద రించి ప్రచారం చేస్తున్న విషయం జగద్విదితం. ఆంధ్రుల నాట్యకళ, ఆంధ్ర నాట్యం అనే రచనలేగాక 'పేరిణిశివతాండవం' గ్రంథరచన చేసి తాము పునరుద్ధరించిన ఆంధ్రనాట్య మైన పేరిణి శివతాండవాన్ని ప్రచారం చేస్తున్న వైనం గుర్తించ దగ్గది. ఈ సందర్భంలో నటరాజు రామాకృష్ణగారి మాటలుటంకించడం సమంజసం.

"కాకతీయ గజసేనాపతి, గణపతి దేవ బావమరది, నాట్యాచార్య గుండామాత్యుని శిష్యుడు" అయిన జాయప రచించిన నృత్తరత్నావళి లో ఈ నర్తనం (పేరిణీ శివతాండవం) గురించి వివరంగా వుంది.

వెయ్యి సంవత్సరాలకు పూర్వం మన తెలుగు నాట్య శాస్త్రవేత్తలు రూపొందించిన ఆంధ్రులకు గర్వకారణమైన ఏకైక వీరనాట్యం పేరిణి. శివుని ఆరాధించే విశిష్ట తాండవ నర్తనం ఇది. వీరరస ప్రధానం ఈ పేరిణి నాట్యం.

భారతీయ నృత్యకళకు ఆంధ్రులు సమర్పించిన అపూర్వ పూజాపుష్పం ఈ పేరిణి.

"పురుషునిలోని పౌరుషాన్ని, వీరునిలోని వీరత్వాన్ని, మగవానిలోని మగటిమిని లోకానికి చాటిచెప్పే పురుషులనాట్యం ఈ పేరిణి". "...కాకతీయ సైన్యాలు కదన రంగానికి వెళ్లిన సమయంలో వీరులు, మైలారదేవులు, మాహేశులు, పశుపతులు, ప్రేరణంగా ప్రదర్శించిన నర్తనం ఈ పేరిణి". (ఆంధ్రనాట్యం పు. 32).

ఈ విధమైన నటరాజ రామకృష్ణగారి ప్రశంసనీయమైన మాటలవల్ల కాకతీయశిల్పంలో నిక్షిప్తమైన నర్తన రీతుల విశిష్టత స్పష్టమవుతుంది.

ఇంతటి మహోత్తమ నృత్తరత్నావళిని రచించి, తెలుగు సంస్కృతికి కారణం అయిన జానపద కళారూపాలు దేశీ నర్తనరీతుల్ని ప్రసాదించి తెలుగుజాతికి గర్వకారణమైన మహనీయుడు కళావేత్త జాయపసేనాని అమరుడు!

పదముల క్షేత్రయ్య పాటకాడు

ఆచార్య కె. సర్వోత్తమరావు

సంగీతం, సాహిత్యం, అభినయం – ఈ మూడింటికి త్రివేణీసంగమంలా పదాలను రచించిన ఆంధ్ర వాగ్గేయకారుడు క్షేత్రయ్య. అనేకానేక క్షేత్రాలను దర్శించడంవల్ల 'క్షేత్రయ్య' రూఢినామంగా స్థిరపడిందని, ఈ వాగ్గేయకారుని అసలు పేరు 'వరదయ్య' అని తేల్చి చెప్పినవారు శ్రీ విస్సా అప్పారావు పంతులు.

క్షేత్రయ్య రాజాంకితంగా చెప్పిన పదాలను తప్పిస్తే ఇతర పదాలన్నిట 'మువ్వగోపాల' అనేదే ముద్ర. ఈ అంకితపదమే కొన్నిట మువ్వపురి గోపాల అని, మోవనాడు కలిగిన మువ్వగోపాల దేవ! అనే ముద్రలతో కనిపిస్తున్నాయి. 'మువ్వగోపాల'లోని 'మువ్వ' కృష్ణాజిల్లా కూచిపూడికి దగ్గరిలోని గ్రామం. ఆ గ్రామంలోనే సుమారు 500 ఏళ్ళనాటి వేణుగోపాలస్వామి ఆలయముండడం, ఆ గ్రామంలో ఇప్పటికీ తాము మొవ్వవారమని చెప్పుకొనే బ్రాహ్మణ కుటుంబాలుండడం విస్సా అప్పారావుగారి నిర్ణయానికి ప్రబలమయిన సాక్ష్యాలు. ఈ కారణాల వల్ల క్షేత్రయ్య 'మొవ్వ వరదయ్య' యే.

అన్నమయ్య జీవితవిశేషాలు తెలుసుకోవడానికి 'అన్నమాచార్యచరిత్ర' సహాయకారి. కాని క్షేత్రయ్య జననాదికాలు తెలుసుకోవడానికి ఏలాంటి ఆధారాలు లేనేలేవు. అయితే

"పిలువనంపె నన్నీవేళ ప్రేమ మీరగా నిపుడు
చెలియ మువ్వగోపాలుడు చిత్తము రంజిల్ల నేడు"

లాంటి మూడు, నాలుగు పదాలబట్టి వరదయ్య సంగీత, సాహిత్య, నాట్య, అభినయ, అలంకారాది విద్యల్ని సాధన చేసేవేళ సహపాఠి అయిన అందగత్తె అయిన ఒక దేవదాసిని ప్రేమించినట్లు, ఆ దాసియే పదరచనకు క్షేత్రయ్యను

ప్రేరేపించినట్లు అవగతమవుతుంది. ఒక మహా పురుషుని అభ్యున్నతి వెనుక ఒక స్త్రీ ఉండడం ఏ మాత్రమూ వింతకాదు.

మొవ్వ గ్రామంలో ఆకతాయిగా వరదయ్య తిరుగుతుంటే ఒక మహాయోగి 'గోపాలమంత్రోపదేశం' చేశాడని, వరదయ్య స్వగ్రామంలోని మొవ్వలో ఆ మంత్రావృత్తి చేసుకొంటుండగా శృంగారరసాధి దేవత గోపాలుడు అనుగ్రహించాడని సుబ్బరామదీక్షితులవారు సంగీత సంప్రదాయ ప్రదర్శినిలో ఉటంకించారు. ఆ సమయాన వరదయ్య పాడిన పాట –

"శ్రీసతిసుతు బారికి నే నోపలేక నిను వేడితే
కోపాలా? మువ్వగోపాలా?"

ఆనందభైరవి రాగం ఆదితాళంలో పాడిన పాట వరదయ్యకు అలౌకికానంద పారవశ్యం కలిగించి ఉండవచ్చు. అతని ఆంతర్యం మారి ఉండవచ్చు. అప్పటినుండి అతడు 'మువ్వగోపాలాధీనుడే' అయినా వరదయ్య క్షేత్రసందర్శనం చేసేవేళ మొవ్వలోని 'మోహనాంగిని' మరచిపోలేదనడానికి క్రింది పదాలు సాక్ష్యాలు

"ఏమిర వరద నీ మోము చిన్నబోయినది
ఎంచలేదని యెంచకురా
బాల యిందుకేనా మనసు జాలిబొందెరా
ఎన్ని తలచుకొందునమ్మా ఎట్లా మరపు
వచ్చునమ్మా కన్నెరో
చక్కని నా దేవుడైన కంచి వరదుని గుణముల
కంచివరదునితో పొందు కద్దో లేదో
వచ్చే మనసో రాని మనసో వనిత నీవు తెలిసికోవే
ఊరికిపోక నేడిందుండేది మేలో
వారిజాక్షులార కంచివరదుడు నా కెదురు చూడగానే
చక్కని దయగలదా యిది నీ జాగా చేవగలిగిందా?

క్షేత్రయ్య 'వేడుకతో నడచుకొన్న విటరాయడే' అనే పదంలో తాను పాడిన పాటల సంఖ్య చెప్పాడు. ఆ పదంబట్టి క్షేత్రయ్య సుమారు 4500 పదాలు పాడినట్లు స్పష్టమవుతుంది. కాని లభించినవి సుమారు 380 మాత్రమే. ఈ పదాలను ముద్రించిన వారిలో శ్రీ విస్సా అప్పారావు, శ్రీ గిడుగు సీతాపతిగారు ప్రముఖులు.

క్షేత్రయ్య మొవ్వ వదిలాక అనేక ప్రాంతాలను దర్శించినవాడే. ఆ వాగ్గేయకారుడు దర్శించిన వాటిల్లో పుణ్యక్షేత్రాలున్నాయి. అలాగే రాజాస్థానాలూ ఉన్నాయి. ఈ సందర్భంలో ఒక అంశం ప్రస్తావించడం సబబు. అన్నమయ్య వ్యక్తిత్వంలో కనిపించే స్వతంత్రత క్షేత్రయ్యలో లేదనాలి. సాళువ నరసింహరాయలు తనమీద 'ఏమొకొ చిగురుటధరమున' లాంటి శృంగార పదం పాడమంటే ససేమిరా అన్నవాడు అన్నమయ్య. అంతేకాదు రాజుల చిత్తప్రవృత్తుల్ని ఎండగట్టినవాడు. కాని, క్షేత్రయ్య తంజావూరు విజయరాఘవ నాయకుని దర్శించినవేళ, తుపాకుల అనంతభూపాలుని కొలువుకూటంలో కలుసుకొన్నవేళ, గోలకొండ పాదుషా కొలువులోనూ వందల పదాలు పాడడం అరిగించుకోలేని అంశం. సతీమణులకంటె వారాంగనలతో కాలం గడుపుతూ రాసిక్య జీవనం సాగించే ఆనాటి రాజులకు క్షేత్రయ్య పదాలు కొత్త జవసత్త్వాలు కలిగించి వుండవచ్చు. అయితే

రాజాస్థాన పరిచయమున్నవేళ క్షేత్రయ్య పదాలకు బహుళవ్యాప్తి వచ్చిందనడం సత్యం. అభినయాత్మకమయిన విధానం క్షేత్రయ్య పదాలకు ప్రచారమయిందనడం వాస్తవం. రాజాస్థానాలలో పాడిన పదాలలో ప్రసిద్ధాలు.

"విడు విడు నన్నంటకురా ఓరోరి జాణ
వదరక పోపోవే వాడేల వచ్చీని"

పదకవితా పితామహుడయిన అన్నమయ్య అధ్యాత్మ, శృంగార సంకీర్తనలతోబాటు ఐహిక కీర్తనలు రచించాడని అన్నమయ్య మనుమడు అన్నమాచార్య చరిత్ర పీఠికలో స్పష్టం చేశాడు. అన్నమయ్య కుమారుడు, మనుమలు ఆ కోవలోనే నడిచారు. కాని తరువాతి కాలంలో క్షేత్రయ్య శృంగారానికి పట్టం గడితే త్యాగయ్య ఆ జోలికి దండంపెట్టి కృతులు వ్రాసి ధన్యుడయ్యాడు.

శృంగారసంకీర్తనల పట్ల మొదటినుండి రెండు అభిప్రాయాలు సాహిత్యలోకంలో బలంగా ఉన్నాయి. 'శృంగార ఏవ మధురః పరప్రహ్లాదనో రసః' అనడాన్ని భక్తికి అన్వయించి చెప్పడం మధురభక్తి అయింది. దీనికితోడు శ్రీ వైష్ణవం పుమాన్ విష్ణురితిఖ్యాతః స్త్రీ ప్రాయ మితరం జగత్. భగవంతుడైన విష్ణువొక్కడే పురుషుడు. తక్కిన జీవకోటి అంతా స్త్రీలు అని చెప్పింది. ఇతరులు ఆకారంలో పురుషులయినా స్త్రీలే. తన్ను నాయికగా భావించుకొని భగవంతుని నాయకునిగా వరించి కొలవడమే మధుర భక్తికి వైశాల్యం కల్పించింది. ఇందుకు నమ్మాళ్వార్ 'పరాంకుశనాయకి' తిరుమంగై ఆళ్వార్ 'పరకాలనాయకి' పాశురాలను ఆరాధ్యంగా సూచించింది. దీనికితోడు తెలుగులో ఈ శృంగారం అనేక రూపాలుగా ప్రదర్శితం కావడానికి ఆయా వాగ్గేయకారుల కాలంనాటి కామశాస్త్రం, కొక్కోకం లాంటివి లక్షణప్రాయమయ్యాయి. ఈ అంశాన్ని డా॥ పి.టి.జగన్నాథరావుగారు తాళ్లపాక పదసాహిత్యం 17వ సంపుటం అనుబంధంలో విశదం చేశారు. తన వాదానికి బలంగా క్షేత్రయ్య పదాలలోని **'కులుకుచు నిద్దరును కొక్కోకము చూచుకోగా'** అనే పదాన్ని ఉదహరించారు. క్షేత్రయ్య శృంగార వర్ణనలకు భానుదత్తుని రసతరంగిణి, రసమంజరి అలంకార గ్రంథాలు కూడా ఆధారాలని శ్రీ జమ్మలమడక మాధవరాయ శర్మగారు భావించారు. ఆలంకారికులు సన్నివేశాలు కల్పించుకొని లక్షణాలు వ్రాస్తే, క్షేత్రయ్య మానవ జీవితంలో నుంచి సహజమైన సన్నివేశాలలోని మనోభావాలను గేయరూపంలో వివిధావస్థలతో చిత్రించాడు. అందుకే బాలాంత్రపు రజనీకాంతరావు క్షేత్రయ్య మనస్తత్వపరిజ్ఞానమూ, అనుభవ పరిణతీ అలంకార శాస్త్రజ్ఞానంకంటె మించినట్టివిగా భావించారు. అయితే ఈ అంశంలో విమర్శకుల అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి.

కొందరు క్షేత్రయ్యది పరమ భాగవతోత్తముని భక్తి అంటే ఆయన పదాలు 'సానెంపాడు వేశ్యలతో నడచిన రతిక్రీడా విలాసమే'

అన్నవారున్నారు. క్షేత్రయ్య ఆశ్రయించిన రాజన్యులు సతులకంటె వారాం గనలను నెత్తిన పెట్టుకొన్నవారు ఒక మాట ఎక్కువే అన్నారు.

'ఆనాటి రుచికి తగ్గట్టు కాబోలు నక్కడక్కడ యిది కొంచెము పచ్చిగా నున్నమాట నిజమే' అన్నవారు మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు.

"క్షేత్రయ్య తన పదములందు వియోగ శృంగారమునే అధికముగా వర్ణించెను. అతడు సంయోగశృంగారమును వర్ణించుచు రతిక్రీడా కుచగ్రహణాదులను, ఆలింగన చుంబనాదులను వివరించిన పట్లును పెక్కుగలవు. అట్టి ఎడ ఆతడు సభ్యతామర్యాద నతిక్రమించినాడేమో అనిపించును' అన్నారు దివాకర్లవారు.

"క్షేత్రయ్యలోకంటె అన్నమయ్యలోనే మధురభక్తిభావం ఒక చూపువాసి ఎక్కువగా ఉన్నట్లు కనబడుతుంది. దీనివల్ల అన్నమయ్యలో ఉదాత్తత కనబడుతున్నది. క్షేత్రయ్య స్వీకరించిన వైవిధ్యంవల్ల ఇతనిలో అది అక్కడక్కడ సకృత్తుగా ఒక చూపువాసి తగ్గినట్లు కనబడుతున్నది అన్నారు పిలకాగణపతిశాస్త్రిగారు. చివరకు విస్సా అప్పారావు గారు కూడా –

"మధుర పద్ధతికి కేవలము వ్యతిరేక ములగు కేవల లౌకిక శృంగారమునే వర్ణించినవి మరియును పచ్చిపచ్చిగా నున్నవి చాలా కలవు. కొన్ని చదువుటకు కూడా బాధ కలిగించునను నుద్దేశముతో రెండు మూడుచోట్ల మాటలను అచ్చువేయక గీతలు మాత్రమే ఉంచడమైనది' అని 'సత్యవాక్కును' ప్రకటించుకొన్నారు.

క్షేత్రయ్యలో 'స్వీయ' నాయికకు సంబంధించిన పదాలే హెచ్చు. ప్రత్యేకించి అలంకార శాస్త్రాలలో వర్ణితమయిన జ్ఞాతయౌవన నవోఢ, విస్రబ్ధనవోఢ, ప్రగల్భ, ప్రౌఢ, ప్రగల్భ, ధీర, స్వాధీనపతిక, పరకీయ, వాసకసజ్జిక – విరహోత్కంఠిత – కలహాంతరిత మొదలయిన నాయికా లక్షణాలతో శృంగార పదాలు అల్లినాడు

జ్ఞాతయౌవన -

గిలిగింతలయ్యీర నా సామి చ
క్కిలిగిలిగింతలయ్యీర
గిలిగింతలయ్యీర కలికి విజయరాఘవ
మొలక చన్ను నీ పంటి మొనను నొక్కకు నట్టె

స్వాధీనపతిక -

అనుకూలుడైనట్టి మగవాడు కలిగితే
అంతకన్నను సంభ్రమ మున్నదా

పరకీయ -

అత్తవారూరికి అంపేరు మావారు
అయ్యయో! ఇకనేమి సేయుదునే

వాసకసజ్జిక -

రారా! మాయింటికి - రాతిరి నిన్నునూ
రాము రమ్మన్నదిరా

విరహోత్కంఠిత -

వదరక పోపోవే - వాడేల వచ్చీని
వద్దు రావద్దనవే

క్షేత్రయ్య పదాలలో ఆధ్యాత్మికతావిస్తృతి తక్కువే. ఆలాగే అన్నమయ్యాదులలాగా సామాజి

కాంశాల స్పర్శ చాలవరకు లేదనడం తప్పేమి కాదు. కాని, క్షేత్రయ్య మొవ్వ వదలి క్షేత్రాటనం చేసేవేళ పద్దెనిమిది పుణ్యక్షేత్రాలను దర్శించినట్లు లభ్యమయిన పదాలబట్టి అవగతమవుతుంది. శివకేశవాభేదం క్షేత్రయ్య ప్రత్యేకత. ఆంధ్ర ప్రాంతంవరకు పరిశీలిస్తే తిరుమల స్వామిపై నాలుగు పదాలు. కడప వేంకటేశ్వరుని మీద ఒక్క పదం కడపజిల్లా ఇనంబ్రోలు ఇనపురి సామిపై రెండు పదాలు, చిత్తూరుజిల్లా సత్యవేడు వాసుదేవుని మీద ఒక్క పదం, కర్నూలు జిల్లా శ్రీనాగశైలం. పాలగిరి చెన్నకేశవస్వామిపై ఒక్క పదం పాడివుండడం గమనించదగ్గవి.

క్షేత్రయ్య పదాలలో కంచి వరదరాజస్తుతి పదాలే ఎక్కువ. క్షేత్రయ్య కంచి సందర్శనవేళ జరిగిన ఒక సన్నివేశం సంగీతలోకంలో బాగా ప్రచారంలో ఉంది.

కంచి వరదరాజస్వామి దేవాలయంలో ఏకాంతసేవ ముగిసింది. స్వామికి శయ్యాసనం సమర్పించి అర్చకులు వెళ్ళారు. తలుపుసు గడియ వేయబడ్డాయి. కాని ఏ మూలనో చీకటిలో కంబానికి చేరగిలబడి కనులు మూసు కొన్న క్షేత్రయ్యను ఎవరు గుర్తించలేదు. క్షేత్రయ్య దృష్టి అలౌకిక శృంగార రసభావనలో లీనమై ఉండగా తెల్లవారినవేళ మెట్లనుండి దిగివచ్చే ఒక స్త్రీ కనిపిస్తే క్షేత్రయ్య మోహనరాగంతో ఝంపతాళంలో ఒక పదం పాడినాడట.

"మగువ తన కేళికామందిరము వెడలెన్
వగకాడ మా కంచివరద తెల్లవారె ననుచు"

అని మొదలై 'పరమాత్మ మువ్వగోపాల తెల్లవారె ననుచు' అని పూర్తి అయ్యే కీర్తన వివాదా స్పదమయినా విశ్రుత విస్తృత ప్రచారంలోనిదే.

చాలాకాలందాకా సాగర ప్రాంతాలలో, ప్రసిద్ధ సంస్థానాలలో, సంగీత నాట్యకళా కోవిదుల సభలలో క్షేత్రయ్య పదాలు బహుళ ప్రచారంలో ఉండేవి. వాటిలో 'మంచిదినము నేడే – ఇది మంచి సమయము రారా – అపదూ రుకు లోనైతినే – మనసు నిలుచునటే మగడొచ్చి పిలిచెను – ఇన్నాళ్లవలె కాదమ్మా– రేపు వత్తువు గాని కొమ్మరో వాని కెంతటి బిగువో – ఎగలాడి బోధనలకు – ఎవడేవాడు' లాంటివి ప్రసిద్ధాలు.

క్షేత్రయ్య పదాల ప్రశస్తికి ఆ పదాలలోని భాషకూడా ఒక కారణం. క్షేత్రయ్య పదాలలో సహజమయిన తెలుగు పలుకుబడులు, లోకోక్తులు, సామెతలు సహజంగా దొరలడం విశేషం. అచ్చ తెలుగు పదాలకున్న రంగు, రుచి, వాసనను పసిగట్టి వాని సహజ సౌంద ర్యాన్ని సౌకుమార్యాన్ని ఆవిష్కరించిన వాడు క్షేత్రయ్య. జనవ్యవహారంలోని పదాల్ని సరికొత్త అర్థాలతో ప్రయోగించి నవ్యతను సాధించడం క్రొంగ్రొత్త పదబంధాలు కల్పించి రామణీయకం సాధించడం, అలతి అలతి పదాలతో అనల్పార్థం సాధించడం క్షేత్రయ్య తెలుగుకొక ప్రత్యేకత. పేర్వారం జగన్నాథం గారి మాటల్లో చెప్పాలంటే 'దేశి కవితను అందల మెక్కించినవాడు, పల్లెపదాలకు రాణివాసం కల్పించినవాడు

క్షేత్రయ్య. సంస్కృత శబ్దాలజోలికి పోక సహజంగా వర్ణించడం క్షేత్రయ్యలోని విశిష్టత. మచ్చుకు ఎంత చక్కనివాడే నా సామీ వీడెంత చక్కనివాడే

'ఇంత మువ్వగోపాలుడు సంతతము నామదికి సంతోషము చేసునే'

మొలక నవ్వులవాడే ముద్దు మాటలవాడే
తళుకారు చెక్కు టద్దముల వాడే
తలిరాకు జిగి దెగడదగు మోము గలవాడే
తెలి తమ్మిరేకు కన్నుల నమరువాడే

ఆలాగే క్షేత్రయ్య పదాలలో లోకోక్తులు కొన్ని



ఇత్తడి సొమ్ములు హెచ్చైన బంగారమౌన
చలివడగండ్లు ముత్య మౌన
ఊరికి పోయిన మగడు ఉట్టిపడ్డట్టు వచ్చి
తోటకూర దొంగవలె తొలగిపోయేవాడవు
ఊరు దూరమైతే మనసు దూరమౌనా
బావిలోని నీరు వెల్లువ పొయ్యీనటవే
కన్నీరు కావట కాలువసుమీ
సొమాడి జోగివలె పోయెనా బ్రతుకు
చల్లవడగండ్లు మూత్రమౌనా
వలపు సిగ్గెరుగదు
చేత కాసులేదుగాని చేసైగలే
మగవాని కట్టబెట్ట మనతరముగాదె
వానకాలము నాటి గరిక

క్షేత్రయ్య పదప్రయోగంలో కూడా ఎంతో విశిష్టత ఉంది మచ్చుకు. అన్యాయకారి అనే అర్థంలో అమరిక, అల్లరి అనే అర్థంలో ఆరుదూరు ఓర్వలేని తనంతో ఆడి పోసుకొను అనే అర్థంలో ఉప్పతించు. ఏమీ లేనివాడు అనే అర్థంలో గుల్లకాడు. కఠినుడనే అర్థంలో వడిగాడు. ప్రాణసఖులనే అర్థంలో అంతరంగులు – నఖక్షతం అనే అర్థంలో చందురు పిల్లలు, విదియచందురులు – మిక్కిలి అనే అర్థంలో సేవాకలహం అనే అర్థంలో చేపటు – తలంపు అనే అర్థంలో ఎంచిన యెన్నికలు లాంటివి

అన్నమయ్య సంకీర్తనల ఛాయలు, ప్రయోగాలు, జాతీయాలు, లోకోక్తులు, పద సంయోజన వైఖరులు క్షేత్రయ్యలో మక్కికి మక్కిగా కనబడడం అన్నమయ్యపట్ల క్షేత్రయ్య

కున్న గౌరవానికి ఎత్తిన కరదీపిక. మచ్చుకు ఒకటి రెండు –

అన్నమయ్య -

కొండలో కోవిల కుయ్యు గుండె పగిలే నీ
యండకు రాగా ప్రాణమంతలో బ్రతికేరా

క్షేత్రయ్య -

కోడి కూసెనయ్యయ్యో నా గుండెఝల్లు ఝల్లుమనెనే
చేడియ నాసామి వద్దచేరి మాటాడేటంతలో

అన్నమయ్య -

చిత్తరువు వ్రాయబోతె చెలియకు నంతలోనె
హత్తి నీ రూపు తోచె హస్తములకు

క్షేత్రయ్య -

ఊరకుండలేక గోర నే వ్రాసిన నీ రూపుగా తోచురా

క్షేత్రయ్య పదాలవ్యాప్తికి సాహిత్యంతో బాటు సంగీతం, అభినయం కూడా కారణాల నడం వాస్తవం. 'రసనిర్వహణకు కావలసిన అంగనిరూపణతో సుకుమారమయిన భేదాలను కల్పించడమూ, వాటిని చిత్రించడానికి కావలసిన మాటల పొందికా సంగీతరచన క్షేత్రయ్య సొమ్ము. మాటలలోని భావాలకు అనుగుణ మయిన రాగవిన్యాసమూ, రాగస్వరూపాన్ని పరిపూర్ణంగా స్ఫురింపజేసే మాటల మార్పు క్షేత్రయ్యకు తోడ్పడినట్లు వేరే వాగ్గేయకారులకు సహాయపడలేదు' అని బాలాంత్రపు వారి అభిప్రాయం. పల్లవితోపాటు అనుపల్లవి చేర్చే సంప్రదాయానికి క్షేత్రయ్యయే మార్గదర్శకుడు క్షేత్రయ్య పదాలలో 39 రాగాలకే ప్రాధాన్యం. అత్యధికం 'కాంభోజి' రాగంలోనివి.

ఒక పదం కచేరిలో పాడేవేళ, విద్వత్సభలో పాడేవేళ, వేదికల్లో పాడేవేళ అభినయించేవేళ తేడాలుండడం సహజం. ఒక పల్లవిని గాని, అనుపల్లవినిగాని, చరణాన్నిగాని 10 సార్లు నుండి 50 సార్లు వీలయితే వేరు వేరు సంగతులు ప్రవర్తిస్తూ పాడుతుంటే ఒక్కొక్కసారి పాడేవేళ ఒక్కొక్క అర్థం స్ఫురించేలా అభినయించడానికి వీలయింది క్షేత్రయ్య పదాలే. ఈ విధానాన్ని క్షేత్రయ్య ద్వారా భాగవత మేళం వారు తంజావూరులో నేర్చుకొన్నారని ఆ సంప్రదాయమే నేటికీ కొనసాగుతుందని పరిశోధకుల అభిప్రాయం.

భక్తి ఉపాసనతో, భాషాసౌందర్యంతో, భావసౌందర్యం సమ్మేళనం చేసి గళమెత్తి పాడిన వాడు క్షేత్రయ్య. శైవం ఆంగికంలో పరాకాష్ఠ పొందితే, వైష్ణవం శుద్ధసాత్త్వికంలో పరాకాష్ఠ స్థితి. అందుకొంటుందనడానికి క్షేత్రయ్య పదాలే సాక్ష్యాలు. క్షేత్రయ్య పదాలు మతం, అభిమతం పెనవేసిన సంకేతపు తాకుడులు. మాటకు, పాటకు, ఆటకు సరససమ్మేళనం క్షేత్రయ్య పదాలలోనే ఉంది. వరదయ్య క్షేత్రయ్యయే కాదు క్షేత్రజ్ఞుడు కూడా. అన్నమయ్య సారాంశం పదకవితాపితామహుడయితే, క్షేత్రయ్య పదకవితా చక్రవర్తి.

కృష్ణాతీరం నాటకరంగం

పొన్నపల్లి విశ్వనారాయణ కృష్ణ

కృష్ణానది ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువభాగం కృష్ణా, గుంటూరు జిల్లా సరిహద్దుగా ప్రవహిస్తోంది. ఈ పవిత్రజలపాన ప్రభావంచేతనేనేమో ఈ రెండు జిల్లా కళలకు ముఖ్యంగా నాట్యనాటకరంగాల పుట్టినిల్లు, మెట్టినిల్లుగా అవతరించాయి. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కూచిపూడి నాట్య సంప్రదాయాన్ని సిద్ధేంద్రయోగి ఈ తీరంలో ప్రతిష్ఠించగా, పద్య నాటక సంప్రదాయాన్ని కన్నదీ, పెంచిపోషించినదీ కృష్ణాతీరమే.

1880వ సంవత్సరంవరకూ తెలుగులో ఎక్కడా స్వతంత్రంగా నాటకాలు ఆడిన ఆధారాలు లేవు. మొట్టమొదట 1880లో బందరు నోబుల్ కాలేజి ప్రధానాంధ్రోపన్యాసకులైన కోరాడ రామచంద్రశాస్త్రి, 'మంజరీమధుకరీయం' అనే తొలి తెలుగునాటకాన్ని రచించారు. ఈ కాలంలోనే అప్పటి మహారాష్ట్ర ప్రాంతం నుండి "ధార్వాడ" నాటక సమాజాలవారు ఆంధ్రదేశమంతటా వారి మరాఠీ, హిందీ నాటకాలను విజయవంతంగా ప్రదర్శించి, ప్రజలను ఉత్రూతలూగించినారు. ఆంధ్రప్రజలలో "నాటకం మనం కూడా ఆడాలి" అనే తృష్ణను రగిల్చిన ఘనత ధార్వాడ నాటక సమాజాలకే దక్కుతుంది. వారి స్ఫూర్తితో ఆంధ్రదేశ మంతటా నాటక సమాజాలు వెలిశాయి.

కృష్ణాతీరంలో మొదట "ఫస్ట్ కంపెనీ" అని పిలవబడే గుంటూరు హిందూ నాటక సమాజం 1882లో స్థాపించబడి 1912 వరకూ కొన సాగింది. ఈ కంపెనీ ద్వారా ఉద్దండులైన నటులు ఉద్భవించారు. నాటకరంగ పితామహునిగా పేరుపొందిన హరిప్రసాదరావు, కోపల్లి హనుమంత రావు, బలిజేపల్లి లక్ష్మీకాంతం మొదలగు మహామ హులు ఈ కంపెనీలోనివారే. వీరు బలిజేపల్లి రచించిన హరిశ్చంద్రతోపాటు, ధర్మవరం కృష్ణమా చార్యులవారి చిత్రనళీయం, విషాదసారంగధర మొదలగు నాటకాలను తెలుగునాట నాలుగు చెరగులా ప్రదర్శించారు. తరువాత 1885లో 'సెకండ్ కంపెనీ' అని పిలువబడే "విబుధరంజనీ శృంగార హిందూ నాటక సమాజం" కనకరత్నం శ్రేష్ఠి గారిచే స్థాపించబడింది. ఈ సంస్థ ప్రముఖనటు లలో, మల్లాది గోవిందశాస్త్రి, నేతి సుబ్బరాయశాస్త్రి గార్లు ముఖ్యులు. తరువాత 1912లో యడవల్లి సూర్యనారాయణ నేతృత్వంలో ఆమెచ్యూర్ డ్రమెటి క్ క్లబ్ అద్దంకి శ్రీరామమూర్తి గారి ఆధ్వర్యంలో 1913లో స్టార్ థియేటర్‌లు స్థాపించబడినవి. వీరు ఉభయులూ అనేక పౌరాణిక నాటకాలను ప్రదర్శిం చి ఖ్యాతిగడించినారు. 1916లో "బాలమిత్ర నాట క సమాజం" దంటువేంకట కృష్ణయ్యచే స్థాపించ

బడి 1930 వరకూ కొనసాగింది. ఈ సమాజం నుండి టి.రామకృష్ణశాస్త్రి, కె.రఘురామయ్య, సూరిబాబు, అంజి మొదలగు నటులునూ మరియు దీనికి అనుబంధంగా ఉన్న 'నవలా నాటక సమాజం' అనే స్త్రీల నాటక సమాజం ద్వారా శ్రీమతులు దాసరి కోటిరత్నం, పసుపులేటి కన్నాంబ, ఆదోని అమ్మణ్ణీబాయి, దాసరి యామినీ పూర్ణతిలకం మొదలగు నటీమణులు నాటకాలతో పాటు సినీరంగంలో కూడా ప్రఖ్యాతిని ఆర్జించారు.

తరువాత హిందూ కాలేజి డ్రమెటిక్ అసోసియేషన్ మొదలగు సంస్థలు కొన్ని వెలసి నాటకపోటీలు నిర్వహించేవారు. ఆ పోటీలలో వేమూరు రామయ్య, ప్రముఖ సినీనటులు ధూళిపాళ సీతారామశాస్త్రి, కళాప్రపూర్ణ పీసపాటి నరసింహమూర్తి, మొదలగువారు బహుమానాలను పొందారు. వీరేకాక గుంటూరు ప్రాంతంనుండి అనేక సమాజాల ద్వారా మందపాటి రామలింగేశ్వర రావు, టి.పుండరీకాక్షయ్య, ఎమ్.వి.ఎస్.శాస్త్రి, పేళ్ళూరి శేషగిరిరావు, జి.వరలక్ష్మి, ఛాయాదేవి, కళావాచస్పతి కొంగర జగ్గయ్య, గుమ్మడి వెంకటేశ్వరరావు, బాలయ్య, తారాబాయి మొదలగు అనేకమంది నటీనటులు నాటకాలలోనూ, సినీరంగాలలోనూ రాణించారు.

ఇక కృష్ణాతీరంలో తెనాలి పట్టణం నాటక రంగంలో నేటికీ మకుటాయమానంగా భాసిల్లుతున్నది. ఇక్కడ 1912లో 'రామవిలాససభ' అనే నాటక సమాజాన్ని స్థాపించారు. ఈ సమాజంలో ప్రసిద్ధి గాంచిన నటులు గోవిందరాజుల సుబ్బారావు, దుర్యోధన పాత్ర అనితరసాధ్యంగా పోషించిన మాధవపెద్ది వెంకటరామయ్య, ఆంధ్రనాటక రంగమునుండి పద్మశ్రీ అందుకున్న తొలి నటుడు స్థానం నరసింహారావు, పులిపాటి వెంకటేశ్వర్లు మొదలగు నటులు ఈ సమాజంవారే. వీరు నటించిన వేదంవారి ప్రతాపరుద్రీయం, గురజాడవారి కన్యాశుల్కం, శ్రీ పాదవారి 'బొబ్బిలి' నాటకాలు జగత్ ప్రసిద్ధిగాంచాయి. వీరేకాక ఈ ప్రాంతం నుండి శ్రీ కృష్ణపాత్రకు 'ట్రెండ్ సెట్టర్' అయిన అబ్బూరి వరప్రసాద్‌రావు, ఎ.వి. సుబ్బారావు, బాలనాగమ్మలో మాయలఫకీర్ వల్లూరి వెంకటరామయ్య, నాటకరంగం నుండి సినీరంగానికి వెళ్ళిన వేమూరు గగ్గయ్య, సి.ఎస్.ఆర్. ఆంజనేయులు, సీతాకుమారి, రత్నమాల, కె.సావిత్రి మొదలగు నటీనటులు ఈ రంగాన్ని సుసంపన్నం చేశారు.

ఇక కృష్ణానది ఇవతలి ఒడ్డు అయిన కృష్ణాజిల్లాకు వస్తే ఈ జిల్లాలో నాటకరంగం గురించి మొట్టమొదట ప్రస్తావించవలసినది 'మైలవరం బాలభారతి' ఆ రోజులో మైలవరం జమీందారు రాజా సూరానేని వేంకటపాపయ్యా రావు గారు తెలుగు నాట ఉన్న ప్రసిద్ధి చెందిన నటులంద

రినీ రప్పించి వారికి జీతాలు ఏర్పాటు చేసి, ఒక బ్రహ్మాండమైన హాలును నిర్మించి, సురభివారి సెట్టింగులకు దీటుగా అన్ని హంగులతో నాటకాలను నిర్విరామంగా ఆడించారు. ఆనాడు ఈ సమాజనాటకానికి మూడురోజుల ముందే టికెట్లు రిజర్వు చేసుకునేవారు. ఈ సమాజంలో యడవల్లి, ఉప్పులూరు సంజీవరావు, గురజ నాయుడు, పారుపల్లి సుబ్బారావు, జొన్నవిత్తుల శేషగిరిరావు, కపిలవాయి రామనాథశాస్త్రి, నిడుముక్కల సుబ్బారావు మొదలగు మహామ హులు పని చేశారు. కానీ ఆ నటీనటుల అనైక్యతా కారణంగా రాజావారి ఆస్తి కళామతల్లికి నీరాజనం అర్పించిన హారతి కర్పూరంవలే దేదీప్యమానంగా వెలిగి హరించుకుపోయినది. నాటినుండి నేటి వరకూ ఏ పద్య నాటకాన్ని ప్రారంభించడా నికైనా ముందుపాడే ప్రార్థనాగీతం 'పరబ్రహ్మ, పరమేశ్వర పురుషోత్తమ సదానంద' ఆ గీతాన్ని రచించిన వారు కృష్ణాజిల్లా నందిగామ ప్రాంతవాసి సందాల కేశవదాసు కాగా, ట్యూన్‌లు చేసిన సంగీత విద్వాంసుడు పాలుట్ల కాంతయ్య కూడా ఈ సమాజంలోని వాడే కావడం విశేషం.

తరువాత విజయవాడలో 1948లో 'ఆంధ్ర ఆర్ట్సు థియేటర్' స్థాపించబడి జాతీయస్థాయి నటీనటులను అందించింది. సినీ రచయిత అనిశెట్టి, ప్రముఖ దర్శకుడు వి.మధుసూదనరావు, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, రక్తకన్నీరు నాగభూషణం, కర్నాటి లక్ష్మీనరసయ్య, ఆదిశేషయ్య మొదలగు గొప్ప కళాకారుల నెందరినో అందించి నేటికీ సజీవంగా ఉంది. అలాగే 1947లో విజయవాడలో 'నేషనల్ ఆర్ట్స్ థియేటర్' నటరత్న ఎన్.టి.రామారావు, ఎన్.త్రివిక్రమరావు, ఎ.పుండరీకాక్షయ్య, సుంకర కనకారావు, శ్రీమతులు వహీదా రెహమాన్, సావిత్రి, కమల కుమారి మొదలగు మహానటీనటులతో తేజరిల్లి, వీరిలో చాలామంది సినీరంగప్రవేశం కారణంగా చిత్ర నిర్మాణ సంస్థగా రూపొందింది. తరువాత 1962లో సత్యనారాయణపురం సాయిబాబా నాట్యమండలి. సూరిబాబు రాజరాజేశ్వరి నాట్యమండలి, బందా కనకలింగేశ్వరరావు, బి.వి. రంగారావు, వేమవరపు శ్రీధరరావు గారు నాట్యభారతిని స్థాపించి అనేక పౌరాణిక నాటకా లకు ప్రాణం పోశారు. వీరుకాక విజయవాడ నుండి కె. నాగేశ్వరరావు, కందుకూరి చిరంజీవి రావు, సూరవరపు, మల్లాది సూర్యనారాయణ, సి.రామమోహన రావు, అన్నాప్రగడ లక్ష్మీకాంత రావు, డి.వి.నరసరాజు, అబ్బూరి కమల, విన్నకోట రామన్నపంతులు, ఉషాబాల, ఋష్యేంద్రమణి, కనకం, డా॥ గరికపాటి రాజారావు మొదలగువారు ఇక్కడ ప్రభవించిన వేలాది కళాకారులలో కొందరు మాత్రమే.

ఇక ముఖ్య పట్టణమైన బందరులో 1884లో జూబిలి థియేటర్, దేవరసు వెంకటసుబ్బారావు, బాలకృష్ణయ్య గార్లచే స్థాపించబడింది. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు, ఇవటూరి నాగభూషణం మొదలగువారు ఈ సమాజంలోని వారే. 1909లో డి.వి. సుబ్బారావు 'ఇండియన్ డ్రమెటిక్' కంపెనీ స్థాపించి దిగ్విజయంగా నాటకాలు ఆడారు. 1947లో ముట్నూరి కృష్ణారావు గారు 'వసంతవని' స్థాపించారు. ఇవి గాక నేషనల్

థియేటర్, రాయల్ హిందూ థియేటర్, ఛత్రపూర్ జగన్మోహన్ థియేటర్, భువనరంజని, శారదా విలాస్ నాటక సమాజం మొదలగు ఎన్నో సమాజాలు తెలుగునేలను కళాసంపన్నం చేసాయి.

ఆంధ్ర నాటక కళాపరిషత్ గుడివాడ పట్టణంలో 1929లో స్థాపించబడి పనిచేస్తోంది. దుక్కిపాటి మధుసూధనరావు, కాజ వెంకటరామయ్య, ఎర్రోజు మాధవాచార్యులు, త్రిపురనేని వరప్రసాదరావు, పోలవరపు సూర్యప్రకాశరావుగార్లు దీనిని స్థాపించారు. ఎమ్.ఆర్. అప్పారావు నూజివీడు జమీందారు దీనికి పోషకులుగా ఉన్నారు. 1935 రామవిలాససభ, 1942 ప్రభాకర నాట్య మండలి. కళాప్రభ, విశ్వకళాసమితి, మొదలగు సంస్థలు వెలిసాయి. జంధ్యాల గౌరీనాథశాస్త్రి, ఘంటసాల వెంకటేశ్వరరావు, అక్కినేని నాగేశ్వరరావు, సరసీరుహం, పెండ్యాల నాగేశ్వరరావు, కైకాల సత్యనారాయణ, గిరిజ, బి.ఎన్.సూరి, మొదలగువారు గుడివాడ ప్రాంతం నుండి నాటకాల ద్వారా సినీరంగంలో ప్రవేశించి ధ్రువతారలుగా వెలుగొందారు.

ఇదంతా పూర్వరంగం. ప్రస్తుతం నాటక రంగానికి పూర్వవైభవం లేదు. సినీ, టి.వి.ల ప్రభావంచే నాటకాన్ని ఓపికగా కూర్చుని చూసే వాళ్ళు తగ్గిపోయారు. ప్రస్తుతం పౌరాణిక పద్య నాటకాలను పోషిస్తున్నది 'ఉత్సవ పందిళ్ళు' కాగా సాంఘిక నాటకాలను పోషిస్తున్నది 'ఔత్సాహిక పరిషత్‌లు' మాత్రమే. ఎప్పుడైతే నాటక రంగానికి పోషకులు కరువైనారో, నాటకాలనాణ్యత తగ్గుముఖం పట్టింది. ఒకనాడు ట్రూపునాటకాలను టిక్కెట్లు రిజర్వు చేసికొని మరీ చూచేవారు. కానీ ఈనాడు పెద్దపెద్ద నటులను సమ్మేళన పరచి నాటకం ఆడించినా టికెట్లు బ్రతిమాలి అంటకట్టవలసిన పరిస్థితికి దిగజారింది.

పరిస్థితులు ఇలా ఉన్నా కృష్ణా తీరంలో నాటక రంగాన్ని ప్రజలు ఆదరిస్తూనే ఉన్నారు. ఆధునికులలో ఆచంట వెంకటరత్నం, తుర్లపాటి రాధాకృష్ణ, మూర్తుల జలంధర, దుర్యోధన పాత్రలను ఎరుగని ఆంధ్రుడు లేడు. తెనాలిలో ఎ.వి.సుబ్బారావు గారి కుమార్లు వెంకటేశ్వరావు, కోటేశ్వరావులు నటనలో తండ్రికి తగ్గ తనయులుగా పేరు పొందారు. గుంటూరు నుండి రామానుజసూరి పల్నాటి యుద్ధం, గుడివాడ ఆర్.ఎ. నాయుడి అన్నమయ్య, విజయవాడ సాయిబాబా నాట్యమండలి, పాండవోద్యోగం, ఉషాపరిణయాలు అనేక పరిషత్‌లలో బహుమతులు పొందాయి. గజారోహణ సన్మాన గ్రహీత

గుమ్మడి జయరాజు (భవానీశంకరుడు), బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి (చింతామణి, ద్రౌపది పాత్రలు), నంది అవార్డ్ గ్రహీతలయిన గుమ్మడి గోపాలకృష్ణ, ఆచంట బాలాజీలు మరియు పృధ్వి వెంకటేశ్వర్లు, వల్లూరి శ్రీహరిరావు, బండి కోటేశ్వరరావు, శీతంరాజు, బి.సుబ్రహ్మణ్యయాదవ్, కె.వి.ఎన్. ఆచార్యులు మొదలగువారు రంగస్థలం మీద ప్రస్తుతం రాణిస్తున్నవారే.

ఇంకొక ముఖ్య విశేషం – విజయవాడలో దేశంలో ఎక్కడా లేనివిధంగా గత 50 సంవత్సరాలుగా కేవలం పోలీస్ వారితో ఒక నాటక సమాజం నిర్వహించబడుతూ, ప్రతి సంవత్సరం విజయ దశమినాడు "కురుక్షేత్రం" నాటకాన్ని ప్రదర్శిస్తారు. ఆ నాటకాన్ని చూడడానికి సాక్షాత్తూ కనకదుర్గమ్మ మేళతాళాలతో ఊరేగుతూ వచ్చి ఆ నాటకంలో చివరి "విజయాంకాన్ని" చూసి వెళ్ళడం అనే సంప్రదాయం 50 సం॥లుగా ఇక్కడ కొనసాగుతోంది.

ఇక ఆంధ్రప్రదేశ్ నాటకరంగంలో ఉన్న 'పరిషత్' లలో ముప్పయి శాతం ఈ తీరంలో ముఖ్యంగా గుంటూరు జిల్లాలోనే ఉన్నాయి. అలాగే నెలవారీ నాటకాలు నిర్వహించే ఆంధ్రనాటక కళాసమితి, నటరాజ కళాసమితి, సుమధుర కళానికేతన్, శారదా కళాసమితి, రసన సమాఖ్య వంటి సంస్థలు వాటి కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తూనే ఉన్నాయి. అంతేగాక ఆంధ్రప్రదేశ్‌లో ప్రఖ్యాతి వహించిన సాంఘిక నాటక కర్తలు బాపట్ల కె.ఎస్.టి.సాయి, హాస్యబ్రహ్మ జంధ్యాల, కె.వెంకటేశ్వరరావు, అనంతహృదయరాజు, ఎ.శివరామిరెడ్డి, జి.ఎస్.ఆర్.మూర్తి, సంజీవి, నాయుడు గోపి, కృష్ణేశ్వరరావు, కందిమళ్ళ సాంబశివరావు, టి.రాజకుమార్, నర్సరావుపేట కె.వి.ప్రసాద్, ఎమ్.వి.ఎల్. నరసింహారావు, నృసింహ కోటి శివ, కావూరి సత్యనారాయణ మొదలగువారు ఈ ప్రాంతంలో బహుమతుల పంటలు పండించిన కృషీవలులలో కొందరు. అంతేగాక విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయం, రామ్మోహన్ లైబ్రరీలలో ఉన్నన్ని పురాతన నాటక పుస్తకాలు మరెక్కడా లేవు.

నేను ఉదహరించిన నాటకరంగం గురించిన విషయాలు, నిండు కృష్ణానదియంత నాటకరంగ చరిత్రలో పుడిసెడు పవిత్రజలం మాత్రమే. వేలాది మంది నటీనటులు, సంగీత వాద్యసహకారులు, ఆహార్య రంగాలంకరణ కళాకారులు, దర్శకులు, గాయకులు, కళాపోషకులు ఎందరో ఈ నాటక రంగ ప్రాభవానికి కృషి చేసి గణుతికెక్కిన వారు కొందరే కానీ, దుర్భర దారిద్ర్యంతో కళనే వృత్తిగా స్వీకరించి సమిధలై కాలిపోతూ వెలుగు పంచుతున్నవారు ఎందరో, ఎందరెందరో. వారికి కొంచెం సహకారం ప్రభుత్వం, ధార్మిక సంస్థలు అందించగలిగితే పది పుష్కరాల మన సాంస్కృతిక వారసత్వ సంపదయైన నాటకరంగం అఖండ కృష్ణవేణీ ప్రవాహంవలె క్రొత్త ఒంపు సొంపులతో అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తూ తెలుగు హృదయక్షేత్రంలో ఆనంద అనుభూతులను పండిస్తూనే ఉంటుంది.

(ఈ వ్యాసంలోని పేర్లు, సంఘటనలు, సంస్థలు పరిపూర్ణము అనడానికి వీలులేదు. దీనిలో లేనివారు కనిష్ఠులు కూడ కారు).

సామాజిక ప్రయోజనం సాధించిన కూచిపూడి భాగవతులు

కట్టా నరసింహులు

సమాజంలో కళలకున్న ప్రాధాన్యం అంతింతనరానిది. కళలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయి. శ్రమను పోగొడతాయి. ఆనందాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయి. బ్రహ్మానందాన్ని ప్రసాదిస్తాయి. కళల్ని ఉపాసించేవారికి జీవనోపాధి కలిగిస్తాయి. సామాజిక ప్రయోజనాన్ని కలిగిస్తాయి. ఈ వాక్యాలన్నీ లలితకళల నుద్దేశించి చెబుతున్న మాటలు. కవిత్వం, సంగీతం, నృత్యం, శిల్పం, చిత్రలేఖనం ఇవన్నీ లలితకళలు. నాట్యాన్ని సమాహారకళ అంటారు. నాట్యంలో కవిత్వం, సంగీతం, నృత్యం వంటి కళలు చోటు చేసుకుంటాయి.

కృష్ణాజిల్లా కృష్ణాతీర ప్రాంతంలోని కూచిపూడి గ్రామం పేరు చెబితే తెలియదనే కళాభిమానులెవ్వరూ ఉండరు. కూచిపూడిలో పుట్టి పెరుగుతూ నేడు ప్రపంచమంతటా కీర్తిప్రతిష్ఠలు పొందుతున్న నాట్యం కొన్ని శతాబ్దాల నుంచి వెలుగొందుతూ ఉంది. భరతనాట్యం నుంచి ఒక శాఖగా విడివడి జానపదం వాసన కలగలుపుకొని కూచిపూడి నాట్యంగా ఆవిర్భవించి స్వీయప్రతిపత్తిని సంపాదించుకొంది. సిద్ధేంద్రయోగి చేతిలో ఈ నాట్యం శాస్త్రీయతను సంతరించుకొంది. వీరి కంటెముందు దినాల్లో పదునైదో శతాబ్దం చివరి దశకంలో కూచిపూడి కళాకారులు తమ నాట్యవైదుష్యం ఆధారంగా ఒక సామాజిక ప్రయోజనాన్ని సాధించి చరిత్రలో ఒక పుట నిలుపుకొన్నారు. కళకు ప్రయోజనం అంటే ఇదికదా అనిపించుకొన్నారు. ఆ సంఘటన తాలూకు వివరాలు ఇలా ఉన్నాయి.

విజయనగర సామ్రాజ్యానికి రాజధాని హంపీ విజయనగరం. ఈ సామ్రాజ్యం అవతరించిన నాటినుంచి విజయనగరం కవుల్నీ కళాకారుల్నీ పోషిస్తూ ఉంది, కవిత్వానికి, నాట్యానికి రంగస్థలంగా వెలిగింది.

జానపద కళలూ ఈ రాజ్యంలో ఆదరణకు నోచుకున్నాయి. కత్తి కర్రసాములు, గడెవిద్యల దొమ్మరి ఆటలు రాచమర్యాదలు పొందాయి. విజయనగరం దసరా ఉత్సవాలకు పెట్టింది పేరు. దసరాకు మూడు నెలల ముందునుంచి పలురకాల సాంస్కృతిక కార్యకలాపాలు జరుగుతూ ఉండేవి. స్వదేశీయులు, విదేశీయులు ఈ కార్యకలాపాల్లో పాల్గొనేవారు. అర్హులైన వారందరికీ అవకాశాలు లభించేవి.

సంగమ, సాళువ వంశాల తరువాత విజయనగర సింహాసనానికి తుళువవంశం వచ్చింది. తుళువ నరసానాయకుడు మొదటి చక్రవర్తి అయ్యాడు. తరువాత అతని కుమారుడు వీర నరసింహరాయలు రాజ్యానికి వచ్చాడు. ఈయన క్రీ.శ.1505 నుంచి క్రీ.శ.1509 వరకు రాజ్యం చేశాడు. ఈ "సమయంలో కడపకు సమీపంలోని మాచుపల్లెను కేంద్రం చేసుకొని సంపెట వారు కొంత ప్రాంతాన్ని పాలిస్తుండేవారు. విజయనగరం ఆజ్ఞాపాలకులే వీరు. మన కథాసమయానికి సంబెట గురవరాజు మాచుపల్లె నాయకుడు.

సంబెట గురవరాజుగారి పాలనలో ప్రజలు కష్టాలపాలవుతూ ఉన్నారు. పంటలు పండకపోయినా పన్నులు చెల్లించవలసిందే! పన్నులు రాబట్టే విధానం దారుణంగా ఉండేది. పన్నులు రాబట్టడానికి స్వయంగా అతడే గ్రామాల్లోకి వెళ్లేవాడు. స్త్రీలు పురుషులు అనే భేదం లేకుండా ప్రజల్ని హింసకు గురి చేసేవాడు. శారీరక హింసకు మించి మానహింసకు గురి చేసేవాడు. పన్ను వసూలు కాని ఇంటి స్త్రీలను వీధిలోకి ఈడ్పించేవాడు. వారి రొమ్ములకు చిరత (క్లిప్పు)లు అంటించేవాడు. బండి చక్రాలకు స్త్రీలను కట్టి బండి లాగించేవాడు. ఇలాంటి దారుణాలు కూచిపూడి భాగవతుల కంటపడ్డాయి.

కూచిపూడి భాగవతులు ప్రతి సంవత్సరం విజయనగరంలో జరిగే దసరా ఉత్సవాల్లో పాల్గొనేవారు. కొన్నేళ్లకు ముందుగనే కూచిపూడి నుండి బయలుదేరి మార్గంలోని గ్రామాల్లో తమ ప్రదర్శనలిచ్చుకొంటూ వెళ్లేవారు. కథాకాలం నాటి సంవత్సరం కూడా అలాగే వెళ్తూ మాచుపల్లెను సమీపించారు. ఆ ప్రాంతంలో సంబెట గురవరాజు పన్నులకోసం ప్రజల్ని హింసిస్తున్న తీరుచూచి చలించిపోయారు. గురవరాజు ముందు తమ ప్రదర్శననిచ్చి మెప్పు పొందాలనుకొన్న కూచిపూడి భాగవతులు ఆ ఆలోచన మానుకొన్నారు. కరువు కాటకాల సమయంలో పన్నులు ఇబ్బడి ముబ్బడిగా రాబట్టి ప్రజల మానమర్యా

దలమీద చెలగాటమాడుతూ "చక్రవర్తికి చెడ్డపేరు తెస్తున్నారని, ఈ దారుణాన్ని చక్రవర్తి దృష్టికి తీసుకుని వెళ్లాలని నిశ్చయించుకొన్నారు.

దేవదాసీ స్త్రీలు దేవాలయాల్లో నాట్యప్రదర్శన లిచ్చే తీరులోనే, ఈ భాగవతులు స్త్రీవేషం ధరించి దాదాపు ఆ నాట్యమే ఇక్కడ ప్రదర్శిస్తారు. వీరి ప్రదర్శనకు కేళిక అనిపేరు. ఈ కేళికలో భామాకలాపం ప్రధానంగా ఉంటుంది. ఈ కేళిక చూడడానికి అంతఃపుర స్త్రీలు ఆసక్తి చూపేవారు. విజయనగరంలో దసరాదిబ్బ పేరు మీద ఒక వేదిక ఉంది. ఈ వేదికకు సమీపంలో పద్మమహల్ ఉంది. ఈ పద్మమహల్ లోపల కూర్చొని రాణివాసంతో కూర్చొని చక్రవర్తి కూడా ప్రదర్శనలు తిలకించేవారు.

కూచిపూడి భాగవతులు తమకు నిర్దేశించిన సమయంలో కేళిక ప్రారంభించారు. ఆటను చూడడానికి అంతఃపుర స్త్రీలూ చక్రవర్తీ వచ్చారు. భాగవతులు తాము ప్రదర్శించే కేళిక కాకుండా గురవరాజు ఆట ప్రారంభించారు. ఒకరు గురవరాజు వేషం వేసుకొన్నారు. మరొకరు స్త్రీ వేషం వేసుకొన్నారు. భటుల వేషంలో ఇద్దరున్నారు. మాచుపల్లె దగ్గర తాము చూచిన దారుణాన్ని కండ్లకు కట్టించారు. చక్రవర్తి విస్తుపోయాడు. ఆట పూర్తయిన వెంటనే భాగవతుల పెద్దను తనవద్దకు రప్పించుకొన్నాడు. మాచుపల్లె ఉదంతాన్ని ఆ పెద్ద తిరిగి చక్రవర్తికి విన్నవించుకొన్నాడు. భాగవతులు తాము అనుకొన్నది సాధించారు. చక్రవర్తికి తాము అనుకొన్న పద్ధతిలో తెలియజేశారు. భాగవతులకు రెండింతల పారితోషికమిచ్చి పంపించాడు - చక్రవర్తి.

మరుసటి ఉదయం కొలువుకూటంలో మాచుపల్లె సంబెట గురవరాజు ప్రస్తావన వచ్చింది. గురవరాజును శిక్షించే వీరుడెవ్వడన్నాడు చక్రవర్తి. ఇస్మాల్‌ఖాన్ అనే సరదారు ముందుకు వచ్చాడు. వీరనరసింహరాయలకు ఇస్మాల్‌ఖాను పుత్రసమానుడు. తగినంత సైన్యాన్నిచ్చి గురవరాజు కోటను పడదొబ్బి వాని తలను తీసుకురమ్మన్నాడు. ఇస్మాల్‌ఖాన్ మాచుపల్లె సమీపానికి వచ్చాడు. అక్కడున్న బండి కనుమమీద దిగాడు. అక్కణ్ణుంచి లడాయి ప్రారంభించాడు. ఫిరంగిగుండ్లు కోటమీద నడిచాయి. కోట కూలిపోయింది. సైనికులు గురవరాజును బంధించారు. ఇస్మాల్‌ఖాన్ గురవరాజు తల తెగనరికాడు. చక్రవర్తి అప్పగించిన పని ఇస్మాల్‌ఖాన్ నెరవేర్చాడు. అంతటితో సంబెట గురవరాజు దారుణమైన పాలన అంతమయింది.

కళ కళకోసమే కాదు, కళ బతుకు తెరువుకు మాత్రమే కాదు. కళ సామాజికులకు ఆనందం మాత్రమే కలిగించదు. కళ సామాజిక ప్రయోజనాన్ని కూడా సాధించిపెడుతుంది అన్న సత్యాన్ని కూచిపూడి భాగవతులు చూపించారు. కత్తికీ కండకూ మాత్రమేకాదు, కళకూ బలముందని నిరూపణ అయింది.

కృష్ణమ్మా! నీ నడకలె సిరులమ్మా

ఎలమర్తి రమణయ్య

1. సహియాద్రి కొండనుఁ బుట్టి
సంద్రాన కలిసేవు
ఎన్నెన్ని అంచల్లో సాగేవు
ఓ కృష్ణమ్మా! నీవడివడినడకలె సిరులమ్మా
కృష్ణమ్మా మమ్మేలె మాయమ్మా

2. కృష్ణా! అనిపిలిచే ఊళ్ళో
గురురాఘవేంద్రుడు వెలసె
నీ తావుల్లె కోవెల్లు అవుతాయి
ఓ కృష్ణమ్మా! నీవడివడినడకలె సిరులమ్మా
కృష్ణమ్మా మమ్మేలె మాయమ్మా

3. రామయ్య రంగున మెరిసే
నీ మేని వన్నెను జూచి
నీ గట్టు నిలిచాడే హనుమన్న
ఓ కృష్ణమ్మా! నీవడివడినడకలె సిరులమ్మా
కృష్ణమ్మా మమ్మేలె మాయమ్మా

4. నదులాఱు నినుగలిసీ
నిధిసంగమేశ్వరమై
నిలిచాడు నీవాడి ఈశ్వరుడే
ఓ కృష్ణమ్మా! నీవడివడినడకలె సిరులమ్మా
కృష్ణమ్మా మమ్మేలె మాయమ్మా

5. బ్రహ్మర్షి శాపము బాసి
రాజర్షి గాధేయుండె
అనఘాత్ముడయ్యాడు నీదరిని
ఓ కృష్ణమ్మా! నీవడివడినడకలె సిరులమ్మా
కృష్ణమ్మా మమ్మేలె మాయమ్మా

6. కైలాస నాథుడుతానే
కొలువైన శ్రీశైలమ్ము
ఇలలోన నీ చెంత నిలిచేనే
ఓ కృష్ణమ్మా! నీవడివడినడకలె సిరులమ్మా
కృష్ణమ్మా మమ్మేలె మాయమ్మా

7. పాతాళగంగవు నీవు
శ్రీశైల క్షేత్రమ్మునకు
భ్రమరాంబ పతి వెలసె నీతటినీ ॥

8. అమరావతినగరాన
అపురూప చైత్యాలెన్నో
కనువిందు చేసేనె నీ చెంత
ఓ కృష్ణమ్మా! నీవడివడినడకలె సిరులమ్మా
కృష్ణమ్మా మమ్మేలె మాయమ్మా

9. ఆ కనకదుర్గా దేవి
తిరముగ నెలవైయున్న
ఆ ఇంద్ర కీలాద్రి నీ ఒడ్డే ॥
ఓ కృష్ణమ్మా! నీవడివడినడకలె సిరులమ్మా
కృష్ణమ్మా మమ్మేలె మాయమ్మా

10. వెలుగొసగు విద్యుత్తు
వ్యవసాయ పనులకు నీరు
అందించు దైవమ్ము నీవమ్మ!
ఓ కృష్ణమ్మా! నీవడివడినడకలె సిరులమ్మా
కృష్ణమ్మా మమ్మేలె మాయమ్మా

కృష్ణాస్తోత్రం

డా॥ ముదివేడు ప్రభాకర రావు

శ్లో॥ శుద్ధ స్ఫటిక సంకాశాం ద్విభుజాం పద్మధారిణీమ్ ।
శివమూర్తి ధరాం దేవీం కృష్ణవేణీం నమామ్యహమ్ ॥ 1

తెల్లని స్వచ్ఛమైన స్ఫటికంవలె ప్రకాశిస్తూ, రెండు చేతులతో తామర పువ్వులను ధరించి, శివమంగళరూపిణివైన తల్లీ! కృష్ణవేణీ! నీకు నమస్కరిస్తున్నాను.

శ్లో॥ శంఖచక్రధరాం దేవీం నీలోత్పల దళప్రభామ్ ।
విష్ణురూపాంకితాం దేవీం కృష్ణవేణీం నమామ్యహమ్ ॥ 2

శంఖము, చక్రము ధరించి, నల్లకలువపూలవంటి శరీర లావణ్యము గలిగి, విష్ణుస్వరూపిణియైన తల్లికృష్ణవేణికి నమస్కరిస్తున్నాను.

శ్లో॥ కమండలధరాం పుణ్యాం జపమాలాధరాం శుభామ్ ।
బ్రాహ్మీం సువర్ణవర్ణాభాం కృష్ణవేణీం నమామ్యహమ్ ॥ 3

నీటితో నిండిన కమండలువు ధరించిన పుణ్యాత్మురాలును, జపమాలను ధరించిన శుభంకరమైన దేవిని, బ్రహ్మభార్యయైన సరస్వతివలె బంగారురంగు దేహకాంతి గలిగినదియైన తల్లి కృష్ణవేణికి ప్రణమిల్లుచున్నాను.

శ్లో॥ స్మరణాత్సర్వదోషఘ్నీం దర్శనాత్స్వర్గదాయినీమ్ ।
స్నానేన ముక్తిదాం పుణ్యాం కృష్ణవేణీం నమామ్యహమ్ ॥ 4

తలచినంతమాత్రాన అన్ని దోషాలు పోగొట్టునది, చూచినంత మాత్రాన స్వర్గసౌఖ్యములు కల్గించునది, పుష్కరకాలంలో నదీస్నానం చేసిన వారికి మోక్షప్రాప్తిని కల్గించే పుణ్యప్రదాయినియైన తల్లి కృష్ణవేణికి ప్రణమిల్లుచున్నాను.

శ్లో॥ కల్యాణాంబువహాం నిత్యాం నృణాం సౌభాగ్యదాయినీమ్ ।
దుఃఖదారిద్ర్య విధ్వంసీం కృష్ణవేణీం నమామ్యహమ్ ॥ 5

ఎల్లప్పుడు శుభాన్ని, మంగళాన్ని ఆరోగ్యాన్ని ప్రసాదించే జలప్రవాహం గలదీ, రాజులకుసైతం సౌభాగ్యాన్ని అనుగ్రహించేదీ, దుఃఖాన్ని దారిద్ర్యాన్ని నశింపజేసేదీ అయిన తల్లి కృష్ణవేణికి నమస్కరిస్తున్నాను.

శ్లో॥ స్వర్గారోహణ సోపాన మహాపుణ్యతరంగిణీమ్ ।
అధికారం సర్వతీర్థానాం కృష్ణవేణీం నమామ్యహమ్ ॥ 6

పరమపావనమైన కృష్ణానది కెరటాలే జీవులు స్వర్గలోకానికి చేరడానికి ఏర్పాటుచేయబడిన మెట్లవలె అమరియుండగా, సకలతీర్థాలకంటె ఉన్నతస్థానంలో ఉండే తల్లి కృష్ణవేణికి నమస్కరిస్తున్నాను.

శ్లో॥ పవిత్రాత్యంత నైర్మల్య మహాపుణ్యాంబువాహినీమ్ ।
త్రైలోక్య పావనీం దేవీం కృష్ణవేణీం నమామ్యహమ్ ॥ 7

ఈ మహాపుణ్యనదీజలం పవిత్రం. మిక్కిలినిర్మలమైనది. మూడులోకాలలో పావనమైనది. అటువంటి నదీమతల్లి కృష్ణవేణికి నమస్కరిస్తున్నాను.

శ్లో॥ సదాశివార్పితాం స్వాంతాం సహ్యజాం సాత్త్వికాత్మికామ్ ।
కామితార్థప్రదాం దేవీం కృష్ణవేణీం నమామ్యహమ్ ॥ 8

తన మనస్సును ఎల్లప్పుడు సదాశివునికే సమర్పించినది, సహ్యపర్వత ప్రాంతాలనుండి పుట్టినది. సత్త్వగుణమే ఆత్మ గుణముగా గల్గినది, కోరిన కోర్కెలనెల్ల తీర్చునట్టి తల్లి కృష్ణవేణికి నమస్కరిస్తున్నాను.

విశ్వనాథ 'కిన్నెరసాని' పాటలు

ఆచార్య కోసూరి దామోదరనాయుడు



తెలుగు సాహితీ ప్రపంచంలో అమేయ కాంతుల్ని వెదజల్లిన కవి ప్రభాకరుడు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు. వీరు ఓ కైలాస శిఖరం. మహాకళాస్రష్ట. ప్రతిభాశాలి. అఖండపాండితీ సంపన్నులు. తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల్ని కళాసంభరితంగా, సహృదయానంద సంధాయకంగా పరిపుష్టం చేసిన సాటిలేని మహా మనీషి. హిందూ సంప్రదాయం పునాదిపై వెలిసిన నవ్యతా సౌధం. వారి ప్రతిరచన మధురమోహనంగా తెలుగు నుడికారానికి పట్టుగొమ్మగా వుంటుంది. హైందవ సంప్రదాయాభిమానం జీవనధర్మంగా భావించి పుంఖాను పుంఖాలుగా అపూర్వమైన కావ్యసృష్టి చేసినవారు విశ్వనాథవారు. ఇతివృత్తం ఎన్నికలోను, కథా కథనంలోను, శైలీవిషయంలోను అనంతమైన వైవిధ్యం కలిగిన మహాకవి ఆయన. అద్భుతమైన భావనాశక్తిపటిమతో పాత్రను చిత్రం చేసినా దృశ్యాన్ని వర్ణించినా మనకు పరమభావకుడైన ఒక రసరాట్టు ఆయనలో మనకు కనిపిస్తాడు. ఆంధ్రవాఙ్మయంలో నదీనామక కావ్యాలెన్నో ఉన్నాయి. కొన్ని నిర్దిష్ట నదీమాహాత్మ్యాన్ని పౌరాణికాంశాలతో రంగరించి వర్ణించినవి. కొన్ని ఎండిపోయిన నదిని చూచి ఆవేదనతో ఆత్మఘోషను వినిపించినవి. ఈ రెంటికీ భిన్నమయింది 'కిన్నెరసాని పాటలు'.

తెలుగుకవులు తమ తమ కావ్యాలలో 'నదీ ఉద్గమనాన్ని, నదీపరవళ్ళను సంస్కృతసమాస జటిలంగా వర్ణించారు. అలాగే నిర్దిష్టదేవత నదీ రూపంగా అవతరించడమూ వర్ణించినవారే. కాని వాటికి చాలవరకు శాపాలో, సంప్రార్థనలో కారణాలయి కనిపిస్తాయి. వీటికంతా భిన్నమయింది 'కిన్నెరసాని పాటలు'.

విశ్వనాథ 'కిన్నెర'కు పురాణకథ లేదు. జానపద ఐతిహ్యమూ లేదు. అంతెందుకు పుణ్య స్నానాలు ఆచరించే వారుకూడా పట్టించుకొన్నట్టు కనబడదు. కవిపండితవర్యులు, జపతపాదులతో కాలం గడిపేవారు దర్శించినట్టూ ఆధారాలు లేవు. అయినా కొండను, కొండచుట్టు తిరిగే జలతరంగ వాద్యవలయాలలో కిన్నెరసాని ఆత్మఘోషను విన్నవాడు విశ్వనాథ. రవి గాంచనిచో కవి గాంచుననడానికి 'కిన్నెరసాని' కథ ప్రత్యక్షసాక్ష్యం. ఇది విశ్వనాథ 'ఆత్మ పలికిన సంగీతం'.

కిన్నెరసాని పాటకు నేపథ్యం

విశ్వనాథ 'ప్రకృతిప్రియులు'. తాను తన జీవితకాలంలో దర్శించిన అనేక దృశ్యాలను, వాటి అనుభూతులును తమ తమ రచనలలో ప్రత్యక్ష పరోక్షరూపాలలో అక్షరబద్ధం చేసినవారు. **'ప్రకృతికిన్ భాష్యప్రణేతల్ కవుల్'** అనడం విశ్వనాథవారిపట్ల నూటికి నూరుపాళ్ళు సత్యం.

విశ్వనాథవారు 'కిన్నెరసాని' వాగును, ఆ వాగు గోదావరిలో సంగమమయ్యే ప్రదేశాన్ని ఎపుడు చూశారో తెలియదు. తెలుగుకవులలో కొందరే డైరీలలో తమ ప్రయాణాలను, అనుభూతులను తేదీలవారిగా వ్రాసుకొనేవారు. అయితే విశ్వనాథవారు 1922-27 మధ్యకాలంలో కిన్నెరసానిపాటలు రచించినట్లు ఆచార్య తమ్మారెడ్డి నిర్మలగారు 'కిన్నెరసాని' అనే వ్యాసంలో ఉటంకించారు.

విశ్వనాథవారు దర్శించిన 'కిన్నెరసాని' రూపురేఖలే వేరు. కిన్నెరసాని కొండలుచుట్టి పాల్వంచ నుండి భద్రాచలం వెళ్ళేదారిలో ప్రవహిస్తూ పల్లానికి పోయి గోదావరిలో కలిసే చిన్నవాగు. ప్రవాహం - కొండ - ప్రదక్షిణం - ఆపై పయనం విశ్వనాథవారికి కవితావస్తువులయ్యాయి. మాలకరి రకరకాల పూలతో హారంకట్టినట్టు ఒక కథాసూత్రంలో తాను దర్శించిన కిన్నెరసాని నడకల హొయలులోని అందాన్ని సమున్నతప్రదేశం అడ్డుపడితే తటాలున భయంతో కాసేపాగిన భీతిని, ఆసరా దొరికితే కలిగే ఆనందాన్ని జతకూర్చి పాటలుగా తీర్చిదిద్దారు. కథకు కాళ్ళుంటాయా? ముంతకు చెవులుంటాయా? అన్నది విశ్వనాథ 'కిన్నెరసాని పాటకు' అతకని అంశాలు.

వస్తు స్వీకరణ

విశ్వనాథవారు తాను దర్శించిన 'కిన్నెరసాని' వాగుకు సమకాలీన కౌటుంబిక జీవనంలోనివి. తాను దర్శించిన కుటుంబాలలోని చిరు సన్నివేశాలను జత చేశారు. ఆ రోజుల్లో కొందరి ఇళ్ళల్లో 'తల్లికే' పెత్తనం అంతా. భర్తా, కొడుకు, కోడళ్ళు ఆమెకు ఊకొట్టవలసిందే. అంతేగాక బాల్యవివాహం కావడంతో కొడుకును, కోడలిని తన అదుపులో ఉంచుకోవడం సహజం. తన మాటవినే కొడుకు, కోడలి మాటలకు ఊకొట్టడం ఇష్టం లేని 'అనురాగ జాడ్యం' ఆపెది. ఈ కారణంవల్ల కుటుంబంలో రవరవలు. చిలికి చిలికి వాన అయినట్టు అత్త కోడలిపై అకారణనింద వేసింది. అసహాయుడయిన భర్త అడకత్తెరలో పోకచెక్కయినాడు. చివరకు కోడలు ఆత్మాహుతికై పరుగులెత్తింది. మగడు అనుసరించాడు. ప్రాధేయపడ్డాడు. అయినా ఫలితం శూన్యం. కోడలికి ఆ స్థితిలోనూ 'కాముకత్వపు కళ్ళు' బెడద తప్పలేదు. చివరకు సాటిస్త్రీ ఆసరా ఇవ్వడంతో ఆవిడ గూటిలో చేరుకొంది. ఈ అంశాలనే చుక్కలుగా పెట్టి విశ్వనాథవారు చక్కని 'చిత్రలిపి' తీర్చిదిద్దారు. ఈ రకంగా వస్తుస్వీకరణలో నవ్యత చేకూరింది.

రచనా విధానం

విశ్వనాథ వారు పద్యకవితాప్రియులు. అయినా ఈ కథను 'ప్రౌఢకవితాకావ్యంగా' తీర్చిదిద్దడానికి ప్రయత్నించలేదు. వస్తువుకు తగినట్టు 'పాటయే' సరి అనుకొన్నారు. కథావస్తువు ఎనిమిది భాగాలుకాగా ఒక్కొక్కభాగం ఒక్కొక్క విధమయిన తీరులో మలచడం నదీప్రవాహ వైవిధ్యాన్ని సూచిస్తుంది. మచ్చుకు కిన్నెర పుట్టుక–

'ఓహో కిన్నెరసాని
ఓహో కిన్నెరసాని' అని హోరుగాసాగే ప్రవాహాన్ని తలపిస్తుంది.

కిన్నెర నృత్యము

'కెరటాలలో నుర్వు
తెరచాలులో నీటి
పొరజాలులో కిన్నె
రటు కదలి యిటు కదలి
చిటి తరంగాలతో – పొటి తరంగాలతో
నటనాలు మొదలెట్టెనే – క్రొన్నీటి
తుటుములా కదలాడెనే'

అని రంగస్థలంలో నాట్యమాడే నాట్యకత్తెను కళ్ళముందు నిలుపుతుంది.

శిల్పరీతి

వసుచరిత్రలో కోలాహలుడు శుక్తిమతి అందచందాలకు ముగ్ధుడై కామించడం వర్ణితం. శుక్తిమతి ఆ వలపును చీదరించుకొన్నా నిస్సహాయ కనుక కోలాహలుడు అనుభవించాడు. ఇది బలవంతపు పెళ్ళి. కిన్నెరసాని పాటలోని 'కిన్నెర' ఆలాంటిది కాదు. తన భర్త నిస్సహాయుడని తెలుసు. తాను స్వస్థానం కదలి పరుగిడినవేళ మగడు వెంటబడడం తెలుసు. ప్రాధేయపడడం తెలుసు. అదొక 'వైరాగ్యపయనం' కాని ఇంతలో మగడు శిలకావడంతో కిన్నెరసాని చకితురాలయింది. ఆ బండచుట్టూ సుళ్ళు తిరిగింది. హైందవతత్త్వం, సనాతనత్వం.

భారతీయత

"తన తొందరయును తన పతి ప్రేమయు
తాను చేసినా తెలివి తక్కువయు
తన పతి చూపిన త్యాగగౌరవము
తలచుకు తలచుకు బోరున బోరున"

కన్నీళ్లు పెట్టింది.

ఆలాగే ఒక ప్రవాహం మరో ప్రవాహంలో లీనంకావడం సహజమే. కిన్నెరసాని 'కడలి' పొంగు చూసి జడుసుకొంది. గమ్యం ఏదో నిర్ణయించు కోకుండా సాగిన పయనం కిన్నెరసానిది. అందుకే వగలసెగలతో బాధపడుతుంటే 'గోదావరి' సాటి స్త్రీగా 'ఆసరా' ఇచ్చింది. సుఖానుభవంలో దర్శనంలో, స్త్రీలమనస్తత్వాలలో తేడాలున్నా ఒక స్త్రీ దుఃఖానుభవం ముందు ఏ స్త్రీ అయినా 'కదలి' పోతుంది. ఈ నేపథ్యంతోనే గోదావరి తాను ముందుకు రావడాన్ని

గోదావరి జాలిగుండె గూడులు కదలి
సాదుకిన్నెర కెదురుపోయీ
లోదిగులు తరగ చేదోయీ
ఆదరముచే నామె నదిమి కౌగిట బూని

ఏది నీ మొగము నా తల్లీ

నీ దిగులు నికమాను చెల్లీ అని వర్ణించి తల్లిగా, చెల్లిగా దర్శనమిచ్చింది.

అభివ్యక్తిమార్గం

ఒక్కొక్క కవికి ఒక్కొక్క 'అభివ్యక్తి' మార్గముంటుంది. విశ్వనాథ కిన్నెరసాని పాటలలో అభివ్యక్తి మార్గంలో మరికొన్ని అంశాలున్నా 'తెలుగుతనం' ప్రధానంగా జోడించడం గుర్తించదగ్గది.

దివ్యమోహనముగ బాడి తెనుగుపాట పాడినది
తెనుగుపాటల వెంట తీపిలా తోచింది
తెలుగు పిట్టలు వొళ్లు తెలియక పాడినై
తెనుగు వాగ్గె పారెనే నెత్తావి
తెనుగు పాటలు పాడెనే
తెలుగు దైవమ్ము భద్రాద్రిపై నెలకొన్న
రామయ్య అతని దర్శనము చేసే త్రోవ
కాచింది కిన్నెరా!

అలల పెన్నురుసుతో –

తెలుగు వొదుగులు పోయెనే కిన్నెరా
తెలుగు తీపులు చిమ్మెనే

విశ్వనాథ 'కిన్నెరసాని' తెలుగు ఇల్లాలి జాలికథ అందుకే తొలినుండి తెలుగుతనాన్నే వేషంలో, భాషలో, మౌనంలో, మూగ వేదనల్లో, ముసిరే ఆపదల్లో, ముంచుకొచ్చే కష్టాలలో వర్ణించారు.

కిన్నెరసానిపాటలలో 'ఆవేదనా వ్యక్తీకరణ' వినూత్నం. కిన్నెరసాని చెప్పాపెట్టకుండా కదలి వెళిపోతుంటే మగడు వెంబడించాడు. తన ఆవేదనంతా ప్రకటించుకొన్నాడు.

ఇంతీ! నను శిక్షింపగ
నింకొక మార్గము లేదటె

మగనికి కిన్నెరసాని కోమలత్వం తెలుసు. రాలపైన తొలినాళుల కాలిడగా ఓర్వలేనిస్థితి తెలుసు. అలాగే 'మహాపతిశీలన'నడం తెలుసు. చివరకు తాను మగవాడయినా

'ఇదిగో చేతుల చాచితి
నేద్పుచుంటి కంఠమెత్తి'అనడం ఎవరినయినా కంటతడిపెట్టిస్తుంది. చివరగా

నా యీ దేహ మీదేమో
ఊయి వోలె నగుచున్నది' అంటూ రాయి అయిపోయాడు. మగని ఆవేదనలాగే మగువ ఆవేదన కూడా.

'ఓ నాథ! నిను వీడి వచ్చీ
ఓ రాజ నిను వదలివచ్చీ
నా యొడల్పయితమ్ము నానా జనులుకోర
యీ యేవపుం బ్రతుకేల పొందితినిరా'

అనడం హృదయం నుండి ఉప్పొంగివచ్చిన వేదనల బుగ్గ.

కవితారామణీయకం

'కిన్నెరసాని పాటలు చదివేవారంతా కిన్నెర నడకలకు ముగ్ధులైపోయేవారుగాని కిన్నెరసాని రూపభావచిత్రణలను దర్శించని వారే' అని ఒక

అభిప్రాయం. విశ్వనాథవారి భావుకత్వం కడలి తరగలలాంటివి. ఒక్కొక్క 'ఉపమ' ఒక్కొక్క రసగుళిక. ఒక్కొక్క 'ఊహ' ఆలోచనామృతం.

కడలిపొంగును వర్ణిస్తూ విశ్వనాథవారు

'గాలి పిల్లలెపోయి వూదెనే
మొగిలు కన్నెలు పోయి చెప్పెన్'

అనడంలో సహజోక్తి.

ఆలాగే ప్రవాహంగా మారిన కిన్నెర

పదువు కట్టిన లేళ్ళ కదుపులా తోచింది
కదలు తెల్లని పూలనదివోలె కదలింది

అనడంలో 'ఉపమ' పతిని వదలి వెళ్తున్న కిన్నెర

తొడిమ యూడిన పూవు పడతిగా తోచింది
ముక్తగీతిక వోలె మోగింది

అనేవి భావాకాశంలో మెరసే మెరపులు.

కిన్నెరసాని పాటలోని ఉపమలు, ఉత్ప్రేక్షలు అన్నీ సహజప్రకృతిని ప్రతిబింబించేవి. సామాన్యుల భావనలలో తొణికిసలాడేవి.

అభిప్రాయాలు – ఆలోచనలు

కిన్నెర మానుషస్త్రీ. ఆమె వాగుగా మారింది. అందుకే స్త్రీత్వ నదీత్వాలను వ్యంజింపచేసే విధంగా సాగడం ఈ కావ్యశిల్పం. గోదావరిలో కలిసినా కిన్నెరసాని 'వ్యక్తిత్వం' ఆలాగే నిలుపుకోవడం 'ఆంధ్రత్వ లక్షణం', సామాన్యకవి అయితే ఈ లఘుకృతిని 'గోదావరి సంగమం'తో పూర్తి చేసేవాడు. కాని విశ్వనాథవారు 'కిన్నెర వైభవము'తో కిన్నెర ప్రత్యేకతను చాటినారు. ఉదయాస్తమానాలలో, ఆలాగే ఋతువుల మార్పులలో కిన్నెర సొగసులను వర్ణించారు విశ్వనాథ. అయితే ఆ జీవితమంతా పరోపకారం కోసమే. ఆ జీవనంలో మెరవులు, ఒరవులు, మలుపులు, ఆటలు, ఏడ్పులు, వెలుగులు, కాపుదలలు అన్నీవున్నా ఋతువు ఋతువుకీ మారే రుచులతో తెలుగు సత్కవి వర్ణించలేనంత చవులతో కిన్నెర తెలుగు దైవమైన భద్రాద్రి రాముణ్ణి దర్శించే త్రోవలో ప్రవహిస్తూ యాత్రికులకు చల్లని నీటి నందిస్తున్నది. కిన్నెరసాని పుణ్యాత్మ, పూతాత్మ.

వేదవతిగారి మాటల్లో చెప్పాలంటే 'తేనెపాటల ఊట కిన్నెరసాని పాట'. ఆచార్య తమ్మారెడ్డి నిర్మల గారి మాటల్లో అయితే 'తేట తేట' తెలుగులా తెల్లవారి వెలుగులా వంటి కమ్మని పాటలకు రూట్ కిన్నెరసానిలో" ఉన్నాయి.

తొందరపాటు పనికిరాదని ఓర్పు అవసరమనే సందేశం 'కిన్నెరసాని' పాటల్లోని నిగూఢసత్యం. చివరగా కిన్నెర నడకల హొయలుకు ముగ్ధులమై అసలయిన 'కిన్నెరసాని'ని దర్శించేవేళ ఆ అనుభూతులను నెమరువేసుకొందాం.

'కరిగింది కరిగింది కరిగింది కరిగింది
కరిగి కిన్నెరసాని వరదలై పారింది
తరుణి కిన్నెరసాని తరకల్లు కట్టింది
పడతి కిన్నెరసాని పరుగుల్లు పెట్టింది'.